# మిసిమి

మాసపత్రిక

సంపుటి 34 సంచిక 1

జనవరి - 2023

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI
— Since 1946 —

Printed & Published by

BAPANNA ALAPATI

at Kala Jyothi Process Pvt. Ltd.,

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

Hyderabad - 500 020.

Ph: 040 - 27612436, 27645538.

Editor: Ph: 949 121 6363

(11.00 am to 4.00 pm)

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : వి. ఆశారాణి

సెల్: 994 951 6567
040 – 27645536

Scan QR to Pay

**Misimi Publication**

LIBRARY OF CONGRESS

LCCN 91-903060

UGC Care

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

ISSN 2454-4329

**misimi90monthly@gmail.com**

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

YouTube **: Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## జనవరి నెల సూచికలు...


మండలి బుద్ధప్రసాద్




కమ్మతెమ్మెరలు : ... 5
అనర్ఘ రత్నాలు : ఆచార్య పప్పు వేణుగోపాల రావు... 6
పఠనం - ఒక జీవన విధానం : యం. లలితమ్మ... 7
ఆలయాల నిలయం : కాశీపురం : కిల్లాడ సత్యనారాయణ... 11
ఆత్మబంధం : కిల్లాడ సత్యనారాయణ... 18
కిలిమంజారో-4 : డా. నిమ్మగడ్డ శేషగిరిరావు... 21
మన ప్రయాణికులు : అశ్వినీకుమార్... 29
మండలి బుద్ధప్రసాద్‌తో మాటామంతీ : అశ్వినీకుమార్... 31
సెర్వాంటెస్ - డాన్ కిహోటీ - 3 : ముక్తవరం పార్థసారథి... 41
చిత్రకళ : అధివాస్తవికత : టి.వి. ప్రసాద్... 50
చిత్రగీతాలు : జావళీలు : డా. ఎమ్. పురుషోత్తమాచార్య... 53
జాతీయ విద్యా విధానం (2020) : డా. శ్రీరాములు గోసికొండ... 57
మాయమైపోతున్న భీమవరపు 'మా శర్మ' మాష్టారు! : ఐ.వి. రామరాజు... 61
ఇరానీ ఛాయ్ : వలేటి గోపీచంద్... 65
ఆచార్య వి.కె.ఆర్.వి. రావు : అలజంగి మురళీధరరావు... 67
వెయ్యేళ్ళ మంతిన : గార రంగనాథం... 69
నూరేళ్ల సుగాలీ కుటుంబం : ఎస్. హనుమంతరావు... 71
షేక్స్‌పియర్ సాహిత్యంలో భారతదేశం ప్రస్తావన : డా. గుజ్జు చెన్నారెడ్డి... 73
ఆంగ్ల సాహిత్యంలో భావ కవితా విన్యాసం : కన్మూరి అలెగ్జాండర్... 75
మధుమతి : వి. రాజారామమోహనరావు... 78
చదవండి... : *మిసిమి* ... 80



జావళీ నాయిక

**అట్టమీది బొమ్మలు**


గాలిలో ఎగరనా


కాశీ నుండి


ఆడుకుందాం..


నీడతో ఆడనా

# కమ్మతెమ్మెరలు

"... ఈ మధ్యనే *మిసిమి* దర్శించాను. ఎంతటి పవిత్రమైన నిలయం! మళ్లీ విద్యార్థిని అయిపోయాను. *మిసిమి* తల్లికి మల్లెపూదండ..."
– *రా.సా. నారాయణ, కాకినాడ*

"... నవంబర్, డిసెంబర్ *మిసిమి* (2022) సంచికలు అధ్యయనం చేయవలసిన గ్రంథాలు. ఒక విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్న భావన కలిగింది. ఇంతటి లోతైన, విస్తృతమైన అధ్యయనం విశ్వవిద్యాలయాలలోనే సాధ్యమవుతుంది. రచయితలకు, సంపాదకులకు, పోషకులకు శతాధిక అభివాదాలు. శతవత్సర సంస్థాపక సంపాదకులు రవీంద్రనాథ్ దివ్యదార్శనికుడు..."
– *శ్రీనివాసరాయ్, విజయవాడ*

"... నవంబర్, డిసెంబర్ *మిసిమి* (2022) సంచికలు ప్రతి అక్షరం చదివాను. అంత తేలిక వ్యవహారం కాదు చదవటం. అన్ని వ్యాసాలు ఆణిముత్యాలు. రచయితలు ఎంతగానో పరిశోధన చేసి రాసినవి. ఇవి చదివేవి కాదు. అధ్యయనం చేయవలసినవి. నా 85 ఏళ్ల అనుభవంలో ఇలాంటి పత్రిక తెలుగులోనే రావటం తెలుగువారి అదృష్టం. ఇంకా చాలా చెప్పాలి. తీరుబడిగా రాస్తాను..."
– *పతివాడ సూర్యనారాయణ, హైదరాబాద్*

"... *మిసిమి* డిసెంబర్ – 22 సంచిక ఆలస్యంగా అందింది అందమైన బొమ్మలతో. కాశీపురంలోని ఆలయాల చరిత్ర ఎంతో పవిత్రంగా ఉంది. డా. నారాయణగారి క్యూబా యాత్ర, అమెరికా ఇమ్మిగ్రేషన్ కష్టాలు, ఎద్దుకాల్లో ముల్లంత. వారి నాయక లక్షణాలు తెలుపుతోంది. మన మెట్రో – ఇందులో మీరు ఏకరువు పెట్టిన ప్రతి విషయం ఎంతో విలువైనది. అంతర్లీనంగా ఉన్న హాస్యం మనసుకు హాయిగొలుపుతుంది. ఎంతో సమాచారం అందించారు. ధన్యవాదాలు...."
– *ఆలపాటి పిచ్చయ్య, తెనాలి*

"... గిరీ (డా. నిమ్మగడ్డ శేషగిరిరావు).. నీ సాహసయాత్రలు చదవడం అయింది. ఆలోచిస్తున్నాను. ఉద్వేగాన్ని అణుచుకోలేక మాట్లాడుతున్నా, ఏమీ అనుకోకు... "గిరీ! మీ బాల్యంలో, మీ విద్యాభ్యాస సమయంలో మీకు నేను ఏమాత్రం బోధించగలిగానో నాకు తెలియదు. కానీ ఇప్పుడు నాకు గురుతుల్యులుగా ఎంతో విజ్ఞానం బోధిస్తున్నావు నువ్వు. ఆయా ప్రాంతాలలో ప్రకృతి శోభ, జీవన శైలి, ఆహార విహారాలు – ఒకటేమిటి.. ఎన్నో, ఎన్నెన్నో తెలియజేస్తున్నావు. నువ్వు నా శిష్యుడివి అనుకోవడం గర్వకారణం. నాకేంటి, భారతదేశంలో *మిసిమి* చదువుతున్న నీ సోదర భారతీయులందరికీ ఇది గర్వకారణమే! ఈ విషయంలో అతిశయోక్తి ఏమీ లేదు. కొన్ని విషయాలు చదువుతుంటే ఒళ్లు పులకరించిపోతుంది. ఒక్కోసారి ఒళ్లు ఝుల్లుఝుల్లుమంటుంది. నీ మనసులోని భావాన్ని చక్కగా రంగరించిపోస్తున్న నీ అనువాదకులకు కూడా! వాళ్లకు నా ధన్యవాదాలు. అసలు ఆయా దేశాలలో ఆ ప్రాంతాలన్నీ చూడటానికి ఏమాత్రం అవకాశం లేని మాలాంటివాళ్లందరకు ఎంతో కొంతైనా పరిచయం చేసినందుకు కృతజ్ఞతలు. తర్వాతి సంచిక కోసం ఎదురుతెన్నులు చూస్తున్నాను. అసలు నువ్వు చూసిన ప్రదేశాలను నీ భారతీయ సోదరులకు తెలియజేయాలి అనుకోవడంలోనే నీ విశాల దృక్పథం కనిపిస్తుంది. నువ్వు నిజమైన భారతీయుడివయ్యా! ఎంతో సేవ చేస్తున్నావు. సుఖీభవ!!..."
– *అంబటి రమణమ్మ (విశ్రాంత ఉపాధ్యాయిని), హైదరాబాద్*

"... *మిసిమి* లో ధారావాహికంగా వస్తున్న *కబీర్* వ్యాస రచయిత శ్రీమతి లక్ష్మీఅయ్యర్ గారు కబీర్‌ను గురించి చెప్పిన విషయాలు విజ్ఞానదాయికమైనవి, అమూల్యమైనవి. తెలుగువారికి శతక సాహిత్యంలో పరిచయమున్నట్లుగా ఉత్తర భారతీయులకు కబీర్ దోహాలు విలువైనవి. మనం చదివేటప్పుడు ఏదో చదువుతున్నట్లు కాకుండా జిజ్ఞాసతో ఇష్టంగా చదవవలసినవి. మనం ఆచరిస్తున్న జీవన విధానానికి కబీరు చెప్తున్న విషయాలు మనకోసం మనం అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఏం చెప్పాడని కాకుండా మానవ జీవితం ఎలా సాగాలో చెప్పినవారు అరుదు. ఇవి చదువుతున్నప్పుడు మనం జీవితంలో ఏం పోగొట్టుకున్నామో, మన జీవితం ఎంతటి క్లిష్టపరిస్థితుల్లో ఉన్నదో తెలియజేస్తున్నవీ వ్యాసాలు. లక్ష్మీఅయ్యర్‌గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు..."
– *గుడిపూడి సుబ్బారావు, అన్నవరగూడెం*

# అనర్ఘ రత్నాలు

**– పప్పు వేణుగోపాల రావు**

సంస్కృతాంధ్ర భాషలు బాగా చదివితే అనేకసార్లు ఏమనిపిస్తుందో తెలుసా. అబ్బా, తెలుగు ఎంత గొప్ప భాష! ఇంత మధురమైన భాషలో మాధుర్యాన్ని మనం తరచుగా ఎందుకు గుర్తించం? ఎందుకు ఈ భాష గొప్పదనాన్ని పలచన చేసి, చులకన చేసి మాట్లాడుతాం అనిపిస్తుంది. ఉదాహరణకి ఎన్నేనా చప్పొచ్చు. నేను పిహెచ్.డి చేసిన విషయం 'సంస్కృతాంధ్ర భారత భాగవతములు, సదృశ విషయ పరిష్కార వివేచన'. శ్రీ శ్రీగారు నన్ను అయ్యా మీ టాపిక్ ఏంటి అని అడిగారు. నేను 'సంస్కృతాంధ్ర భారత భాగవతములు, సదృశ విషయ పరిష్కార వివేచన' అని చెప్పాను. ఏదీ ఒకసారి తెలుగులో చెప్పండి అని చమత్కరించేవారు. ఎందుకు చెప్తున్నానంటే ఆ విషయం మీద పరిశోధన చేసిన నాకు వ్యాస భాగవతం కన్నా పోతన భాగవతం ఎన్నో రెట్లు నచ్చింది. ఆ విషయం వివరాలు మరోసారి ముచ్చటిద్దాం. మనం తరచు భర్తృహరి శ్లోకాలు ఉదాహరిస్తూ ఉంటాం. నిజానికి వాటిని తెలుగున అనువదించిన ఏనుగు లక్ష్మణకవి పద్యాలు తిరిగి సంస్కృతం చెయ్యవలసినంత గొప్పవి.

*ఒక ఉదాహరణ :*

ఒక దుర్మార్గుడు ఎంత విద్యావంతుడైనా వాడి జోలికి పోకూడదు, ఎందుకంటే గొప్ప మణి తలమీదుందని పాముకి దగ్గిరగా వెళ్లగలమా అంటాడు భర్తృహరి.

***దుర్జనః పరిహర్తవ్యః విద్యయాలంకృతోపిసన్***
***మణినా భూషితస్సర్పః కిమసౌ న భయంకరః***

దీనిని తెలుగు చేసిన ఏనుగు లక్ష్మణ కవి 18వ శతాబ్దంవాడు. రామేశ్వర మాహాత్మ్యము విశ్వామిత్ర చరిత్ర మొదలైన గ్రంథాలు రచించినవాడు. వాటన్నితటికంటే ఆయన అనువదించిన భర్తృహరి శ్లోకాలు అనర్ఘ రత్నాలు. ఈ శ్లోకానికి ఆయన అనువాదం చూడండి.

***తే॥ విద్యచే భూషితుండై – వెలయుచున్న***
***దొడరి వర్జింపనగుసుమీ – దుర్జనుండు***
***చారుమాణిక్యభూషిత – శస్త మస్త***
***కంబు గల పన్నగము భయం – కరము గాదె !***

సంస్కృతంలో భర్తృహరి మణినా భూషితస్సర్పః అన్నాడు. మణి అలంకారంగా ఉన్న పాము అన్నాడు. దానిని తెలుగులో ఏనుగు లక్ష్మణ కవి ఎంత సౌందర్యంగా చెప్పాడో చూడండి, చారుమాణిక్యభూషిత – శస్త మస్తకంబు అన్నాడు. అదీ తెలుగు సౌందర్యం. అదే అనువాదంలో రహస్యం. అనువాదం చేసిన వారి విద్వత్తు.

**ఈ నెల చాటువు:**

అల్లసాని పెద్దనగారికి కొడుకు పుట్టాడట. ఆయన అగ్రహారంలో ఉన్నవాళ్ళందరికీ విందుభోజనం పెట్టాలనుకున్నాడు. ఒక కట్టెలు కొట్టేవాడిని పిలిచి "నాయనా! నీవు అడవికి వెళ్లి ఓ బండెడు కట్టెలు కొట్టుకురా" అన్నాడు. సాయంకాలానికి బండెడు కట్టెలు వచ్చాయి. పెద్దనగారు చాలా సంతోషించి, ఆ కట్టెలు కొట్టేవాడికి ఒక నాలుగు బంగారు నాణేలు ఇచ్చాడు, వాడు తీసుకోలేదు. "ఏం?" అన్నాడు పెద్దన. "అయ్యా! ఇంకెవరైనా అయితే డబ్బే తీలుకునేవాడిని. మీ దగ్గర డబ్బెందుకు, ఒక పద్యం శలవియ్యండి" అన్నాడు. పెద్దన కట్టెలు కొట్టేవాడు పద్యమడిగిన తెలుగు జాతిలో పుట్టినందుకు గర్వించాడు, కరిగిపోయాడు. ఆ కట్టెలు కొట్టేవాని పేరు గువ్వల చెన్నడు. "నాయనా! ఒక గుడి కట్టిస్తే కాలంతో పాటు ఎప్పుడో కూలిపోతుంది, నేలనుయ్యి తవ్విస్తే ఏదో ఒకనాడు పూడుకుపోతుంది, ఒక చెరువు ఏదో ఒక వరదలో కట్టలు తెంచుకుని ఆనవాలు లేకుండా పోతుంది, ఒక ఉద్యానవనం వేస్తే ఎప్పుడో ఒకప్పుడు ఎండిపోతుంది. కాని ఓయీ గువ్వల చెన్నా! కుడి ఎడమల కీర్తిగలవాడా, పద్యం ఒక్కటే కాలంలో కలిసిపోకుండా నిలుస్తుంది" అన్నాడు. ఆ పద్యం చదివి పులకించండి.

***కం॥ గుడికూలును నుయి పూడును***
***వడి నీళ్ళంజెరువు దెగును వనమును ఖిలమౌ***
***చెడనిది పద్యంబొక్కటె***
***కుడిఎడమల కీర్తిగన్న గువ్వలచెన్నా!***

– కట్టెలుకొట్టేవాడు బంగారానికి బదులుగా పద్యం అడిగిన జాతి తెలుగు జాతి!

ఆచార్య పప్పు వేణుగోపాల రావు
చెన్నై. e-mail: pappuvenu@gmail.com



# పఠనం - ఒక జీవన విధానం

- యం. లలితమ్మ

మనిషికీ, అక్షరానికి విడదీయరాని సంబంధం ఉంది. జీవితం నుంచి అక్షరాలని, అక్షరాల నుంచి జీవితాన్ని వెదుక్కోవడం ఎప్పటినుండో వస్తున్నదే. షేక్స్‌పియర్ రాసిన అక్షరాలు మానవ జాతిని ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. అక్షరాలకి అంత సజీవశక్తి ఉంది. పుస్తకం అక్షరాకృతి దాల్చిన ఆలోచనల సముదాయం. ఒక రచయిత అక్షరాల ఉపకరణం ద్వారానే సజీవ పాత్రలని సృష్టించి, వాటిని చెక్కడం కోసం ఖచ్చితమైన మాటలని ఎన్నుకుంటాడు. అలా గొప్ప గొప్ప పుస్తకాలు కొందరు చిరస్మరణీయులచే విరచితమై, తరతరాలుగా దారిదీపాలై వెలుగొందుతున్నాయి. కొన్ని పుస్తకాలు శతాబ్దాలుగా మనస్సులను తాకుతూ, కాలాన్ని, దూరాన్ని అధిగమించి మనిషికి దగ్గరగా సజీవ ప్రయాణం చేస్తున్నాయి. అందుకే పుస్తకాలను నాగరికతా వాహకాలు అని అంటారు. గొప్ప పుస్తకాలు మనిషి మెదడును వికసింపజేస్తాయి, విశాలం చేస్తాయి, దానికి జ్ఞానశక్తిని ప్రసాదిస్తాయి. విజ్ఞానవంతమైన సమాజసృష్టి జరగాలంటే ప్రజల్లో పఠనాసక్తి పెంపొందాలి. చదవడాన్ని అలవాటుగా చేసుకున్న ఎందరో వ్యక్తులు ఇవాళ వ్యవస్థ నిర్మాణంలో భాగస్వాములుగా, వ్యక్తి నిర్మాణానికి మార్గదర్శకులుగా రాణిస్తున్నారు. పండిట్ నెహ్రూ తన కుమార్తె ఇందిరకు రాసిన ఒక లేఖలో "మనల్ని మనం తీర్చిదిద్దుకోవడం కోసం, విజ్ఞానం కోసం, వికాసం కోసం, లక్ష్యసాధన కోసం, పుస్తకపఠనం తప్పనిసరి" అని పేర్కొన్నారు. ఆహారం మనిషి దేహాన్ని ఎలా ఆరోగ్యంగా ఉంచుతుందో, పుస్తక పఠనం మనిషి మనస్సుకు అలా పుష్టి చేకూరుస్తుంది.

పుస్తక పఠనం అలవాటు కలిగినవాళ్ళు మిగతావాళ్ళకంటే భిన్నంగా ఆలోచిస్తారు. మనిషి ఉన్నతంగా జీవించడానికి ఉపకరించే ప్రధాన సాధనం పుస్తక పఠనం. జీవితంలో ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు పుస్తకాలు మనకు అవసరమైన ఉత్తేజాన్ని, బలాన్ని అందిస్తాయి. మన మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి ఒకానొక సందర్భంలో మాట్లాడుతూ "పుస్తక ప్రేమికుల కుటుంబంలో పుట్టినందుకు నాకెంతో గర్వంగా ఉంది. మా తండ్రిగారు విపరీతంగా పుస్తకాలు చదవడమేకాక, వారికి పుస్తకాలు రాసే అలవాటు కూడా ఉంది'' అని ఎంతో ఆత్మసంతృప్తితో తెలిపారు. సార్వజనీనమైన భావాల్ని మనకు పుస్తకాలు అందిస్తాయి. గొప్ప పుస్తకం మనిషి ఆలోచనా సరళికి పదును పెడుతుంది. దాని సారాంశం మనిషి రక్తంలోకి ఇంకి అదొక అద్భుత అనుభవంగా మిగిలిపోతుంది. ఈ అనుభవం కొత్త ఆలోచనాశక్తిని అందివ్వగలుగుతుంది. రచయిత హృదయాంతరాళంలో నుంచి వచ్చిన పుస్తకం, ఖచ్చితంగా పాఠకుని హృదయాంతరాళంలోకి చేరుతుంది. అందువలన రచయితలోని పక్వత పాఠకుణ్ణి చేరుతుంది. పఠనం అనేది ఒక అలవాటుగా ఉన్నవారికి ఈ ప్రయోజనం సిద్ధిస్తుంది. పుస్తకం ఏ చదువరి నుండి ఎలాంటి ప్రతిఫలమూ కోరదు. అనుభవం అందరి జీవితాల్లోనూ ఉంటుంది. కాని ఆ అనుభవం కొందరికి మాత్రమే సొంతం అవుతుంది. జీవితానుభవం సంపాదించడానికి పుస్తకం మంచి సాధనం.

ఈ రాకెట్ యుగంలో, కంప్యూటర్ యుగంలో పెద్దల నుండి పిన్నలదాకా పుస్తకాలు చదివేవారు గణనీయంగా తగ్గిపోతున్నారు. ఎప్పుడైతే చూడడమనే సంస్కృతి ప్రారంభమయ్యిందో అప్పుడే చదవడమనే అలవాటును మరచిపోతున్నాం. ఒక మహానుభావుడు అన్నట్లు 'బుక్స్ కల్చర్' పోయి 'లుక్స్ కల్చర్' వచ్చింది. విద్యావ్యవస్థలో చోటుచేసుకున్న కొన్ని పరిణామాలవల్ల విద్యార్థులలో

పఠనాభ్యాసం క్రమక్రమంగా కనుమరుగవుతోంది. సిలబస్ పుస్తకాలు, మార్కెట్‌లో దొరికే రెడీమేడ్ నోట్సులు, టెస్ట్ పేపర్లు, గైడ్లు చదివితే మరో నాలుగు మార్కులు అదనంగా వస్తాయి కదా అనే భావన ఇటు తలిదండ్రుల దగ్గర నుండి, అటు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులదాకా సర్వత్రా నెలకొనివుంది. మన విద్యావిధానంలో కూడా నాలుగు గోడల మధ్య బోధనకు ఇచ్చినంత ప్రాధాన్యత, స్వయం ప్రాతిపదికపై గ్రంథాలయాల ద్వారా విద్యనభ్యసించే విధానానికి ఇవ్వడం లేదు. అందుకే ఆదివారం వచ్చినా తరగతి పుస్తకాలు తప్ప మిగతా పాఠ్యేతర పుస్తకాలు – జీవిత చరిత్రల పుస్తకాలు, నీతికథల పుస్తకాలు, మనోధైర్యం కలిగించే పుస్తకాలు, భావనాశక్తిని పెంపొందించే పుస్తకాలు మొదలైనవాటిని మనం దరిచేరనీయడం లేదు. కథల పుస్తకాలో, పిల్లల పత్రికలో తీరికవేళల్లో చదువుతుంటే క్లాసు పుస్తకాలు చదువుకోక అవెందుకు చదువుతున్నావని తమ పిల్లల్ని కోప్పడుతున్న తల్లిదండ్రులు చాలామంది మన సమాజంలో ఉన్నారు. అలా పాఠ్యపుస్తకాల పరిధిలోనే విద్యార్థి దశ గడిచిపోతుంది. కాని సర్వ ప్రపంచాన్ని దర్శింపజేసి మనోవికాసానికి తోడ్పడే పుస్తకపఠనపు అలవాటు విద్యార్థి దశలో అత్యంత కీలకం, ఆవశ్యకం. విద్యార్థులలో రీడింగ్ హాబిట్ వల్ల స్వాధ్యయనం అలవడుతుంది, భావనాశక్తి పెరుగుతుంది. మార్కుల పరుగుపందెం ఒకవైపు ఉన్నా, మానసిక పరిణతి కోసం కూడా పుస్తకాలను చదవాలి. పుస్తకపఠనపు అలవాటు వల్ల ఆ పసిమనస్సుల ఆలోచనా వైశాల్యం పెరుగుతుంది. బాల్యంలోనే పుస్తకాన్ని ప్రేమించి పఠించే అలవాటు కలిగిన విద్యార్థులు నిర్ణయాలు తీసుకోవడంలో కూడా ఎనలేని పరిణతి ప్రదర్శిస్తారు. వారు సృజనశీలత, బుద్ధికుశలత, సమయస్ఫూర్తి, సంయమనం, ఆత్మవిశ్వాసం కలిగినవారై ఎదుగుతారు.

ఐర్లాండ్ దేశంలో ప్రతి ఒక్కరి ఇంట్లో ఖచ్చితంగా పుస్తకాలు ఉంటాయి. భూటాన్‌లాంటి చిన్న దేశంలో కూడా అందరికీ పుస్తకాలు అందుబాటు అయ్యేవిధంగా గ్రంథాలయాలు ఏర్పాటు చేసుకొన్నారు. సెలవులొస్తే మనం ఊర్లకు, టూర్లకు పోయినట్లుగా అమెరికాలో చాలా మంది తమ పిల్లల్ని తీసుకొని కుటుంబసమేతంగా గొప్ప–గొప్ప గ్రంథాలయాలను సందర్శించి కొన్ని రోజులు గడిపివస్తారు. అందుకే సెలవుల్లో ఎన్ని పుస్తకాలు చదివామో చెప్పుకోవడం అమెరికాలోని పిల్లలకు ఒక గొప్ప విషయం. న్యూయార్క్ నగరంలోని మెట్రో రైళ్ళలో ఎక్కువమంది, తమ ప్రయాణంలో పుస్తకాలు చదవడం దర్శనమిస్తుంది. కానీ మనం అయితే రైలు ప్రయాణంలో సెల్‌ఫోన్లు చూసుకుంటూనో, వీడియో గేమ్స్ ఆడుకుంటూనో కనిపిస్తాం. ఇంతేకాక విదేశీయులలో పిల్లల పుట్టిన రోజులకు, పండుగ రోజులకు పుస్తకాలను బహుమతులుగా ఇచ్చే సంప్రదాయం ఉంది. కాని మనం ఎవరి తాహతు కొద్దీ వాళ్ళు పుస్తకాలు కాకుండా మిగతావి – బొమ్మలు, బట్టలు, కేకులు, మిఠాయిలు, కానుకలు, మొదలైనవి ఇచ్చి పుచ్చుకోవడం గమనిస్తాము. ఒకానొక సందర్భంలో 'మీ పిల్లలు ఎలా తయారవ్వాలని మీరు కోరుకుంటున్నారు'? అని అన్నా క్విండ్లెన్‌ను అడిగితే 'నా పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయి వాళ్ళ ఇళ్ళను పుస్తకాల బీరువాలతో అలంకరించుకొనే వాళ్ళయితే చాలా సంతోషపడతాను' అని అన్నారు. ఇలా పుస్తకాలను విరివిగా ఒక విద్యార్థి ఉపయోగించుకోవాలంటే సమాజానికి గ్రంథాలయాలు అవసరం. సత్యాన్వేషణకు కేంద్రం గ్రంథాలయం. బ్రిటీష్ లైబ్రరీ చాలా పెద్దది. అందులో ఉన్న గ్రంథాలన్నింటినీ దాదాపుగా చదివేసినవాళ్ళు ఇద్దరే ఇద్దరు. మొదటి వ్యక్తి కార్ల్‌మార్క్స్ – మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేసిన తత్వవేత్త. రెండవ వ్యక్తి అంబేద్కర్ – భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించినవాళ్ళల్లో ప్రముఖులు. వారు అంటరాని వారి అభ్యున్నతి కోసం పాటుపడి గొప్ప స్ఫూర్తిప్రదాతగా భారత చరిత్రలోనే గాక ప్రపంచ చరిత్రలో కూడా నిలిచిపోయారు. మాగ్జింగోర్కీ బతుకుదెరువు కోసం మొదట్లో చిన్నచిన్న ఉద్యోగాలు చాలా చేశాడు. ఒక రొట్టెల కంపెనీలో పని చేసేటప్పుడు ఎప్పుడైనా కాస్త తీరిక దొరికితే ఏదోక పుస్తకం చదివేవాడు. అలా చదివినందుకు యజమాని విపరీతంగా తిట్టేవాడు, కేకలేసేవాడు. అయినా గోర్కీ చదివే అలవాటుకు దూరం కాలేదు. చదువుకోవడం కోసం కొవ్వొత్తులు దొంగిలించేవాడు. పుస్తకం అంటే అంత ప్రేమ మరి. అందుకే ఆయన ప్రపంచం మరచిపోలేని ఒక మహారచయిత అయ్యాడు. స్వయం కృషితో జ్ఞానం

సంపాదించాడు. కనుక 'ఈ లోకమే నా విశ్వవిద్యాలయం' అనగలిగాడు.

ఒక జాతి సంస్కృతిని, నాగరికతని పదికాలాలపాటు పదిలపరిచే ఆలయమే గ్రంథాలయం. వేలాది సంవత్సరాల చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక, శాస్త్రీయ రంగాలకు సంబంధించిన లక్షలాది గ్రంథాలు గ్రంథాలయాలలో భద్రపరచబడి ఉంటాయి. 'గ్రంథాలయం ఒక మౌన విద్యాలయం' అని ఓ కవి అన్నాడు. విద్యాలయానికి సంబంధించిన గ్రంథాలయంలో మంచి పుస్తక సంపద ఒనకూరిందంటే అది ఆ విద్యాలయానికి సంబంధించిన అధ్యాపకుల మేధావితనం, విషయ నిపుణత, విజ్ఞాన పరిపక్వత వల్ల మాత్రమే సాధ్యమవుతుంది. గ్రంథాలయం విద్యార్థికి, అధ్యాపకునికి మేధాశక్తిని పెంపొందించే ప్రదేశం. రాబర్ట్ సన్ డేవీ పేర్కొన్నట్లు పుస్తక పఠనానికి సంబంధించి ఒక ముఖ్యమైన విషయాన్ని గమనించాలి. మన వయస్సు పెరిగేకొద్దీ ఒక పుస్తకం గురించిన అవగాహన పెరుగుతూ ఉంటుంది. అంటే ఒక పుస్తకాన్ని మనం యౌవనంలో ఒకసారి, వృద్ధాప్యంలో మరోసారి పఠించాలి. 'నచ్చిన పుస్తకాన్ని పదేపదే చదవాలన్న ఆసక్తి లేకపోతే చదవడంవల్ల ప్రయోజనమేమీ లేదు' అని ఆస్కార్ వైల్డ్ అనేవాడు. గ్రంథాలలో నిక్షిప్తమయిన ఈ సంపదను గురించి తెలుసుకోవాలంటే పఠనాన్ని ఒక జీవన విధానంగా చేసుకోవాలి.

ప్రతి గ్రంథాలయానికి ఒక మంచి లైబ్రేరియన్ ఎంతో అవసరం. మంచి లైబ్రేరియన్ లేకపోతే ఆ గ్రంథాలయానికి తాళం వేయవచ్చు. కేవలం పుస్తకాలను ఒక చోట పోగేసి ఒక బోర్డు తగిలించితే చాలు అనుకునే లైబ్రేరియన్ వల్ల ఎలాంటి ప్రయోజనము ఒనకూరదు. మంచి లైబ్రేరియన్ అంటే ఏ వయసువారు ఎలాంటి పుస్తకాలను కోరుకుంటారో తెలిసి ఉండాలి. ఏ పుస్తకాలు విద్యార్థిపై గట్టి ప్రభావం చూపుతాయో అవగాహన కలిగి ఉండాలి. ఒక అబ్బూరి రామకృష్ణ ఒక శ్రీశ్రీకి దారి చూపినట్లు, ఒక చదువరికి ఏ పుస్తకపఠనంవల్ల ప్రేరణ కలుగుతుందో అవగాహన కలిగివుండాలి. కొత్తగా ప్రచురణ అయిన పుస్తకాల జాబితా గురించి విద్యార్థులకు ఎప్పటికప్పుడు పరిచయం చేస్తుండాలి. ఇలా చదువరులను మనస్ఫూర్తిగా ఆహ్వానించి పుస్తక సంపద మరింత వినియోగానికి గ్రంథాలయాధికారి అనునిత్యం తోడ్పడాలి. ఒక మహానుభావుడు 'గ్రంథాలయాన్నిబట్టి ఒక ఊరిని అంచనావేయడం జరుగుతుంది' అని సెలవిచ్చాడు. ఒక సందర్భంలో రవీంద్రనాథ్ ఠాగూర్ గ్రంథాలయాల గురించి ప్రస్తావిస్తూ 'గ్రంథాలయ భవనం ఎంత పెద్దది అనేది కాదు, ఎన్ని పుస్తకాలు ఉన్నాయనేది కాదు, ఎంత బాగా పుస్తకాలు ఉపయోగపడుతున్నాయి అనే దానిమీదే గ్రంథాలయ నాణ్యత ఆధారపడి ఉంటుంది' అని తెలిపారు. గ్రంథాలయాలు నిర్జీవ పుస్తకాల సమాధులవలె కాక చైతన్యపూరితమైన విజ్ఞాన కేంద్రాలుగా, విశ్వ కళాపరిషత్తులుగా రూపొందాలి. గ్రంథాలయం గ్రామానికి మెదడుగా ఉండాలి. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా. నందమూరి తారక రామారావు ఒక సభలో ప్రసంగిస్తూ 'గ్రంథాలయం అంటే మొక్కుబడిగా ఏవో కొన్ని పుస్తకాలు, రెండు మూడు పత్రికలు ఉంచే సంస్థగా కాకుండా గ్రామ జీవితంలో, గ్రామ సౌభాగ్యంలో, గ్రామ చైతన్యంలో పాలుపంచుకొనే మహోన్నత సంస్థగా, ముఖ్యంగా యువశక్తి కార్యస్థానంగా రూపొందాలి' అని తెలిపారు.

సమాజంలోని మనుషులే పుస్తకంలోని పాత్రలు, పుస్తకంలోని పాత్రలే సమాజంలోని మనుషులు. కన్యాశుల్కంలో ఓ గిరీశం, పడమటిగాలి నాటకంలో ఓ మాయోడు, పైకి అభిమానాన్ని వ్యక్తపరచుకుంటూనే, లోలోపల పరస్పరం ద్వేషించుకొనే వ్యక్తులు మనకు నిత్యజీవితంలో తారసపడుతూనే ఉంటారు. పుస్తక పఠనం వల్ల మనకు ఇట్లాంటి వాళ్ళ గురించి తెలుస్తుంది. దానివలన మనం ఏది చేయాలో, ఏది చేయకూడదో నేర్చుకుంటాము. కాబట్టి పుస్తకాల్లో జీవితాన్ని, జీవితం నిండా పుస్తకాల్ని మిళితం చేసుకుంటూ మనిషి తన బతుకుదారి పొడుగునా సాగిపోవాలి. పుస్తకాలు చదవాలనే అభిరుచి ఉన్న మనిషి ఎక్కడున్నా సుఖసంతోషాలతో ఉండగలుగుతాడు అని గాంధీ అంటుండేవారు. రీడింగ్ హాబిట్ వల్లే స్వయంగా విజ్ఞానాన్ని పెంపొందించుకోడానికి సాధ్యమవుతుంది. వివేకం కోసం కూడా జ్ఞానాన్ని ఆర్జించినప్పుడు దానికొక పరమార్థం ఏర్పడుతుంది. విద్య అనేది మనిషి ఉన్నతంగా జీవించడానికి ఉపయోగపడాలేగాని కేవలం తరగతి కృతార్థత కోసమో, ప్రొగ్రెస్ రిపోర్టు

కోసమో, ఉద్యోగం కోసం మాత్రమే కాకూడదు. విద్యార్థులను నైతికంగా సమున్నతులుగా తీర్చిదిద్దాల్సిన వ్యవస్థ కేవలం భావి ఉద్యోగులను తయారు చేసే కర్మాగారంలా తయారైంది. విద్య అనేది మనిషిని ఒక మర మనిషిలా కాకుండా సృజనశీలిగా తయారు చేయాలి. జ్ఞానాధారిత విద్య నవతరాన్ని బాధ్యతాయుతమైన, నిజాయితీపరులైన నిష్పాక్షిక, నిశితదృష్టితో అన్ని విషయాలను సమంగా పరిశీలించగల పౌరులుగా తయారు చేస్తుంది.

ఏ దేశ ప్రజలు పుస్తకాలు ఎక్కువగా చదువుతారో ఆ దేశం సుభిక్షంగా ఉంటుంది. అభివృద్ధికి విద్య ప్రాతిపదిక అయితే, విద్యకు ప్రాతిపదిక పుస్తకం. విద్యావంతులు వారి విద్యాభ్యాసం తరువాత కూడా పఠనాభ్యాసం కొనసాగించాలి. మనిషి ఉత్తమాభిరుచికి అతను చదివే పుస్తకమే గీటురాయి. పుస్తకపఠనం అనేది గానుగెద్దులాంటి యాంత్రికమైన జీవితం నుండి ఒక ఊరట, ఓ వెసులుబాటు, ఓ ఎదుగుదల. చదవడం వల్ల పొందిన ఆనందం జీవితాంతం నిలిచి ఉంటుంది. ఆ గొప్పతనం మనిషిని మానసికంగా ఉన్నతంగా, గొప్పవానిగా తీర్చిదిద్దుతుంది. పుస్తకపఠనం మనిషి ఆలోచనలకొక ఉదాత్తత కల్పించి స్వార్థపరత్వాన్ని, సంకుచితత్వాన్ని తగ్గించి విశ్వమానవ సౌభ్రాతృత్వానికి కావలసిన మానసిక స్థితి కల్పించడంలో తోడ్పడుతుంది. ఇరివెంటి కృష్ణమూర్తి పేర్కొన్నట్లు,

'మంచి పుస్తకం మంచిమనసుకు మరోపేరు; సొంత పుస్తకం మంచిమనిషికి మరోతోడు' పఠనం మన జీవనంలో భాగమై, బాధ్యతై కలకాలం కొనసాగాలి. పుస్తకం ఓ నిత్యావసర వస్తువు కావాలి, పఠనం ఓ జీవన విధానం కావాలి.

యం. లలితమ్మ
కావలి, నెల్లూరు జిల్లా. ఫోన్: 798 949 0551.

---

"... గౌ. అశ్వినీకుమార్‌గారికి.. కన్నడం నుండి తెనుగులోనికి అనువదించబడిన నవలలో *వంశవృక్షం*, *పర్వ* ప్రముఖమైన నవలలు. పర్వ కన్నడంలో ఉన్న సైజులో తెనుగులో సగమే ఉన్నది. ఈ సూక్ష్మీకరణ రీడబిలిటీ బాగా పెరిగింది. రచయిత సమాచార సేకరణకు తన ఆరోగ్యాన్ని కూడా లక్ష్యపెట్టలేదని చదివాను. ఇక *వంశవృక్షం* నవలకూ ఠాగూరు గోరా నుండి ప్రోత్సాహం పొంది ఉంటారని నాకనిపించింది. ఏమైనా అది ఉత్తమ నవలే. మన సాహిత్యంలో కళాపూర్ణోదయంలోని *రంభా, నలకూబరులు*, వారి రూపంలో మరో జంటల మధ్య సంవాదం షేక్‌స్పియర్ నవల *కామిడి ఆఫ్ ఎర్రర్స్* లోని ఘటనకు సారూప్యాన్ని ప్రశంసనీయంగా పేర్కొంది. గురజాడ *కన్యాశుల్కం* లో గిరీశం దేవుణ్ణి నన్ను స్వతంత్రునిగా సృష్టించాడా లేక అస్వతంత్రుడిగా సృష్టించాడా అని అడుగుతాడు. మాక్సిం గోర్కీ చరిత్రలో బాల్యం భాగంలో ఒక గార్డెనరు గోర్కీని అదే ప్రశ్న వేసి గిరీశం వాదననే తాను చెప్తాడు. ఇది నా చిన్నతనంలో చదివిన గుర్తు. ఈ ఘటనలను మీ దృష్టికి తేవాలని నాకు తీరని కోరిక కాకుండా వ్రాస్తున్నాను.

* * *

కొంతకాలం క్రితం ***మిసిమి*** లో తెనాలి తాలూక ప్రముఖుల వివరాలను తెలియజేసిన వ్యాసంలో పాములపాటి కృష్ణయ్య చౌదరి పేరుతో ఇద్దరు ప్రముఖులున్నారని అందులో ఒకరు ఎమ్.బి.బి.ఎస్. పూర్తిచేసి ధనార్జనపై ఆశతో ఇంగ్లాండు వెళ్లి హోమియోపతి వైద్యులుగా తిరిగి వచ్చారన్నారు. ధనసంపాదనకు ఆ రోజులలో హోమియోపతిని ఆశ్రయించే అవివేకులు ఉండరనుకుంటాను. హోమియోపతిలో స్థూలరూపంలో వ్యాధికారకమైన పదార్థాలు సూక్ష్మరూపంలో వ్యాధికారకాలైన పదార్థాలు సూక్ష్మరూపంలో వ్యాధి నివారకాలవుతాయనే నిర్ధారణ ఆర్థికశాస్త్రంలో మార్క్సు 'అదనపు విలువ'కు ఉన్నంత ప్రాధాన్యత వైద్యశాస్త్రంలో వానిమీద అన్వేషణకు ఉన్నది. కాని హోమియోపతి వైద్యం ప్రాధాన్యతను సంచరించుకోకపోవడానికి ఫార్మా ఇండస్ట్రీకి అవకాశం లేకపోవటమే ప్రధాన కారణమనుకుంటాను. ఏమైనా హోమియోపతి మానవజాతికి ఒక వరమే (నా స్వానుభవంలో గ్రాడ్యుయేట్ ఎమ్.ఎ.) 4 సంవత్సరాల తరువాత కూడా ఫలితాలనివ్వటం గమనించాను...." – *పి.ఆర్. ప్రకాశరావు, బెంగుళూరు*

# ఆలయాల నిలయం
# కాశీపురం

– కిల్లాడ సత్యనారాయణ


వారణాసి

రెండవ భాగం

**శక్తి పీఠాలు:**

శివుడూ శక్తీ వేర్వేరు కాదు. అందువల్ల కాశీలో శక్తి పీఠాల గురించి అంతగా చర్చ జరగలేదు.

దేశంలో 51 శక్తి పీఠాలున్నాయి. శివుడి భార్య సతి అగ్నిప్రవేశం చేసినప్పుడు ఇక్కడ కళ్ళు పడ్డాయని చెబుతారు. ఆమె శరీరంలోని విభిన్న అంగాలు దేశంలోని వేరువేరు చోట్ల పడ్డాయి. అవి శక్తి పీఠాలుగా వెలిశాయి. ప్రతి శరీరక అంగంలోనూ పార్వతి దేవి పూర్తిగా ఉంటుందని పురాణాలు చెబుతాయి.

శక్తిపీఠాల్లో మూడు ప్రసిద్ధి. మదురై మీనాక్షి (మత్స్య నేత్రాలతో), కంచి కామాక్షి (అనురాగ నేత్రాలతో), కాశీ విశాలాక్షి (విశాలమైన కన్నులతో). కాశీలోని మీర్ ఘాట్ వద్ద ఉన్న విశాలాక్షి గుడికి 1971లో తమిళులు మరమ్మత్తు చేశారు. దక్షిణ భారతీయులు ఈ మందిరాన్ని ఎక్కువగా దర్శిస్తారు.

దేవీ భాగవతంలో ''వారణాస్యాం విశాలాక్షీ గౌరీముఖానిస్వాని'' అని పేర్కొనబడింది. అంటే వారణాసిలో విశాలాక్షి దేవి ముఖంతో నివసిస్తుంది.

**అన్నపూర్ణ భవాని:** కాశీ విశ్వనాథుడు దర్శనం చేసుకున్న భక్తులు పక్కనే ఉన్న అన్నపూర్ణ దేవిని కూడా దర్శించుకుంటారు. కాశీని పాలిస్తున్న రాణి అన్నపూర్ణ దేవి. అందుకనే కాశీఖండంలో అన్నపూర్ణను భవానీగా పేర్కొన్నారు. కాశీలో ఎవరు ఆకలితో ఉండటానికి వీలు లేకుండా అన్నపూర్ణ దేవి చూసుకుంటుంది. అందుకనే ఆమెను అమ్మగా కొలుస్తారు.

ఒక పౌరాణిక కథ ఉంది. వ్యాసుడికి కాశీలో మూడు రోజులు పట్టడం కూడా దొరకదు. దానికి కోపగించి వ్యాసుడు కాశీని శపించబోతాడు. అప్పుడు అన్నపూర్ణ దేవి ప్రత్యక్షమై అతనికి పరమాన్నాన్ని వడ్డిస్తుంది. ఇది శివుడు వ్యాసుడికి పెట్టిన పరీక్ష. వ్యాసుడు నైజాన్ని తెలుసుకున్న శివుడు అతన్ని కాశీ నుంచి బహిష్కరిస్తాడు. అందుకే వ్యాసుడు గంగా నదికి అవతలి ఒడ్డున స్థిరపడతాడు. అదే వ్యాస కాశి.

అన్నపూర్ణ గుడిని ఒక మఠం నిర్వహిస్తుంది. ప్రస్తుత మఠాధిపతి మహంత్ శ్రీ మహేంద్రగిరి నాకు మిత్రులు. ఆయన ఏమంటారంటే "అన్నపూర్ణ గుడిలో నిత్యాన్నదానం జరుగుతుంది. అలాగే ఈ మఠం పేద విద్యార్థుల కోసం ఉచితంగా ఒక పాఠశాల నిర్వహిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో, పేదల బస్తీల్లో వైద్య శిబిరాలు కూడా నడుపుతుంది.'' ఆయన నన్ను ఒక కార్యక్రమానికి పిలిచారు. అక్కడ నాచే మహిళలకు కుట్టు మిషన్లు, విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేయించారు. ప్రతి సంవత్సరం కార్తీకమాసం ప్రారంభంలో అన్నపూర్ణ గుడిలో


దుర్గామాత ఆలయం - వారణాసి


అన్నపూర్ణాదేవి ఆలయం - వారణాసి


దుర్గామాతా కుండ్ - వారణాసి

అన్నకూటం పండగ జరుగుతుంది. ఆ రోజు గుడి మొత్తం పిండి వంటలతో నిండిపోతుంది.

**నవగౌరీ దేవాలయాలు:** చైత్రమాసంలోని నవరాత్రిలో ఒక్కోరోజు ఒక దుర్గామందిరాన్ని కాశీలో దర్శించుకుంటారు.

1) శ్రీ ముఖ నిర్మాలిక గౌరీ, గాయ్ ఘాట్ వద్ద రామ మందిరంలో (ఇక్కడ జిహ్వస్వామి ఉండేవారు), 2) శ్రీ జ్యేష్టగౌరీ, భూత భైరవ మందిరం వెనుక, 3) శ్రీ సౌభాగ్య గౌరీ, చౌక్‌లో, 4) శ్రీ శృంగార గౌరీ, గ్యానవాపీ మసీదు వెనుక, 5) శ్రీ విశాలాక్షి గౌరీ, మీర్ ఘాట్‌లోని విశాలాక్షి మందిరం, 6) శ్రీ లలితా గౌరీ, లలితా ఘాట్, 7) శ్రీ భవానీ గౌరీ, అన్నపూర్ణ మందిరం వద్ద, 8) శ్రీ మంగళ గౌరీ, బాలాఘాట్ పైన, 9) శ్రీ మహాలక్ష్మి, లక్ష్మి కుండ్ వద్ద.

**నవదుర్గా దేవాలయాలు:**

అశ్వనీ మాసంలో నవదుర్గా దేవిల దర్శనం చేసుకుంటారు. కాశీలో నవ దుర్గా దేవాలయాలు ఉన్నాయి. శ్రీ శైలపుత్రి (లాట్ భైరవకు కొంచెం దూరంలో), శ్రీ బ్రహ్మచారిణి (దుర్గాఘాట్ మహల్‌లో), శ్రీ చిత్రఘంటా (చౌక్ పోలీస్ స్టేషన్ ఎదురుగా), శ్రీ కూష్మాండ (దుర్గాదేవి, దుర్గా కుండ్), శ్రీ స్కంద మాత (బాగేశ్వరీ దేవి, జైత్‌పురా), శ్రీ కాత్యాయని (సిద్దేశ్వరీ మహల్‌లో), శ్రీ కాళరాత్రి (అన్నపూర్ణ గుడి వెనుక), శ్రీ మహా గౌరీ (అన్నపూర్ణా దేవి, విశ్వనాథ మందిరం వద్ద), శ్రీ సిద్ధదాత్రీ దుర్గ (సిద్ధ మాత మందిరం, గోల్ ఘర్).

**శీతలా దేవి:** జ్వరాలను ముఖ్యంగా అమ్మవారిని (స్మాల్ పాక్స్) నయం చేసే దేవత శీతల మాత. ఈ గుడి దశాశ్వమేధ ఘాటు వద్ద ఉన్నది. ఈమెకు భర్త లేదు. ఈమె స్వతంత్ర స్త్రీ శక్తి. కుబేర్ నాథ్ శుక్లగారు ఈ గుడిని 'మాతృతీర్థం'గా పేర్కొన్నారు.

**బాలా త్రిపుర సుందరీ దేవి మందిరం:** ఇవి రెండు దేవాలయాలు ఉన్నాయి. ఒకటి మణికర్ణికా ఘాట్‌లో, రెండవది మైదాగిన్‌లోని గౌరఖనాథ్ సమాధి స్థలంలో ఉన్నాయి. ఈ దేవి విద్యకు అధిపతి. ఈ మందిరాల్లో వాస్తు శిల్ప కళ ఆకర్షణీయం. కాశీలో ఈ మందిరాలను సిద్ధపీఠాలుగా భావిస్తారు. దశాశ్వమేధ ఘాట్‌లో కాళీమందిరం, సింధియా ఘాట్‌లో సంకటా మందిరం, పీతాంబర మందిరం, త్రిపుర భైరవీ వీధిలో త్రిపుర భైరవీ మాత, ఈశ్వరగంగీ వీధిలో తారాదేవి మందిరం మొదలైన ప్రసిద్ధ దేవీ స్థానాలు కాశీలో ఉన్నాయి.

**దుర్గ గుడి:**

ఇది దుర్గా కుండ్‌ను ఆనుకుని ఉంటుంది. దీనిని నగర శైలిలో నిర్మించారు. ఇక్కడ దట్టమైన అడవి ఉండేదని జేమ్స్ ప్రిన్సిప్ చిత్రాల ద్వారా తెలుస్తుంది. అందుకే దుర్గామాతను వనదుర్గ అని కూడా పిలుస్తారు. "ముఖ్య మందిరాన్ని నాటౌర్ రాణి శ్రీమతి భవానీ నిర్మించారని" ఈ మందిర పూజారి శ్రీ కౌశల్ పతి దుబే చెప్పారు. ఈ మందిరంలో నాలుగు వైపులా వరండా రెండవ పీష్వాబాజీరావు నిర్మించినట్లు ఆధారాలున్నాయి. దుర్గా కుండ్ నిర్మాణం అహిల్యాభాయ్ హోల్కర్ చేశారు.

భక్తులతో ఎప్పుడూ కిటకిటలాడుతూ ఉంటుంది ఈ గుడి. కాశీని దక్షిణం నుండి ఈ దేవత కాపాడుతుందని అంటారు. శక్తి స్వరూపిణి దుర్గ. దుర్గ అనే రాక్షసుడిని సంహరించడం కోసం దుర్గ అవతరించినట్లు దేవీ మహాత్మ్యం చెబుతోంది. కాశీ ఖండంలో కూడా దీని గురించి విస్తృతంగా వర్ణించబడింది.

ప్రతీ సంవత్సరం భాద్రపదంలో దుర్గగుడిలో మూడు రోజులు సంగీత, నృత్య కార్యక్రమాలు జరుగుతాయి. శ్రావణ మాసంలో ఇక్కడ పెద్ద ఉత్సవాలు జరుగుతాయి.

చారిత్రకంగా చూస్తే దేవీ మందిరాల ప్రతిష్ఠ గురించి క్రీ.శ. 8వ శతాబ్దం నుండి ఆధారాలు లభిస్తున్నాయి. లింగ పురాణం, కాశీ ఖండంలో కాశీలో 72 దేవీ పీఠాల గురించి చెప్పబడింది.



శ్రీ బతుక్ భైరవ్ ఆలయం




లాట్ భైరవ బాబా



తులసీమానస్ ఆలయం

**తులసీమానస మందిరం:**

లంకా – భేలుపుర్ మార్గంలో తెల్ల పాలరాయితో నిర్మించిన మందిరం ఇది. మానసం అంటే సరస్సు అని అర్థం. గోస్వామి తులసీదాస్ కోసం 1960లో కోల్‌కతా వ్యాపారి 1960లో దీనిని నిర్మించారు. సీతారామ లక్ష్మణులు గర్భగృహంలో ఉంటారు.

**సంకటమోచన హనుమాన్ మందిరం:**

తులసీ మానస మందిరానికి కొంచెం దూరంలో ఈ మందిరం ఉంటుంది. హనుమంతుడు కష్టాలను పోగొడతాడు. కాశీలో ఇది ప్రముఖమైన మందిరం. దీనిని తులసీ దాస్ నిర్మించినట్లు చెబుతారు.

తులసీదాస్ రామ దర్శనం కోసం తపిస్తున్నాడట. కానీ అతనికి హనుమంతుడి దర్శనం ప్రాప్తించింది. రామదర్శనం కోసం చిత్రకూట్ వెళ్ళమని హనుమంతుడు సలహా ఇచ్చాడట. ఈ మందిర ప్రాంగణంలో భక్తులు హనుమాన్ చాలీసా చదువుతుంటారు.

ఇక్కడ చైత్ర మాసంలో సంకటమోచన సంగీత కార్యక్రమాలు జరుగుతాయి. దేశంలోని ప్రముఖ సంగీత కళాకారులు దీనిలో పాల్గొంటారు.

సంకట మోచన మందిర ట్రస్టు అధిపతి శ్రీ విశ్వంభర నాథ్ మిశ్రా. ఆయన బి.హెచ్.యూ లోని ఐఐటీలో ఎలక్ట్రానిక్స్ విభాగంలో ప్రొఫెసర్. ఆయనను నేను కలిసాను.

ఆయనకు సంస్కృతంలో చాలా ప్రావీణ్యం ఉంది. "నేను ఉదయం 4 గంటలకు లేస్తాను. పూజా కార్యక్రమాలు చేస్తాను. 9 గంటలకు కోటు బూటుతో ఐఐటికి వెళ్తాను. తిరిగి సాయంత్రం 5 గంటలకు వస్తాను. బట్టలు మారుస్తాను. పంచె కట్టుకుంటాను. సంకటమోచన మందిరానికి వెళ్తాను. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తాను" అని తన దైనందిన క్రియల్ని వివరించారు.

"నా దృష్టిలో నా ఈ రెండు క్రియలూ భిన్నం కావు. నాణానికి రెండువైపులవంటివి. రెండూ సత్యాన్వేషణకు సంబంధించినవే. రెండూ ఒకదానికొకటి పూరకాలే." అని నవ్వుతూ నా ప్రశ్నకు బదులిచ్చారు.

**పన్నెండు సూర్యదేవాలయాలు:**

కాశీలో సూర్యుడు పన్నెండు రూపాల్లో వెలసినట్లుగా కాశీఖండం పేర్కొంటుంది. పరమేశ్వరుడి ఆజ్ఞతో సూర్యుడు కాశీరాజు దివోదాసను భంగపరచేందుకు కాశీ వచ్చాడు. సూర్యుడు విఫలం చెందాడు. ఇక్కడే ఉండిపోయి, 12 నెలలకు పన్నెండు రూపాల్లో ఆదిత్యుడుగా వెలిశాడు.

***పంచపాదం పితరం / ద్వాదశాకృతం / దివ ఆహుః పరే అర్థే***
***పురీషిణం / అథేమే అన్య ఉపరే విచక్షణం***
***సప్తచక్రే షళర ఆహురర్పితమితి*** *– ఋగ్వేదం (1)*

సర్వ ప్రపంచమునకు పై భాగమునందుండి, తన కిరణముల పరిపాక విశేషముచేత సంవత్సరము, ఆయనము, ఋతువు, మాసము, పక్షము, దినము మొదలైన కాల భేదాల్ని సూర్యుడు ఏర్పరుస్తున్నాడని చెప్పింది వేదం.

ఈ సూర్యదేవాలయాలను దర్శించుకుంటే శారీరక మానసిక రుగ్మతలు దూరమవుతాయనీ, సకల శుభాలు కలుగుతాయని అంటారు.

లోలార్కాదిత్య దర్శనం పిల్లలు పుట్టడం కోసం, విమలాదిత్య దర్శనం కుష్టువ్యాధి నయం కోసం, సాంబాదిత్య దర్శనం చర్మరోగ నయం కోసం, ఉత్తరార్కాదిత్య దర్శనం వివాహం కోసం చేసుకుంటూ ఉంటారు.

కేశవాదిత్య దర్శనం సుఖసంతోషాల కోసం, ఖఖోల్కాదిత్య దర్శనం మనశ్శాంతి కోసం, అరుణాదిత్య దర్శనం అంగవైకల్యం నుండి ముక్తి పొందడం కోసం, మయూఖాదిత్య దర్శనం శరీరోష్ణతను తగ్గించడం కోసం చేస్తూ ఉంటారు.


ఆదికేశవ ఆలయం


కర్దమేశ్వర్ ఆలయం



కర్దమేశ్వర్ మహాదేవుడు

యమాదిత్య దర్శనం స్వర్గానికి వెళ్లడం కోసం, వృద్ధాదిత్య దర్శనం నిత్యం చురుగ్గా ఉండటం కోసం, గంగాదిత్య దర్శనం జలం కోసం, ద్రౌపదాదిత్య దర్శనం ఆహారం కోసం చేస్తూ ఉంటారు.



గౌరీ కేదారేశ్వరీ మహదేవ్ ఆలయం

కాశీలోని ఘాట్లలో సూర్యోదయాన్ని ఆరాధిస్తారు. గంగలో స్నానం చేస్తారు. గంగా జలాన్ని సూర్యుడికి అర్ఘ్యంగా అర్పిస్తారు. అస్సీ ఘాట్లో 'సుబః ఏ బనారస్' పేరుతో సూర్యోదయాన్ని ప్రతిరోజూ హారతితో ఆహ్వానిస్తున్నారు.

ఈ పన్నెండు సూర్య దేవాలయాలు కాశీలోని ఘాట్లలో ఉన్న విభిన్న దేవాలయాల్లో ఉన్నాయి. వీటిలో లోలార్క ప్రాచీనమైనది, ప్రముఖమైనది. దీన్ని గాహద్వాల రాజులు ఆరాధించినట్లు రెండు రాగిపత్ర శాసనాలు తెలుపుతున్నాయి.

ఉత్తరార్క, సాంబాదిత్య సూర్యులకు పెద్ద పెద్ద దేవాలయాలు ఉండేవని, అవి మధ్యయుగంలో కూల్చివేయబడ్డాయని చరిత్రకారులు చెబుతున్నారు. ఇప్పటికీ అక్కడ దేవాలయాల అవశేషాలు ఉన్నాయి.

పూర్వీ ఉత్తరప్రదేశ్‌లోనూ, బీహార్‌లోనూ ఛట్ పండగ చాలా ప్రముఖమైనది. దేశ నలుమూలల నుండి వీరు ఈ పండుగకు తమ తమ ఇళ్లకు చేరుకుంటారు. హిళలు నది ఒడ్డున, చెరువుల ఒడ్డున బేదిలను తయారుచేసి, పళ్ళు-పూలతో కుటుంబ ఆయురారోగ్యాల కోసం పూజిస్తారు. ఆ తర్వాత నీటిలోకి దిగి సూర్యుడికి నీటిని అర్ఘ్యంగా అర్పిస్తూ ప్రార్థిస్తారు.

ప్రముఖ భోజ్‌పురి గాయని మాలినీ అవస్తి "ఈ ఘర్ ఈ దువర్వా కర్, రహల్ బా ఇంతిజార్; తోహార్ గాం కర్ రహల్ బా ఇంతిజార్, ఆజా ఆజా బబువా, ఈ హ ఛటీ మయియా కే త్యోహార్" (ఈ ఇల్లూ, ఈ గుమ్మం నీ కోసం ఎదురు చూస్తున్నాయి. నీ ఊరూ నీ కోసం ఎదురు చూస్తుంది. నువ్వు రా నాయనా, ఛటీమయ్యా పండగకి) అని పాడుతారు.

ఇక్కడ సంగీత సాహిత్య కార్యక్రమాలతో పాటు, నిత్యం హోమం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన శ్రీ అజయ్ గుప్త, రత్నేష్ వర్మ నా స్నేహితులు.

"భక్తి శ్రద్ధలతో కాశీలో సూర్యుణ్ణి ఆహ్వానించినట్లుగా ప్రపంచంలో ఎక్కడా ఆహ్వానించరు" అంటారు డయానా ఎల్.ఏక్.

సూర్యారాధన భారత సంస్కృతి అంత పురాతనమైంది. చరిత్రకారుడు లలిత ప్రసాద్ పాండే తన 'సన్ వర్షిప్ ఇన్ ఎన్సియెంట్ ఇండియా' పుస్తకంలో "సూర్యారాధన వైదిక కాలానికి ముందు నుండి ఉందనీ, అది క్రీ.శ. 4వ శతాబ్దం నుండి 13వ శతాబ్దం మధ్య ఉన్నత దశలో ఉండేదనీ" వివరించారు. భారత కళాభవన్ చిత్రాల్లో లభ్యమవుతున్న క్రీ.శ. 8వ శతాబ్దినాటి సూర్యుడు కాశీలో ప్రాచీనమైనదిగా భావిస్తున్నారు.

**చార్ ధాం దేవాలయాలు:**

నాలుగు ధాముల దేవాలయాలు కాశీలోనే ఉన్నాయి. అస్సీ ఘాట్‌లో జగన్నాథ మందిరం, శంకుల్ ధారా చెరువు వద్ద ద్వారకాధీశ మందిరం, లక్సాలోని రామకుండ్ వద్ద రామేశ్వర మందిరం, గాయ్ ఘాట్ వద్ద బద్రీనారాయణ మందిరం ఉన్నాయి.

ఈ యాత్రలో భాగంగా నేను బద్రీనారాయణ గుడికి వెళ్ళాను. ఈ గుడి ముందున్న విశాలమైన గంగలో స్నానం చేసి భక్తులు దర్శనానికి వస్తున్నారు.



శంకట మోచన్


వేణీ మహదేవ్ జీ



మాతా అన్నపూర్ణాదేవి


కాలభైరవ బాబా


తులసీమానస్ ఆలయం


గౌరీ కేదారేశ్వర్ ఆలయం - వారణాసి

అక్కడ పూజారి శ్రీ ద్వారకానాథ్ త్రిపాఠి. అతని కళ్ళల్లో తృప్తి అనే కాంతి నన్ను ఆకట్టుకుంది. అతని శరీరంలోని అణువణువు నుండి వస్తున్న భక్తి అనే ఆనందం నన్ను పలకరించింది. అతని గురించి తెలుసుకోవాలనిపించింది. అడిగాను. అతనికి 76 సంవత్సరాలు. వారి తాతలు, ముత్తాతలు కూడా ఈ గుడిలోనే పని చేసినట్లు చెప్పారు. అయితే మిగతావారిలా కాకుండా తనకు దేవుడి సేవయే వ్యవసాయం. వ్యవహారం. అతని మాటల్లో–

"నేను ముప్పైఏళ్ల నుండి స్వామి సేవకు పూర్తిగా అంకితమైపోయాను. నా మోకాళ్ళ నొప్పి కూడా నన్ను బాధించదు. ఠాకూర్ జీకి నైవేద్యం నా చేతులతో తయారు చేస్తాను. నా చేతులతో భోగ్ అర్పిస్తాను. అందరికీ ప్రసాదం ఇస్తాను. నాకు ఏం కావాలో ఠాకూర్ జి చూసుకుంటారు. ఆయనను నేను చూసుకుంటాను. ఇంతకన్నా ఏం కావాలి? ఆయన ఎప్పుడూ నాతోనే ఉంటాడు. ఇంతకన్నా ఆనందం ఏముంది?" చాలా ఆనందంతో, తృప్తితో చెప్పాడు.

మనం చేస్తున్న పనిని ఎంతమందిమి ప్రేమిస్తున్నాం? అందులో ఆనందాన్ని ఎంతమందిమి అనుభవిస్తున్నాం?

ఆ తర్వాత నేను జగన్నాథ్ మందిరానికి వెళ్ళాను. ఈ మందిరానికి ఉత్తరంలో దేవాలయ స్థలం చాలా ఉంది. కొందరు ఆవుల్ని, గేదెల్ని కట్టారు. చెత్తా చెదారం నలువైపులా వేసారు. దాటుకుని మందిరంలోకి వెళ్ళాను. "పూరీ జగన్నాథ్‌లో పూజారుల మధ్య తగాదా జరిగింది. అక్కడ నుండి ఒక పూజారి కాశీ వచ్చేశాడు. ఇక్కడ ఈ మందిరాన్ని నిర్మించాడు." అని అక్కడ పూజారి చెప్పారు.

కాశీ ఇంతమంది దేవుళ్లకు నివాస స్థానం ఎలా అయ్యింది?

దీనికి సమాధానం మనకు కాశీ ఖండం (39, 43–64)లోని ఈ క్రింది కథ నుండి లభిస్తుంది.

"చాలా కాలం క్రితం భూలోకంలో పెద్ద కరువు వచ్చింది. భూమి అంతరించిపోయే ప్రమాదం వాటిల్లింది. సృష్టికర్త బ్రహ్మకు ఏం చేయాలో తోచదు. అప్పుడు తన దివ్యదృష్టితో భూమ్మీద రిపుంజయ అనే రాజు మాత్రమే దీన్ని కాపాడగలడని అనిపించింది. ఈ పృథ్వికి రాజుగా ఉండమని రిపుంజయను బ్రహ్మ కోరాడు. దేవతలంతా కాశీని విడిచి పెట్టాలని, తన పరిపాలనలో జోక్యం చేసుకోరాదనే షరతుపై రిపుంజయ పరిపాలన స్వీకరించాడు. దేవతలంతా స్వర్గలోకానికి వెళ్లిపోయారు. శివుడు కాశీ విడిచి పెట్టి మాందార పర్వతానికి చేరుకున్నాడు.

రిపుంజయ దివోదాస బిరుదుతో పరిపాలన ప్రారంభించాడు. కాశీని రాజధానిగా చేసుకొని దివోదాస చక్కగా పాలించాడు. ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉన్నారు. ధర్మ పరిపాలనలో భూమ్మీద శాంతి నెలకొంది.

దేవుళ్లను భూమ్మీద నుండి బహిష్కరించినందుకు దేవుళ్ళు దివోదాసపై చాలా కోపంగా ఉన్నారు.

కాశీ వియోగంతో శివుడు దహించుకుపోతున్నాడు. అతని తలపైన గంగ కానీ, చంద్రుడు కానీ, అతని శరీరంపై పూసుకున్న గంధం గానీ అతణ్ణి చల్లార్చలేకున్నాయి. దీనికి సమాధానం కాశీ ఒక్కటే అని భావించింది పార్వతీదేవి.

కాశీకి శివుడు వెళ్ళడం ఎలా సాధ్యం? దివోదాస కాశీని విడిచి పెట్టినప్పుడే అది సాధ్యం. అతను కాశీని ఎప్పుడు విడచి పెడతాడు? ధర్మం దారితప్పినప్పుడు.

అందుకు శివపార్వతులు ఒక ఉపాయం చేసారు.

వారు యోగినులను భూలోకం పంపారు. శివుడు కొందరు దేవతలను దివోదాస రాజ్యంలోకి పంపించాడు. వారే యోగినులు. మాయలతో రాజును దారి తప్పించే ప్రయత్నం చేశారు. నర్తకులుగా కొందరు, పూలు కట్టేవారుగా కొందరు, జోస్యం చెప్పేవారుగా కొందరు... మొత్తం 64 మంది తమ కళలను ప్రదర్శించారు. కానీ రాజు చలించలేదు. రాజ్యం ధర్మం తప్ప లేదు. కాశీలోనే ఈ 64 మంది యోగినులు స్థిరపడిపోయారు.


ఆదిత్యులు

దశాశ్వమేధ ఘాట్‌కు దగ్గరలో ఉన్న చౌంసతి దేవి మందిరం ఈ యోగినుల గుడి.

యోగినులు తిరిగిరాలేదు. శివుడికి కాశీపై ఆశ తగ్గలేదు. దివోదాసను భంగపరచమని

సూర్యుణ్ణి పంపాడు. భిక్షగాడిగా, వ్యాపారిగా, సన్యాసిగా రకరకాల వేషాలతో సూర్యుడు కాశీలో ఒక ఏడాది గడిపాడు. ఫలితం లేదు. సూర్యుడు పన్నెండు ఆదిత్యులుగా విభజితమై కాశీలోనే స్థిరపడిపోయాడు. ఈ పన్నెండు ఆదిత్య మందిరాలు కాశీలో ఉన్నాయి.

కామాన్ని తన యోగనేత్రంతో బూడిద చేసిన పరమ శివుడు ఇప్పుడు కాశీ మోహంలో చిక్కుకున్నాడు. బ్రహ్మను పురమాయించాడు. అశ్వమేధయాగం కోసం వచ్చిన బ్రాహ్మణుడిగా దివోదాస వద్దకు బ్రహ్మ వెళ్ళాడు. యాగానికి ఏర్పాట్లు చేయమని కోరాడు. దివోదాస ఏర్పాట్లు చక్కగా చేసాడు. ఒక్క పొరపాటు కూడా జరగలేదు. బ్రహ్మ అశ్వమేధ యాగం చేసిన ఈ స్థలం దశాశ్వమేధ ఘాట్‌గా ప్రసిద్ధి చెందింది. ఇక్కడే గంగా హారతి ప్రతి రోజూ జరుగుతుంది. బ్రహ్మ ఇక్కడ ఒక శివలింగాన్ని స్థాపించి స్థిరపడిపోయాడు. అది ఇప్పుడు బ్రహ్మేశ్వర శివలింగంగా కొలవబడుతుంది. మందార పర్వతంపై శివుడు ఎదురు చూస్తున్నాడు. శుభవార్త రాలేదు. తనకు విశ్వాసపాత్రులైన గణాల్ని పంపించాడు. శంకుకర్ణ, మహాకాళ, మహోదర, ఘంటకర్ణ మొదలైన గణాలు కాశీ నుండి ప్రభావితమై ఇక్కడే శివలింగాలను స్థాపించి స్థిరపడిపోయారు.

గణాధిపతి గణపతిని కాశీకి పంపించాడు శివుడు. బ్రాహ్మణ జ్యోతిష్యుడుగా వేషం ధరించాడు. దివోదాస అతణ్ని పిలిపించాడు. "నేను ప్రపంచాన్ని ఎవరూ పరిపాలించనంత చక్కగా పాలించాను. ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారు. అయినా నాలో ఏదో అసంతృప్తి. దీనికి పరిష్కారం చెప్పండి" అని అడిగాడు.

"పద్దెనిమిది రోజులు ఆగండి. మీ ప్రశ్నకు సమాధానం చెప్పే బ్రాహ్మడు వస్తాడు" అని గణపతి చెప్పాడు . గణేశుడు చప్పన్ (56) గణేశులుగా విభాజితమై కాశీలోనే స్థిరపడిపోయాడు. ఆఖరి అస్త్రంగా శివుడు విష్ణువును పంపాడు. విష్ణువు గాంగా వరుణ సంగమ స్థలంలో స్నానం చేసి బౌద్ధ సన్యాసిగా (పుణ్యకీర్తి) వేషం ధరించాడు. లక్ష్మీదేవి బౌద్ధ సన్యాసిని (విజ్ఞాన కౌముది)గా మారింది. సారనాథ్ దగ్గర దర్మక్షేత్రాన్ని స్థాపించారు. బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేసారు. ప్రజలు అది విని దారి తప్పారు. కులమత ధర్మాలు గాడి తప్పాయి. సమాజం అస్తవ్యస్తం అయ్యింది. అలా దివోదాస రాజ్యం ధర్మం తప్పింది. దివోదాసకు రాజ్యాధికారంపై మమకారం తగ్గింది. పద్దెనిమిదవ రోజున విష్ణువు బ్రాహ్మణుడిగా దివోదాస సభలోకి వచ్చాడు. రాజు పరిపాలనలో విసిగిపోయాడు. 'కర్మల నుండి బయటపడే' మార్గం చెప్పమని అడిగాడు.

'శివుణ్ణి కాశీ నుండి పంపించివేయడం నువ్వు చేసిన పాపం. దీనికి పరిష్కారంగా ఒక శివలింగాన్ని స్థాపించు. ఆ తర్వాత ఒక రథం వచ్చి నిన్ను స్వర్గానికి తీసుకు వెళుతుంది' అన్నాడు బ్రాహ్మణ వేషంలో ఉన్న విష్ణువు. ఆ తర్వాత రాజు ఒక శివలింగాన్ని స్థాపించాడు. ఇదే దివోదాసేస్వర మందిరం. ఇది విశాలాక్షి గుడికి దగ్గరగా ఉంటుంది. దివోదాస కుమారుడు రాజ్యాధికారం చేపట్టాడు. మిగతా దేవుళ్ళలాగానే విష్ణువు కూడా కాశీలోనే ఉండిపోయాడు. తన వాహనమైన గరుడ పక్షిని శివుడికి శుభవార్తను అందజేయమని పంపించాడు. విష్ణువు పంచగంగా తీర్థం వద్ద స్థిరపడిపోయాడు. అదే వేణు మాధవ గుడి.

విష్ణువు విజయంతో శివుడు చాలా ఆనందపడ్డాడు. శివుడి రాకకోసం కాశీలో ఉన్న దేవుళ్ళందరూ కాశీకి ఉత్తరాన ఉన్న వృషభధ్వజం వద్ద ఎదురు చూశారు. వేయి దీపాల కాంతితో శివుడు కాశీలో ప్రవేశించాడు. 330



జ్యోతిర్లింగాలు



గణేశాలయం



ఆదికేశవుడు



సంకటమోచన ఆలయ ద్వారం



వరలక్ష్మీ దేవి

మిలియన్ల దేవుళ్ళు కాశీలో ఉండిపోయారు. నిజానికి వాళ్లకు కాశీ ఎప్పుడూ అవిముక్తయే.

కాశీ ఈ దేవుళ్లందరి మొత్తం కన్నా ఎక్కువ.

ఇక్కడ పురాణం, భూగోళశాస్త్రం కలిసి నడుస్తాయి. కాశీలో ఇప్పటికీ ఈ దేవాలయాలను చూడొచ్చు. దివోదాస కాశీని విడిచి వెళ్ళినప్పుడు, అతని రక్షకులైన లొహరా వీర్, భోజువీర్, కంకడా వీర్, దత్రావీర్‌లు ఇక్కడే స్థిరపడిపోయారు. ఇప్పటికీ ఈ పేర్లతో ఉన్న వీధులు వారణాసిలో ప్రసిద్ధి.

ఇక్కడ దేవాలయాల వద్ద ఉన్న కొందరు భిక్షగాళ్ళను అడిగాను. "ఇప్పుడు కాశీకి ప్రతిరోజూ లక్షకు పైగా భక్తులు వస్తున్నారు. దీనికి మీరు సంతోషిస్తున్నారా?" అని.

"మా ఆదాయం కొంత పెరిగింది." అని ఒకడు చెప్పగా,

"మరీ అంత గొప్పగా పెరగలేదు బాబూ" అని మరొకడు,

"మనుషుల్లో దయ రోజురోజుకు తగ్గిపోతుంది. దానికి దేవుడికి పరిహారం చెల్లించుకుంటున్నారు." అన్నాడు ఇంకొకడు.

"నువ్వెందుకు అలా మాట్లాడుతున్నావు" అనడిగాను.

"నా పదిహేడేళ్ల కొడుకు యాక్సిడెంట్ అయి, రోడ్డు పక్కన రక్తం కారుతూ పడున్నాడు. ఎన్నో వాహనాలు ఆ రోడ్డు మీద వెళ్లాయి. ఒక్క నాయాలు కూడా వాడి వంక చూడలేదు. పోలీసులు వచ్చేసరికి వాడి ప్రాణం



గంగా హారతి

గాల్లో కలిసిపోయింది బాబూ. వాణ్ణి అలా వదిలేసినోళ్లంతా దేవుళ్ళకు మొక్కేవాళ్ళే" అన్నాడు నిట్టూరుస్తూ.

కాశీలోని రిక్షావాళ్ళలో, దుకాణాల్లో, సత్రాలలో.... ఆత్మీయత పలకరిస్తుంది. మానవీయ సంబంధాలు పెనవేసుకు కనిపిస్తాయి.

మనల్ని మనకు చూపిస్తుంది కాశీ. ఇక్కడ ఈతి బాధలుండవు. నేతి బాధలుండవు. ఇక్కడ భక్తి వీధుల్లో ప్రవహిస్తుంటుంది. ఆ ప్రవాహం నుండి ఎవరెంత తీసుకుంటే అంత.

ధార్మిక లోతుల్ని చూడాలంటే కాశీలో ఉండాలి. మెలగాలి. కలవాలి. కరగాలి.

భౌతిక ప్రపంచంలో దాగిన అలౌకిక ప్రపంచం కాశీ. ఇక్కడ అడక్కూడదు. ఇవ్వాలి.

కిల్లాడ సత్యనారాయణ
వారణాసి. ఫోన్: 833 398 7838.

## ఆత్మచిత్రం

*ఆత్మచిత్రం* – చూస్తుంటే ఏ చిత్రమూ స్పష్టంగా తోచదు. ఆత్మను చూడగలమా? అనుభూతి చెందగలం. మనం ఈ భూమికీ, ఆకాశానికీ చెందినవాళ్లం కదా!

యతుల జతులు వినపడవు – అంత్య ప్రాసలూ కనపడవు – లయవిన్యాసాలసలే లేవు. శబ్ద రోదనలూ కావు – పల్లెటూరి మట్టి దారిలో యద్లబండి వెళుతున్నట్లు మొద్దు గంటల మెత్తని మోతలు – ఈ కవితలు. కవితో బంధాన్ని ముడివేస్తాయి.

(ఈ *ఆత్మచిత్రం* కేదార్‌నాథ్ సింగ్ వచన కవితలకు తెలుగు అనువాదం.)

* * *



***ఆత్మచిత్రం*** *– కిల్లాడ సత్యనారాయణ*

*పేజీలు: 172, వెల: ₹ 150/- ప్రతులకు: కె. సత్యనారాయణ, ఇం.నెం. 49/54ఎ/4బి, బాలయ్యశాస్త్రి లే అవుట్, వెలమ కళ్యాణమండపం దగ్గర, సీతమ్మధార, విశాఖపట్నం – 531117. ఫోన్: 833 398 7838.*

# ఆత్మబంధం

## భోజ్‌పురి వరకూ నా ప్రయాణం

ఇది ఎలాంటి సంబంధం? ఆయన్ని నేనెప్పుడూ కలవలేదు. ఆయన మాటల్ని నేనెప్పుడూ వినలేదు. కానీ గత రెండేళ్ల నుండి ఆయనకూ నాకూ మధ్య ఏదో సంబంధం ఉన్నట్లు అనిపిస్తుంది. గాలితో, వెలుతురుతో ఉన్న సంబంధంలా. వాని పదాల నీడ నాపై పడసాగింది.

నేను చాలా పుస్తకాలు చదివాను. కానీ రెండు కృతులు మాత్రం నన్ను కదిలించాయి. ఒకటి మహాత్మాగాంధీ ఆత్మకథ 'సత్యంతో నా ప్రయోగాలు' అనే పుస్తకం. రెండవది 'శ్రీ కేదార్ నాథ్ సింగ్' కవిత్వం. ఈ రెండూ నా అస్తిత్వంలో అణువణువునూ స్పృశించాయి. ఈ రచనల్లో కేవలం వీరి మేధస్సు మాత్రమే కాదు, వీరి వ్యక్తిత్వం, అస్థిత్వం కూడా మిళితమై ఉన్నాయి. అందుకే ఆ పదాలకు అంతటి శక్తి.

శ్రీ కేదార్‌నాథ్ సింగ్ సాహిత్యంతో నా తొలి పరిచయం 2020లో జరిగింది. విజయవాడ పుస్తకమేళాలో కవి ఖాదర్ మొహియుద్దీన్ నాకు కేదార్‌నాథ్ సింగ్ ప్రతినిధి కవితల హిందీ పుస్తకాన్ని బహూకరించారు. ఆ పుస్తకం కొన్ని రోజులు నా టేబుల్‌లను అలంకరించింది. దాన్ని తెరిచేందుకు ధైర్యం సరిపోలేదు. ఎందుకంటే, నాకు హిందీ సాహిత్యంలో ప్రవేశం లేదు. కానీ ఎందుకో ఆ పుస్తకం ప్రతి రోజు నావైపే చూస్తున్నట్లు అనిపించేది.

భవనంలోకి వెళాలంటే, తాళంచెవి కావాలి. కవిత్వంలోకి ప్రవేశించాలంటే, రసహృదయం ఉండాలి. కేదార్‌నాథ్‌సింగ్ కవిత్వంలోకి నన్ను తీసుకువెళ్లే తాళంచెవి కోసం వెదకడం ప్రారంభించాను నాకు దొరికిన మొదటి తాళంచెవి 'చౌపాల్'. శ్రీ కామేశ్వర్ సింగ్ సంపాదకత్వంలో కేదార్‌నాథ్ సింగ్‌పై వెలువడిన ప్రత్యేక సంచిక 'చౌపాల్'.

విజయవాడ నుండి ఉత్తరప్రదేశ్‌లోని బాందాకు నాకు బదిలీ అయ్యింది. అక్కడ ప్రొ. శశికాంత్ శుక్ల, ప్రొ. రామ్‌గోపాల్ గుప్తలతో పరిచయం ఏర్పడింది. వీరి సహకారంతో కేదార్ నాథ్ సింగ్ కవిత్వం కొంచెం చేరువయ్యింది. అక్కడ ఆర్.టి.ఒ. గా చేస్తున్న శంకర్ జీ సింగ్ నన్ను కలిశారు. ఆయనది కూడా కేదార్ నాథ్ సింగ్ గారి గ్రామమేనని చెప్పారు. శ్రీ కేదార్‌నాథ్ సింగ్‌తో ఆయన తీసుకున్న ఫోటోలను చూపించారు. సంతోషం కలిగింది.

అయినా నా తృష్ణ తీరలేదు. ఒకరోజు అలహాబాద్ వెళ్లాను. అక్కడ వాణీ ప్రచురణ సంస్థ కార్యాలయానికి వెళ్లాను. వారివద్ద నుండి కేదార్‌నాథ్ సింగ్ రాసిన పుస్తకాలు తీసుకున్నాను. వాటిని చదవడం ప్రారంభించాను. కేదార్‌నాథ్ సింగ్ సాహిత్యంపై వచ్చిన అన్ని పుస్తకాలు పంపమని వాణీ ప్రచురణ సంస్థ మేనేజర్ తివారీని అడిగాను. చాలా పుస్తకాలు పంపించారు.

కేదార్‌నాథ్ సింగ్ సాహిత్యంపై వచ్చిన విమర్శనాత్మక గ్రంథాలలో – సాఖీ, కేదార్‌నాథ్ ఔర్ ఉన్నా సమయ్, కేదార్‌నాథ్ సింగ్‌కే కావ్య మే బింబ్ – విధాన్, కేదార్ నాథ్ సింగ్ కా కావ్య సంసార్, కేదార్ నాథ్ సింగ్ కే కావ్య కీ గవేషణా, కేదార్ నాథ్ సింగ్ సంచయన్, కేదార్ నాథ్ సింగ్ కా దూసరా ఘర్, కవి కేదార్ నాథ్ సింగ్, కేదార్ నాథ్ సింగ్ కీ కావ్య సృష్టి మొదలైన పుస్తకాలు నాకు అమూల్యమైన తాళం చెవులు.

ఈశ్వరుని లీల ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటుంది. నేను దేన్ని వెదుకుతున్నానో దాని దగ్గరకే నన్ను చేర్చాడు.

నాకు వారణాసికి బదిలీ అయింది. 'చౌపాల్'లో వ్యాసం రాసిన సంజయ్ గౌతమ్‌కు ఫోను చేశాను. శ్రీ కేదార్‌నాథ్ సింగ్ గురించి ప్రొ. రామ్ సుధార్ సింగ్‌తో మాట్లాడమని ఫోన్ నెంబర్ ఇచ్చారు. నేరుగా ఆయన్ని కలిశాను. మట్టి పరిమళం వెదజల్లుతున్న ఒక మహాకవి కవిత్వంలోని వెలుగుల్ని ఆ మట్టి మూలాల్లో వెతకడానికి

బయలుదేరాను. ప్రొ. రామ్ సుధార్ సింగ్‌తో కలిసి కేదార్ నాథ్ సింగ్ స్వగ్రామం చకియా వెళ్లాను. అక్కడ జగర్ నాద్ దొరకలేదు. కానీ డా. కామేశ్వర ప్రసాద్ సింగ్ దొరికారు. వీరు శ్రీ కేదార్‌నాథ్ సింగ్‌కు సన్నిహితంగా మెలిగిన వ్యక్తి.

కేదార్‌నాథ్ సింగ్ పై సుమారు ఆరు వందల పేజీల ప్రత్యేక సంచికను వెలువరించిన వ్యక్తి. కేదార్ నాథ్ సింగ్ : చకియాసే ఢిల్లీ, కవితావోం కే బీచ్ పుస్తకాలను తీసుకొచ్చిన వ్యక్తి. చకియాలో ప్రతి ఇంటినీ స్పృశిస్తూ, కేదార్ నాథ్ సింగ్ గారి ఇంటికి చేరాం. గది గదిలో తిరిగాం. ఆయన పేరు ఉచ్చరిస్తే చాలు, అక్కడ మనుషుల ముఖాల్లో ఆయన మావాడే అన్న ఆత్మీయ ఆనందం కనిపించింది.

కేదార్‌నాథ్ సింగ్ గారి బంధువులు కలిశారు. శైలేష్ కుమార్ సింగ్, శక్తి సింగ్, సురేంద్ర సింగ్, చందన్ సింగ్, అంకిత్ సింగ్ మరికొంత మంది... చిన్నా పెద్దా నా చుట్టూ గుమిగూడారు. వాళ్లంతా కేదార్ నాథ్ సింగ్ జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయారు. నన్ను పేరులేని నది (బినా నామ్ కీ నదీ) దగ్గరకు తీసుకెళ్లారు. తుప్పలతో నిండి ఉంది. ఒక వృద్ధుడు గేదెల్ని తోలుకుంటూ వస్తున్నాడు. 'అతను ఝుమ్మన్ మియానా?' అనడిగాను. 'కాదు' అన్నారు.

కేదార్ నాథ్ సింగ్ నిరాడంబరత గురించి అడిగాను. 'ఆయనకు ఇద్దరు మిత్రులుండేవారు. ఈ ముగ్గురూ నడుచుకుంటూ, మాట్లాడుకుంటూ రాణీగంజ్ బజారుకి వెళ్లేవారు. దారిలో కనిపించినవారితో హాస్యమాడుతూ వెళ్లి, అక్కడ జిలేబి తినేవారు' అన్నారు శైలేష్ కుమార్ సింగ్.

మాజీ గ్రామ సర్పంచ్ సురేంద్ర సింగ్ 'ఊరిలో ఆయన ఎక్కువగా వృద్ధులతో గడిపేవాడు. పురాతన స్థలాలకు వెళ్లేవాడు. ఏమీ చదువుకోనివాళ్లతో కూడా ఎంతో ఆత్మీయంగా మాట్లాడేవాడు' అన్నారు.

'ఊరిలో కొందరికి ఆయన ఆర్థికంగా కూడా సహాయపడేవాడు. లాల్ మోహార్, జగర్ నాథ్ కుటుంబానికి సహాయపడడం నాకు మాత్రమే తెలుసు. ఎవరికీ తెలియనివ్వొద్దు అనేవాడు' అంటూ ఇన్నాళ్లుగా తన గుండెల్లో దాచుకున్న రహస్యాన్ని బయటపెట్టాడు చందన్ సింగ్. 'కుషీనగర్‌లో ఉద్యోగం చేస్తున్నప్పుడు ఆ కళాశాల బంట్రోతుతో స్నేహం చేశారు. ఇద్దరూ కలిసి బజారులో తిరిగేవారు. ఒకరోజు వీరిద్దరూ కలిసి గోరఖ్‌పూర్ వెళ్లారట. తీవ్రమైన చలి. రాత్రి పడుకున్నప్పుడు తనవద్ద ఉన్న రగ్గును బంట్రోతుకు ఇచ్చి, తను మాత్రం కేవలం స్వెట్టర్‌తో పడుకున్నారట' అన్నారు శక్తిసింగ్.

'ఊరంటే ఆయనకు ప్రాణం. ఊరిలోనే కాదు, ఊరి నుండి ఎవరు ఢిల్లీ వెళ్లినా ఆయన భోజ్‌పురిలోనే మాట్లాడేవారు' అన్నారు శైలేష్ సింగ్.

కేదార్ నాథ్ సింగ్ తన 'దేశం – ఇల్లు' కవితలో ఇలా అంటారు.

*హిందీ నా దేశం*
*భోజ్‌పురి నా ఇల్లు*
*ఇంటి నుండి బయటకు వస్తే*
*దేశంలోకి వెళ్లిపోతాను*

'మాతృభాష' కవితలో –

*'చీమలు పుట్టలోకి దూరినట్లు*
*వడ్రంగి పిట్ట బెరడు దగ్గరకి చేరినట్లు*
*.... ఓ నా భాషా*
*నేను నీలోకి తిరిగి వస్తాను ...* అంటాడు.

కామేశ్వర్ సింగ్ గారు కేదార్‌నాథ్ సింగ్ గారి నిరాడంబరత్వం గురించి చెబుతూ 'ఆయన సహజంగా జీవిస్తారు. ఢిల్లీలో ఒకసారి ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో సాహిత్య గోష్ఠికి ఆయనతో కలిసి నేనూ వెళ్లాను. కేదార్ నాథ్ సింగ్ మామూలు కుర్తా, పైజామ, చెప్పులు వేసుకున్నారు. భోజనాల సమయంలో అన్నంలో కూరని చేతితోనే కలుపుకుని తింటున్నారు. కొందరు ఆయనవైపు 'ఎవరో పల్లెటూరి వ్యక్తి ఇక్కడకు ఎలా వచ్చాడన్నట్లు' వింతగా చూస్తున్నారు. సూటు, బూటు వేసుకున్న ఒక వ్యక్తి వచ్చి, 'ఈయనెవరు?' అని నన్నడిగారు. 'కవి కేదార్‌నాథ్ సింగ్' అన్నాను. వెంటనే ఆ వ్యక్తి కేదార్‌నాథ్ పాద స్పర్శ చేసి, 'క్షమించండి, మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను' అన్నాడు. 'తనకు 42 సంవత్సరాల వయస్సులో ధర్మపత్ని శివకలీ దేవి స్వర్గస్తులయ్యారు. ఏకాంత జీవనంలో ఒకవైపు కవిత్వాన్ని ఆశ్రయించారు కేదార్‌నాథ్. మరోవైపు పిల్లలపై దృష్టి పెట్టారు. ఆయనకు ఒక కుమారుడు, అయిదుగురు కుమార్తెలు. కుమారుడు ఐ.ఎ.ఎస్. అధికారి. కుమార్తెలు బాగా చదువుకుని చక్కగా స్థిరపడ్డారు' అన్నారు కామేశ్వర్ సింగ్. చకియా నుండి

బయలుదేరాం. కారులో శ్రీరామ్ సుధార్ సింగ్ 'కేదార్ నాథ్ సింగ్ యూపి కళాశాలలో చదువుకున్నారు. ఆయన బెనారస్ ఎప్పుడు వచ్చినా, కళాశాలకు వచ్చేవారు. గేటు దగ్గర నేలకు నమస్కరించి, లోపలికి వచ్చేవారు' అని యూపి కళాశాలతో కేదార్ నాథ్ సింగ్‌కుగల అనుబంధాన్ని వివరించారు. తిరిగొచ్చాక బి.హెచ్.యూ.లో ప్రొఫెసర్ సదానంద్ సాహిగారిని నాకు పరిచయం చేశారు శ్రీరామ్ సుధార్‌సింగ్. ఆయన 'సాఖీ' పత్రికను నడుపుతున్నారు. 'సాఖీ'తో కేదార్‌నాథ్ సింగ్‌కుగల సంబంధాన్ని ఆయన తెలిపారు. అంతే కాదు. సాఖీ పత్రిక ద్వారా కేదార్ నాథ్ సింగ్ పేరుతో పురస్కారాన్ని ప్రారంభించారని, ఆ సభకు నన్ను రమ్మని ఆహ్వానించారు. ఆ కార్యక్రమంలో నేను కేదార్‌నాథ్ సింగ్ గారి కుటుంబ సభ్యులందరినీ కలిశాను. చాలా ఆనందం కలిగింది. కేదార్‌నాథ్ సింగ్ కుటుంబీకులైన ప్రొ. సురేంద్ర ప్రతాప్ గారు నన్ను ప్రోత్సహించారు. ప్రముఖ హిందీ సాహిత్యకారుడు డా. ఇండివర్‌ను కలిశాను. వీరి ద్వారా కేదార్ నాథ్ సింగ్ కవిత్వం గురించి మరింత తెలుసుకున్నాను. కేదార్‌నాథ్ సింగ్ చాలా ఉన్నత స్థాయికి చేరుకున్నారు. జె.ఎన్.యూ.లో హిందీ విభాగాధిపతిగా పనిచేశారు. ప్రతిష్ఠాత్మక జ్ఞాన్‌పీఠ్ అవార్డు అందుకున్నారు. కవిగా చాలా ప్రజాదరణ పొందారు. అయినా ఆయనలో సహజత్వం, సరళత్వం, నిరాడంబరత లేశమాత్రం తగ్గలేదు. 'ఉన్నతి' కవితలో ఆయన వ్యక్తిత్వం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది.

*నగరపు మెట్లన్నీ కలిసి*
*ఎంత ఎత్తుకు చేరుతాయో*
*అక్కడ ఎవరూ లేరు*

సమాజంలో చాలామంది డబ్బు, పదవి, కీర్తి వెంట పరుగులు తీస్తున్నారు. ఇవన్నీ కొందరు పొందుతున్నారు. అయినా అసంతృప్తి. జీవితంలో మనం ఏం కోల్పోయాం? ఏం పొందాం? ఈ చింతన ఎవరు చేసుకుంటున్నారు.

'పేరు' (నామ్) కవితలో–

*పేరు సంపాదించే పనిలో*
*నేను ఇక్కడకు చేరుకున్నాను*
*అప్పుడు తెలిసింది*
*ప్రతీ పేరూ*
*ఏ పక్షీ గుడ్లు పెట్టని ఒక గూడు* అంటారు కేదార్‌నాథ్

'జగర్ నాథ్, ఝుమ్మన్ మియా, బంసి మల్ల, లాల్ మోహర్, బూఢా చౌకిదార్, ఝప్ సీ చర్ వాహ, సన్ ఝు హజ్జాం, నూర్ మియా, బంగాలి బాబూ... వీరందరూ కేదార్ నాథ్ సింగ్ కవితా పాత్రలు. నేల, మాంఝి వంతెన పేరులోని నదీ, మొదలైనవి ఆయన కవితా శీర్షికలు. పార, పలుగు, ఉప్పు, ఎద్దు, గుర్రం, వత్తి పూలు వంటివి ఆయన కవితా వస్తువులు.'

కేదార్ నాథ్ సింగ్ గారు రాసిన చాలా పుస్తకాల నుండి నూరు కవితల్ని ఎంపిక చేసి, తెలుగు పాఠకులకు అందిస్తున్నాను. అనువాదం మూలం అవదు. రెంటికీ మధ్య చెరపలేని సన్నని గీత ఎప్పుడూ ఉంటుంది.

అనువాదం గురించి కేదార్ నాథ్ సింగ్ గారే ఇలా అన్నారు.

'గీతాంజలి గొప్పతనం తెలుసుకోవాలంటే, మనం బెంగాలీ భాష నేర్చుకోవాలి. బెంగాలీ చాలా మృదువైన సంగీత భాష. అనువాదంలో ఆ అనుభూతి అందదు. ఏది అనువాదంలో నాశనం అవుతుందో, దేనికి అనువాదం అసాధ్యమవుతుందో దాన్ని శ్రేష్ఠ కవితగా వ్యాఖ్యానించవచ్చు.'

కేదార్‌నాథ్ సింగ్ కవితల్ని తెలుగులోకి అనువాదం చేయడం నాకు కత్తి మీద సాము అయింది. కొన్ని భోజ్‌పురి పదాలు, గ్రామీణ పదజాలం, తూర్పు ఉత్తరప్రదేశ్ ప్రాంత వ్యవసాయ పదాలు, కొన్ని జాతీయాలు... ముఖ్యంగా ఆయన కవితా శిల్పం నాకు ఎదురైన సవాళ్లు. పట్టు విడువలేదు. ముందు ఆయన చుట్టూ అల్లుకున్న మనుష్య, వస్తు ప్రపంచంతో సంబంధం పెంచుకున్నాను. ఆ తర్వాత ఆయన పదప్రపంచం కొంచెం తేలికయ్యింది.

నా తెలుగు అనువాదంలో కూడా అదే క్లుప్తత, సరళతా సహజంగా చోటుచేసుకున్నాయి. నా అనువాదం కేదార్ నాథ్ సింగ్ గారి కవితలు అందించినంత రుచిని అందించలేకపోవచ్చు. కానీ కవిత్వ ప్రేమికుల దప్పికను తప్పక తీరుస్తుంది.

---

జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా. కేదార్‌నాథ్ సింగ్
నూరు కవితలకు (హిందీ) తెలుగు -
***ఆత్మచిత్రం***- కిల్లాడ సత్యనారాయణ
వారణాసి. ఫోన్: 833 398 7838.

## మనసు జారిపోయే చోటు
# కిలిమంజారో-4

- నిమ్మగడ్డ శేషగిరిరావు

ఆఖరి రోజు కరంగా క్యాంపు నుండి అంతా ఒకవైపే ప్రయాణించాలి. మా లక్ష్యం కిలిమంజారో శిఖరాగ్రం చేరుకోవటం. లెక్క ప్రకారం తర్వాత కాంపు 4600 మీటర్ల ఎత్తులో ఉన్న 'బరుఫు'. తుది దశలో శిఖరారోహణ మొదలుపెట్టేది ఇక్కడి నుండే. అనుభవజ్ఞుడైన మా గైడ్ కాస్పర్ ఉపాయంగా, 'బరుఫు' కాంపు నుండి మరో కిలోమీటర్ ఎగువన ఉన్న 'కొసావో' కాంపుకు నడిపించాడు. అది 4800 మీ. (15,748 అడుగులు) ఎత్తులో ఉంది. ఈ రెండు కాంపుల మధ్య నిలువుగా ఉన్న పెద్ద రాళ్ళున్నాయి. బరుపు కాంప్ వద్ద ఆగి, మళ్ళీ శిఖరారోహణ మొదలుపెడితే, మొదటి గంటలోనే మా శక్తి హరించుకుపోయేది. ఇలా చేయటంవలన 'బరఫు' కాంపువద్ద ఉండే గుంపుని తప్పించుకోవటమేకాక, శిఖరాగ్రానికి చేరే ప్రయాణానికి ఒక గంట ఎక్కువ సమయం దొరికింది.

కరంగా క్యాంపు నుండి కొసావో కాంపుకు మధ్య దూరం 6 కి.మీ. మాత్రమే. కాని మాకు ఐదు గంటలు పట్టింది. ఎక్కిన ఎత్తు దాదాపుగా 700 మీటర్లు. ఇప్పటివరకు మా పర్వతారోహణలో 'కొసావో' కాంపే ఎత్తైనది. యథాప్రకారం నేను మా గ్రూపులో అరగంట వెనకబడ్డాను.

నేను అక్కడికి చేరుకొనేసరికి మధ్యాహ్నం 2.30 గంటలయ్యింది. నేను నేరుగా భోజనాల టెంట్‌కు వెళ్ళాను. అక్కడ వెంకట్ లేడు. వెంకట్ మళ్ళీ మౌంటెన్ సిక్‌నెస్‌కి గురై తన గుడారంలోనే విశ్రాంతి తీసుకుంటున్నాడని తెలిసి, పరిస్థితి తెలుసుకునేందుకు అతని వద్దకు వెళ్ళాను. అతను అరనిద్రలో ఉన్నాడు. అతని ముఖం ఉబ్బి ఉంది. కాని అలాంటి పరిస్థితిలో కూడా అతని ముఖంలో చిరునవ్వు అలాగే ఉంది. మానసికంగా బలంగా ఉన్నాననీ, శరీరం సహకరించి, కాస్పర్ సపోర్ట్ చేస్తే, శిఖరారోహణకి సిద్ధమేనని చెప్పాడు. అతనికి భరోసా ఇచ్చి, విశ్రాంతి తీసుకోమని, బయటికివచ్చి నేను కాస్పర్‌తో మాట్లాడాను. వెంకట్‌కి మధ్యమధ్యలో ఆక్సిజన్ ఇస్తున్నట్లు అతను చెప్పాడు. రాత్రి పది గంటలకు అతని పరిస్థితి బేరీజు వేశాకే, తమతో పాటుగా తీసుకెళ్ళాలా వద్దా అనే నిర్ణయం తీసుకుంటానని కాస్పర్ చెప్పాడు.


కిలిమంజారో శిఖరం

నేను భోజనాల టెంట్‌కి చేరుకునే సరికి మా టీమ్‌లో ఫిజిషియన్స్ మోహన్, రమేష్, మహేష్‌లు, వెంకట్‌కు ముందుకు సాగటానికి కావలసిన స్వస్థత లేదని, తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పారు. మరో వర్గం, ఐ.టి. టీం యువకులు మాత్రం పదిగంటలకల్లా వెంకట్ మెరుగై మనతో కలుస్తాడనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా, వెంకట్ సురక్షితంగా ఉండటం ముఖ్యం కాబట్టి, నేను పరిస్థితిని నిష్పాక్షికంగా గమనించి కాస్పర్‌తో కలిసి గట్టి నిర్ణయం తీసుకోవాలని తీర్మానించుకున్నాము.

నాకు, మరో ఇద్దరికి గత నాలుగు రోజులుగా బి.పి. పెరిగింది. ఎత్తు ఎక్కుతూ, నడుస్తూ ఎక్కువ శక్తిని ఉపయోగించటంతో, శరీరం మీద వత్తిడి పెరగటం వలన బి.పి. సహజంగా పెరుగుతుంది. కాస్పర్ తన ప్రోటోకాల్ ప్రకారం, 'కాప్టోప్రిల్' అనే యాంటీ-హైపర్‌టెన్సివ్ మందును సూచించాడు. దీనివలన బి.పి. తగ్గటంతో పాటు, ఎలర్జీతో కూడిన పొడి దగ్గు వస్తుంది. నాకు కూడా దగ్గు రావటంతో, అది తగ్గటం కోసం నాకు వేరే మందు 'యాంటీ-హిస్టమిన్' ఇవ్వాలనుకున్నారు. దీనివలన మగతగా ఉంటుంది. ప్రయాణంలో మగతగా జోగటంకంటే, దగ్గు సహించటమే మంచిదని నేను ఆ రెండో మందు వద్దన్నాను. మా అందరిలో గిరీష్ అనుభవజ్ఞుడైన పర్వతారోహకుడు. అతను కూడా అంత స్వస్థతతో లేడు. రాజ్ జలుబుతో బాధపడుతున్నాడు. యువకులైన ప్రశాంత్, మనోజ్, రాఘవ్, రాజేష్‌లు కూడా అంత ఉత్సాహంగా లేరు. మేమందరం బాగా డస్సిపోయి ఉన్నాము. అలసటవల్ల, ప్రాణవాయువు పలుచనవటంవలన, మేము కొంచెం అయోమయ పరిస్థితిలో ఉన్నాము. శారీరకంగా మా బృందం కృశించినట్లున్నా, శిఖరం చేరాలనే మా సంకల్పం మాత్రం చెక్కుచెదరలేదు. అయిదారు గంటలు నిద్రపోతే మా శరీరాలు తిరిగి శక్తి

పుంజుకుంటాయని కాస్పర్ ధైర్యం చెప్పాడు. ఈ ఆఖరి ఎనిమిది గంటల సాహసయాత్ర సక్రమంగా సాగాలని, ఎనిమిది రోజుల ప్రయాస సత్ఫలితంతో ముగియాలని కోరుకుంటూ, మా గుడారాల్లోకి వెళ్ళాము. రాత్రి పన్నెండు గంటలకి శిఖరారోహణ తుది ఘట్టం మొదలవుతుంది.

కొసావో కాంపు వద్ద మాకు చివరి మెడికల్ చెకప్ జరిగింది. దాదాపు అందరికీ రక్తంలో ఆక్సిజన్ (ఎస్.పి.ఒ.2) 80% వరకు ఉంది. నా హాస్పిటల్ ప్రాక్టీసులో అయితే ఎవరికైనా ఎస్.పి.ఒ. 2 92% తక్కువగా ఉంటే చాలా ప్రమాదకరమనుకొంటాము. ఇక 80%తో సాధారణ పరిస్థితులలో ఎవరిని ఊహించుకోలేము కూడా. మేము ఎక్కవలసిన ఎత్తు ఇంకా 1000 మీటర్లు పైనే ఉంది. తక్కువ ఎస్.పి.ఒ.2, గాలిలో పలుచనైన ప్రాణవాయువుతో త్వరగా అలసట వస్తుంది. ఎక్కేటప్పుడు కండరాలను ఎక్కువగా ఉపయోగించటం వలన, వాటికి ఆక్సిజన్ ఎక్కువగా కావలసి వస్తుంది. అక్కడ వెయ్యి మీటర్లు ఎక్కటమంటే, దుబాయ్‌లో ఉన్న బుర్జ్ ఖలీఫాను (ప్రపంచంలో అన్నిటికంటె ఎత్తైన భవనం) 5000 మీటర్ల ఎత్తు మీదుంచి, దానిని ఒకటింబావుసార్లు ఆగకుండా ఎక్కినట్లన్నమాట. కిలిమంజారో పర్వతానికి ‘కిబో’, మావెంజీ అనే రెండు శిఖరాలున్నాయి. వీటిలో ‘కిబో’ పెద్దది. మావెంజీ అణగారిపోయిన అగ్నిపర్వతం. ‘కిబో’ నిద్రాణమై ఉన్న అగ్నిపర్వతం. ఎప్పుడైనా ఎగసి పడవచ్చు. దాదాపు 200 సంవత్సరాల క్రితం ఈ అగ్నిపర్వతం లావా చిమ్మినట్లు నమోదయింది. ‘కిబో’, మావెంజీ పర్వతాల మధ్య ఉన్న లోయలాంటి వంపును కిలిమంజారో జీను (శాడిల్) అంటారు. ఆ ప్రాంతం చంద్రుడి ఉపరితలంలా, నల్లటి లావా రాళ్ళతో, ఇసుకతో నిండి ఉంటుంది. ‘కిబో’ పర్వతం దూరానికి ఒక పెద్ద ముద్దలా కనిపించినా, దాని పై భాగం మాత్రం ఒక అగ్ని పర్వత బిలం. కిబో శిఖరం మీద ఉహూరు ఎత్తైన పాయింట్ (5875 మీ.; 19340 అడుగులు). అది ఆఫ్రికా మొత్తానికి ఎత్తైన ప్రాంతం. ఏ కిలిమంజారో పర్వతారోహకుడికైనా దాన్ని అధిరోహించటమే పరమావధి.

‘కిలిమంజారో’ అనే పదం ‘చగ్గా’ అనే భాష నుండి తీసుకున్నారు. అది కిలిమంజారో ప్రాంతంలో నివసించే ‘చగ్గా’ తెగవారి మాతృభాష. ఆ భాషలో ‘కిలిమంజారో’ అంటే ‘పక్షులకు అసాధ్యమైనది’ అని. అంటే ఈ పర్వతం పైకి పక్షులు కూడా చేరలేవని అర్థం.

యోహానస్ రోబ్సన్ అనే స్విస్-జర్మన్ క్రిస్టియన్ మత ప్రచారకుడివలన 1848లో ఐరోపా వారికి ‘కిలిమంజారో’ గురించి తెలిసింది. ఈ పర్వతానిని కనుగొన్న ఆనందంలో, అతను లండన్‌లోని రాయల్ జాగ్రఫికల్ సొసైటీ (ఆర్.జి.ఎస్)కి, తను భూమధ్యరేఖా ప్రాంతంలో మంచుతో కప్పబడిన పర్వతాన్ని కనుగొన్నట్లు సమాచారం పంపాడు. ఆ రోజుల్లో యాత్రికులకు ఈ సొసైటీ ఒక దిక్సూచి. ఐతే, యూరప్‌లో రోబ్సన్ చెప్పిన దానిని ఎవ్వరూ నమ్మలేదు. అతను అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాడని ఆర్.జి.ఎస్. ఎద్దేవా చేసింది. అది నమ్మశక్యంగా లేదని, ఆవిర్లు కక్కే వేడినీటి ఊటలకు, బుగ్గలకు ఆలవాలమైన భూమధ్యరేఖకు దగ్గరలో మంచుతో కప్పబడిన పర్వతం ఉండటం అసాధ్యమని కొట్టివేసింది. 1889వ సంవత్సరంలో జర్మన్ పర్వతారోహకుడు హాన్స్ మేయర్ దాన్ని అధిరోహించి రికార్డు సృష్టించాడు.

1936లో ఎర్నెస్ట్ హెమింగ్వే, ‘ద స్నోస్ ఆఫ్ కిలిమంజారో’ అనే ఒక చిన్న కథ కూడా వ్రాశాడు. ఇది తరువాత సినిమాగా కూడా వచ్చింది. గ్లోబల్ వార్మింగ్ కారణంగా గడచిన 10 సంవత్సరాలలో కిలిమంజారో మీదున్న మంచు 80% తగ్గిపోయిందని అంచనా. ఇది ఇలాగే కొనసాగితే 2030వ సంవత్సరం నాటికి మంచు మొత్తం కరిగిపోయి, మంచు పర్వతంగా కిలిమంజారో చరిత్రలో మాత్రమే మిగిలిపోతుంది.

కిలిమంజారో ఎక్కటానికి ఎలాంటి ప్రత్యేక శిక్షణ అవసరం లేదు. అందుకేనేమో నాలాంటివారికి ఇదొక ప్రత్యేక ఆకర్షణ. కొంతమేరకు శరీర పటుత్వం, ఎక్కువ మొత్తంలో మానసిక ధైర్యం మాత్రం అవసరం. పర్వతారోహణలో కలిగే ‘మౌంటెన్ సిక్‌నెస్’ ఒక పెద్ద అవరోధం. అది ఎవరికి కలుగుతుందనేది, 4000 మీటర్లు ఎత్తు చేరేవరకు తెలియదు. శరీర దృఢత్వం కలిగినవాళ్ళు కూడా జన్యుపరంగా ఈ సిక్‌నెస్‌కు గురవవచ్చు. అలాంటివాళ్ళు, దానికి తట్టుకోలేక, ఎంతో బాధతో, తక్కువ ఎత్తులోనే, తమ స్వప్నాలకు స్వస్తి చెప్ప వలసి రావచ్చు. ప్రఖ్యాత టెన్నిస్ క్రీడాకారిణి ‘మార్టినా నవ్రతిలోవ’ ఇటువంటివారిలో ఒకరు. భరించలేని మౌంటెన్ సిక్‌నెస్‌వల్ల తన పర్వతారోహణ కలను తీర్చుకోలేకపోయింది.

అందరిలోకీ నేను నిదానం అని ఋజువు అవ్వటంవల్ల, కాస్పర్ నన్ను, మరో ఇద్దరు పెద్ద వయసువారిని (రావుగారు, రాజ్) ఒక గంట ముందు శిఖరారోహణకు పంపాలని నిర్ణయించాడు. మేము ముగ్గురం ఇండియాలో ఒకే మెడికల్ కాలేజివాళ్ళం (రంగరాయ మెడికల్ కాలేజ్), చిరకాల మిత్రులం.

అందరికంటే ముందు సాయంత్రం ఆరుగంటలకల్లా భోజనం చేసేసి, విశ్రాంతికి ఉపక్రమించమని కాస్పర్ ఆజ్ఞ. మేము ముగ్గురం మళ్ళీ రాత్రి 10 గంటలకే లేచి, 11

గంటలకల్లా శిఖరంవైపుగా సాగాలి. మిగిలినవాళ్ళు షెడ్యూలు ప్రకారం అర్ధరాత్రి 12 గంటలకు బయలుదేరతారు. మేము అందరం ఉదయం 6 గంటలకు సూర్యోదయానికి కిబో చేరుకోవాలి. చీకటి రాత్రిలో ఏడు నుండి ఎనిమిది గంటల పాటు, ఆ ప్రతికూల వాతావరణంలో, తెలియని దారిలో, ఆ కొండని ఎక్కాలి. సాయంత్రం 6.30 గం॥లకు, ఎటూ కాని సమయంలో గుడారంలో ఎంత ప్రయ్నతం చేసినా నిద్రపట్టటం లేదు. దాంతోపాటు వెంకట్ పరిస్థితి కూడా నా మనసులో మెదులుతుంది. మధ్యలో ఇమ్మాన్యుయేల్ స్వరం వినపడి, వెంకట్ ఆరోగ్యం గురించి అతనిని అడిగి తెలుసుకున్నాను. అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందనీ, అతనిని శ్రద్ధగా చూస్తున్నారని తెలిసింది.

కొంచెం, కొంచెం నిద్రపడుతున్నప్పుడు జోసఫ్ నన్ను నిద్రలేపేశాడు. ఇమ్మాన్యుయేల్ వచ్చి నేను సరైన దుస్తులను ఒకదాని మీద ఒకటిగా వేసుకుంటున్నానో లేదోనని మరీమరీ అడిగాడు. రకరకాలుగా అమరే వెచ్చటి దుస్తులు ఇంత ఎత్తులో చలి నుండి రక్షించుకోవటానికి అత్యవసర వస్తువులు. నేను ఆరు దుస్తులను ఒకదాని మీద మరొకటిగా వేసుకున్నాను. మొదటి రెండు పొరలు శరీరాన్ని అంటిపెట్టుకుని, శరీర సహజ ఉష్ణోగ్రత బయటికి పోకుండా ఉంచేవి. మిగిలినవి చలి లోపలికి రాకుండా కాపాడేవి. రెండు జతల మేజోళ్ళు, టోపి, హెడ్ లైట్, ఇలాంటివన్నీ ప్యాక్ చేసుకున్నానని కూడా రూఢి చేసుకున్నాడు.

ఇదంతా అయిన తరువాత టెంట్ నుండి బయటకు వచ్చిన వెంటనే నేరుగా వెంకట్ వద్దకు వెళ్ళాను. నా మనసులో అతను పదేపదే మెదులుతున్నాడు. నేను వెళ్ళేసరికి అతను దుస్తులు వేసుకుంటున్నాడు. అతని ముఖం వాపు అలాగే ఉంది. అతనితో పాటు కాస్పర్ అక్కడే ఉన్నాడు. కాస్పర్ సలహా ప్రకారం క్రిందకు దిగిపోతున్నానని వెంకట్ చెప్పాడు. తప్పనిసరి పరిస్థితి. ఏమీ మెరుగవలేదు. అంతకంటే విషమించకూడదని కాస్పర్ అతనిని సైమన్‌తో పాటు క్రిందికి పంపుతున్నట్లు చెప్పాడు. వేగంగా క్రిందకు దిగిపోవటమే దీనికి సరైన వైద్యం. వెంకట్ ఆ పనే చేస్తున్నాడు. కాస్పర్ తర్వాత అనుభవంగల గైడు సైమన్. అతను వెంకట్‌తో పాటు వెళ్ళటం నాకు ధైర్యమిచ్చింది. కొద్ది నిముషాల్లో నేను, కాస్పర్, వెంకట్, సైమన్‌లకు వీడ్కోలు పలికాము. ఇంతవరకు వచ్చి లక్ష్యం చేరుకోకుండా మధ్యలో వెనుకకు మళ్ళవలసి రావటం ఎవరికైనా బాధాకరమే. కాని పరిస్థితి అర్థం చేసుకున్న వెంకట్ హుషారుగానే ఉన్నాడు. వాళ్ళిద్దరూ వడివడిగా చీకట్లోకి సాగిపోయారు. వారి హెడ్‌ల్యాంప్‌ల వెలుతురు క్రమంగా చీకట్లో కనుమరుగైపోయింది. రాత్రి పదకొండు గంటలకు నేను రాజ్, రావులతో కలసి, ఒక గైడు, సమ్మిట్ పోర్టర్లతో సహా ఈ ప్రయాణంలో ఆఖరు ఘట్టం పూర్తి చెయ్యటానికి బయలుదేరాను. కొన్ని నిముషాల నడక తరువాత నేను హెడ్‌లైట్ సరిచేసుకుంటూ ఆకాశం వైపు చూశాను. ఆ చీకటి రాత్రి, నక్షత్రాలతో నిండిన నిశ్శబ్ద ఆకాశం ఎప్పటికీ మిగిలిపోయే జ్ఞాపకం. అన్ని నక్షత్రాలు ఒకేచోట పోగుపడినట్లున్న ఆకాశాన్ని నేను అంతకు ముందెప్పుడూ చూడలేదు. నక్షత్రాలు నాకు చాలా దగ్గరగా ఉన్నట్లు అనిపించాయి. దూరాన మోషిలో విద్యుద్దీపాలు మిణుకుమిణుకుమంటున్నాయి. మా ముందు కొంత దూరంలో కదులుతున్న మిణుగురుల దండ కనపడుతోంది. మాకంటె ముందు ఒకరి వెనుక ఒకరుగా వెళుతున్న పర్వతారోహకుల హెడ్‌లైట్ల కాంతి మలుపులు తిరుగుతూ వారు వెళ్ళే మార్గాన్ని పట్టి ఇస్తోంది.

అదే సమయానికి కొన్ని మిగతా గ్రూపులు కూడా బయలుదేరటంవలన మేమందరం ఒకే వరుసలో నడవవలసి వచ్చింది. నేను ముందు; రాజ్, రావు నా వెనుక ఉన్నారు. నా నడక బాగానే సాగుతోంది. రాజ్ అప్పుడప్పుడూ ఆగుతూ నడుస్తున్నాడు. ముందే అతని ఆరోగ్య పరిస్థితి అంత బాగోలేదు.

రాత్రి గడుస్తున్నకొద్దీ చలిగాడ్పు పెరిగింది. చలి తీవ్రమౌతోంది. తెల్లవారుజాము రెండు గంటల నుండి 4 గంటల మధ్య చలిగాలులు విపరీతమౌతాయట. అప్పటికే, నేను ధరించిన దట్టమైన ఆరు పొరల దుస్తులని చలి సవాలు చేస్తూ, వెక్కిరించటం మొదలెట్టింది. ఇమ్మాన్యుయేల్ మమ్మల్ని నీళ్ళు త్రాగమని చెబుతున్నాడు. బాటిల్‌లో నీరు ముడోవంతు ఐస్‌గా మారిపోయింది. మేము తెచ్చుకున్న శక్తినిచ్చే పదార్థాలు, తినుబండారాలు తిందామంటే అవి కూడా రాయిలా గట్టిపడిపోయాయి. ముందు జాగ్రత్త చర్యగా ఇమ్మాన్యుయేల్ కొన్ని గ్లూకోజ్ పాకెట్లు తీసుకొచ్చాడు. అవే మమ్మల్ని కాపాడాయి.

ముందుకెళుతున్నకొద్దీ మేము బాగా అలిసిపోతున్నాము. రాజ్ అందరికంటే ఎక్కువగా. కాసేపు ఆగాలా వద్దా అనే సందేహంలో ఉన్నాము. మా శరీరం, మనసు మాత్రం విశ్రాంతి కోరుకుంటున్నాయి. కాస్సేపు ఆగి గుండెల నిండా గాలి పీల్చుకొని, ఆక్సిజన్‌తో నింపుకోవాలనుంది. కాని అలా ఆగితే అంత తీవ్రమైన చలిగాలి మమ్మల్ని తూట్లు పొడిచేలా ఉంది. శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవటానికి ముందుకు నడుస్తూ ఉండటం ఒక్కటే మార్గం. ముందు నుయ్యి, వెనక గొయ్యి అనే సామెత గుర్తు చేసుకునే సందర్భం ఇది. గైడ్‌లు

చెప్పినదాని ప్రకారం చలిగాలి ఎక్కువైతే రాత్రి ఉష్ణోగ్రతలు మైనస్ 20 డిగ్రీల సెంటిగ్రేడ్లవరకు పడిపోవచ్చుట.

ఈ ప్రయాణంలో చాలావరకు నేను రాజ్ గురించి శ్రద్ధ తీసుకోవటంలో నిమగ్నమవటంవల్ల, నా గురించి ఆలోచించుకుని భయపడే అవకాశం తగ్గింది. మేము నిదానంగానే అయినా, ఆగకుండా ఎక్కుతూనే ఉన్నాము. రాజ్ పరిస్థితి అటుంచితే తెల్లవారుజాము నాలుగు గంటలయ్యేసరికి, నా గురించి నేనే పట్టించుకోలేని పరిస్థితిలో ఉన్నాను. అడుగు వెయ్యటం కూడా కష్టంగానే ఉంది. నిద్రలేమి కూడా ఇందుకు కారణమనుకుంటా.

ఇంత పెద్ద ఎత్తులో నేను ఇంతకు ముందెప్పుడూ పర్వతారోహణ చేయలేదు. ఇంతకు ముందు నేను చేసినవన్నీ 10–12 గంటల్లో ముగిసిపోయాయి. సాధారణంగా అయితే, అలాంటి శారీరక శ్రమ తరువాత నేను వేడి నీళ్ళ స్నానం, చల్లటి పానీయం, మెత్తటి పరుపు మీద నిద్రలాంటి చిన్నచిన్న సౌఖ్యాలను కోరుకుంటాను. ఈ మూడు ఈ కిలిమంజారో దరిదాపులలో కూడా ఉండవు. నేను మామూలు పరిస్థితులలో కూడా ఎప్పుడూ గుడారాలలో ఉండలేదు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఇలా ఉండటం మాట అటుంచి, తెలిసి తెలిసి ఏకంగా ఎనిమిది రోజులపాటు ఇంత ప్రతికూలమైన పరిస్థితులను ఎదుర్కోవటానికి నేనెలా సంసిద్ధమయ్యాను?

'ఈ ఏడుగంటలకోసమే కదా, గత కొన్ని రోజులుగా నేను నా శక్తినంతా కూడగట్టుకున్నది! ఇక ఇప్పుడు ఇంకొక్క ఊపులో లక్ష్యంవైపు సాగుతాను' అని నాకు నేనే చెప్పుకున్నాను. 50 ఏళ్ళ వయస్సులో ఇదంతా నా శారీరక, మానసిక శక్తులకు పెద్ద పరీక్ష. ముందుగా మనసును సంబాళించుకోవాలి. అందుకోసం, మహోన్నత పర్వతాల ఔన్నత్యాన్ని, మహా సముద్రాల లోతును, సాంద్రారణ్యాల రహస్యాలను, ఎడారుల ఒంటరితనాన్ని వెతుక్కుంటూ ప్రాణాలొడ్డిన గొప్పగొప్ప సాహసికుల అనుభవాలను, ధైర్యాన్ని, వాళ్ళ దృఢసంకల్పాన్ని గుర్తు తెచ్చుకోవటం మొదలుపెట్టాను. ఎందరో నడచి, నడచి ఏర్పరచిన దారిలో, ఎంతోమంది తోడ్పాటుతో, మరెంతోమందితో కలసి చేస్తున్న ప్రయాణమిది. వాళ్ళముందు నేనెంత? కాని, వారందరి ప్రయత్నాల స్ఫూర్తితో నేను ఈ సాహసం చేయటం వారికి నిజమైన ఘన నివాళిగా భావించాను.

శిఖరాగ్రానికి చేరుకోవటం చాలా పెద్ద సవాలు. ఇది క్లిష్టమైనదని తెలిసి, నా శక్తిమేర శరీరాన్ని, మనసును అందుకు అనుగుణంగా మలచుకుంటూ సిద్ధమయ్యాను. ఎంత సంసిద్ధమయ్యాననుకున్నా, ఈ కష్టం ఊహాతీతంగా ఉంది. ప్రతిరోజూ సరికొత్త సవాళ్ళు, ఇంతకు ముందెన్నడూ అనుభవంలోకి రాని పరిసరాలు, పరిస్థితులు హఠాత్తుగా మమ్మల్ని ఎదిరిస్తున్నాయి.

నైరాశ్యంలోకి జారిపోబోతున్న, మమ్మల్ని ఉత్సాహపరుస్తూ పునరోన్ముఖం చేయటానికి మా గైడులు, పోర్టర్లు ఇచ్చిన సహకారం మెచ్చుకోతగినది. నా అభిప్రాయంలో వాళ్ళ ప్రోత్సాహం, వారి నిరంతర సాహచర్యం, ఇక్కడ కీలక అంశాలు. మాలో ఉత్సాహం నీరుకారిపోతున్నప్పుడల్లా వాళ్ళకు తెలిసిన పాటలు ఎత్తుకునేవారు. ఒక్కోసారి కనీసం వీళ్ళకోసమైనా ఈ యాత్రను విజయవంతం చెయ్యాలని అనుకునేవాడిని.

తెల్లవారుజాము నాలుగు గంటలయ్యేటప్పటికి మా ఉత్సాహం, శక్తి అడుగంటిపోయింది. మేము అసలేమీ ముందుకెళ్ళలేక పోతున్నాము. నా మనసులో అధైర్యం మొదలైంది. నేనసలు ఈ లక్ష్యం ఎందుకు ఎంచుకున్నాను? ఎందుకు నా మిత్రులందర్నీ కూడా ఈ దిశగా మళ్ళించాను? ఇంత కష్టపడటం నావల్లే కదా! ఇదంతా అవసరమా? ఇక్కడి నుండి నేను ఇంటికి సురక్షితంగా వెళ్ళగలనా? ఒక హెలికాప్టర్ ఇప్పుడు ఇక్కడ దిగి, నన్ను మోషికి తీసుకెళతానంటే, రెండో ఆలోచన లేకుండా ఒప్పుకుంటాను.

సరిగ్గా అప్పుడు, అకస్మాత్తుగా ఇమ్మాన్యుయేల్ "మన ప్రయాణంలో కఠినమైన దశ పూర్తయింది ఒక గంటలో మనము లక్ష్యం చేరుకుంటాము" అని చెప్పాడు. తొలి జాము కాంతి రేఖలు కనిపించబోతున్నాయని, ఇక చలిగాలులు తగ్గుముఖం పడతాయనీ చెప్పాడు. అతను చెప్పినట్లుగానే జరిగింది. నా జీవితంలో ఒక సూర్యోదయం కిలిమంజారో మీద చూడగలనని అనుకోలేదు. ఈ మార్గంలో ప్రకృతి పిలుపును తీర్చుకోవటం చాలా అసౌకర్యమైన విషయం. గ్లోవ్స్ తీసేసరికి మా చేతులు కొంగర్లుపోతున్నాయి. ప్రత్యేక్షంగా కాని, పరోక్షంగా కాని నాకెదురయ్యే ప్రశ్న, "కిలిమంజారో మీద టాయిలెట్‌కి ఎలా వెళ్ళతారు?" అని. స్నానంలానే, ఇది కూడా అంత ప్రధానమైన విషయం కాదులే అని అప్పుడనుకున్నాను. కాని అది అసలు సమస్యే కాదని ప్రయాణం మొదలయ్యాక తెలిసింది. కాంపులో టాయిలెట్స్ ఉన్నాయి. 'గ్లాడిస్ అడ్వంచర్' వాళ్ళు అదనపు ఛార్జితో మొబైల్ టాయిలెట్ ఏర్పాటు చేశారు. కావలసిన ప్రదేశానికి వెంట తీసుకు వెళ్ళగలిగే కమోడ్‌ను ఒక టెంట్‌లో ఏర్పాటు చేశారు. దాన్ని మేము 'టాయిలెట్ టెంట్' అంటాము. మెస్ టెంట్, కిచెన్ టెంట్‌తో పాటు టాయిలెట్ టెంట్ కూడా మా కాంపులో ప్రధానమైనది. టాయిలెట్ నిర్వహణకు ప్రత్యేకంగా ఒక

'టాయిలెట్ మాస్టర్' ఉంటాడు. వంట మాస్టర్, టెంట్ మాస్టర్ తర్వాత అతనే ముఖ్యుడు. అతడు టాయిలెట్స్‌ని ఎప్పుడూ శుభ్రంగా ఉంచేవాడు. ఈ విషయంలో ఎప్పుడూ ఎలాంటి ఫిర్యాదు లేదు. కాంపు మారినప్పుడల్లా, టాయ్‌లెట్ టెంట్స్‌ను కూడా మడత పెట్టి, కమోడ్‌ను తీసి, తరువాత కాంపుకు చేర్చేవారు.

గిరీష్, తన ఎవరెస్ట్ బేస్ కాంప్ అనుభవం దృష్ట్యా, మూత్ర విసర్జన కోసం సంచుల్ని ఎవరికి వారు తెచ్చుకోమని సలహా ఇచ్చాడు. కాని ఆ సలహా అప్పుడు మా తలకెక్కలేదు. హెడ్‌లైట్ ఉంటుంది కదా, బయటకు వెళ్ళి టాయ్‌లెట్‌ను ఉపయోగించుకోగలమని అనుకున్నాము. కాని అతను మాత్రం అందరికీ ఉచితంగా 'పీ బాగ్స్' కానుకగా ఇస్తానన్నాడు. మొత్తం యాత్రాకాలానికి సరిపోయే అన్ని ఇచ్చాడు కూడా. కొంతమంది సందేహిస్తూ, మరి కొందరు తప్పక వాటిని వెంట తీసుకెళ్ళారు.

కాని తరువాత, మేమంతా పీ బ్యాగులు ఇచ్చినందుకు గిరీష్‌కి ధన్యవాదాలు చెప్పకుండా ఉండలేకపోయాము. మమ్మల్ని రక్షించింది అవే. రాత్రిపూట వాతావరణం చాలా చల్లగా ఉంటుంది. తమ స్లీపింగ్ బ్యాగు నుండి ఎవ్వరికీ బయటకు రావాలనిపించదు. కొండలెక్కేటప్పుడు శరీరం డీ హైడ్రేట్ అవుతుంది. దాని నుండి కాపాడుకోవటానికి గైడ్స్ మాకు రోజూ నాలుగు లీటర్ల నీళ్ళు త్రాగమని చెప్పేవాళ్ళు. వాతావరణం చల్లగా ఉండటంతో పాటు, నీళ్ళు ఎక్కువగా త్రాగటంవల్ల, మౌంటెన్ సిక్‌నెస్ కోసం డయామోక్స్ బిళ్ళలు వేసుకోవటంవలన, మాకు రాత్రిపూట కనీసం రెండుసార్లకు పైగా టాయ్‌లెట్ అవసరం వచ్చేది.

మొదటిరోజు ఒకసారి ఈ సంచిని వాడిన తర్వాతగాని దాని అవసరం తెలియలేదు. దీన్ని ఉపయోగించటం చాలా తేలిక. చాలా పరిశుభ్రంగా ఉంటుంది. ఉదయమే సులభంగా దాన్ని పారవేయవచ్చు. అలా మొదట ఇష్టంలేని కానుకలుగా వచ్చాయో, అవే విలువైనవిగా మారిపోయాయి. సామాన్యంగా వీటిని మూత్రం ఆపుకోలేని రోగులకు, కదలలేని వృద్ధుల కోసం వాడతారు.

పగటిపూట ట్రెక్కింగ్‌లో బుష్ టాయిలెట్స్‌ని ఉపయోగించటం అందరూ చేసేదే. ప్రతి రెండు గంటలకు గైడ్స్ టాయిలెట్స్‌కు అనువైనచోట బ్రేక్ ఇచ్చేవారు. బుష్ టాయిలెట్ ఉపయోగించేటప్పుడు పాములవల్ల ప్రమాదం లేదా అని ఒక మిత్రుడు అడిగాడు. అతని ప్రశ్నకు నావద్ద సమాధానం లేదు. కాని అలాంటి సందేహాలున్నవారు ఇటువంటి సాహసాలు చెయ్యకూడదని మాత్రం అనుకున్నాను.

అప్పుడు మాకు కొంత దూరంలో ఒక కొండ కనిపించింది. దారంతా అగ్ని పర్వతాల నుండి విరజిమ్మబడిన నల్లటి ఇసుకతో కప్పబడి ఉంది. అది స్టెల్లా పాయింట్. "మనం అక్కడికి చేరితే శిఖరాగ్రం చేరినట్లే" అన్నాడు ఇమ్మాన్యుయేల్. అక్కడ నుండి స్టెల్లా పాయింట్ సుమారు 500 గజాలుంటుంది. ఈ 500 గజాలు నా జీవితంలో నేను నడచిన అత్యంత క్లిష్టమైనవని నేను ఎలాంటి మొహమాటం లేకుండా చెప్పగలను. ఒక్కొక్క అడుగుతో పాటు ఒక టన్ను ఇటుకల బరువు లాక్కుపోతున్నట్టుంది. దోవంతా మమ్మల్ని ఉత్సాహపరచిన ఇమ్మానుయేల్ ప్రోత్సాహం కూడా ఇక్కడ ఏమీ పనిచేయలేదు.

చీకటిని ఛేదిస్తూ తొలికిరణాల వెలుగు మెల్లగా ఆవిష్కారమౌతోంది. అప్పటివరకు నేను స్టెల్లా పాయింట్ వద్ద, ఎన్నిసార్లు చూసినా కొత్తగానే అలరించే సూర్యోదయపు సొబగులను చూడాలని కలగన్నాను. కాని ఆ క్షణంలో నా దృష్టంతా ప్రకృతి సౌందర్యం మీద కంటే, సూర్యుడి లేత కిరణాల వెచ్చదనం మీదే ఉంది.

'ఏమైనా సరే, నేను స్టెల్లా పాయింట్ నుండి ఇక ముందుకు వెళ్ళను', అని గట్టిగా నిర్ణయించుకున్నాను. ఉహూరు శిఖరం చేరాలంటే ఇక్కడి నుండి మరో గంట పడుతుంది. ఇక అది నా వల్ల కాదు. మా ముగ్గురి నడక అప్పటికే నత్తనడకలా సాగుతోంది. సరిగ్గా స్టెల్లా పాయింట్‌కు వంద గజాల దూరంలో ఉండగా ఎర్రటి క్షితిజ రేఖను చీల్చుకొంటూ తూర్పున సూర్యుడు ఉదయిస్తున్న నిత్యాద్భుత దృశ్యం మమ్మల్ని కట్టిపడేసింది. సూర్యోదయాన్ని చూడటానికే ఆగినా, కొంచెం విశ్రాంతి తీసుకోవటమే ప్రధానమైన ఉద్దేశ్యం.

ఇంకొంచెం వెలుగు వచ్చాక, మా జట్టులో మా తరువాత బయలుదేరిన మిగిలినవాళ్ళందరూ కొద్ది దూరంలో మా వెనుక ఉండటం గమనించాను. రాఘవ్ వేగంగా నడుస్తూ వచ్చి స్టెల్లా పాయింట్ వద్ద మమ్మల్ని కలిశాడు. అతనికి తీవ్రమైన తలనొప్పి ఉంది. దాన్ని అధిగమించటానికి వేగంగా నడుస్తున్నానని చెప్పాడు. సూర్యోదయం నాలో కొత్త శక్తి నింపింది. స్టెల్లా పాయింట్‌కు చేరే ఆఖరి వంద గజాలు చాలా చాలా కష్టమనిపించినా, అప్పటికి నేనొక సులుసూత్రం తెలుసుకున్నాను. ఒకటి నుండి ఇరవైవరకు లెక్క పెట్టుకుంటూ, ప్రతి ఇరవై అడుగుల తర్వాత, కొంచెంసేపు ఆగుతూ మళ్ళీ ముందుకు వెళ్ళటం. అలా అయిదుసార్లయ్యేసరికి, నేను స్టెల్లా పాయింట్‌పై ఉన్నాను. అది సముద్ర మట్టానికి 5685 మీటర్ల (19340 అడుగుల) ఎత్తులో ఉంది. స్టెల్లా పాయింట్ వద్ద మాకు ఒక కప్పు అల్లపు టీ ఇచ్చారు. టీ అంత రుచిగా

ఎప్పుడూ అనిపించలేదు. నేను మరో కప్పు అడిగి మరీ తీసుకున్నాను. ఈ రెండు కప్పుల టీ తాగేసరికి ఎక్కడలేని ఉత్సాహం, శక్తి వచ్చాయి. మరో ఇరవై నిముషాల్లో మొత్తం పదమూడుమంది బృందం స్టెల్లా పాయింట్‌కి చేరుకుంటారు. విశ్రాంతికి కొంత సమయం దొరికింది. "మరో అరగంటవరకు నేను ఇక్కడి నుండి కదిలేదే లేదు" అని రాజ్ ఘంటాపథంగా చెప్పటం నాకిప్పటికీ గుర్తు.

ఉహూరు శిఖరాగ్రం చేరేవరకు ఆగవద్దని ఇమ్మాన్యుయేల్ నన్ను ప్రోత్సహించాడు. కిలిమంజారో గైడ్లు మనం ఇంకా నడవవలసిన దూరాన్ని, అందుకు పట్టే సమయాన్ని చెప్పి నిరుత్సాహపరచరు. వాళ్ళు మామూలుగా, "ఇదిగో.. ఇక్కడే.." అంటూ మనల్ని ముందుకు నడిపిస్తారు.

సూర్యోదయం ఆశల పునరుజ్జీవనానికి నాంది. ఆ పైన రెండు కప్పుల టీ. వీటితో పాటు 'విశ్రాంతి తీసుకున్నాం' అనే ఆనందం... నన్ను శిఖరాగ్రం వైపు పునరోన్ముఖుణ్ణి చేశాయి. ఉహురు నుండి తిరిగి వస్తున్న ట్రెక్కర్లు ఉత్సాహంతో జయజయధ్వానాలు చేస్తున్నారు. అది ఇక్కడే ఉందంటూ, తప్పనిసరిగా చూడవలసిందేనంటూ అందరినీ ఉత్సాహపరుస్తున్నారు. అదొక ఉరవడితో కూడిన ఉత్సాహపూరిత వాతావరణం. నేను కూడ లేచి హుషారుగా ఉహూరు వైపు నడవటం మొదలెట్టాను.

**ఎన్నాళ్ళో వేచిన ఉదయం:**

దారిలో దృశ్యాలు శ్వాసించటాన్ని శాసించేంత అద్భుతంగా ఉన్నాయి. మేము ఎప్పుడో లావా ఎగసిపడిన అగ్ని పర్వతపు బిలం అంచు మీద నడుస్తున్నాము. అగ్ని పర్వతం నుండి ఎగసిపడిన నల్లటి ఇసుక తెర మీద ఆవిష్కారమౌతున్న హిమనీ నదపు దృశ్యాలు, ఒక అధివాస్తవిక అనుభూతిని కలుగజేస్తున్నాయి. సముద్ర మట్టానికి దాదాపు ఆరు కిలోమీటర్ల ఎత్తులో, మరో హిమాలయాలు అనంతంగా విస్తరించుకుని దూరంగా దిగంతాలలో వినీలాకాశంతో కలిసిపోతున్న దృశ్యం నాకు ముందెన్నడూ ఊహలోకి కూడా రాలేదు.

మేము నడుస్తున్న దారిలో మంచు కొద్దిగానే ఉంది. కాని దూరంగా మంచు కోటగోడలా కనిపించింది. అప్పటివరకు నా వెనక ఉన్న సింహం (రావుగారు) కొంచెం ముందుకెళ్ళాడు. ఆ వెనక రాఘవ ఉన్నాడు. నేను అలా ముందుకు వెళుతూ అక్కడ కనిపిస్తున్న ఊహాతీతమైన దృశ్యాలలో మునిగి తేలుతుండగానే, అంతలో 'ఉహూరు' బోర్డు కనిపించింది. కొద్ది నిముషాల్లో నేను అక్కడ ఉన్నాను.

కిలిమంజారో యాత్రలో ఇది నా ఆఖరి 'నిర్వాణం' (అనిర్వచనీయమైన అనుభూతి). ఈ సమ్మిట్ వద్ద ఒక్కొక్కరికి ఒక్కొక్క అనుభూతి ఉంటుంది. నాకంటె ముందే, వారం క్రితం సమ్మిట్ చేరుకున్న, నా యాత్రా మిత్రులు కన్నన్, సునీతలు పెద్దగా ఏడ్చేస్తూ ఆనంద భాష్పాలు రాల్చారట. జీవితంలో అత్యున్నత స్థాయికెదిగిన మనిషి, దారి పొడవునా తను పడిన ప్రయాసను గుర్తు చేసుకుని కన్నీళ్ళు పెట్టుకున్న వైనమే ఇది. కొంతమంది చాలా దివ్యమైన అలౌకిక అనుభూతికి లోనవుతారు. కొంతమంది వినువీధిలో విహరించిన అనుభూతిని వ్యక్తం చేశారు. ఎప్పుడూ ఎవ్వరితో మాట్లాడక, తన భావాలను బయటకు వ్యక్తం చేయని ఎంతటి వ్యక్తికైనా సరే, ఇక్కడికి చేరగలిగితే, ఆ అతిరేక భావప్రభంజనానికి చెలియలికట్ట వెయ్యటం కష్టం.

"సాధించాను!" అనే అనుభూతితో ఉపశమించిన నా మనసు పక్షి ఈకలా తేలిపోతునట్లుగా ఉంది. ఇది బహుశా ఆక్సిజన్ లోపంవలన కూడా కావచ్చు. ఇక్కడ ఒక్కొక్కరి 'నిర్వాణం' ఒక్కొక్క రకం. ప్రత్యేకం. వ్యక్తిగతం. నా నిర్వాణం అంతగా బయటికి కనిపించేది కాదు. ఇది సంక్లిష్టం. అనుభూతి ప్రధానం. దాన్ని ఈ విధంగా చెప్పవచ్చు. "ఓ దేవుడా! ఈ యాత్రను ముగింపుకు తెచ్చినందుకు నీకు కృతజ్ఞతలు" అనటంలాంటిది. తరువాత ఇదంతా అవాస్తవం అనిపించి, నిజంగానే నేను ఇంత గొప్ప కిలిమంజారో శిఖరాగ్రం చేరుకోగలిగానా? లేదా ఇదొక భ్రాంతేమో? అని అనిపించింది.

నేను ఒకటి మాత్రం ఒప్పుకుంటాను. నా వ్యక్తిగతమైన అనుభూతి. అనంతమైన ఆనందం అనేకంటె, యాభైఏళ్ళ వయసులో నేను ఈ విజయం సాధించటానికి సహకరించిన గొప్ప ప్రకృతి శక్తుల ముందు వినమ్రమైన వందన సమర్పణ అనవచ్చు. ఇది నాకు నిజంగానే ఎన్నాళ్ళుగానో వేచిన ఉదయం.

పదవీ విరమణ తరువాత ఫించను జీవితాన్ని అనుభవించటం అనే విషయం మీద ఇంగ్లండ్‌లో నేను ఎప్పుడూ నా సహోద్యోగులతో, 'నాలాంటి దక్షిణ భారతీయుడికి జీవిత కాలం తక్కువనీ, అందువలన రిటైర్‌మెంటు జీవితాన్ని సగటు యూరోపియన్‌లాగా ఎక్కువ కాలం అనుభవించలేను,' అని పరాచికంగా అంటుండేవాడిని. కారణమేదైనా దక్షిణ భారతీయుల శరీరాలు క్రీడలకు, సాహసాలకు అనుగుణమైనవి కావని నా అభిప్రాయం. అయితే అటువంటి అపోహను స్వయంగా ఛేదించుకుని, ఎంతో శారీరక దారుఢ్యం అవసరమైన ఈ విజయం సాధించగలగటం నాకెంతో సంతోషం.

**అవీ ఇవీ...అన్నీ:**

ప్రతి కాంపు వద్ద దాదాపు ఎనిమిది అడుగుల ఎత్తులో చెక్కతో చేసిన ల్యాండ్ మార్క్ బోర్డులు ఉంటాయి. దాని మీద అక్కడి నుండి వివిధ దిశలలో చేరగలిగే ప్రదేశాల పేర్లు, దూరంలాంటి వివరాలు ఉంటాయి. మేము అటువంటి ప్రతి పాయింట్ వద్ద ఫోటోలు తీసినా, ఆఫ్రికా తలమానికమైన ఉహూరు వద్ద తీసినవే అన్నిటికంటె బాగున్నాయి.

ఈ పర్వత ప్రాంతమంతా చాలా పరిశుభ్రంగా ఉంది. ప్లాస్టిక్ లేదా ఇతర వ్యర్ధపదార్థాలు ఎక్కడా కనిపించలేదు. పర్వతం మీద చలిమంటలు వేసుకోవటానికి అనుమతించరు. ఒక నిబంధన ఏమిటంటే పర్వతం మీదకు తీసుకొచ్చిన వాటినన్నీ తిరిగి క్రిందకు తీసుకెళ్ళాలి. కాంపు ప్రాంతాలు చాలా చిన్నవి. వాటినే మళ్ళీమళ్ళీ ఉపయోగిస్తుంటారు. కనుక అలాంటి ప్రమాణాలను వాళ్ళు పాటించకపోతే దాని భద్రతకు, పర్యావరణానికి కూడా ప్రమాదం.

శిఖరం అధిరోహించినరోజు నా ఓపికకు, ఓర్పుకు నిజమైన పరీక్ష. సాంకేతికంగా అది ఆరు కిలోమీటర్ల దూరమే. కాని అప్పటివరకు పడిన ప్రయాస తరువాత, ప్రతి అడుగూ మాకు కష్టతరమైనదే. ఆక్సిజన్ లోపించటం, ఎముకలు కొరికే చలి, బలంగా వీచే గాలులు, నిద్ర లేకపోవటం, అలసట అన్నీ కూడగలసి వేసే ప్రతి అడుగును భారంగా చేసేవి.

ప్రతి సంవత్సరం వచ్చే 25,000 మంది ట్రెక్కర్స్‌లో 35% మంది శిఖరానికి చేరటంలో విఫలమవుతారట. 11500 అడుగుల ఎత్తు తర్వాత, ఆల్టిట్యూడ్ సిక్‌నెస్ రావటం ప్రధాన కారణం. మా తిరుగు ప్రయాణంలో చెట్ల కొమ్మలతో కప్పి ఉన్న కొన్ని రాళ్ళ గుట్టలను చూశాము. అవన్నీ ఆ పర్వతంపై చనిపోయినవారి జ్ఞాపకార్థం ఉంచిన రాళ్ళు అని గైడ్స్ ద్వారా తెలిసి ఒక క్షణం మా గుండె బేజారైంది. ఒకవేళ అనుకోని ప్రమాదం జరిగితే, యాత్రికులను క్రిందకు తీసుకెళ్ళటానికి ఏకైక మార్గం 'హెలికాప్టర్'. కొన్ని హద్దులు దాటాక ఎలాంటి మోటర్ వాహనాలు వెళ్ళేందుకు దారి లేదు. ఒకవేళ అత్యవసరమైతే ప్రమాదస్థితిలో ఉన్న వాళ్ళను చక్రాల మీద నడచే స్ట్రెచర్ మీద, ఆరుగురు వ్యక్తులు వంతులవారిగా హెలీప్యాడ్ వద్దకు తీసుకెళతారు. చీకటి పడ్డ తర్వాత ఆ హెలికాప్టర్ కూడా ఉండదు.

ట్రెక్కింగ్‌లో మనం వెళ్ళవలసిన గమ్యాన్ని సూచించే దూరాలు మనల్ని తప్పు దోవ పట్టిస్తాయి. ఉదాహరణకు 'లెమోషో' గేటు నుండి ఉహురు శిఖరానికి దూరం 48 కిలోమీటర్లు. ఇవి పర్వత కిలోమీటర్లు, సరిగా చెప్పాలంటే 'కిలి కిలోమీటర్లు'. అవి సమతలమైన నేలమీద నడచే దూరాలకు పూర్తిగా భిన్నం. కిలి కిలోమీటర్లు నడవటం కనీసం 10 రెట్లు కష్టతరం.

మా ప్రయాణంలో రోజుకు పది కిలోమీటర్ల దూరం చొప్పున మా యాత్ర సాగింది. ఇంగ్లండ్‌లో నా ఊరైన న్యూబరీలో ప్రసిద్ధమైన వాకర్స్ జోన్.. గ్రీన్‌హోమ్ కామన్ పైన, నేను పదిహేను నుండి ఇరవై కిలోమీటర్లు నడవ గలిగేవాడిని. ఏడు నుండి ఎనిమిది కిలోమీటర్లు పర్వతాలపై సునాయాసంగా నడుస్తాననుకొనేవాడిని. కాని ఈ కిలిమంజారో ట్రెక్కింగ్‌లో నా అమాయకత్వం తెలిసొచ్చి, నవ్వుకున్నాను. ఎందుకంటే 'గ్రీన్‌హోమ్ కామన్' బల్లపరుపునేల మీద నడక. దీనిని గ్రేట్ మౌంటెన్ కిలిమంజారో మీద నడకతో సరిపోల్చటం నిజంగా తెలియని తనమే.

ఈ ప్రయాణంలో ఎన్నోసార్లు, 'నేనెందుకింత ప్రయాసతో కూడిన పనిలో దిగాను!' అని అనుకున్నాను. నేను తలపెట్టిన ఈ పనిని సాధించగలగటానికి కేవలం నా మానసిక బలం, ధృఢ నిశ్చయం, ఆ పైన నా అదృష్టమే కారణాలు. ఏదో అదృశ్య శక్తి నన్ను పైపైకి నడిపించింది. తిరిగి చూసుకుంటే, ఆ ప్రయాసకంటే, నాకు కలిగిన సంతృప్తి ఎన్నో రెట్లు ఎక్కువ. ఆఫ్రికా పై కప్పు నుండి చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడగలిగాను. మానవ జాతి ఆవిర్భవించిన ఈ ఖండంలో నిజంగా ఒక అధివాస్తవికతతో కూడిన దివ్యానుభూతిని పొందగలిగాను.

శిఖరాగ్రంవద్ద కాసేపు ఆనందించాక, క్రిందకు దిగటం ప్రారంభించాము. బేస్ కాంపు చేరుకోవటానికి మాకు రోజున్నర పట్టింది. ఒక రోజంతా ఆగకుండా నడిచాము. అతిభారమైన రోజుల్లో ఇది ఒకటి. శక్తంతా కూడగట్టుకుని శిఖరం చేరటంతో పాటు, ముందు రాత్రి నిద్రలేకపోవటం కూడా కారణం. చివరి రాత్రి మ్వేకా కాంపువద్ద బస చేశాము. చాలా వేగంగా దిగటం ప్రమాదమే. మోకాళ్ళు, మడమలపై భారం పడుతుంది. ట్రెక్కులో నేను చాలా నిదానం అవటంవల్ల, ఎక్కే సమయంలో మా టీంలో యువకులైన ప్రశాంత్, మహేష్, రాఘవ్, రాజేష్‌లతో గడిపే సమయం కోల్పోయాను. ఈ ఆఖరి రోజు వాళ్ళతో కలిసి నడిచే కోరిక తీరింది.

దీనికి ముందెన్నడూ, ఇంత పెద్ద స్థాయిలో పర్వతారోహణ చెయ్యలేదు. నేను వెళ్ళినవన్నీ 10–12 గంటల ప్రయత్నాలే. క్యాంపింగ్ టెంట్‌లో ఎప్పుడూ ఉండలేదు. ఇవన్నీ అలా ఉంచితే, ఏకధాటిగా ఎనిమిది రోజులు ఈ పరిస్థితుల్లో ఉండగలిగాను. సువిశాల ఆకాశం క్రింద చిన్న గుడారాల్లో, స్నానం లేకుండా, బాధలు పడుతూ, అన్ని

రోజులపాటు నడవటం ఎంతో కష్టం. ఈ భౌతిక సుఖాలకీ, ప్రపంచానికీ దూరంగా కొద్ది కాలంపాటైనా ప్రకృతి ఒడిలో ఒదిగిపోవాలని నేను తరచూ కలగనేవాడిని. ఇప్పుడు అనుభవిస్తున్న సౌఖ్యాలు, సుఖాల హంగామా లేకుండా సామాన్యంగా జీవించే అవకాశం కోసం కూడా నేను ఎదురు చూస్తుంటాను. దక్షిణ భారతదేశంలో చిన్న గ్రామంలో పరిమితమైన సౌకర్యాల మధ్య పెరిగిన నేను, ఇప్పుడు చాలా విలాస వస్తువుల మీద ఆధారపడి ఉన్నాను. కోరుకున్న సౌఖ్యాలు అమరినా సరే, సహజంగా మన పూర్వీకుల్లా ఉండాలని, కనీస అవసరాలతో అడవుల్లో తిరగాలనీ, బాధ్యతలకు, కాల పరిమితులకు అతీతంగా, యాంత్రిక జీవితానికి దూరంగా వెళ్ళి ప్రకృతితో కలసి బ్రతకాలని, మనలో చాలామందికి లోపల ఒక ప్రాధమికమైన కోరిక నిబిడీకృతమై ఉంటుంది. మనందరికి తల్లితో గడిపే క్షణాలు విలువైనవి. అమూల్యమైనవి. తల్లి ఎంత దూరంలో ఉన్నా సరే, కొంత కాలమైనా ఆమెతో గడిపే క్షణాల కోసం ఎదురు చూసినట్లే, ప్రకృతి మాత ఒడిలో ఒదిగే సమయం కోసం కూడ అర్రులు చాస్తుంటాము. దైనందిన జీవితపు రణగొణ ధ్వనులకు దూరంగా ఉంచే ఇటువంటి నిశ్శబ్ద అనుభవాలలో, జీవితావలోకనకు, ఆత్మపరిశీలనకు, తత్వచింతనకు అవకాశం లభిస్తుంది. ఏళ్ళ తరబడి వీటిని సానుకూలం చేసుకోలేకపోతే, యాంత్రిక జీవిత కోరలలో చిక్కుకుపోయి మనల్ని మనమే కోల్పోతామేమో!!




ఈ విజయం పూర్తిగా వ్యక్తిగతమైనా, నా బృంద సభ్యులతో పాటు నేను కూడా మమ్మల్ని హీరోలను అనుకోవటం లేదు. నా దృష్టిలో ఇది సాధ్యపడేలా చేసిన పోర్టర్లు, గైడ్లు, సహాయక బృందమే నిజమైన హీరోలు. వాళ్ళు లేకపోతే మేము ఇది సాధించగలిగేవాళ్ళం కాదు. మా బృంద సభ్యుల చెదరని విశ్వాసమే మాకొక పెద్ద ఆస్తి. బృందంలో ప్రతి ఒక్కరూ మిగిలినవారికి స్ఫూర్తిని అందించటానికి ప్రయత్నించారు. మాకంటే మరి ముఖ్యంగా మా కుటుంబాలకే మేము ఎక్కువగా ధన్యవాదాలు చెప్పాలి. యాత్రలో ఉన్న మాకు "ఏం చెయ్యాలి, ఏం జరుగుతుంది, ఏమిటి" అనేది తెలుసు. మా గురించే ఆలోచిస్తూ ఇంటివద్ద ఉన్నవాళ్ళకు అది తెలియదు. ముఖ్యంగా మా క్షేమ సమాచారాలేమీ తెలియనప్పుడు వారు పడిన ఆదుర్దా అంతా ఇంతా కాదు.

చివరగా నా విషయానికొస్తే, ఈ అనుభవం నన్ను మరింత వినమ్రుడిని చేసింది. 'ప్రకృతి ముందు మనం చాలా అల్పులం' అనే నమ్మకాన్ని మరోసారి ధృఢ పరచింది. మనం ప్రకృతిని గౌరవిస్తే, దానిలో దాగి ఉన్న అందాల్ని, రహస్యాల్ని సున్నితంగా శోధించటానికి అనుమతిస్తుంది. ప్రకృతిని నాశనం చెయ్యాలని ప్రయత్నిస్తే, మన వినాశనానికి మనమే కారణమవుతాము. ఏది ఏమైనా, కిలిమంజారో యాత్రలో ఎక్కడో జారిపోయిన నా మనసు మళ్ళీ నన్ను చేరుకోవటానికి చాలా కాలం పట్టింది.

*(కిలిమంజారో అనుభవ రచన సమాప్తం)*

*రచయిత ఆంగ్లంలో రాసిన ఈ యాత్రావిశేషాలను – తెలుగు చేసింది 'భ్రమణకాంక్ష' – ఆదిరానాయణ; జయశ్రీ అట్లూరి గారలు (లండన్).*

**డా. నిమ్మగడ్డ శేషగిరిరావు**
**ఇంగ్లాండ్**, e-mail: srnimmagadda@googlemail.com

## అమృతలోచనం



.... కళలు బజారులో దొరికే వస్తువులు కావు, బుద్ధికి తోచిన విద్యలు. మనసుపెట్టి నేర్చుకోదగ్గవి. మనఃస్ఫూర్తిగా నేర్వవలసినవి. తొలి తెలుగు పదం, కీర్తన, జావళి అన్నీ ఇక్కడే పుట్టాయి. ఎంత నేర్చుకుంటే అంతకు మించి వినాలి, చదవాలి. మనిషిని సన్మార్గం వైపు నడిపించటానికి సంగీత సాహిత్యాలు పుట్టాయి. ఇవే లేకపోతే ప్రతిదీ ఓ జడపదార్థంలా కనిపిస్తుంది. సంగీత సాహిత్యాల పట్ల సదవగాహన కలిగి, సంప్రదాయం పట్ల, సంస్కృతుల పట్ల సదభిప్రాయం ఏర్పరుచుకుని స్వీయానుభవంతో వ్రాసిన ఈ కళారంగ వ్యాసాలు కళాభిమానుల ప్రశంసాపాత్రను తప్పక పొందగలుగుతాయి. పురుషోత్తమాచార్యగారు సంవత్సరాలుగా పరిశోధించి వ్రాసిన ఈ *అమృతలోచనం* ఎంతో విలువైనది.

*పేజీలు: 260, వెల: ₹ 200/- ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్. ఫోన్: 040 – 24652387, 9396611905.*

# మన ప్రయాణికులు

– అశ్వినీకుమార్

బార్సిలోనా నుంచి మాడ్రిడ్ హైస్పీడ్ ట్రైన్ ఎక్కటం కోసం రైల్వే స్టేషన్ చేరాం. మామూలుగానే పెట్టెబేడా ఇద్దరికీ చేతి నిండా ఉన్నాయి. మధ్యాహ్నం 12.00 గం॥లకు బయలుదేరే రైలు కోసం ఉదయం 11.00 గం॥లకే వచ్చాం. స్టేషన్ లైట్లతో తళతళ మెరిసిపోతోంది. అంతేనా! జనంతో కిటకిటలాడిపోతోంది. లోపలికి వెళితేగాని విషయం అర్థం కాలేదు. ఉదయం 6.00 గం॥లకు వెళ్లవలసిన రైలు ఇంతవరకూ బయలుదేరలేదు అని. కారణం తెలుసుకోవడానికి కష్టపడాల్సి వచ్చింది. ఎక్కడా ఆంగ్లంలో సందేశాలు, సంకేతాలు లేవు. అంతా స్పానిష్. సరే! ఉదయం 6.00 గం॥ల నుంచి వేచి చూస్తున్న ప్రయాణికులు అక్కడి రైలు కంపెనీ సిబ్బందిని ఇబ్బంది పెట్టకుండా ఎంతో ఓర్పుతో అక్కడే ఉన్న రెస్టారెంట్లలో కాలక్షేపం చేస్తున్నారుగాని 'ఏమిటి ఈ అన్యాయం?' అని గోల పెట్టకుండా, పిల్లలతో, తోటి ప్రయాణికులతో కాలం గడుపుతున్నారు. మేమూ మేడమీద మెక్‌డోనాల్డ్ ముక్కలతో కడుపు నింపుకుని కొంత సమాచారం, ఒక ఇంగ్లీషువాడు దొరికితే తెలుసుకున్నాం. రాత్రి ఎవరో 'ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్' 8 కి.మీ. పొడవున నాశనం చేశారు. కమ్యూనికేషన్ లేక బార్సిలోన, పారిస్, మాడ్రిడ్ మరికొన్ని రైళ్లు నిలిచిపోయాయి. అంతలో మాకు చప్పట్లు వినిపించాయి. ఉదయం 6.00 గం॥ల రైలు బయలుదేరుతుందనే సందేశం విని, ప్రయాణికులు ఆనందంతో చేసిన చప్పుళ్లు. ఇక్కడ మీకు ఓ విషయం చెప్పాలి. ఈ వేగవంతమైన రైళ్లు, కొన్ని విమానాళ్లు నడిపేది ఒక ప్రైవేట్ సంస్థ. దాని పేరు రెన్ఫే. 2.30 గం॥లలో 506 కి.మీ. ప్రయాణిస్తుంది. మావంతు రావడానికి 6.00 గం॥లు పట్టాలి. కాని ప్రొఫెసర్ గారు ఒక పోలీసు సెక్యూరిటీ పెద్దమనిషితో మా టిక్కెట్లు చూపించి సెక్యూరిటీ దాటించారు. రెన్ఫే టిక్కెట్ అధికారి 'ఇప్పుడున్న రైలు ఎక్కండి' అని ఫ్లాట్ ఫాం నెం. 4 కి అని చెప్పాడు. అంతే! అక్కడ ఉన్న లిఫ్టు ఎక్కి పెట్టెలతో సహా దిగాను. ప్రొఫెసర్‌గారు కనపడలేదు. ఫ్లాట్‌ఫాం మీద రెండు ప్రక్కలా తెల్లని రైళ్లు ఉన్నాయి. ఏ రైలు ఎక్కాలి? అంతలో ఎస్కలేటర్ దిగిన ప్రొఫెసర్‌గారు నన్ను పిలిచారు. లిఫ్టుకి, ఎస్కలేటర్‌కి చాలా దూరం ఉంది. ఫ్లాట్ ఫాం మీద రైలు సిబ్బంది లేరు. 'మాడ్రిడ్ మాడ్రిడ్' అని మేమే కేకలు వేశాం.



బార్సిలోనా రైల్వేస్టేషన్

ఎవరో కుడిప్రక్క రైలు చూపారు. అంతే! పెట్టెలు పెట్టటానికి అక్కడ ఉన్న స్థలంలో ఆ బరువు వదిలించుకుని, ఖాళీగా ఉన్న ఫస్ట్‌క్లాస్ సీట్లలో కూర్చుని అంత కష్టమూ మర్చిపోయాం. తినటానికి, తాగటానికి ఏవో ఇచ్చారు. మధ్యలో సారగోసా స్టేషన్‌లో ఒకటి రెండు నిమిషాలు ఆగి, మళ్లీ 225 కి.మీ. వేగంతో ఎడారి భూమిలో దూసుకుపోయింది. సాయంత్రం 4.00 గం.లకు మాడ్రిడ్ చేరాం. స్టేషన్ బయట ఎండ, వడగాలి అదిరిపోతుంది. టాక్సీలు లోపలకు రానివ్వరు. పెట్టెలు ఈడ్చుకుంటూ, రోడ్డు (చాలా ఎత్తులో ఉంది) మీదకు వచ్చి, టాక్సీలో హోటల్‌కు చేరాం. హోటల్ పేరు మెనినాస్. ఇది ఒక చిత్రకారుని పేరు. చిన్నదైనా వన్నెలన్నీ ఉన్నాయి. మాడ్రిడ్ సెంటర్‌లో ఉంది. మాడ్రిడ్, పారిస్ తలదన్నేట్లు ఉంది. అందమైన నల్లని జుత్తు, కమలాల కళ్లు, చిత్రకారుడు గీసిన ఒంపుసొంపులతో ఆడ, మగ ఆ వేసవి సాయంత్రం ఆరుబయట వైన్ తాగుతూ సప్పర్ నుంచి డిన్నర్ వరకూ కాలక్షేపం చేస్తున్నారు. ఏమిటి? వీరికి ఏ సమస్యలూ, కష్టాలూ ఉండవా? ఇంత ఆనందంగా సమయం గడుపుతున్నారా? డబ్బు సమస్యలు అసలే లేవా? హాయిగా తిని, తాగుతున్నారు. ఈ ప్రశ్నలు నన్ను వేధిస్తున్నాయి. ఆ తర్వాత అక్కడ ఉన్న మూడ్రోజులలో కొంతవరకు తెలిసింది. మామూలుగానే ఆ రాత్రి కలలు లేని నిద్ర, మర్నాడు మాడ్రిడ్ మహానగరంలో నిద్రలేచాం. ప్రయాణికులం కదా! ఏం తెలిసిందో తర్వాత తెలుసుకుందాం!

ఇప్పుడు మన ప్రయాణికుల వ్యవహారం చూద్దాం. రైళ్లకు, విమానాలకు ఏదైనా అంతరాయం రావచ్చు. ఆలస్యమయితే సిబ్బందితో పోట్లాడటం, అరుపులు, కేకలు, ఇంగ్లీషులో బూతులు మనం తరచూ వింటుంటాం. నేను ఒకసారి బొంబాయిలో హైదరాబాద్ రావడానికి విమానం ఎక్కాను. అరగంట అయినా బయలుదేరలేదు. ఇంతలో

కేకలు మొదలయ్యాయి. కాక్‌పిట్ నుంచి ఎటువంటి సందేశం లేదు. మిగతా సిబ్బంది ఏమీ చెప్పలేరు. కానీ పైలెట్ ఇంకా రాలేదు అని తెలిసింది. ఎందుకు రాలేదు? ఆయన నారిమన్ పాయింట్ నుంచి బయలుదేరి ట్రాఫిక్ చిక్కుల్లో పడ్డాడు. అంతే! ప్రయాణికులు రెచ్చిపోయారు. టైమ్ సెన్స్ లేదా? దగ్గరలో ఉండడానికి హోటళ్లు లేవా? బాధ్యత లేదా? (ఇదంతా ఇండియన్ ఎయిర్‌లైన్స్ రోజుల్లో) చివరికి పైలెట్ వచ్చాడు. ఆలస్యానికి సారీ చెబుతూ ఆయన పనిలో పడ్డాడు. ఎవ్వరూ కిక్కురమనలేదు. అంటే దింపేస్తాడని భయం.

అది వేరే కథ! ఈ మధ్య ఇలాంటిదే ఇండిగో వ్యవహారం. సిబ్బంది, గొడవ చేసిన ప్రయాణికుణ్ణి చితకబాదారు. ప్రయాణం అంటే ఓర్పు, నేర్పు ఉండాలి. ఎటువంటి స్థితికైనా సిద్ధంగా ఉండాలి. ఎవరూ కావాలని ప్రయాణికులను ఇబ్బంది పెట్టరు. బార్సిలోనా స్టేషన్‌లో నాలుగు గంటలు నిలువు కాళ్ల మీద నిలబడ్డాం. నవ్వుకుంటూనే. ఒకసారి మన మెట్రో, కోవిడ్‌కు ముందు – కరెంటు పోతే ఒక గంట ఇబ్బంది పడింది. ఈలోపు ప్రయాణికులు చేసిన గొడవ సామాన్యమైనది కాదు. యూరోప్, అమెరికాలలో కోవిడ్ తర్వాత ఎయిర్‌పోర్ట్ సిబ్బంది బాగా తగ్గిపోయారు. ఉన్నవాళ్లకు సరైన సమాచారం ఉండదు. కోవిడ్ తర్వాత ఐరోపా విమానాశ్రయాలన్నింటిలో ఇమ్మిగ్రేషన్ నాలుగు గంటలు పైనే పడుతుంది. ప్రయాణికులు ఓర్పుగానే భరించారు, వరసలోనే నిలబడి – నిశ్శబ్దంగా!

మమ్మల్ని బోస్టన్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఒక ఇమ్మిగ్రేషన్ నల్లమ్మాయి రెండు గంటలు ఇబ్బంది పెట్టింది. వీసాల గురించి తెలియని అజ్ఞానంతో. ఇందులో మనం చేయగలిగిందేమీ లేదు. ఎవరింటికైనా వెళితే, వాళ్లు తలుపు తీసిన తర్వాత కదా లోపలకు వెళ్లాలి!

సిటీబస్ స్టాపుల నుండి రెస్టారెంట్ల టోకెన్ వరకూ – ఒక్కరున్నా రెండో మనిషి వరసలోనే నిలబడతారు. ప్రక్కదారినో, దొంగదారినో ముందుకు వెళ్లాలనే ఆలోచనే ఉండదు – తమవంతు వచ్చేవరకూ ఓర్పుగా నిలబడతారు. మన సంగతి మనం కొత్తగా చెప్పుకోవాలా? ఓస్లో పెద్ద రైల్వేస్టేషన్ – రెస్ట్‌రూంకి – 174 రూ.లు కట్టి వరసలో నిలబడడ్డాను.

* * *



అమీర్‌పేట మెట్రో స్టేషన్

అమీర్‌పేటలో – అరవంచ (గ్లాస్కో) అరచేతుల చొక్కా – నా ప్రక్కనే కూర్చున్నాడు. ఫోన్ టుక్–టుక్ మోగింది – ఆc నేనే! ఏంది చెప్పు – కడప నుంచా? అవతల మాటలు వినపడవు కదా – ఏంది అబ్బాయి సంబంధమా? వివరాలేంది? అమ్మడు ఎంత ఎత్తుంటాది – (మావాడు సాఫ్ట్‌లో ఉన్నాడుగందా – రేపోమాపో అమెరికా పోతుండ్లా) చదివేంది? ఆస్తి – ఎంతుంటాది? అన్నింటికీ అట్నుంచి జవాబు వచ్చినట్లుంది – సరేలే – ఇయ్యాల అమావాస్య – రేపు మంగళారం – ఎల్లుండి మాట్లాడతా – సత్తిరెడ్డీ!

* * *

పెళ్లి అంటే గుర్తుకొస్తుంది – ఈ వారంలోనే హైటెక్స్‌లో పెళ్లికి వెళ్లాను. రాత్రికి అరకోటి వసూలు చేసే వేదిక! పెళ్లి జరిగే వేదిక చాలా గొప్పగా అలంకరించారు. వచ్చిన అతిథులకు అందుబాటులో లేకుండా బాగా బ్రైట్‌లైట్లు కళ్లల్లో గుచ్చుకుంటున్నాయి. ఎదుటి మనుష్యుల్ని చూడలేం. వధూవరుల అమ్మానాన్నలు పైనే చిక్కుపడి వచ్చిన చుట్టాలను పలకరించినవారు లేరు. వరుడు నవ్వడు – వధువు నవ్వు ఆపదు! విడ్డూరం! అక్కడ రెండు వేదికలున్నాయి. అంటే రెండు పెళ్లిళ్లు జరుగుతున్నాయి. ఇక విందు – అందరికీ ఒకే మైదానంలో పెట్టినట్లున్నారు. ఎవ్వరు ఎక్కడ తిన్నారో ఎవ్వరికీ తెలియదు. ఒకప్రక్క డేరాలో మందు – మాంసం ఒక ప్రైవేటు పార్టీ – అయ్యో! పెళ్లి ఎట్లా అయిపోయింది? అదేదో హాలీవుడ్ సినిమాలో విలన్ 'I am filthy rich' అంటాడు.

మరోముచ్చట! టిటిడి కళ్యాణమండపం – శరత్‌గారి అమ్మాయి వివాహం – ఉదయం పదిగంటలకే ముహూర్తం – సన్నాయి మేళం – వేదమంత్రాలు – పట్టుచీరలు – మల్లెపూలు – వాలుజడలు – పలకరింపులు, తుళ్లింతలు, అక్షింతలు, ఆశీర్వాదాలు! ఆహా!– ఎక్కడా జుట్టు విరబోసుకుని రాత్రి వేసుకునే గౌనులకు నగిషీలు కుట్టిన పగటి వేషాలు కనింపిచలేదు సుమా! ఇంతటి సంప్రదాయబద్ధమైన పెళ్లివేడుక చూసి ఎంత కాలమైంది!

# మండలి బుద్ధప్రసాద్ తో మాటామంతీ

– అశ్వినీకుమార్

బుద్ధప్రసాద్ గారూ

*మిసిమి* కి స్వాగతం..

దివిసీమ! అంటే దేవతల భూమి. భూమిమీద దేవతలుంటారా? సరే, కృష్ణాతీరానికి బెజవాడ నడిబొడ్డు. ఎలాగంటే, బెజవాడ నుంచి నాగాయలంక, మచిలీపట్నం, తూర్పువైపుగా – ఏలూరు, ఖమ్మం – ఇవి ఉత్తరం, జగ్గయ్యపేట, కోదాడ పరిసరాలవరకు పశ్చిమం. ఎటుచూసిన 100 కి.మీ.లోపు, 70 కి.మీ.ల పైన ఉంటుంది. దక్షిణవైపు కృష్ణా ఉంది కాబట్టి అది కృష్ణాతీరమైపోయింది. దివిసీమకు, తెనాలి తాలూకాకు చాలా దగ్గరి సంబంధాలున్నాయి. అటు హంసలదీవి, సాగరసంగమం, ప్రక్కన రేపల్లె – ఇదంతా దివిసీమకు ప్రక్కప్రక్కనే ఉంటాయి. భౌగోళికంగా ఇంత ప్రధానమైన ప్రదేశంలో రాజులు, జమీందార్లు పరిపాలించారు. అది చరిత్ర. స్వాతంత్ర్యం తర్వాత దేశ రాజకీయాలలో గుడివాడ, బెజవాడ ప్రాంతాల నాయకులు కీలకమైన పాత్ర వహించారు. ప్రజలను ఉత్తేజపరిచారు. వ్యవసాయకంగా దేశానికే తలమానికంగా నిలిచిన సారవంతమైన ప్రాంతం. విద్యాపరంగా అందరికంటే ముందున్న బౌద్ధిక క్షేత్రం. వేల సంవత్సరాల క్రితమే బౌద్ధానికి, నౌకావ్యాపారానికి ఆద్యమైన, ఆనవాళ్లున్న సముద్రతీర భూమి. దివిసీమ నుంచే శ్రీకృష్ణ దేవరాయలు యుద్ధాలు రచించాడు – అలాగే ఆముక్తమాల్యద ప్రబంధ కావ్యానికి శ్రీకారం చుట్టాడు. ఆంధ్ర మహావిష్ణువు ఆలయం, సిద్ధేంద్రయోగి, మువ్వగోపాల క్షేత్రయ్య వీరందరికీ ప్రసిద్ధి చెందన క్షేత్రం – దివిసీమ.

ఇప్పటికి వస్తే దివిసీమ, అవనిగడ్డ, గాంధీక్షేత్రం విద్యాశాఖా మంత్రివర్యులు, ప్రపంచ తెలుగు మహాసభలు, నిప్పులు చెరిగిన ఉప్పెన, ఒక హత్యతో చెలరేగిన విధ్వంసకాండ, నిమ్మకూరు, ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశం, అప్పటివరకు లేని ఒక ప్రాంతీయ పార్టీ అధికారంలోకి రావడం, ఎంతోమంది విద్యాధికులు రాజకీయ ప్రవేశం, ఒక జిల్లా పరిషత్ ఛైర్మన్, ఇదంతా మన సంభాషణలకు నేపథ్యం. నేను గాంధీ క్షేత్రానికి మీ నాన్నగారు విద్యాశాఖా మంత్రిగా ఉన్నప్పుడు ఒక కార్యక్రమానికి వచ్చాను. అప్పటికి మీరు ఇంకా వయస్సులో చిన్నవారే. తరువాత ప్రపంచ తెలుగు మహాసభలకు మీ నాన్నగారే శ్రీకారం చుట్టారు. దివిసీమ ఉప్పెన బీభత్సాన్ని ఆయనే భరించారు. అప్పుడు ఆ ప్రాంతాన్ని విస్తృతంగా చూసి చలించిపోయాం. మీ నాన్నగారు అప్పటి ముఖ్యమంత్రికి చాలా సన్నిహితులు. అంటే అధికారానికి నిలయం మీ ఇల్లు. గాంధీక్షేత్రం సేవాప్రదేశం. ఎంతోమందికి సహాయసహకారాలందించిన ప్రదేశం. ఇటువంటి నేపథ్యంలో మీ నాన్నగారి నీడలో, మీ బాల్యం, మీ చదువు ఆ తర్వాత మీ రాజకీయ రంగ ప్రవేశం – ఇవన్నీ మాట్లాడుకుందాం.



*మిసిమి* లో బుద్ధప్రసాద్

*బుద్ధప్రసాద్:* దివిసీమలో జన్మించటం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను. అక్కడ జన్మించటమే కాదు, ఆ దివిసీమ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించడం కూడా ఎవరికి కలగని అదృష్టంగా అనుకుంటాను. అది సామాన్యమైన ప్రదేశం కాదు. మీరన్నట్టు అది దేవతల భూమి.. రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైన ప్రాంతమది. ప్రత్యేకించి తెలుగు సాహిత్య చరిత్రలో

దివిసీమను మినహాయించి రాయటం ఎవరివల్లా సాధ్యం కాదు. ఎందుకంటే తెలుగు సాహిత్య వారసత్వానికి నాంది పలికింది దివిసీమ. ఒకపక్కన కూచిపూడి నాట్యానికి సిద్ధేంద్రయోగి శ్రీకారం చుట్టారు. క్షేత్రయ్య పదాలతో మొవ్వ పరిమళించింది. అలాగే అనేక రాజవంశాలు పరిపాలన చేశాయి. వాటికి సాక్ష్యంగా ఎన్నో ఆలయాలు కానవస్తాయి. దానికంటే ముందు మనం పేర్కోవలసింది బౌద్ధుల కాలం. బౌద్ధుల కాలంలో ఘంటసాల గొప్ప విద్యా కేంద్రంగా విలసిల్లింది. ఘంటసాల నౌకా వాణిజ్య కేంద్రంగా విస్తరించింది. అందుకే అక్కడ జలవిశ్వేశ్వరస్వామి ఆలయముంది. అయితే ఇవ్వాళ ఘంటసాల దగ్గర సముద్రం లేదు. సముద్రం జరిగిపోయింది. బౌద్ధ అవశేషాలు ఈనాటికీ ఉన్నాయి. కొన్ని శిల్పాలు ప్యారిస్‌లో ఉన్నాయి. కొన్ని శిల్పాలను ఘంటసాల మ్యూజియంలో పెట్టడం జరిగింది. ఆ రకంగా బౌద్ధుల కాలంలో దివిసీమ పరిఢవిల్లిందనటానికి సాక్ష్యం ఘంటసాల.

ఇకపోతే కృష్ణానది సాగరసంగమం చేసే ప్రదేశం హంసలదీవి. ఈ ప్రాంతం ఒకప్పుడు పెద్ద అడవిలా ఉండేదట. అయితే ఆ ప్రాంతాన్నంతా సస్యశ్యామలం చేసినవారు "అయవంశీయులు". అక్కడో రాజధానిని నిర్మాణం చేసుకుని పరిపాలన చేశారు. ఆయన అయపిన చోళుడు. ఆయన మీదకి కాకతీయ గణపతి చక్రవర్తి దండెత్తి వచ్చాడు. అప్పుడు చాలా భీకరయుద్ధం తలకటూరులో జరిగింది. అయితే ఆ యుద్ధంలో అయవంశీయులు పరాజయం చెందటం జరిగింది.

కానీ గణపతి దేవుడేం చేశాడంటే వీళ్లు చాలా పరాక్రమవంతులు, వీరితో కయ్యంకంటే నెయ్యం మంచిదని వారి కుమార్తెలను నారమణి, పేరమణిలను వివాహం చేసుకున్నాడు. రాకుమారుడు జాయపను ఓరుగల్లు గజసేన అధ్యక్షుడిగా చేశాడు. ఆ జాయపసేనానే నృత్తరత్నావళిని రచించాడు. ఆ నృత్తరత్నావళి ఆధారంగానే రామప్ప దేవాలయం శిల్పాలు చెక్కబడ్డాయి. ఆ శిల్పాల ఆధారంగానే నటరాజ రామకృష్ణగారు పేరిణి శివతాండవ నృత్యాన్ని పునఃసృష్టి చేయటం జరిగింది. ఇదొక చరిత్ర. ఆ రకంగా చారిత్రికంగా కూచిపూడి నృత్యాన్నిచ్చింది సిద్ధేంద్రయోగయితే, నృత్తరత్నావళి నిచ్చింది జాయపసేనాని. అయితే జాయపసేనాని ఓరుగల్లులో ఉండటంతో అక్కడివారనుకుంటారు. జాయపసేనాని గణపతి స్వామి ఆలయం కట్టించాడు. గణపతిదేవుడి పేరు మీదుగా.. ఆ ఊరి పేరు గణపేశ్వరం. అలా రుద్రమదేవి కూడా ఆ ప్రాంతాన్ని పరిపాలించింది.

ఆ తరవాతి కాలంలో తన దండయాత్రలు పూర్తిచేసుకున్న అనంతరం శ్రీ కృష్ణదేవరాయలు శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు దేవాలయాన్ని సందర్శించాడు. అప్పట్లో శ్రీకాకుళం ప్రథమాంధ్ర రాజధాని అని చెబుతారు. దానికి శాసనాధారాలు లభించవు కానీ పురాణాల్లో శ్రీకాకుళం గురించి గొప్పగా రాయబడి ఉంటుంది. అక్కడ స్వామివారు కృష్ణదేవరాయలకు కలలో కనబడి నువ్వు సంస్కృతంలో రాశావు, అనేక భాషలు తెలుసు, దేశభాషలందు తెలుగు లెస్స అన్నావు అంటూ కృష్ణదేవరాయలుని తెలుగులో ఓ కావ్యాన్ని రాయమన్నారుట. అందుకని ఆముక్తమాల్యదకు అక్కడ శ్రీకారం చుట్టడం జరిగింది. అలాంటి గొప్ప చరిత్ర మా ప్రాంతానికుంది. అలాంటి ప్రాంతంలో జన్మించడమంటే అదృష్టమే కదా!

ఆ తర్వాత ఇంకో విషయమేమిటంటే స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీగారు మా ప్రాంతానికి వచ్చారు. మా నియోజకవర్గంలో ఆరు మండలాలున్నాయి. ఆయన ఆరు మండల కేంద్రాలు 1929లో తిరిగాడు. అప్పటికి అవనిగడ్డకి రావాలంటే పడవదాటి రావాలి. మహాత్ముడు పడవెక్కి అవనిగడ్డ వచ్చాడు. అక్కడ నుండి నాగాయలంక వచ్చాడు. ఆ తరువాత కోడూరు వచ్చాడు. మధ్యలో మోపిదేవి చూశారు. ఘంటసాల, చల్లపల్లి తిరిగాడు. ఇలా విస్తృతంగా ఆరు మండల కేంద్రాలు పర్యటించాడు. అప్పట్లో స్త్రీలందరు తమ బంగారాన్ని విరాళంగా మహాత్మునికిచ్చారు. ఇంకా నిధులు కూడా సమకూరాయి. ఆరకంగా స్వాతంత్ర సమరంలో చైతన్యవంతమయిన ప్రాంతమని నిరూపించుకుంది.

స్వాతంత్ర్య సమరయోధులందరూ బందరులో ఉన్నా వారందరు దివి తాలూకావారే. దాంట్లో ముట్నూరి కృష్ణారావుగారు అక్కడివాడే. ఆంధ్ర జాతీయ కళాశాల పెట్టిన కోపల్లె హనుమంతరావుగారు, ముట్నూరి కృష్ణారావుగారు, చెరుకువాడ నరసింహంగారు, గొట్టిపాటి

బ్రహ్మయ్య వీరంతా స్వతంత్ర సమరంలో ప్రముఖ పాత్ర పోషించినవారే. దివి తాలూకాలో జన్మించి బందరు కేంద్రంగా స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. అలా ఏ ప్రాంతమయినా తీసుకోండి. పెదకళ్ళేపల్లిలో త్యాగరాజు శిష్యపరంపర అక్కడ వర్ధిల్లింది. ఆకుమళ్ళ వెంకట సుబ్బయ్యగారని త్యాగరాజు శిష్యులు. ఆయన శిష్యులు సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రిగారు. సుసర్లవారు ఇక్కడ నుండి కాలినడకన తంజావూరు వెళ్లి, ఆకుమళ్ళ వెంకట సుబ్బయ్యగారి దగ్గర సంగీతాన్నభ్యసించి తిరిగి ఇక్కడికి వచ్చి గురుకులం పెట్టారు. గాయక సార్వభౌముడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారిది శ్రీకాకుళం గ్రామమే. వారి శిష్యులు మన మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు. అదే పెదకళ్ళేపల్లి గ్రామంలో మరో మహానుభావుడు జన్మించారు. వారు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. వారి కుమారులు వేటూరి ఆనంద మూర్తిగారు పరిశోధకులు. ఇక జగద్విదితమయిన మరో గొప్ప వ్యక్తి, తెలుగు పాటకు జాతీయ పురస్కారం సాధించిన వేటూరి సుందరరామమూర్తిగారు కూడా ఇక్కడివారే. దానితో పాటు హంపీక్షేత్రం రచించిన కొడాలి సుబ్బారావుగారు ఇక్కడ పుట్టినవాడే. భావకవిత్వపు తొలి గ్రంథంగా దాన్ని పేర్కొంటారు. నరే కాసుల పురుషోత్తమకవి గొప్ప కవి. ఆయన తేలప్రోలులో జన్మించాడు. వారి *శ్రీకాకుళాంధ్ర నాయక శతకం* కానీ, *హంసలదీవి గోపాల శతకం* కానీ ఎంతో ప్రసిద్ధి చెందాయి. నిందాస్తుతితో రాసిన ఆయన శతకం చాలా గొప్పది. ఒకసారి విశ్వనాథ సత్యనారాయణ గారు అన్నారుట, పోతన *భాగవతం* రాయకపోతే అంత శక్తున్నవాడు కాసుల పురుషోత్తమ కవి అని. అంత గొప్ప కవి పురుషోత్తమ కవి. ఇలా చెప్పుకుంటూపోతే పెద్ద జాబితా అవుతుంది. ఆ రకంగా దివిసీమ ఎంతో గొప్పది. దివిసీమలో సాగరసంగమం చేరుతున్న కృష్ణానదికి గుర్తుగా కృష్ణాజిల్లా అని బ్రిటిష్‌వారు నామకరణం చేశారు.

మహాబలేశ్వరంవద్ద పుట్టి ఎన్నో వేల కిలోమీటర్లు ప్రవహించినా ఆ పేరు ఎక్కడా పెట్టలా. చిట్టచివర ఎక్కడయితే సాగరంలో కలుస్తుందో ఆ ప్రదేశానికి ఈ పేరు పెట్టారు. దక్షిణదేశ ధాన్యాగారంగా పేరొందింది. అలాంటి చారిత్రక ప్రాంతంలో పుట్టడం, మూడుసార్లు శాసనసభ్యునిగా ప్రాతినిధ్యం నా అదృష్టంగా భావిస్తున్నాను.

**మిసిమి : బాగుంది. దివిసీమ ప్రాశస్త్యం గురించి వివరంగా చెప్పారు. మీ గురించి చెప్పండి?**

ఇక నా గురించి చెప్పాలంటే మానాన్నగారు మండలి వెంకట కృష్ణారావుగారు, మా అమ్మ ప్రభావతీదేవి. నేను పుట్టింది నాగాయలంక గ్రామంలో. 1956 మే 26న పుట్టాను. మాది బహదూర్‌పల్లి గ్రామం. మా తాతగారు ఉపాధ్యాయులు. ఆయన పేరు మండలి వెంకటరామయ్య గారు. ఆయన మంగళాపురం గ్రామంలో పనిచేస్తున్నప్పుడు ఆయన శిష్యులు చండ్ర రాజేశ్వరరావు, చండ్ర రామలింగయ్యగారు. వారు రాజకీయాల్లో కమ్యూనిస్టు పార్టీలో జాతీయ స్థాయికి ఎదిగినవారు.

రామలింగయ్యగారు మొదటి శాసన సభ్యులు. వారు ఎన్నికవగానే మా తాతగారికి పాదనమస్కారం చేసి ఆశీర్వాదం తీసుకుని వెళ్ళారుట. రాజేశ్వరరావుగారు గాంధీక్షేత్రంలో మా తాతగారి ఛాయా చిత్రానికి దండేసి 'మేమీ స్థాయికి రాజకీయాల్లోకి వచ్చామంటే అందుకు మా గురువుగారు వెంకట్రామయ్యగారు నేర్పిన విలువలే కారణ'మని చెప్పారట. ఆ విధంగా మాతాతగారొక జాతీయవాదిగా పేర్కొనవచ్చు. ఆయన బహదూర్‌పల్లిలో ఒక గ్రంథాలయాన్ని స్థాపించారు. అందులో అనేక రకాల పుస్తకాలుండేవి. దాంట్లో *రుక్మాంగద* అన్న హరికథ పుస్తకం చదివి అమ్ముల విశ్వనాథం ప్రముఖ హరికథా భాగవతార్ అయ్యాడు. ఆయన ఆ ఊరివాడే. స్వంతంగా హరికథలు చెప్పటం నేర్చుకొని, ప్రముఖ విద్వాంసుడిగా ఎదిగారు, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి కళాప్రపూర్ణ గౌరవాన్ని పొందారు.

**మిసిమి : పార్లమెంటు సభ్యునిగా, మీ నాన్నగారు / శాసనసభ్యులుగా – మంత్రిగా ప్రజాసేవ చేశారు – వారి నేపథ్యం ఏమిటి?**

మానాన్నగారి విషయానికొస్తే, ఆయనమీద మా తాతగారి ప్రభావముంది. ఆయన విద్యార్థి కాంగ్రెస్‌లో చేరి *క్విట్టిండియా ఉద్యమం* లో పాల్గొన్నారు. మైనర్ బాలుడని పోలీసులు వదిలేశారట. ఆ తరువాత జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చేశారు. ఆయన్ని తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా కాశీనాథుని పూర్ణమల్లికార్జునుడు, మాగంటి అంకినీడు వంటి పెద్దలు

ప్రతిపాదించడం జరిగింది. ఈయన కృషిని గమనించిన డా. నీలం సంజీవరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజుగారు మా నాన్నగారు 1957వ సంవత్సరంలో పార్లమెంటు సభ్యునిగా పోటీ చేస్తే బావుంటుందని భావించారు. మా నాన్నగారి జేబులో చిల్లిగవ్వ కూడా లేదు. డిపాజిట్ కట్టలేని పరిస్థితి. మాది సామాన్యమైన కుటుంబం. వారి కృషి ఫలితంగా పార్లమెంటు సభ్యుడిగా గెలవటం జరిగింది. ఆయన పార్లమెంటు సభ్యులైన సంవత్సరానికి నేను పుట్టాను. ఆయన పార్లమెంటు సభ్యులయ్యాక అవనిగడ్డకు తమ మకాం మార్చారు. అందువలన నా బాల్యమంతా అవనిగడ్డలో గడిచింది. ఇంటర్మీడియట్ వరకు అవనిగడ్డలో చదువుకున్నాను. బాల్యంలో వీధిబడిలో నా చదువు సాగింది. దసరా వచ్చినప్పుడు అవనిగడ్డ నుంచి పులిగడ్డవరకు మా మాస్టారు "అయ్యావారికి చాలు ఐదు వరహాలు" అన్న పాట పాడించి నడిపించారు. అలా వెళ్తుంటే "ఎమ్.పి.గారబ్బాయి ఎమ్.పి.గారబ్బాయి వచ్చాడం"టూ నన్ను ముద్దు చేసేవారు. అదొక జ్ఞాపకం నాకు. ఆ తరువాత సి.బి.ఎమ్. స్కూల్లో చదివాను. అది కెనెడియన్ బాప్టిస్ట్ మిషనరీ స్కూల్. అక్కడ మిస్సమ్మలుండేవారు. వారు చదువు నేర్పిస్తుండేవారు. అక్కడ క్రైస్తవ గీతాలు పాడటం, బైబిల్ చదవటం అలవాటయ్యింది. అది మతసామరస్య భావన నాలో ఏర్పడటానికి కారణమయింది.

***మిసిమి*: మీకు బుద్ధప్రసాద్ అని నామకరణం ఎలా చేశారు నాన్నగారు?**

నాకు బుద్ధప్రసాద్ అని పేరు పెట్టడానికి కారణమేమిటంటే బుద్ధుని యొక్క 2500 సంవత్సరాల వేడుకలలో నేను పుట్టడం. మా నాన్నగారికి బుద్ధుడంటే అభిమానం ఎక్కువ. అందుకే అవనిగడ్డ క్షేత్రంలో బుద్ధుడు, క్రీస్తు, గాంధీ విగ్రహాలు కనపడతాయి.

***మిసిమి*: గాంధీ క్షేత్రం ఎప్పుడు పెట్టారు?**

*బుద్ధప్రసాద్:* 1968లో గాంధీ శతజయంత్యుత్సవాలు మొదలయ్యాయి. అప్పుడు నాన్నగారు గాంధీ కోసం ఏదైనా చేయాలని భావించి జిల్లా పరిషత్తు నుంచి తొంభై సెంట్లు లీజు తీసుకుని గాంధీ క్షేత్రం ఏర్పాటు చేశారు.

***మిసిమి* : అక్కడ జరిగే కార్యక్రమాల గురించి చెప్పాలంటే?**

*బుద్ధప్రసాద్:* అక్కడ గ్రంథాలయం ఉంది. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణ గారు ప్రారంభించారు. పాతూరి నాగభూషణం గారు అధ్యక్షత వహించారు. ఓంప్రథమంగా మొదలయింది. అది అంచెలంచెలుగా పెద్దదవుతూ వచ్చింది. '77 తుఫానులో ఎందరికో ఆశ్రయమిచ్చింది. రోజుకు పదివేలమందికి భోజనాలు పెట్టేవాళ్ళం. ఇక ఇప్పుడు ఆ క్షేత్రాన్ని దర్శించని పెద్దలు లేరు. నాటి రాష్ట్రపతి సంజీవరెడ్డి వచ్చారు. ఇందిరాగాంధీ రెండు మూడుసార్లొచ్చారు. ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, గవర్నర్‌లు ఎంతోమంది వచ్చారు. వివిధ దేశాల ప్రముఖులు సందర్శించారు.

ఉప్పెనకు ముందు చాలా కార్యక్రమాలు జరిగాయి. మత్స్యకారుల పిల్లల కోసం ఆశ్రమ పాఠశాలను ఇక్కడే నిర్వహించటం జరిగింది. ఆ తర్వాత హిందీ ప్రచారక్ విద్యాలయాన్ని పెట్టాం. దానిద్వారా చాలామంది హిందీ పండిట్‌లుగా శిక్షణ పొందారు. కొంతకాలం ఫిషరీస్ పాలిటెక్నిక్ ఇక్కడే ఉంది. తర్వాత బహదూర్‌పల్లికి మారింది. చాలామందికి అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాం. '77 తుఫాను తరువాత 150 మంది అనాథ పిల్లలను పోషించటం జరిగింది. వారికోసం గాంధీ గురుకుల విద్యాలయం స్థాపించాం. గాంధీ విధానంలో బేసిక్ విద్యా విధానం ద్వారా విద్యను నేర్పే ప్రయత్నం చేశాం. చేతివృత్తులలో శిక్షణ కల్పించాం. *గాంధీ క్షేత్రం* పేరుతో పత్రిక నడిపాను.

***మిసిమి* : ఇంత చరిత్ర కలిగిన భూమిమీద, ఒక గొప్ప రాజకీయ చరిత్ర కలిగిన మీ నాన్నగారి నీడలో మీరు పెరిగారు. వారి ప్రభావం మీ మీద ఎంతుంది?**

*బుద్ధప్రసాద్:* మా నాన్నగారి ప్రభావం నామీద సంపూర్ణంగా ఉందండీ.. దానికి కారణం నా చదువు మీద ఆయనెప్పుడూ దృష్టి పెట్టలేదు. నేనో సామాన్య విద్యార్థిగా ఉండేవాడిని. మా నాన్నగారు ఎక్కడికి వెళ్ళినా నన్ను వెంటబెట్టుకు వెళ్ళేవారు. ఆయనకు మొదటినుంచి హంగూ ఆర్భాటాలుండేవి కావు. ఎవరయినా వస్తే వారికి మర్యాద చేయటంవంటి పనులుండేవి నాకు ఎక్కువగా. దానివలన ఎంతోమంది పెద్దలను కలవటం జరిగింది. ఆ అనుభవం జీవితానికెంతో ఉపయోగపడింది. ఆంధ్రదేశంలోని

ప్రముఖులందరినీ కలవగలిగానంటే అది మా నాన్నగారివలనే సాధ్యమయింది. నా అదృష్టమేమిటంటే చాలామంది స్వాతంత్ర్య సమరయోధులింకా సజీవంగా ఉన్నారప్పుడు. ఆచార్య ఎన్.జి. రంగా, బెజవాడ గోపాలరెడ్డిగారితో నేనెంతో చనువుగా ఉండేవాడిని.

***మిసిమి* : దివిసీమని నిప్పులు చిమ్మిన ఉప్పెన – అతలాకుతలం చేసింది. నాయకులే కాదు – జాతి మొత్తం కదిలివచ్చి చేయూతనిచ్చారు.**

ఉప్పెన తరవాత రామకృష్ణ మిషన్, క్రైస్తవ సంస్థలు, ఆరెస్సెస్‌తో దగ్గర సంబంధాలేర్పడ్డాయి. వారందరితో కలిసి పనిచేయటంవలన ఎంతో కొంత నేర్చుకోగలిగాను. ఎంతోమంది సాహిత్యకారులను ప్రత్యక్షంగా చూశాను. ఒకసారి దేవులపల్లి కృష్ణశాస్త్రి మా ఇంటికొచ్చారు. ఆయన వెళ్లిపోతుండగా మా నాన్న ఆయన్ని కారెక్కించమంటే ఆ పనిలో ఉన్నాను. ఆయన కారెక్కుతూ నన్నో ప్రశ్న వేశారు. 'మా గురువుగారెవరో తెలుసా?' అని. అప్పటికే చదివున్నా కాబట్టి రఘుపతి వెంకటరత్నం నాయుడు అన్నాను. వెంటనే నన్నాయన కావిలించుకుని బొటబొటా కన్నీరు కార్చాడు. వెంటనే ఆయన "రుగ్వీథి" అనే పుస్తకాన్ని నాకిచ్చారు (*మిసిమి* బల్లమీద *ఋగ్వీథి* చూసి ఆశ్చర్యంతో నవ్వారు). నాయుడుగారు ఇంగ్లీష్‌లో రాసినదానికి తెలుగులో వీరు పద్యాలు రాశారు. అంటే గురుభక్తేమిటో ఆయన నుంచి నేర్చుకున్నాను నేను. అట్లాగే ఆచార్య వినోబాభావేగారిని పూనే వెళ్లి కలుసుకున్నాను. గాంధీగారి మనవరాలు నిర్మలాగాంధీ లెటర్ రాసిచ్చారు. ఆంధ్రులు ఆరంభ శూరులు అన్నారాయన. ఆయనకు వినబడదు. అలా కాకుండా ఉండాలని దీవించండి అన్నాను. ఆయన హిందీలో చెప్పారప్పుడు. తెలుగులో చెప్పాలంటే–

*మరణించేవరకూ శూరులుగా జీవించండి*
*మరణానంతరం శూరులుగా మిగలండి*

***మిసిమి* : మీ రాజకీయ రంగ ప్రవేశం ఎలా జరిగింది?**

*బుద్ధప్రసాద్:* ఇప్పటిలాగా కాకుండా ఆ రోజుల్లో కార్యకర్త పాత్రెక్కువగా ఉండేది. నేనో కార్యకర్తలా మా నాన్నగారి అన్ని కార్యక్రమాల్లో పాల్గనేవాడిని. అందులో రాజకీయ రంగానికి చెందినవి కూడా ఉండేవి. ఎలక్షన్ పోస్టర్లంటించటం నుంచి, గోడమీద రాతల వరకు. (నవ్వు).. తెలుగుదేశం పార్టీ ఏర్పడక ముందు యువజన కాంగ్రెస్‌లో ఉండేవాడిని. ఆ తర్వాత తెలుగుదేశం వచ్చాక మండల స్థాయిలో అధ్యక్షులను పెట్టాల్సి వచ్చింది. అవనిగడ్డ మండలానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నన్ను పెట్టారు. అప్పుడు ఆరు మండలాలు కాంగ్రెస్ పార్టీ గెలిచింది, ఎన్.టి.ఆర్ ప్రభంజనాన్ని తట్టుకుని. నేను చాలా సిగ్గరిని, బిడియస్తుడిని. ఏ కార్యక్రమానికైనా ఏర్పాట్లు చేసేవాడిని కాని, మాట్లాడనికి దూరంగా ఉండేవాడిని. నెమ్మదిగా వందన సమర్పణతో మొదలుపెట్టాను. అలా అడుగులో అడుగు వేస్తూ బయల్దేరాను. ఉపన్యాసాలను ఇవ్వటం నెమ్మదిగా అలవాటయ్యింది.

***మిసిమి* : మీ పార్టీలో అందరూ నాయకులే. వారందరినీ ఎలా దాటుకొచ్చారు?**

అనుకోని పరిస్థితులలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడినయ్యాను. మా దగ్గర కాంగ్రెస్ పార్టీలో వర్గ రాజకీయాలుండేవి. కలుస్తుండేవారు, విడిపోతుండేవారు.. మా నాన్న, పిన్నమనేని కోటేశ్వరరావుగారు కలుస్తుండేవారు, విడిపోతుండేవారు. ఆ టైంలో మా నాన్న ఆరోగ్యం దెబ్బతింది.. ఒకేసారి మూడు ఎలక్షన్లొచ్చాయి. ఒకటి సహకార కేంద్రం, రెండోది పాల కేంద్రం, మూడోది జిల్లా కాంగ్రెస్.. జిల్లా కాంగ్రెస్ ఎలక్షన్ల ముందు రాజీవ్ గాంధీగారు మా ఊరొచ్చారు. మా ఇంట్లోనే బసచేశారాయన. ఆయన ప్రోగ్రామ్ అంతా నేను ఆర్గనైజ్ చేశాను. అప్పటికే పిసిసి అధ్యక్షుడు హనుమంతరావుగారు నన్ను పిసిసి కార్యవర్గ సభ్యుడిగా నామినేట్ చేశారు.

ఈలోగా రాజీవ్ గాంధీగారు ఉగ్రవాదుల దాడిలో మరణించారు. పి.వి. నరసింహారావుగారొచ్చారు. సంస్థాగత ఎన్నికలొచ్చాయి. మా నాన్నగారిని ఏఐసిసి మెంబర్‌గా తప్పించారు. అప్పుడు నేను జోక్యం చేసుకుని మా నాన్నగారిని ఉంచమని కోరాను. మూడింటిలో మీరేదైనా తీసుకోండన్నారు. ఆ సమయంలో పేర్ని కృష్ణమూర్తిగారు మంత్రిగా ఉన్నారు. నేను సహకార సంఘ అధ్యక్షుడిని కాదు, పాల సంఘం అధ్యక్షుడుని కాదు కానీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోటీచేయగలను అన్నాను. అలా ఏవో మాటలనుకున్నాము. ఈలోగా కావూరి సాంబశివరావుగారొచ్చి, నువు పోటీచేయి, నేను సపోర్ట్ చేస్తానన్నారు.

అప్పుడు పెద్ద మాటల యుద్ధమే జరిగింది.

కావూరి సాంబశివరావు, పాలడుగు వెంకటరావు, వంగవీటి చలపతిరావు, చెన్నుపాటి విద్య, కటారి ఈశ్వరకుమార్.. వీళ్ళంతా నాకు సపోర్ట్ చేశారు. ఎన్నికయింది. మళ్ళా కోర్టుకెళ్లి స్టే పట్టుకొచ్చారు (నవ్వు).

అట్లా ఎన్నికల్లో దిగాల్సొచ్చింది. ఆ దిగటం, దిగటం పన్నెండేళ్ళ పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నాను. సరే, మధ్యలో నన్ను తప్పించారు. అప్పుడు ఎలక్షన్‌లొచ్చాయి. అది నాకు మేలు చేసింది. అవనిగడ్డ తప్ప మిగిలిన నియోజకవర్గాలు నాకు సంబంధం లేదుకదా. నేను అవనిగడ్డ మీదే దృష్టిపెట్టి ఎలక్షన్ గెలిచాను. అప్పుడు రాజశేఖరరెడ్డిగారు ప్రతిపక్ష నాయకుడు. ఒకరోజు ఆయన ఢిల్లీ నుంచి ఫోన్ చేశారు. రాజశేఖరరెడ్డిగారికి జిల్లాలో ఆయన వర్గముండేది. ఆయన వారిని ప్రోత్సహించేవారు. నేను కాంగ్రెస్‌వాదిని తప్ప నాకు ఏ వర్గమూ లేదు. నన్ను పక్కనపెట్టారు. అప్పుడాయన ఫోన్ చేసి నువ్వు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉండాలన్నారు. నేను శాసనసభ్యుడిగా ఉన్నాను కదా అని నేనన్నాను. మీరెవరినయినా పెట్టండి, సపోర్ట్ చేస్తాను అని నేనన్నాను. ఆయన ఒప్పుకోలేదు. నువ్వుండాల్సిందే అన్నారు. ఒత్తిడి చేశారు. కాదనలేకపోయాను. అదొక టర్నింగ్ పాయింట్. మళ్లీ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ గెలుపుకు కృషి చేశాను. అభ్యర్థులను నేనే ఎంపిక చేశాను. రాజశేఖరరెడ్డిగారికి వేరే అభిప్రాయాలున్నా నేను మార్చాను. అభ్యర్థి గెలుపు ముఖ్యమని ఆయన నా మాటకు విలువ ఇచ్చారు. నేను సూచించిన అభ్యర్థులందరూ గెలిచారు.

***మిసిమి* : మీరు జాతీయ పార్టీ నుండి ప్రాంతీయ పార్టీకి మీ ప్రయాణం వివరించండి.**

*బుద్ధప్రసాద్:* అదెలా జరిగిందంటే, రాష్ట్ర సమైక్యత విషయంలో రాజీలేని పోరాటం నాది. మా నాన్న నాకు స్ఫూర్తి. 72 జై ఆంధ్ర పోరాటంలో ముగ్గురు మంత్రులు మాత్రమే రాజీనామా చేయలేదప్పుడు. అప్పటి ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు మంత్రి వర్గంలో మా నాన్నగారు, భాట్టం శ్రీరామమూర్తి, లుకలాపు లక్ష్మణదాసు. అప్పుడు మేం చాలా కష్టాలు పడ్డాం. ఆ ఉద్యమం కృష్ణాజిల్లా కేంద్రంగా నడిచింది. మామీద దాడులు జరిగాయి. ఇంట్లోంచి బయటకొచ్చే పరిస్థితి లేదు. సాహిత్యం మీద నాకు కొంచెం మమకారం ఏర్పడిందంటే అదే కారణం. ఒక ఏడాది పాటు మేం ఇంట్లోంచి బయటకు రాలేదు. బయట సీఆర్పీఎఫ్ కాపలా కాస్తుండేది. ఎవరినీ ఇంటికి రానిచ్చేవారు కాదు. బయటకెళితే ప్రాణ భయముండేది. అప్పుడు పుస్తకాలు చదవడం అలవాటయింది. వందల పుస్తకాలు చదవడం అప్పుడే వీలయింది. అందుకని సమైక్యత విషయంలో రాజీ లేదు. ఒక దశలో రాజశేఖరరెడ్డిగారికి అనుమానమొచ్చి నన్ను, గాదె వెంకటరెడ్డి, ద్రోణంరాజు సత్యనారాయణ ఇలా కొంతమందిని పిలిచి ఢిల్లీ వెళ్లి సోనియా గాంధీని కలవమని పంపారు. మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ.. ఇలా వీళ్లందరినీ కలిశాం కానీ సోనియాగాంధీ అప్పాయింట్మెంట్ ఇవ్వలేదు. చివరికి పార్లమెంటు సెంటర్ హాల్లో నడుచుకుంటూ వెళుతుంటే ఎదురెళ్ళి కలిశాం. పార్లమెంట్‌లో రాష్ట్రాన్ని ఎందుకు సమైక్యంగా ఉంచాలో అప్పుడు ఇందిరాగాంధీ గారి స్పీచ్ కాపీ ఆవిడకిచ్చాం. రాజశేఖరరెడ్డిగారున్నప్పుడు ఆ ప్రయత్నం చేశాం. తరవాత సంజయ్ బారు నాతో ఒక విషయం చెప్పారు. అప్పటికే సి.డబ్ల్యు.సి.లో రాష్ట్రాన్ని విడదీయాలని నిర్ణయించారని. అదీ రాజశేఖరరెడ్డిగారున్నప్పుడే. అప్పుడు సంజయ్ బారుగారు ఒక చీటి పంపించారుట, మన్మోహన్ సింగ్‌గారికి. ముఖ్యమంత్రికి చెప్పకుండా ఆ విషయం ప్రకటించటం మంచిది కాదని..

అప్పుడు రాజశేఖరరెడ్డి గారు రాత్రికి రాత్రి బయల్దేరి వచ్చారని, ఆ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని చెప్పుకున్నారు.

'మీరు రాష్ట్రాన్ని విభజిస్తే కాంగ్రెస్ గెలవదు. నామీద నమ్మకముంచండి. నేను గెలిపిస్తాన'ని ముఖ్యమంత్రి చెప్పినట్లు ఢిల్లీ వర్గాలు చెప్పాయి. అప్పటికి అది ఆగింది. ఇది సంజయ్ బారుగారు నాకు చెప్పింది. అప్పుడే రోశయ్య కమిటీ వేశారు. సెంట్రల్ గవర్నమెంట్‌ని ఒప్పించడానికి చేసిందది.

డిసెంబర్ 9 ప్రకటన వచ్చినప్పుడు నేను, దేవినేని నెహ్రూ కుటుంబాలతో కూర్గ్ పర్యటనలో ఉన్నాం. రాత్రి 12 గంటలకు చిదంబరం ప్రకటన వచ్చింది. ఉదయాన్నే నెహ్రూగారికీ విషయం చెప్పి అప్పటికప్పుడు బెంగుళూరు వచ్చి ఫ్లైట్ పట్టుకుని విజయవాడ వచ్చాం. అప్పటికి అక్కడ

బంద్ జరుగుతోంది. సాయంత్రమే మీటింగ్ పెట్టి రమ్మన్నారు. మళ్లీ కన్వీనర్ బాధ్యతలు నాకు కట్టబెట్టారు. అలా మళ్లీ సమైక్య ఉద్యమం కన్వీనర్‌నయ్యాను. తరవాత శ్రీకృష్ణ కమిటీ వేశారు. ఆ కమిటీ రిపోర్ట్ పరిగణలోనికి తీసుకోకుండా విభజించారు. ఆ విభజన జరిగినప్పుడు అధికార భాషా సంఘం ఛైర్మన్‌గా ఉన్నాను. అప్పుడు తిరుపతిలో ప్రపంచ తెలుగు మహా సభలు నిర్వహించాం. దాని ఉద్దేశం కూడా ఒక వాతావరణం కల్పించడానికే.

రాష్ట్ర విభజన ప్రకటనతో నేను కాంగ్రెస్ పార్టీకి, అధికార భాషా సంఘానికి రాజీనామా చేశాను. కిరణ్ కుమార్ రెడ్డి రాజీనామాను ఆమోదించలేదు. ఆయన నమ్మకమేమిటంటే అసెంబ్లీలో విభజన తీర్మానం వీగిపోతుందని. వాళ్లు వెనక్కి వెళ్ళి పోతారని.. మేం కూడా అదే నమ్మకంతో ఉన్నాం. కానీ తీర్మానాన్ని పక్కన పెట్టేస్తారని అనుకోం కదా. మా చేతుల్లో ఏమీ లేకుండా పోయింది (నవ్వు).

ఈలోగా జగన్ మోహన్ రెడ్డి గారు తమ పార్టీలోకి ఆహ్వానించారు. కొడాలి నానిని, పేర్ని నానిని పంపించారు దాని గురించి.. నా ఉద్దేశం వేరే పార్టీలోకి మారటం కాదని చెప్పాను. ఒక సిద్ధాంతం కోసం రాజీనామా చేశాను. కాంగ్రెస్ పార్టీ వెనక్కి వెళుతుందన్న నమ్మకం ఉండింది. అది పోవటంతో రాజీనామా చేశాను తప్ప వేరే పార్టీలోకి వెళ్లటం కోసం కాదు అని చెప్పాను. నా రాజీనామాను గవర్నర్ నరసింహన్ గారు కూడా చాలాకాలం ఆమోదించలేదు. సరె, ఈలోగా రాష్ట్ర విభజన జరిగిపోయింది.

***మిసిమి* : తర్వాత మీరే రాజకీయ భవిష్యత్తుని నిర్ణయించుకున్నారా?**

ఒకరోజు సెక్రటేరియట్‌లో ఉండగా సీనియర్ పాత్రికేయుడు సి. నరసింహారావు వచ్చి చంద్రబాబు నాయుడు గారు మీతో మాట్లాడనుకుంటున్నారని చెప్పారు.. దేనికి అంటే, మిమ్మల్ని పార్టీలోకి తీసుకోవాలని అనుకుంటున్నారని చెప్పారు.

నేనన్నాను, జన్మంతా తెలుగుదేశం పార్టీతో పోరాటం కదా.. ఇప్పుడు పార్టీ మారితే ఎంతవరకు వాళ్ళు హర్షిస్తారు, నావెంట ఉన్నవారు హర్షిస్తారు అన్నాను. పెద్దాయనతో – అవునని చెప్పాలా, కాదని చెప్పాలా!

నేను పార్టీని అనుభవజ్ఞుడి చేతిలో పెట్టాలని చెప్పాను. రాజకీయాల నుంచి తప్పుకోవాలన్న ఆలోచన నాకుంది అని చెప్పాను.

సరే ఆయన మా పార్టీవాళ్ళను పిలిచి నేను మాట్లాడతాను. వాళ్ల పార్టీవాళ్ళతో ఆయన్ను మాట్లాడుకోమనండి అని చెప్పారు. మా వాళ్ళని పిలిచి అడిగాను. సరే కాంగ్రెస్‌వాళ్ళకి లోకల్ పాలిటిక్స్ కదా.

టీడీపీతో పోరాడుతూ దాంట్లోకెట్లా వెళతామని కొంతమంది సంశయం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఉందామంటే అటెళదాం, విరమించుకుని ఇంట్లో కూచుందామంటే వద్దు అని నేను చెప్పాను.

అలా జరిగింది, నేను తెలుగుదేశంలోకి రావటం అనేది.

***మిసిమి* : అదేలెండి, మీ అంతట మీరు కాకుండా వారి ఆహ్వానం మేరకు, తర్జన భర్జనల అనంతరం వెళ్ళారన్నమాట.**

*బుద్ధప్రసాద్:* అవును. వెళ్లినందుకు ఆయన తగిన విధంగానే గౌరవించారనుకోండి. నేనేమీ కోరుకోలేదు, కోరుకోటానికి కూడా నాకర్హత లేదు. అంటే పార్టీలో నేను చేసిన సేవేమీ లేదు కదా. సరే, డిప్యూటీ స్పీకర్ హోదా కల్పించారనుకోండి. తర్వాత కొన్ని పనులు చేయగలిగామన్న తృప్తి ఉంది.

***మిసిమి* :మిమల్ని చూసినా, మీ నాన్నగారిని చూసినా చాలా ఆశ్చర్యమనిపిస్తుంది.. రాజకీయాలలో ఎటువంటి మచ్చ లేకుండా ఉండటం సాధ్యం కాదు. మీరు, మీ నాన్నగారు ఆ అరుదైన ఘనత సాధించారని చెప్పొచ్చు. అది ఎలా సాధ్యమయింది?**

*బుద్ధప్రసాద్:* అది నాకు కూడా ఆశ్చర్యమే. చిన్నప్పటి నుండి ఆర్థిక బాధలు చూసినవాడిని. మా నాన్నగారు తిరుగుతూ ఉండేవాడు. బియ్యానికి లేక పచారీకి లేక మా అమ్మ అవస్థ పడుతుండేది. అదే పరిస్థితి చివర్లోనూ ఉండేది. మా నాన్న చనిపోయినప్పుడు అవనిగడ్డ తీసుకెళ్ళటానికి, ఖర్మ చేయటానికి చేతిలో చిల్లిగవ్వ లేదు. అయితే ఏంటంటే ఎలా జరిగాయో నాకు తెలీదు. పన్నెండు సంవత్సరాలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా చేశాను. ఆ పదవిలో ఉండటం ఎంత ఖర్చుతో కూడుకున్నదో మీకు తెలుసు. ఎవరికీ టీ ఇప్పించేవాడిని

కాదు. ఇప్పించడానికి డబ్బులూ ఉండేవి కాదు. ఎవరూ ఏమీ అనుకునేవారు కాదు. ఇప్పుడా పరిస్థితులు మారిపోయాయనుకోండి.. నాకు ఎలక్షన్లొచ్చేప్పటికి పార్లమెంటు సభ్యులు కాస్త స్థితిమంతులుండేవారు. శివశంకర్ గారు, బాలశౌరిగారు, బాడిగ రామకృష్ణ గారు... సరే, వాళ్ళు పెట్టిన ఖర్చుతో మేం కూడా నెట్టుకుంటూ వెళ్లిపోయాం.

ఒకచోట మా నాన్న రాశారు. మా నాన్నకి ముఖ్య మంత్రులంతా సన్నిహితులు.. సంజీవరెడ్డి గారు మొదలైనవారంతా. వారు స్టేషనుకొస్తే రిసీవ్ చేసుకోవడానికి, స్వాగతం పలకటానికి వెళుతుండేవారు. వెళ్తే పూలదండలతో సత్కరించాలి. ఈ సంప్రదాయాన్ని సిరీస్ రాజుగారు మొదలెట్టారు. మా నాన్నావాళ్ళు వెయ్యాలంటే డబ్బులు లేవు. (నవ్వు). పరిస్థితి ఆ రకంగా ఉండేదని రాశారొక వ్యాసంలో. ఆనాడు మా నాయకులెవరూ నన్ను ఇబ్బంది పెట్టలేదు. ఆడంబరాలు లేకుండానే వ్యవహరించారు.ఇదివరకు ముఖ్య మంత్రులు ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లలో ఉండేవారు. వెంగళరావుగారి నుంచి నాకు తెలుసు. ఆయన నక్సలైట్లకు వ్యతిరేకంగా ఉన్నా, ఉద్యమాలను అణిచేసినా మినిమం సెక్యూరిటీ ఉండేదాయనకు. ఇప్పుడందరికీ ఫైవ్‌స్టార్ హోటల్స్ కావాలి. ఇవాళ ముఖ్యమంత్రి బయటకొస్తే వందలమంది పోలీసుల భద్రత. ఎందుకు వీరికి ఇంత అభద్రతా భావం - భయం తెలియదు.

బరంపురంలో మన తెలుగు వాళ్ళు ఒక మీటింగ్ పెట్టారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా నేను వెళ్ళాను. ఒడిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వచ్చారు. ఎక్కువ హడావిడి లేకుండా సామాన్యుడిగా వచ్చి కూర్చున్నాడు.. కార్యక్రమం అయాక తిరిగి వెళ్లిపోయారు. పోలీసుల ఆర్భాటం లేదు. ఈయనకు అసలే లేదు.

ఆ మధ్య మేం బ్రిటిష్ లైబ్రరీలో ప్రపంచ రచయితల చారిత్రక సదస్సును పెట్టాము. దానికి వాళ్ళ తరఫున డిప్యూటీ మంత్రి వచ్చారు (అప్పట్లో చిరంజీవి కేంద్ర మంత్రి). ఆయనొచ్చాడు. సరే మనం శాలువా, మొమెంటో అవన్నీ ఇస్తాం కదా. ఆయన సింపుల్‌గా చేత్తో పట్టుకొని వెళ్లిపోయాడు. ఆయనకు ఎస్కార్ట్ కూడా ఎవరూ లేరు. (నవ్వు). ఇది జరిగింది లండన్లో. అదే మన దగ్గర మరీ ఎక్కువయి పోయిందండీ, తెలుగు రాష్ట్రాల్లో. నిన్నటి దాకా ఈ నాయకులంతా ప్రజలలో ఉన్నవారే కదా. ఇవాళ ఇంత ఆడంబరంగా మారితే ఎలా! మనం బతికితే చాలు, ప్రజలేమైపోతే మనకెందుకన్న మనస్తత్వం మంచిది కాదు. రేపు పదవి పోతే ప్రజల మధ్యే కదా ఉండాల్సింది.

***మిసిమి* : మీరు రాజకీయాల్లో ఉన్నా కూడా మీ జీవితమంతా సాహిత్యం చుట్టూ తిరిగినట్లుంది!?**

*బుద్ధప్రసాద్:* ఇందాక చెప్పా కదా. జై ఆంధ్ర ఉద్యమంలో పుస్తకాలు చదవడం అలవాటయింది. ఉద్యమం అయిపోయిన వెంటనే డిగ్రీ చదవటానికి హైదరాబాద్ వచ్చాను. మా నాన్నప్పటికి విద్యా, సాంస్కృతిక వ్యవహారాల శాఖకు మంత్రిగా ఉండేవాడు. అవనిగడ్డలో ఇంకా అప్పటికి డిగ్రీ కళాశాల రాలేదు.

ఇక్కడ చింతలబస్తీలో న్యూ గవర్నమెంట్ కాలేజ్ ఉండేది. సామాన్యమైన కాలేజ్. దాంట్లో గంగప్పగారని మా గురువుగారుండేవారు. ఈ మధ్యే పోయారు.

ఇక్కడ కవులు, కళాకారులు మా ఇంటికొస్తూ ఉండేవారు. పుస్తకాలు చదివున్నా కదా. చాలా అభిమానం ఉండేది వారంటే, ముఖ్యంగా దాశరథిగారు, డా. సి. నారాయణరెడ్డి గారు. రోజూ మా ఇంటికొస్తూ ఉండేవారు. ముఖ్యంగా దాశరథిగారు బాగా సన్నిహితంగా ఉండేవారు. ఎవరినైనా సార్, సార్ అనటం ఆయన దగ్గర నుండి అలవాటయింది. ఆయన సార్, సార్ అంటుండేవారు. ఆ ఊతపదం ఆయననుండి నాకొచ్చింది. అలా ఎంతోమంది కవులు, కళాకారుల పరిచయాలేర్పడ్డాయి.

తర్వాత 1975లో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. నేనొక కార్యకర్తగా పనిచేశాను. మా నాన్న నిర్వహణా బాధ్యతలతో తలమునకలై ఉండేవాడు.

రాత్రి రోజూ పదకొండు, పన్నెండు గంటలదాకా రవీంద్రభారతిలో కూచునేవాడిని, ఏదో పనిచేస్తూ. అట్లా తెలుగు మహాసభల ప్రభావం నాపై చాలా పడింది. అట్లా తెలుగు భాషపట్ల వ్యామోహం పెరిగింది.

ఆ తరవాతేంటంటే నేను డిగ్రీవరకు తెలుగు మీడియంలో చదివినా, మా అబ్బాయి విషయమొచ్చేసరికి తెలుగ సరిగ్గా చదవలేకపోతున్నాడు. అప్పుడా సమయంలో ధర్మారావు గారు, రాజుగారు వీళ్లంతా మాతృభాషా సమితి అని పేరు పెట్టి ఆ సంస్థ ద్వారా కొన్ని కార్యక్రమాలు

చేస్తున్నారని పేపర్లో చదివాను. వాళ్ళకు ఫోన్ చేస్తే వచ్చారు. తర్వాత వారితో మీటింగ్‌కు పిలిస్తే వెళ్ళాను. అప్పుడే *నడుస్తున్న చరిత్ర* పత్రిక నడుపుతున్న సామల రమేష్ బాబు పరిచయం అయారు. ఇలా కాదు, తెలుగు భాషను ప్రేమించేవారందరు ఒక సంస్థగా ఏర్పడాలని నిర్ణయించి శ్రీ కాకుళంలో తెలుగు భాషా చైతన్య సమితికి శ్రీకారం చుట్టాం. తెలుగు భాషా ఉద్యమ సమాఖ్య అని నామకరణం చేశాం. సామల రమేష్ బాబు కార్యదర్శిగా, నేను ఉపాధ్యక్షుడిగా ఒక కమిటీ వేశాం.

***మిసిమి* : ఏం తీర్మానించారు మీరప్పుడు!**

*బుద్ధప్రసాద్:* విద్యా విధానం గురించి, రాష్ట్రేతర ప్రాంతాలలో ఉండే తెలుగు వారి గురించి తీర్మానాలు ఇలాంటివన్నీ ఉన్నాయి. ఆ సమయంలో నేను శాసనసభ్యుడిగా ఉండటం కొంత దోహదపడింది. పాత ప్రొసీడింగ్స్ లైబ్రరీలో కూచుని చదువుతుండేవాడిని. అట్లా చదువుతున్నప్పుడు వావిలాల గోపాలకృష్ణయ్య గారు శాసన సభ్యులుగా తెలుగు భాషకు సంబంధించిన కొన్ని అనధికార తీర్మానాలు ప్రవేశపెట్టి ఉన్నారు. రాష్ట్రం ఏర్పడింది, మన భాష కోసం. మన భాషను అధికార భాషగా తెచ్చేందుకు మీరు ప్రయత్నం చేయలేదు అని ఆయన అధికార భాష గురించి అనధికార తీర్మానం ప్రవేశపెట్టారు. మీరు అనధికార తీర్మానం ఉపసంహరించుకుంటే మేమే అధికార తీర్మానం పెడతామని ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇది 1966 నాటి చరిత్ర. అలా అధికార భాషా చట్టమొచ్చింది.

సరే, నేనేం చేశానంటే ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు బోధనా భాషగా ఉండాలని అనధికార తీర్మానం ప్రవేశపెట్టాను. అనధికార తీర్మానాలు సాధారణంగా చర్చకు రావు. అదృష్టవశాత్తూ ఇది చర్చకు వచ్చింది. ప్రవేశపెట్టినవాడిగా నేను మాట్లాడతాను, కానీ బలపరిచేవాడుండాలిగా. మా కాంగ్రెస్‌వాళ్ళందరూ ఎటో వెళ్ళిపోయారు. లక్కీగా బిజెపి పక్షాన కోట శ్రీనివాసరావుగారు అసెంబ్లీలో ఉన్నారు. సరే, లేచి ఆయనదగ్గరకు వెళ్ళి, ఇలా ఉంది పరిస్థితి అని చెప్పి మీరు బలపరచాలని కోరాను. ఆయన బలపరచటమేకాదు, గంటసేపు మాట్లాడారు. అప్పుడు అప్పటి విద్యా శాఖ మంత్రి మండవ వెంకటేశ్వరరావు గారు, మీరు తీర్మానం ఉపసంహరించుకోండి జీవో తీసుకొస్తాం అని కోరడంతో తీర్మాన ఉపసంహరణ, జీవో రావటం జరిగాయి. రాజకీయాలలో ఉండబట్టే కదా ఇది వీలయింది. ఇంకో విషయం చెప్పాలి. కన్నడ భాషకు ప్రాచీన హోదా కోసం ప్రయత్నిస్తున్నప్పుడు కూడా నేను అనధికార తీర్మానం ప్రవేశపెట్టాను. కానీ అది చర్చకు రాలేదు. కానీ ప్రాచీన భాష హోదా ఉద్యమం వేడెక్కేందుకు ప్రయత్నించాను.

ఒకరోజు వేటూరి గారు అవనిగడ్డ వచ్చారు. వారితో తెలుగుకు ప్రాచీన హోదా గురించి ప్రస్తావించాను. కన్నడ భాష కవులు, కళాకారులు తమ అవార్డులను ప్రభుత్వానికి తిరిగిచ్చేస్తున్నారు, మనవాళ్ళెవరూ ముందుకు రావటం లేదని చెప్పాను. ఆ రోజు గాంధీ వర్ధంతి. ఆ ముందురోజు ఆయన పుట్టిన రోజు. అవనిగడ్డలో ఆయనకు పెద్దెత్తున సన్మానం చేశాం. ఆ రోజు ఆయనుండిపోతే తెల్లారి మేం కాఫీ తాగుతూ ప్రాచీన భాషగా తెలుగు గురించి మాట్లాడుకున్నాం.

సరే, గాంధీగారి వర్ధంతి కదా మీరొచ్చి వెళ్ళండి అని కోరాం. ఆయనొచ్చాడు. ఆయన తన ప్రసంగంలో గాంధీ గారు మాతృభాష గురించి మాట్లాడిన సందర్భాన్ని గుర్తుచేస్తూ నా భాష ద్వారా నాకు జాతీయ స్థాయి అవార్డొచ్చింది. నా భాషకు ప్రాచీన హోదా ఇవ్వని కారణంగా ఆ అవార్డు తిప్పిపంపిస్తున్నా అని ప్రకటించాడు. ఆ ప్రకటన ఆయన మామూలుగా చేయలేదు. బొటబొటా కన్నీరు కారుస్తూ చెప్పాడు. దాంతో మొత్తం కదలిక వచ్చింది. వెంటనే టీవీల్లో స్క్రోలింగ్ వచ్చింది. అది చూసి సినిమావాళ్ళందరూ రియాక్ట్ అయారు. ఉద్యమం ఉధృతమయింది. అప్పుడు రాజశేఖరరెడ్డి గారు ఇదంతా గమనించి అసెంబ్లీలో తీర్మానం పెట్టాడు.

చంద్రబాబు నాయుడు గారు సపోర్ట్ చేశారు. తెలుగుని ప్రాచీన భాషగా గుర్తించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసి పంపారు. అప్పటికి మనదగ్గరింకా ప్రజలలో కదలిక లేదు. కానీ కర్ణాటకలో పరిస్థితి భిన్నంగా ఉంది. వారికి భాషంటే పట్టుదలెక్కువ. అప్పుడు ద్రవిడ యూనివర్సిటీ ఉపాధ్యక్షులుగా గంగిసెట్టి లక్ష్మీనారాయణగారు ఉండేవారు. లక్ష్మీనారాయణగారితో మాట్లాడి కర్ణాటక వాళ్ళతో మాట్లాడితే బావుంటుందంటే ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేశారు. దానికి నేను వెళ్ళాను. నాతోపాటు మండలి ఛైర్మన్ చక్రపాణిగారు కూడా వచ్చారు. కర్ణాటక

నుంచి బిజెపి ప్రభుత్వం విద్యా శాఖ మంత్రి వచ్చారు. అప్పుడు వీరప్పమొయిలీది ప్రధాన పాత్ర. ఆయన కన్నడంలో గొప్ప రచయిత కూడా. ఈలోగా రాజశేఖరరెడ్డిగారు ఓ కమిటీ ఏర్పాటు చేశారు. మంత్రి ఎమ్. సత్యనారాయణ రావుగారు అధ్యక్షులు. ఏబికే ప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆవుల మంజులత, నేనూ సభ్యులం. రాజకీయంగా చూడాల్సింది నేనే కాబట్టి ఢిల్లీ వెళ్ళాం. మన ఎమ్.పి.లెవరూ పెద్దగా స్పందించలేదు.

ఒక పెద్దాయన దగ్గరకు వెళ్ళాం. ఏమిటి దీనివలన లాభం అన్నాడు. ఇది తెలుగు.. మన ఆత్మ గౌరవ సమస్య అంటే వీళ్లకు అర్థం కాదు. వంద కోట్లిస్తారండీ అన్నానో లేదో, ఒక క్షణం ఆలస్యం చేయకుండా అందరికీ ఫోన్లు చేయటం మొదలెట్టాడు. (నవ్వు). మొత్తం అందర్నీ సమీకరించాడు. అందరం కలిసి ప్రధాని మన్మోహన్ సింగ్ గారి దగ్గరికి వెళ్లి ఒక రిప్రజంటేషన్ ఇచ్చొచ్చాము. అదే సమయంలో ప్రియ రంజన్ దాస్ మున్షీ I&B మినిస్టర్‌గా ఉన్నారు. ఆయనకు నన్ను పరిచయం చేశారెవరో. ఎందుకొచ్చారు అని అడిగాడాయన. ప్రాచీన భాషగా తెలుగును గుర్తించమని చెప్పడానికి వచ్చామన్నాను. ఆయనో మాట చెప్పాడు. ఈ ప్రభుత్వం మీమీద ఆధారపడి నడుస్తోంది. మీరేదడిగితే అదివ్వక తప్పదు అన్నాడు.

కానీ మీ ఎంపీలడగటంలేదు. అందుకని వాళ్లివ్వటం లేదు అన్నాడు. మా ఎంపీలందరు కలిసి అడిగితే వాళ్ళు తప్పక ఇస్తారు. కానీ మీ వాళ్ళు అడగటంలేదు అని రహస్యం బట్టబయలు చేశాడు (నవ్వుతూ).

***మిసిమి* : మీరు పుస్తక ప్రదర్శనలో *మిసిమి* స్టాల్‌కు వస్తారు. అనేక పుస్తకాలు కొంటారు. అలాగే అన్ని స్టాల్స్ చూసి ఎన్నో పుస్తకాలు సేకరిస్తారు. అన్నీ చదివే తీరికా, ఓపికా ఉంటుందా?**

*బుద్ధప్రసాద్:* బుక్ ఎగ్జిబిషనే కాదండీ, ప్రతి ఆదివారం అబిడ్స్‌లో పాత పుస్తకాలు కొనడం నాకు చాలా ఇష్టం. దానికోసం మేమెప్పుడు ఎర్రగడ్డ నుంచి ఆటోలో వెళ్ళేవాళ్ళం. పుస్తకాలకన్నా ఆ ఖర్చు ఎక్కువవుతూ ఉండేది. అలా చూడటం, కొనటం ఓ వ్యసనం. చివరికి మా నాన్న హాస్పిటల్‌లో ఉన్నా కూడా వెళ్ళొస్తుండేవాడిని. నాకు జై ఆంధ్ర ఉద్యమంలో ఇంట్లో ఉండటంవలన చదవటం అలవాటయిందని చెప్పాకదా. ఓ వారం కవిత్వం, ఓ వారం నవలలు, ఓ వారం ఆత్మకథలు, ఓ వారం తత్వశాస్త్రం.. ఇలా ఓ ప్రోగ్రామ్ పెట్టుకుని చదివేవాడిని (నవ్వు).

***మిసిమి* : ఇన్ని పుస్తకాలు చదివారు. మీకు నచ్చిన పుస్తకాలు చెప్పమంటే..?**

*బుద్ధప్రసాద్:* నచ్చిన పుస్తకాల్లో మొదటిది గాంధీ గారి ఆత్మకథ, నెహ్రూ గారి ఆత్మకథ, ప్రకాశం గారి ఆత్మకథ.. ఆత్మకథలు చదవకపోతే చరిత్ర తెలియదు. అందుకనే ప్రకాశంగారిది, అయ్యదేవర కాళేశ్వరరావు గారి ఆత్మకథలను ఎమెస్కోవారికి చెప్పి ప్రింట్ చేయించాను. దాశరథిగారి *యాత్రాస్మృతి* కూడా ఇష్టం. ఇక రచయితల్లో అడవి బాపిరాజు గారు చాలా ఇష్టం. నారాయణ రావు, కోణంగి చాలా ప్రభావితం చేశాయి. దానికి కారణం ఆ నవలల్లో గాంధీ తత్వం, జాతీయ భావనలుండేవి. భాష సరళంగా ఉండటం కూడా ఒక కారణం. కాంగ్రెస్ వాళ్ళం కాబట్టి కమ్యూనిస్టు సాహిత్యం చదవకూడదని కొంతకాలం ఉండేది. అందుకే శ్రీశ్రీ సాహిత్యం జై ఆంధ్ర ఉద్యమంలో కానీ చదవలేకపోయాను. ఆ టైంలో *మహాప్రస్థానం*, ఆరుద్ర *త్వమేవాహం*, సోమసుందర్ *వజ్రాయుధం* అప్పుడు చదివాను. అనిసెట్టి సుబ్బారావు కవిత్వం కూడా.

విశ్వనాథ సత్యనారాయణగారిని మొదట్లో చదవలేదు. చదివితే పాత కాలానికి వెళ్లిపోతామనే భయముండేది. అప్పుడే *కల్పవృక్షం* కూడా వచ్చింది. విశ్వనాథగారు మా నాన్నని *రామాయణ కల్పవృక్షం* లో శ్రోతను చేశారు. మా నాన్నగారికి బట్టలు కూడా పెట్టారు.

(ఇంకా ఉంది)

(మాటామంతీ సమయంలో పాల్గొని ఈ రాతప్రతి రూపొందించిన సి.ఎస్. రాంబాబుగారికి ధన్యవాదాలు)




ఫిక్షన్ ఆవిష్కర్త

# సెర్వాంటెస్ – డాన్ కిహోటీ



సెర్వాంటెస్

*– ముక్తవరం పార్థసారథి*

సెర్వాంటెస్ – ఆయన ఒక రచన చేశారు. 500 సంవత్సరాల క్రితం. ఆ పుస్తకం బైబిల్ కంటే ఎక్కువ ప్రతులు అమ్ముడుపోయింది. ప్రపంచంలో అన్ని పుస్తకాలకంటే ఎక్కువసార్లు ప్రచురించబడింది. ఈ పుస్తకం 200 భాషలలోకి అనువదింపబడింది. ఐరోపా సాహిత్యంలో మొదటి నవలారూపం సంతరించిపెట్టి 'ఫిక్షన్' రచనకు ఆవిష్కారం చేసి – తరువాత రచయితలకు ఆదర్శంగా నిలిచిన రచన. అదే **డాన్ కిహోటీ**. అలాంటి రచనను ఏ విధంగా అధ్యయనం చేయాలి? ఆ విషయమే విశదీకరిస్తున్నారు ముక్తవరం పార్థసారథి. ఇది చివరి భాగం.

*– సం.*

ఫిక్షన్ రాయడమంటే మన మానని గాయాలకు లేపనం రాసుకోవటమే. రచయిత అదృశ్యమై పాత్రగా మారతాడు. ఒకరు కాదు. అనేక పాత్రలుగా కూడా, బహురూపిగా కనిపిస్తాడు. ఎవరికీ చెప్పుకోలేని ఆత్మఘోష ఫిక్షన్‌గా మారుతుంది. ఒక నార్వేజియన్ రచయిత చెప్పినట్టుగా, "రాసే క్రమంలో పాత్రల వెనక దాగటం అలవాటు చేసుకున్నాను. త్వరలోనే నా మనసు తేలికపడింది. నిజజీవితంలో కాకపోయినా, కనీసం, ఫిక్షన్‌లో నాలోని సంఘర్షణకు పరిష్కారం లభించింది."

"ఈ మానసిక వైద్యం సాహిత్యానికి మాత్రమే ప్రత్యేకం. ఇక్కడ మనం ఎవరినైనా ధిక్కరించవచ్చు. ఎవరిమీదైనా ప్రతీకారం తీర్చుకోవచ్చు. సమాజానికి లొంగి బతుకుతాం. కానీ ఇక్కడ మనం సమాజాన్ని శాసిస్తాం."

సెర్వాంటెస్ కూడా ఈ పద్ధతినే అనుసరించాడు. ఒక జీవితకాలం తను అనుభవించిన కష్టాలకు, అవమానాలకు, పరాజయాలకు ఫిక్షన్ రంగు పులిమాడు (వాస్తవం కానిదే ఫిక్షన్).

## ప్రపంచమే ఒక నాటకరంగం

**ఒక సంభాషణ:**

సెర్వాంటెస్: నా వద్ద ఆరు నాటకాలూ, మరో ఆరు నాటికలూ ఉన్నాయి.

పాంక్రాషియో: మరి వాటినెందుకు ప్రదర్శించలేదు?

సెర్వాంటెస్: నాటక ప్రయోక్తలు నాకోసం వెతకటంలేదు. నేను వాళ్ల కోసం నిరీక్షించటంలేదు.

పాంక్రాషియో: నీ వద్ద నాటకాలున్న సంగతివాళ్లకు తెలియకూడదు.

సెర్వాంటెస్: వాళ్లకప్పటికీ నాటకాల గురించి తెలుసు. కానివాళ్ల కొలువులో, భట్రాజుల్లాంటి కవులున్నంతవరకు నా అవసరం వాళ్లకుండదు. నా ఉద్దేశం నాటకాలను ప్రచురించటం. హడావిడిగా రంగస్థలం మీద వాటిని చూసి అర్థం చేసుకొనే ప్రయత్నం కూడా చేయకపోవడంకన్నా, తీరిగ్గా, పుస్తకాల్లో చదువుకోవడం మంచిది కదా!

ఒక నాటకశాల ముందు "బిజినెస్ ఆఫ్ అల్జీర్స్ – రచన: మిగ్వెల్ డి సెర్వాంటెస్" అన్న ప్రకటనను చూసి గర్వించాడు సెర్వాంటెస్. "అల్జీర్స్‌లో ఏడేళ్ల పాటు ఖైదీగా ఉన్న రచయిత" అని కూడా రాశారు పబ్లిసిటీ కోసం.

అయితే చెర నుండి తప్పించుకోవడం కోసం సెర్వాంటెస్ ప్రాణాలకు తెగించాడు. అనేక విఫల యత్నాలు చేశాడు.

1580లో వాలెన్సియా నుండి స్వదేశానికి వెళ్లాలనుకున్నాడు. మాడ్రిడ్‌లో తనవాళ్లతో కలవాలని ఆతృతగా ఉంది. కాని తనమీద మోపిన అభియోగాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. లేదా క్షమించాలి. లేదా విస్మరించాలి. డిసెంబర్ దాకా నిరీక్షించాడు. మాడ్రిడ్‌కు వెళ్లాలనుకున్నప్పుడు అధికారులు అడ్డు చెప్పలేదు. సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఇంటికి చేరాడు గాని అక్కడి పరిస్థితులు కొత్త చిక్కులు తెచ్చిపెట్టాయి. ఇన్నాళ్లూ అందరూ ఎలా బతికారోగాని ఇంట్లో చిల్లిగవ్వ కూడా లేదు. తండ్రికి వృద్ధాప్యంతో పాటు అనారోగ్యం కూడా పెరిగింది. చెముడు కూడా వచ్చింది. సోదరి మాగ్దలెనా ఎవరినో పెళ్లి చేసుకోవాలనుకుందిగాని ఆ సంబంధం బెడిసికొట్టింది. పరిహారం చెల్లించి విడుదలైన ఖైదీలకు ఆర్థిక సహాయం చేస్తున్న ఒక సంస్థకు దరఖాస్తు చేస్తున్నాడు.

ఇంటికి చేరాడన్న మాటేగాని సెర్వాంటెస్ చెరసాల కష్టాలను మించిన ఆర్థిక / కుటుంబ సమస్యల్లో కూరుకుపోయాడు. తను మళ్లీ సైన్యంలో చేరి తృణమో పణమో సంపాదిస్తే తప్ప ఈ కష్టాలో కొలిక్కి వచ్చేట్టు లేవు. ఇంక ఆలస్యం చేస్తే లాభం లేదు. ఆరోగ్యం సహకరించకపోయినా, పోర్చుగల్‌కు వెళ్లి తనకో ఆధారం కల్పించమని కింగ్ ఫిలిప్‌కు అర్జీ పెట్టుకున్నాడు. తనను శరణు కోరిన పేదవాడికి అడిగినంతా ఇవ్వలేదుగాని సెర్వాంటెస్‌కో చిన్న ఉద్యోగం దొరికింది. ఆ వెంటనే జూన్ నెలలో, లిస్బన్ నుంచి బయలుదేరి కాడిజ్ చేరుకుని, జిబ్రాల్టర్ దాటి ఆఫ్రికా ఖండంలోకి ప్రవేశించాడు.

అప్పటికే అల్జీర్స్‌లో బందీగా గడపడంవల్ల, ఆఫ్రికాలోని తీవ్ర ఉష్ణోగ్రతలకు అలవాటు పడ్డాడు సెర్వాంటెస్. కొన్ని రాచకార్యాలను చక్కపెట్టుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత మంచి ప్రభుత్వోద్యోగం కోసం మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించాడు సెర్వాంటెస్. కానీ రాజుగారు కరుణించలేదు. నిరాశ పెరిగింది. చివరిసారిగా, ఆంటోనియో డి ఎరాసో అనబడే ఉన్నతోద్యోగికి రాసిన లేఖలో తను ఉద్యోగం ఇప్పించమని వేడుకొన్నాడు. "నేను 'గలాటీ' (నవల) రాస్తున్నాను. పూర్తి చేయగానే మీ చేతుల్లో పెట్టి జీవితం ధన్యం చేసుకొంటాను. మీరే నాకు దిక్కు" అన్నది ఆ లేఖ సారంశం.

మనసు కలతగా దిగులుగా ఉన్నప్పుడు రచన సాగదు. గలాటీ అనుకోవడానికి మరో నాలుగేళ్లు పట్టింది. రచన తిండి పెట్టదు. సెర్వాంటెస్‌కు ఏ ఉద్యోగమూ దొరకలేదు.

పదహారు, పదిహేడు శతాబ్దాలలో ఇంగ్లండు, స్పెయిన్‌లలో ఆధునిక రంగస్థలం ఆవిర్భవించింది. ఈ దేశాలు ఇటాలియన్ నాటకాలనూ, భవన నిర్మాణ రీతులనూ విరివిగా దిగుమతి చేసుకోవటమే అందుకు కారణం. ప్రేక్షకుల్లో కూడా నాటకాలు చూడటం పట్ల ఆసక్తి పెరిగింది. ప్రవేశ రుసుము కూడా అతి తక్కువగా ఉండటంతో ప్రతినాటకాల దగ్గరా జనం గుమిగూడారు. స్థానిక రచయితలు రాసిన నాటకాలు కూడా డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా, స్పానిష్ రచయిత ప్రతి రోజూ నాటకాలు ప్రదర్శించే అవసరముండటంతో పర్మనెంట్ థియేటర్లు కట్టించారు.

అయితే ఇప్పటితో పోల్చితే, నాటక రచయితల పరిస్థితి ఆ రోజుల్లో చాలా దయనీయంగా ఉండేది. తమ రచనల మీద రచయితలకు హక్కులుండేవి కావు. నాటకాల దర్శకులు వాటిని కొనుక్కొని తమ స్వంత నాటకాలుగానే ప్రదర్శించేవారు (ఈ వాతావరణం తొలి రోజుల హాలీవుడ్‌ని తలపిస్తుంది). ఇది దారుణమే కావచ్చుగాని, సెర్వాంటెస్‌కు తన కావ్య కన్యల గురించిన భ్రమలేమీ లేవు. థియేటర్ యజమానుల అన్ని షరతులకూ అంగీకరించి ముప్పైనాటకాలకు పైగా వాళ్ల కమ్ముకున్నాడు డబ్బుకు కటకటలాడుతున్న రచయిత కీర్తి మరీచికల వెంట పరిగెత్తాడు. కాని అక్కడా సెర్వాంటెస్‌కు నిరాశే ఎదురైంది. ఇతడు ఎన్ని నాటకాలు ప్రదర్శించినా, లోప్ డి వెగా రంగస్థల వ్యాపారంలో రాజరాజుగా వెలిగాడు. నిజానికి అప్పటి నాటకాలన్నీ శ్రవ్య ప్రధానమైనవే. చూడటానికి కాకుండా, వినటానికే జనం ఎగబడ్డారు. ఆడియన్స్ అంటే అర్థం అదే. సాహితీ విలువలు పెంచే విధంగా తను

రాస్తుంటే, చవకబారు నాటకాలు లోప్ డి వెగా రాస్తున్నాడని సెర్వాంటెస్ అసహనం. డాన్ కిహోటీలో పలు సందర్భాలలో జరిగిన సాహితీ చర్చలో ఈ విషయం ప్రస్తావిస్తాడు సెర్వాంటెస్. "నాటక కంపెనీలవాళ్ల మెప్పు కోసం రాసేవాళ్ల జీవితాలు ఎంత తుచ్ఛమైనవో కదా!" అన్నది ఒక చర్చ సారాంశం. లోప్ డివెగాను ఇది గాయపరిచిందనటంలో సందేహం లేదు. ఆ తర్వాత కొద్ది రోజులకే సెర్వాంటెస్ నాటకాలను ఏ కంపెనీ స్వీకరించలేదు. నాటక రచయితకు, అతని కలలకు తెరపడింది. అయినా కోపం చల్లారని లోప్ డివెగా "సెర్వాంటెస్ అంత చెత్త రచయిత మరొకడు లేడు. డాన్ కిహోటీ పరమ నీచ, నికృష్ట నవల అని పాఠకులు ఏకగ్రీవంగా తీర్మానించారు అని బహిరంగంగా ప్రకటించాడు. నాటకాలలో విఫలమైన సెర్వాంటెస్ తన వచనానికి పదునుపెట్టాడు. డాన్ కిహోటీలో గొప్ప నాటకీయత కనిపిస్తుంది. సజీవమైన భాష, సరికొత్త శైలి. నాలుగు వందల ఏళ్ల తర్వాత కూడా ఆ పుస్తకం మనల్ని అలరించటానికి కారణం అదే.

తన ఆత్మకథాత్మకమైన Journey to Parnassusలో మిగ్వెల్ అనబడే పాత్ర ఇలా సమర్థించుకుంటాడు: "నాటకాలు ప్రదర్శింపబడకపోవచ్చు. ఫరవాలేదు. వాటిని జనం హడావిడిగా చూసి అపార్థం చేసుకోవడంకన్న, అవే కథలను పుస్తకాలుగా నెమ్మదిగా చదువుకోవడమే మంచిది." చదివేటప్పుడు పుస్తకాన్ని అర్థం చేసుకోవడానికి పాఠకునికి కావలసినంత సమయం దొరుకుతుంది. నాటకాన్ని చూడటంలో ఆ అవకాశం లభించదు.

రాజ సేవలో తరించాలని ప్రయత్నించి విఫలమైన సెర్వాంటెస్ ఒక కథలో తన విరక్తిని ఇలా ప్రదర్శిస్తాడు. "రాజోద్యోగినయ్యే అర్హత నాకు లేదు. అవును. భట్రాజు పొగడ్తలు నాకు చేతకాదు మరి."

ఆనాటి ప్రజారంజకమైన కార్డ్‌బోర్డ్ పాత్రల నాటకాలకు భిన్నంగా, పగటి కలలకూ, వాస్తవానికీ లేదా భ్రమకూ వాస్తవానికీ ఉన్న తేడానే ప్రధానాంశంగా నాటకాలు రాశాడు సెర్వాంటెస్. డాన్ కిహోటీలోనూ ఇంచుమించు ఇదే ఇతివృత్తం మనకు మరింత పరిపూర్ణంగా, మరింత విస్తృతంగా దర్శనమిస్తుంది. నాటకంలో అంతర్నాటకంలా ఇందులో కూడా పాత్రలు తమ జీవిత గమనాన్ని తామే నిర్ణయించుటారు. ధనవంతులను, రాజవంశీకులను పెళ్లి చేసుకొని సొసైటీ లేడీస్‌గా గుర్తింపబడాలనుకునే మహిళలు, ఎలాగైనా ధనిక మహిళలను పెళ్లి చేసుకొని కోట్లకు పడగెత్తాలనుకొనే నిరుపేద యువకులు – అందరూ భ్రమల్లో బతికే అమాయకులే సెర్వాంటెస్ నాటకాల్లో దర్శనమిస్తారు. ఆ నాటకాలు కేవలం వినోదం కాదు. మిమ్మల్ని కలల లోకంలో విహరింప చేయవు. మీ భ్రమలను తొలగించి, కళ్లు తెరిపిస్తాయి. అవి విజయం సాధించకపోవడానికి కూడా కారణం ఇదే.

లోప్ డివెగా మీద పరుషమైన వ్యాఖ్యలు చేయటానికి ముందుదాకా సెర్వాంటెస్‌కు మంచి రచయితగా కొద్దో–గొప్పో పేరు లేకపోలేదు. తిండికి కూడా కరువు లేదు. అప్పుడే ఆనా ఫ్రాంకా డి రోహోస్ అనబడే అమ్మాయితో ప్రేమలో పడి ఒక కూతుర్ని కూడా కన్నాడు. అయితే ఆమెకప్పటికే పెళ్లైంది. అయినా ఆ భర్త ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదు.

ముందు జాగ్రత్తగా ఎస్క్వివియాస్‌కు వెళ్లి, కొన్నాళ్లు తర్వాత కాటలినా డిసాలజార్‌నై పటేషియో వోజెస్ మెడితానో అనే మరో మహిళను హడావిడిగా పెళ్లి చేసుకున్నాడు సెర్వాంటెస్. ఊహించని, చిత్రవిచిత్రమైన మలుపులు తిరిగేదే నాటకం. సెర్వాంటెస్ జీవితం కూడా నాటకానికేమీ తీసిపోదు.

**లాగలాటియా**

ఎస్క్వివాస్ చిన్న ఊరే. కాలక్రమంలో నగరాల్లో జరిగిన అభివృద్ధి అక్కడ కనిపించదు. సెర్వాంటెస్ ఇదివరలో అక్కడికి చాలాసార్లు వచ్చాడు. కాని ఈసారి అతడిలోని కవికి కొత్తగా కనిపించింది. డాన్ కిహోటీ కథాస్థలానికి ప్రేరణ అదే. "నాకు గుర్తురావటం లేదుగాని లామాంకాలోని ఒకచోట..." అంటూ ప్రారంభమవుతుంది ఆ పుస్తకం. తన జ్ఞాపకాలలో పదిలంగా దాచుకున్న ఎస్క్వివాస్ గురించిన చేసిన ప్రస్తావన అది. సుమారు 180 కుటుంబాలు ఉంటాయక్కడ. ఒకసారి పెళ్లికి వెళ్లినప్పుడు సెర్వాంటెస్‌కు Quijana అనబడే వ్యక్తితో పరిచయమైంది. అలా Quixote సాహిత్యంలోకి ప్రవేశించాడు.

సెప్టెంబర్ 22 నాటి సెర్వాంటెస్ అతని మిత్రులూ గ్రామంలోని మద్యశాలలో కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు

ఫెర్నాండో డి సాలజాల్ వోమ్ మెడియానోతో స్నేహం కలిసింది. ఆ తర్వాత ఏం జరిగిందోగాని రెండున్నర నెలలకే (డిసెంబర్ 12 నాడు) ఆయన కూతురు డోనా కాటలీనాను వివాహం చేసుకున్నాడు సెర్వాంటెస్. కాటలీనా సంపన్నురాలు కాకపోయినప్పటికీ, అనేక ఎకరాల ఆలివ్ చెట్లు, ద్రాక్షతోటలూ ఆమెకు వారసత్వంగా లభించాయి. తొలిసారి మాడ్రిడ్ వెళ్లిననాటి నుండీ సమాజంలో పెద్దమనిషి అనిపించుకోవాలనే కోరిక బలంగా నాటుకుపోయింది సెర్వాంటెస్‌లో. కాటలినాతో పెళ్లితో అది సాధ్యమైంది. గ్రామీణ జీవితంలో కొత్త ప్రేమకథ ప్రారంభమైంది.

సెర్వాంటెస్ వెంటనే కాటలినా ఇంటికి మారి, అక్కడ ఇంటి పెద్ద అనిపించుకున్నాడు. నగర జీవితానికి అలవాటుపడ్డవాళ్లు చిన్న ఊళ్లలో అంత సుఖంగా బతకలేరు. కాని అక్కడ కొన్ని ఆకర్షణలుంటాయి. ఊరి మధ్యలో ఉంది కాటలినా ఇల్లు. ఇంటెదురుగా చర్చి ఉంది. ఇంటి వెనక తోటలో నుండి ఒక కాలువ ప్రవహిస్తుంది. కిటికీల్లో నుండి కొండలూ, వాటి మీద పెరిగిన ఆలివ్ చెట్లూ కనిపిస్తాయి. తమ ద్రాక్షల నుండి తీసిన వైను భలే రుచిగా ఉంటుంది. మాడ్రిడ్‌లో నిత్యం సహరచయితలతో కలహాలే. ఒకరంటే ఒకరికి అసూయ. ఆడ పొందు కోసం కక్కుర్తి పడి ఒక సత్రం యజమాని భార్యతో పెట్టుకొని, ఆడపిల్లను కని, తలెత్తుకోలేక, ఊరి విడిచి వచ్చాడు. ఇక్కడెంత హాయిగా ఉంది. పరువుగా, అందమైన భార్యతో గడపవచ్చు. కుటుంబ పోషణా బాధ్యత లేదు. అయితేఈ కలలన్నింటికీ త్వరలోనే అడ్డుపడింది. కాటలినాను చేసుకోవటమే పెద్ద పొరబాటు అనే దశకు చేరుకున్నాడు. పదకొండెకరాల భూమి తనదైంతంటే అది పెద్ద కట్నమే. కాటలినా, తన తల్లినీ, ఇద్దరు తమ్ముళ్లనూ ఇంట్లో ఉండమని ఆహ్వానించింది. ఇటీవలే మరణించిన ఆమె తండ్రికి చేసిన అప్పులు భూమి ధరకన్న ఎన్నో రెట్లు ఎక్కువున్నాయి. ఇప్పుడవన్నీ తీర్చవలసిన బాధ్యత సెర్వాంటెస్‌దే. ఆలివ్ చెట్లు, ద్రాక్ష తోటలో నుండి ఆశించినంత రాబడి రాలేదు. అన్నింటికీ మించి కాటలినాకు సంతానం కలగలేదు. జీవితం నిస్సారమనిపించింది. అయితే సాహిత్య పరంగా సెర్వాంటెస్ ఊహించని విజయం సాధించాడు.

పాస్టొరల్ (గ్రామీణ నేపథ్యంలో, కవిత్వపరంగా రాసిన ప్రేమకథలు)కు జనాదరణ పెరుగుతున్న రోజులవి. నగరాల్లో జరిగే మోసాలు, అధికారులను, ప్రసన్నం చేసుకోవడానికి వారికి దాసానుదాసుల్లాగా నటించటం, ప్రతిదానికీ పక్కవాడితో పోటీపడటం, ఆత్మన్యూనతను పెంచే జీవనసరళి గ్రామాల్లో ఉండదు. ముఖ్యంగా భూస్వాముల దాష్టీకం నుండి దూరంగా ఉండొచ్చు – ఎవరూ తమను దోచుకోవడం లేదన్న భావన ఎంత తృప్తిగా ఉంటుంది!

రాజుల కొలువుల పట్ల ప్రజలకు పెరిగిన వైనమే ముఖ్యం. పాస్టొరల్స్ పట్ల ఆసక్తిని పెంచింది. గ్రామాల్లో కష్టపడి పనిచేసుకోకుండా, బద్ధకం పెంచుకొని, మాడ్రిడ్‌కు వచ్చి, అధికారుల ముందు ఉద్యోగం కోసం చేతులు కట్టుకొని నిల్చునే తత్వం తగ్గించాలన్న ప్రభుత్వ వ్యూహం కూడా పాస్టొరల్స్ పుంఖానుపుంఖంగా రావటానికి దోహదం చేసింది. అన్ని కథల్లోనూ ఒకే ఇతివృత్తం. నగరాల్లో అవినీతి ఉంటుంది. గ్రామాల్లో, పచ్చని చేల మధ్య నిజాయితీపరులైన రైతులు, శ్రామికులుంటారు. అదొక భూతల స్వర్గం. ఈ పాస్టొరల్స్‌ను ప్రోత్సహించటానికి ప్రభుత్వానికి మరో కారణం కూడా లేకపోలేదు. స్పెయిన్ పతనావస్థలో ఉంది. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయింది. ప్రజల్లో అసంతృప్తి పెరగకుండా ఉండాలంటే "గతమొక స్వర్ణయుగం. ప్రభుత్వం మీద ఆధారపడకుండా వ్యవసాయం చేసుకోవటమే ఉత్తమ జీవితం" అన్న భావనను ప్రజల్లో పెంచాలి.

''చరిత్ర ఉన్న ప్రతి సంస్కృతికీ ఒక ఊహాస్వర్గముంటుంది. ఒక స్వర్ణయుగముంటుంది'' అంటాడు జర్మన్ కవి షిల్లర్. "గతమెంతో ఘనకీర్తి" అంటూ ప్రభుత్వాలు, అధికారవర్గాలు ఉష్ణ పక్షుల్లా మారారంటే ఆ దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉన్నదన్నట్టే. "ప్రకృతి ఆరాధనే దైవారాధన" అన్నారు రెనాసాన్స్ కాలంనాటి కవులు. "వర్జిల్, డేవిడ్‌లాంటి ప్రాచీన కవులనే అధ్యయనం చేయాలి. వాళ్లే నిజమైన కవులు. వర్తమాన కవులు రాసేది కవిత్వమే కాదు." వాస్తవమైన గతాన్ని విస్మరించి దాన్నో ఆదర్శవంతమైన ఊహాలోకంగా ప్రచారం చేశారు సాహిత్య పీఠాధిపతులు. స్పెయిన్‌లో సాహస గాథల మీద మోజు తగ్గిన తర్వాత పాస్టొరల్, నవలలు జనాన్ని

ఆకట్టుకున్నాయి. వీటితో పాటే పికారెస్క్ (జులాయిలు, రోగ్స్ చేసే సరదా సాహస కృత్యాలు) నవలలకూ ఆదరణ పెరిగింది. నిజానికి పాస్టొరల్స్‌కివి పూర్తి విరుద్ధం. ఆదర్శ ప్రేమికుల్నీ, అందర్నీ మోసగించి కాలర్ ఎగరేసుకునే దుర్మార్గుల్ని కూడా ఇష్టపడ్డారు జనం. నిజానికి, స్పానిష్ సమాజంలో వస్తున్న మార్పులను ఈ రెండు రకాల నవలలూ ప్రతిబింబించాయి. ప్రభుత్వం బలహీనపడి, ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని, అవినీతి రాజ్యమేలుతున్నప్పుడు, ప్రజలు తక్షణ వినోదం కోసం ఈ సాహిత్య ప్రక్రియలను ఆశ్రయించారు.

సహజంగానే సెర్వాంటెస్ కూడా తన ప్రయత్నంగా ఒక పాస్టొరల్ రాయాలనుకొన్నాడు. కవిత్వం రాసి ప్రచురించాలనే కోరిక కూడా బలంగా నాటుకుంది. లాగూటియా రాయాల్సిందే. తన కష్టాలు తీరే మార్గం అదొక్కటే. *పిరికివాళ్లు, భయస్తులు సాహసగాథలను ఇష్టపడతారు. ప్రేమరాహిత్యంలో ఉన్నవాళ్లే ప్రేమకథలు కావాలంటారు. జీవిత పోరాట పటిమ తగ్గినవాళ్లే గత వైభవాన్ని నెమరేసుకుంటారు.*

లాగలాటియాలోని కథానాయకకుడు లాసో సెర్వాంటెస్‌కు ప్రతిరూపమే. కథానాయిక సిలేనా.

సిలేనాను గాఢంగా ప్రేమిస్తాడు లాసో. కానీ తన ప్రేమను వ్యక్తం చేయలేడు. "నిజ జీవితంలో నేను ఇష్టపడిన ఒక యువతిలాగే ఉన్నావు నువ్వు" అంటాడొకసారి. అలాంటి పిచ్చి మాటలకామె కోపం తెచ్చుకొంటుందేమోనని భయపెడతారు మిత్రులు. ఇలా డొంక తిరుగుడుగా చెప్పటం సాంప్రదాయిక సాహస గాథల్లో కూడా ఉంటుంది. స్వర్ణయుగాన్ని నమ్మకపోయినా, సాహస పరాక్రమాలు, దుష్టశిక్షణ చేసే వీరులు అన్ని కాలాల్లోనూ ఉంటారని విశ్వసించాడు సెర్వాంటెస్.

లాగలాటియాలో నాయికానాయకులు మారువేషాల్లో కనిపించటం ఒక ప్రత్యేకత. లాసో ఎవరు? అతను స్పెయిన్ ఒక్కటే కాదు. ఏషియా, యూరోప్‌లను కూడా చుట్టి వచ్చాడు. అందువల్ల అతని ప్రేయసి (ఆమె గొర్రెల కాపరి) విదేశీయురాలై కూడా ఉండవచ్చు. లాసో ఎవర్ని ప్రేమిస్తున్నాడు? నిజజీవితంలో తారసపడ్డ యువతినా? ఆమెను తలపించే మరో సుందరినా? గొర్రెల కాపరి పేరు సిలెనా కాదు. మరి ఆమెను ఆ పేరుతో ఎందుకు పిలుస్తున్నాడు? ఆమెకీ విషయం అర్థమవుతుందా? ఇదంతా ప్రేమ మిస్టరీ. ఎంత చెప్పుకున్నా లాగలాటియా, సెర్వాంటెస్ రాయబోతున్న మాస్టర్‌పీస్‌కు రిహార్సల్‌లాంటిదే. ఇలాంటి ఒక ప్రేమకథ డాన్ కిహోటీలో కూడా ఉంటుంది. కథానాయకుడు డల్సినియా ఆఫ్ టొబాసో అనబడే ఊహాసుందరిని ప్రేమిస్తాడు. చూసి, పరిచయం చేసుకొని ఇష్టపడటం కాదు. ఆమె రూపాన్ని మనసులో ప్రతిష్టించుకొని, తన సాహస కార్యాలన్నింటినీ ఆమెకే అంకితమయ్యాయి. ఇంతా చేస్తే, టొబాసో ఒక కుగ్రామం. అక్కడుంటున్న డల్సినియా అనబడే స్త్రీ ఒక పేదరాలు. గుండ్రటి మొహం. చప్పిడి ముక్కు. తొలిసారి ఆ జగదేక సుందరిని చూసిన డాన్ కిహోటీ తన అదృష్టానికి మురిసిపోతాడు. ఉద్వేగంతో మాట కూడా రాదు. అప్పుడు సాంకోపాంజా కల్పించుకొని "పరమ సాహసవీరుడు నీ వీరుడు నీ ముందు మోకరిల్లుతున్నాడు. ఇకనైనా కరుణించు" అని డల్సినియాను వేడుకుంటాడు. పొలం పనులు చేసుకుంటున్న డల్సినియా, డాన్ కిహోటీలాంటి వింత మనిషిని చూసి బిత్తరపోతుంది. కాయకష్టం చేసుకొని బతకటమే తప్ప, ఈ ప్రేమలూ, సాహసకార్యాలూ, నాటకీయమైన డైలాగులూ ఆమెకు తెలియవు. ఈ అభూత కల్పనలూ, కృతక ప్రవర్తనా పతనమవుతున్న, దివాళా తీసిన స్పానిష్ సమాజానికి సంకేతం. వాస్తవం దుర్భరంగా ఉన్నప్పుడు పగటి కలల్లో ఊహించటం మానవ సహజం. సంపన్నులెప్పుడూ బాగానే ఉంటారు. వాళ్ల జీవిత సరళిని అనుసరించాలని తాపత్రయపడుతుంటారు పేదలు. వివాహాలలో, మత సంకారం కాకూడదు. అందరూ పవిత్రంగా, క్రిస్టియన్లులాగానే బతకాలి అన్న ఆదర్శాన్ని ప్రచారం చేసింది స్పానిష్ ప్రభుత్వం. యూదులనో, ఇతర మతస్తులనో ప్రేమించిన యువతీయువకులేం చేయాలి మరి? కనీసం పగటి కలల్లోనైనా అందరూ తమ మతంవాళ్లే అనుకొని తృప్తిపడాలి. డాన్ కిహోటీకు ఈ భ్రమ, వాస్తవం మధ్య జీవితం గడిచింది. దుష్టసంహారానికి అశక్తుడై, గాలిమరలనే శత్రువులుగా ఊహించుకున్నాడు. *మనం ఆచరణలో పెట్టలేనివే ఆదర్శాలు.*

1585లో కాటలినాను వివాహం చేసుకున్న సెర్వాంటెస్ తన తలిదండ్రులను చూపించటానికి ఆమెను

మాడ్రిడ్‌కు తీసుకొచ్చాడు. ఇంట్లో ఆమె అందరికీ నచ్చింది. కాటలినా తల్లి, తన భూములు చూసుకొనే అల్లుడు దొరికినందుకు మురిసిపోయింది. ఆలస్యంగానైనా సెర్వాంటెస్ జీవితానికో లంగరు దొరికినట్లనిపించింది. తనిప్పుడు భూస్వామి. ఇక ఆలివ్‌లకూ, ఇతర పళ్లకూ కొదవ లేదు. కలలు బాగానే ఉన్నాయి. అతడి జీవితంలో ఎప్పుడైనా ఆశలు నెరవేరిన సందర్భం ఉందా!

ఆర్థికంగా స్థిరపడ్డాడు గాని, సాహిత్య జీవితానికి ముప్పు వాటిల్లే ప్రమాదముంది. మాడ్రిడ్‌లోని రచయితలు, ప్రింటర్లతో సంబంధాలింకా కొనసాగుతున్నాయి. ఆ సంవత్సరం ఫిబ్రవరిలో *The confusion, The seige of consantinople* పుస్తకాలు ప్రచురణకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మరో రెండు నెలల తర్వాత ఏప్రిల్‌లో లాగలాటియా ప్రచురితమై పాఠకుల్ని బాగా ఆకర్షించింది. అది కీర్తి.

స్పెయిన్‌లోని ఉత్తమ రచయితల్లో ఒకడిగా గుర్తింపు వచ్చింది. రచయితలకు మంచి పేరు రావటం సులభమే. డబ్బు సంపాదించటమే కష్టం. తరచూ అసాధ్యం. లాగూటియా మొదటిసారి కేవలం అయిదువందల ప్రతులు అచ్చేశారు. ఆ తర్వాత అతడి జీవితకాలంలో మరో రెండుసార్లు మాత్రమే ప్రచురించబడింది. అయితే దీనివల్ల రచయితకేమీ లాభం కలగలేదు. అప్పటికే డాన్ కిహోటీతో ఆయన పేరు యురోపియన్ దేశాలలో పాఠకులకు సుపరిచితమైంది. లాగలాటియాను ఇప్పటికీ ఎందుకు చదువుతారంటే ఇరవైఏళ్ల తర్వాత ఆయన తీసుకొచ్చిన సాహిత్య విప్లవానికి బీజాలందులో ఉన్నాయి.

సెర్వాంటెస్ జీవితం చివరిదాకా ఆర్థిక సమస్యలతో, కష్టాలతో ముడిపడి ఉంది. మళ్లీ అప్పులు చేశాడు. ఇంటి దగ్గర ఉండి సంపాదించలేడు. భార్య వల్ల తనకు సంక్రమించిన ఆలివ్‌లు ఇతర చెట్ల ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. భూములను తిరిగి భార్యపేర రిజిస్టర్ చేయించి ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాడు. సెర్వాంటెస్‌కు ఉద్యోగమంటే సైన్యంలో చేరటమే. తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సెవిల్ నగరానికి బయలుదేరాడు.

**మాటకారులు, నయవంచకులు, ధూర్తులు... రోగ్స్**

పదహారవ శతాబ్ది స్పెయిన్‌లో గ్రామాల నుండి పెద్ద నగరాలకు వలసలు బాగా పెరిగాయి. నేరాల సంఖ్య కూడా అనూహ్యంగా పెరిగి రక్షణా యంత్రాంగానికి సవాల్ విసిరింది. మాడ్రిడ్, సెవిల్ వంటి నగరాల్లో దొంగలు, మోసగాళ్లు కాపలా కాచి మరీ కొత్తవాళ్లను నిలువు దోపిడీ చేశారు. పోలీసుల కళ్లుగప్పి లేదా పోలీసుల సహకారంతో జూదశాలలు, వ్యభిచార గృహాలు ఎక్కడపడితే అక్కడే దర్శనమిచ్చాయి. అయితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోలేదు. చట్టాలను సవరించి, కొత్త చట్టాలు చేసి నేరస్తులకు కఠిన శిక్షలు విధించ సంకల్పించింది. ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు శిక్షలు విధిస్తానంటే కోర్టులు చూస్తూ ఊరుకొంటాయా, లిటిగేషన్లు పెరిగాయి. అయినప్పటికీ వీలు దొరికితే చాలు, క్రూరాతి క్రూరమైన శిక్షలు విధించింది ప్రభుత్వం. చంపనక్కర్లేదు. ఆ బాధ భరించలేక నేరస్తుడే ప్రాణం విడుస్తాడు. హింసను ఓర్చుకోగలిగినవాడు నేరస్తుడు కాదని ఆనాటి విశ్వాసం.

నేరస్తులు తమ కథలు చెప్పుకోవటమే పికారెస్క్ నవల (పికారో అంటే రోగ్). ఈ రకమైన నవలా ప్రక్రియకు అది స్వర్ణయుగం. సామాన్య పాఠకులు తాము చేయలేని సాహసాలు మరొకరు చేసినందుకు సంతోషించారు.

తడిగా ఉన్న చీకటి జైలు గదిలో దిగాలుగా కూర్చున్నాడు సెర్వాంటెస్. నూనె దీపాల పొగతో ఊపిరి సలపక దగ్గొస్తున్నది. శిక్షలు అనుభవిస్తున్న మరికొంతమంది ఖైదీలు కూడా ఉన్నారా గదిలో. 1597–1598 మధ్య ఆరు నెలలపాటు సెర్వాంటెస్ ఆ గదిలో, వాళ్ల మధ్య గడిపారు. వాళ్ల అనుభవాలు విన్నాడు. వాళ్లకు సమాజం ఎలా కనిపిస్తున్నదో తెలుసుకొన్నాడు. అధికారాలను దుర్వినియోగం చేస్తున్నందన్నప్పుడల్లా, చర్చి ప్రతిఘటించటం కూడా సర్వసాధారణమే. ఈ విషయాన్నే సెర్వాంటెస్ డాన్ కిహోటీలో ఒక హాస్య సంఘటనగా వర్ణిస్తాడు. ప్రేతాన్ని చూశానన్న భ్రమలో డాన్ కిహోటీ ఒక ప్రీస్టు మీద దాడి చేస్తాడు. “నా పవిత్ర శరీరం మీదే చెయ్యేస్తావా, మూర్ఖుడా?” అంటూ ప్రీస్టు అతణ్ణి తక్షణమే వెలివేస్తాడు. “స్వామీ, నేను మిమ్మల్ని ముట్టుకొనైనా లేదు. నా శూలం మిమ్మల్ని తాకింది” అంటాడు డాన్ కిహోటీ వినయంగా.

ధాన్యం సేకరణ విషయంలోనే కార్డోబాలో మరోసారి సెర్వాసెంటెస్‌ను వెలివేస్తుంది చర్చి. కాని రెండుసార్లూ,

కొద్ది రోజుల్లోనే తిరిగి తమ చర్చిలో సభ్యుడిగా చేర్చుకుంటారు. అయితే మత పరంగా ఆయనకు క్షమాభిక్ష లభించిందేమోగాని, ఉద్యోగ నిర్వహణలో అవినీతికి పాల్పడ్డాడనే అభియోగంతో ప్రభుత్వం అతడికి జైలు శిక్ష విధించింది. తను నిజాయితీ గల వ్యక్తిననీ, ఏ నేరం చేయలేదనీ పెట్టుకొన్న అర్జీలను బుట్టదాఖలు చేశారు అధికారులు.

చెయ్యని నేరాలకు శిక్షలనుభవించి, అవమానాలు మూటగట్టుకోవడంవల్లనేమో సెర్వాంటెస్ పాత్రలందరూ బహిష్కృతులు, పరాజితులే. మంచి చేయాలనుకొంటారు. కానీ అది బెడిసికొడుతుంది. హీరోలమనుకొని నవ్వులపాలనవుతారు. “మంచివాళ్లే మూర్ఖులు” అన్నది జీవితం సెర్వాంటెస్‌కు నేర్పిన పాఠం.

1593లో సెర్వాంటెస్ తల్లి లియొనార్ మరణించింది. మరికొన్నాళ్లకే భార్య కాటలినా అంకుల్ (తమిద్దరికీ పెళ్లి జరిపించిందీయనే) కూడా కాలం చేశారు. సెర్వాంటెస్ ఉద్యోగాలు చేస్తూ ఊళ్లు తిరుగుతున్నప్పుడు ఈయనే భూముల వ్యవహారాలు చూశాక, 1594లో యుద్ధ ప్రయత్నాల నుండి విరమించిన స్పానిష్ ప్రభుత్వం సైనికులను ఇళ్లకు పొమ్మంది. ఏడేళ్లు ఉద్యోగం చేసినా పైసా కూడా వెనకేసుకోలేకపోయాడు సెర్వాంటెస్. ఆయన చేసిన యుద్ధాలన్నీ, అవినీతిపరుడిగా తన మీద వచ్చిన ఆరోపణలను తొలగించుకోవడానికి చేసిన ప్రయత్నాలే.

ఇంత జరిగినా సెర్వాంటెస్‌కు రాజుగారి సేవలో తరించాలనే కోరిక ఇంకా తీరలేదు. ఈసారి టాక్స్ కలెక్టర్‌గా కొత్త నౌకరీ ప్రారంభించాడు. గ్రానడాలోని ఆండలూసియా వెళ్లి పన్నులు వసూలు చేయాలి. టాక్స్ కలెక్టర్లను అప్పుడూ ఇప్పుడూ కూడా అందరూ అసహ్యించుకుంటారు. అయినా రెండు మిలియన్ స్పానిష్ కరెన్సీని వసూలు చేసి ఆ డబ్బుకు బదులుగా సెవిల్‌లోని ఒక బ్యాంకర్ వద్ద లెటర్ ఆఫ్ క్రెడిట్ తీసుకొన్నాడు. ఇప్పుడు డబ్బు మోసుకు తిరిగే బాధ తప్పింది. కాని సెర్వాంటెస్ జీవితంలో ఏదీ అనుకున్నట్లుగా జరగలేదు. మాడ్రిడ్ చేరాడో లేదో డిపాజిటర్ల డబ్బుతో బ్యాంకర్ పారిపోయాడని తెలిసింది. కాని సెవిల్‌లోని డిపాజిటర్లు, అతణ్ణి పట్టుకొని బడితపూజ చేసి వీలైనంత లాక్కున్నారు. ఆ డబ్బు మీద ప్రభుత్వానికి మొదటి అధికారం ఉంటుందని అధికారులకు లేఖ రాశాడు సెర్వాంటెస్. చట్టపరమైన చర్యల సంగతి ఎలా ఉన్నా సెప్టెంబర్ 1597లో సెర్వాంటెస్‌ను సెవిల్‌లోని రాయల్ ప్రిజన్‌లో వేశాడు. అక్కడ దొంగలు, నిలువు దోపిడీ చేసేవాళ్లు, హంతకులే అతని సహచరులను ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. అల్జీర్స్‌లో తను గడిపిన ఖైదీల కొట్టానికీ, దీనికీ ఏమీ తేడా లేదు. పేరుకే జైలుగాని అదో నల్లబజారు. డబ్బుంటే దేనికీ లోటుండదు. అరుపులు, కేకలు, ముష్టియుద్ధాలు, జూదం, నిషేధిత వస్తువులకు అత్యధిక ధరలకు అమ్మటం, వ్యభిచారం – ఇలా దేనికీ లోటు లేదు.

1598లో జైలు నుండి విడుదలైనప్పటికీ, సెర్వాంటెస్ పూర్తిగా మారిపోయాడు. అధికారిక సమాచారం లేదుగాని డాన్ కిహోటీ బహుశా అక్కడే ప్రారంభమై ఉంటుంది. దీనితో పాటు Exemplery Novels పేరిటి కొన్ని కథలు కూడా రాశాడు. జైలులో రచన ప్రారంభమైందా లేదా అని జైలు అనుభవాలు ఆ వ్యక్తులు డాన్ కిహోటీలో పాత్రలుగా మారారు. వాళ్ల దృష్టి కోణం నుండి ఈ నాగరిక సమాజం ఎలా కనిపిస్తుందో అనన్య సామాన్యంగా చిత్రించాడు సెర్వాంటెస్. ఇదొక్కటే కాదు. స్పానిష్ సమాజం పట్ల, స్పానిష్ రాచరికం పట్లా అతడికి ఏమాత్రం గౌరవం లేదు. అవినీతి, దోపిడీ ప్రారంభమయ్యేది అధికార వర్గాల మధ్యనే. అటువంటప్పుడు ఒకరో ఇరువురో నేరస్తులను శిక్షిస్తే సమాజంలో మార్పు ఎలా వస్తుంది?

అప్పటికే పాఠకుల్ని బాగా ఆకట్టుకుంటున్న పికారెస్క్ నవలలతో ప్రభావితుడైనప్పటికీ, సెర్వాంటెస్ ఆ ప్రక్రియను తన అనుభవాలనూ, జీవితం పట్ల తనకున్న దృక్పథాన్నీ చెప్పటానికి అత్యంత ప్రతిభావంతంగా ఉపయోగించాడు. స్పానిష్ ప్రభుత్వం ఎలాంటిదైనా, దాన్నెప్పుడూ ధిక్కరించలేదు. పైగా రాజభక్తుడిగానే జీవితం గడపాలనుకున్నాడు. కాని ప్రభుత్వాన్ని నమ్ముకున్న ప్రతిసారీ తనకు ఆశాభంగమే మిగిలింది. ఉద్యోగమిచ్చారుగాని జీతమివ్వలేదు. యుద్ధాల్లో ప్రాణాలొడ్డి పోరాడాడు. వికలాంగుడయ్యాడు. కానీ తన ఉనికినే వాళ్లు గుర్తించలేదు. ప్రభుత్వం దృష్టిలో సైనికులకూ, జంతువులకూ పెద్ద తేడా లేదు కాబోలు. ప్రభుత్వం చాలా దుర్మార్గమైంది. చట్టబద్ధంగా బతికాడు. జైలులో ఉన్నప్పుడు చట్టాన్ని ఉల్లంఘించిన నేరస్తులతో గడిపాడు. తనకున్న విస్తారమైన

రంగస్థలానుభవంతో అధికారవర్గాలు కల్పించిన భ్రమల్లో బతికున్న వాళ్ల జీవితాలను విశ్లేషించాలనుకొన్నాడు. సమాజ నియమాలను ఉల్లంఘించినవాళ్లకు పికారో అని పేరు పెట్టి పాఠకుల్ని పగటి కలల్లో విహరింపజేశాడు.

ఈ పద్ధతి మార్చటం తన బాధ్యతగా తీసుకొన్నాడు సెర్వాంటెస్. డాన్ కిహోటీకు ముందు ఒకచోట ఇలా రాశాడు. ఫిక్షన్ వాస్తవమా, కల్పనా అని కోడిగుడ్డు మీద ఈకలేరుకుంటూ ఉండకూడదు. ఒకవేళ అది నిజంగా జరిగివుంటే మనం ఎలా స్పందిస్తాం అని ఆలోచించాలి. మనమో, మనలాంటివాళ్లో లోకాన్ని ఊహించుకున్న తీరది. ఎవరూ ఎలా రాసినా వాళ్లు తమ చుట్టూ ఉన్న లోకాన్ని అలా ఊహించుకున్నారన్నమాట. ఫిక్షన్ చెప్పే నిజాలు నిరూపించగలిగినవి కాదు. అవి Subjetire Truths. కాని ఇది ఎలా సాధ్యం? చదువుకున్నంతసేపైనా కథ నిజంగా జరుగుతున్నదని నమ్మితేనేకదా! సెర్వాంటెస్ తను కనిపెట్టిన నూతన ప్రక్రియతో లోకాన్ని రచయిత దృష్టితో చూడమని ఆహ్వానిస్తున్నాడు. స్పానిష్ రాజ్య వ్యవస్థ ఎలా కుళ్లి, లుకలుకలాడుతున్నదో పాఠకులు సులభంగానే తెలుసుకున్నారు. గొప్ప సాహితీకారుడు, ఫాసిస్టు భావాలున్న సెర్వాంటెస్ ఇలాంటి కథ రాయటం ఆశ్చర్యం కొలిపే విషయమే. ఆధునిక స్పెయిన్‌లో నిరంకుశ ప్రభువు ఫ్రాన్సిస్కో ఫ్రాంకోకు సన్నిహితుడైన ఎర్నెస్టో జిమినెజ్ కబాలెరో రాసిన ఒక పుస్తకంలో "మేథోపరంగా స్పానిష్ సామ్రాజ్యాన్ని కూల్చటానికి సెర్వాంటెస్ చేసిన ప్రయత్నమే డాన్ కిహోటీ" అని రాశాడు.

1598లో జైలు నుండి విడుదలైన సెర్వాంటెస్, సెవిల్‌లో ఉన్నప్పుడే తన మాస్టర్‌పీస్ మీద దృష్టి ప్రారంభించాడు. 1600లో వచ్చిన ప్లేగు మహమ్మారి సెవిల్‌లో ఎనిమిదివేల మందిని బలి తీసుకుంది. కాని అంతకన్నా విషాదకరమైన మరొక వార్త విన్నాడు సెర్వాంటెస్. తమ్ముడు ఫ్లాండర్స్‌లో యుద్ధం చేస్తూ నేలకొరిగాడు.

అనేక ఇతర విషాదాలు, కుటుంబ వ్యవహారాల మధ్య రచన కొనసాగింది. ఇరవైఏళ్ల క్రితం లాగలాటీ ప్రచురించిన ఫ్రానిస్కో డి రోబ్లెస్‌కు 1604లో డాన్ కిహోటీ వ్రాతప్రతిని అందచేశాడు సెర్వాంటెస్.

* * *

**కథాజగతి**

1995లో యునెస్కో ఏప్రిల్ 23ను అంతర్జాతీయ పుస్తక దినోత్సవంగా ప్రకటించింది. దీనికో ప్రధాన కారణం 1616లో ప్రపంచ సాహిత్య చరిత్రలో అజరామరులైన ఇద్దరు రచయితల మరణాలే – విలియం షేక్స్‌పియర్, మిగ్వెల్ జిసెర్వాంటెస్‌లు ఏప్రిల్ 23 నాడే మరణించారంటారుగాని అది నిజం కాదు. షేక్స్‌పియర్ మరో పది రోజుల తర్వాత మరణించాడు. సెర్వాంటెస్ ఒకరోజు ముందు మరణించి ఉంటాడు, ఒకరోజు తర్వాత అతణ్ణి సమాధి చేశారు. పుస్తక దినోత్సవమంటే ఫిక్షన్ దినోత్సవమే. ఫిక్షన్ రచయితలను / రచయిత్రులను గుర్తు చేసుకోవటమే. వాస్తవాలు కాని వాస్తవాలతో, చరిత్ర కాని చరిత్రలతో మనల్ని అలరించారు వాళ్లు. అబద్ధాల ద్వారా వాటి వెనక దాగిన నిజాల్ని ఆవిష్కరించిన మహానుభావులు వాళ్లు. రోజువారీ జీవితాలలో కూరుకుపోయిన సత్యాలతో మన జీవితాలలో వెలుగును పంచారు.

సెర్వాంటెస్, ఆయన సృష్టించిన, ప్రపంచ ప్రసిద్ధుడైన డాన్ కిహోటీ ఇద్దరూ వృద్ధాప్యంలో ప్రశాంతంగానే, కుటుంబ సభ్యుల మధ్య కళ్లు మూశారు. కాని మరణశయ్య మీద, డాన్ కిహోటీ తన కలల ప్రపంచాన్ని తిరస్కరించి కఠోర వాస్తవ జీవితాన్ని అంగీకరిస్తాడు. సెర్వాంటెస్‌కు ఆ సుఖం కూడా మిగల్లేదు. జీవిత చరమాంకంలో తన చివరి రచనలు ప్రారంభించిన ఈ మహానుభావుడు, డాన్ కిహోటీ ప్రచురణతో కీర్తి శిఖరాలను అధిరోహించినప్పటికీ, తన దుఃఖమయ జీవితంలో మార్పు రాలేదు. దుఃఖాన్ని మించిన అవమానాలవి. ఆరోగ్యం క్షీణించింది. మాడ్రిడ్‌లో సెటిలయ్యాడు. ఆర్థిక ఇబ్బందులూ, శారీరకమైన బాధలూ ఊపిరి సలపనివ్వలేదు.

పబ్లిషరు ఒత్తిడితో 1615లో డాన్ కిహోటీ రెండవ భాగం కూడా పూర్తి చేశాడు. ఒక మిత్రుని సహకారంతో తన నాటకాల సంకలనాన్ని కూడా అదే సంవత్సరం ప్రచురించాడు. అతి చవకబారు పేపరు మీద ప్రింటర్ ఆ పుస్తకాన్ని మార్కెట్లోకి తెచ్చినప్పటికీ, డాన్ కిహోటీకన్నా ఎక్కువ అమ్ముడు పోయిందా పుస్తకం. 1615 నవంబర్‌లో సెర్వాంటెస్ దంపతులు మరో పెద్ద భవంతిలో గ్రౌండు ఫ్లోర్‌కు మారారు. అదే ఆయన ఆఖరు నివాసం. చివరి అయిదు నెలలూ సెర్వాంటెస్ కిటికీ ప్రక్కనే కూర్చుని వీధిలో

పోతున్న తన మాజీ సహనటుల్నీ చూస్తూ, వాళ్లతో జోకులు వేస్తూ, నవలలోని కొన్ని భాగాలు చదివి వినిపిస్తూ గడిపాడు. గుండె జబ్బు ముదిరిందేమో, దాహం పెరిగింది. కాళ్లు గుర్తుపట్టలేనంతగా వాచిపోయాయి.

1616లో ఏప్రిల్ 18 నాడు సెర్వాంటెస్‌కు మతాచారం ప్రకారం వీడ్కోలు చెప్పారు భార్య కాటలినా. పనిమనిషి, మేనకోడలు, కాన్స్టాంజా, ఇసాబెల్‌లు ఆయన ప్రక్కనే ఉన్నారు. నొప్పి భరించలేని చివరి రోజుల్లో, తన చివరి నవల పెర్సైల్స్ & సిగ్నిస్మండా కు అంకితం రాశాడు. రచయిత మరణం తర్వాత ఏడాదికి ప్రచురితమైందీ పుస్తకం. "ప్రయోగానికి సిద్ధంగా, గుర్రం ఎక్కి సిద్ధంగా ఉన్నాను. మృత్యువు నా కళ్ల ముందు కరాళ నృత్యం చేస్తున్నది. నిన్న మావాళ్లు నాకు ఎక్స్ట్రీమ్ అంక్షన్ (తులసి తీర్థం) ఇచ్చారు. ఇవ్వాళ ఇది రాస్తున్నాను. ఆశ ఉడిగింది. కానీ చివరి క్షణం ద్వారా ఉత్సాహంగా బతుకుతాను" అంటాడు సెర్వాంటెస్ పెర్సైల్స్ & సిగిస్మండా అంకితంలో. కోరికలకూ వాస్తవానికీ మధ్య ఉన్న వైరుధ్యం. సెర్వాంటెస్ చివరి పుస్తకాలలో ఇదే కథావస్తువు. అసలతడి జీవితమంతా ఈ రెండింటి మధ్యా ఊగిసలాడటమే కదా! సెర్వాంటెస్ చివరి అంకితంలో కూడా ఇదే ప్రతిధ్వనించింది.

డాన్ కిహోటీ ఇంచుమించు ప్రపంచంలోని అన్ని భాషల్లోకీ అనువాదమయింది. నాలుగు వందల ఏళ్లలో అది ఎన్ని వందలసార్లు అచ్చయిందో లెక్కలేదు. బైబిల్ తర్వాత అత్యధికంగా అమ్ముడుపోయిన పుస్తకం ఇదే. పండిత పామర భేదం లేకుండా అందరూ దీన్ని చదువుతూనే ఉన్నారు. అయినప్పటికీ కీర్తికీ, అవమానాలకూ సంబంధం లేదు. సెర్వాంటెస్ చివరి రోజుల్లో జరిగిన ఒక విషాద సంఘటన ఇది.

1605 July 27 రాత్రికి తనుంటున్న పై అంతస్తు అపార్టుమెంటులో అరుపులు వినిపించాయి. పొరుగింటాయన, బైట ఎవరో యుద్ధం చేసుకుంటున్నట్లుగా కత్తులు చప్పుడు వినిపించిందని చెప్పాడు. సెర్వాంటెస్ పరిగెత్తుకొచ్చి చూస్తే ఒక వ్యక్తి రోడ్డు మీద పడి ఉన్నాడు. అందరూ కలిసి గాయపడ్డ ఆ మనిషిని ఇంట్లోకి తీసుకొచ్చారు. ఈ గొడవతో బిల్డింగ్‌లో ఉన్నవాళ్లంతా మేలుకొని అర్థం కానట్లుగా చూశారు. త్వరలోనే ఒక డాక్టరూ, ఒక ప్రీస్టూ వచ్చారు – ఒకరు గాయాలకు కట్టు కట్టటానికీ, మరొకరు పరలోకానికి ఆయన దారి సుగమం చేయటానికీ. గాయాలు లోతుగా తగిలాయి. అతడు బ్రతికే అవకాశం లేదు. తెల్లవారేసరికి క్షతగాత్రుడు మరణించాడు!

స్థానిక మేజిస్ట్రేట్‌గారొచ్చి బిల్డింగ్‌లో ఉన్నవాళ్లందర్నీ ప్రశ్నించాడు. ఒక వదరుబోతు ఆ వచ్చినవాళ్లందరూ సెర్వాంటెస్ అతిథులే అయి ఉంటారన్నాడు – అందరూ ఆడవాళ్లే. అంటే వ్యభిచారం రహస్యంగా కొనసాగుతుందేమో. సెర్వాంటెస్ కుటుంబాన్ని రెండు రోజులపాటు పోలీసులు అదుపులో ఉంచారు. సెర్వాంటెస్ పరువు పోయింది. తన సోదరీ, కూతురు కూడా దోషులే – జనం అలాగే అనుకుంటారు. నిజానిజాలు తెలుసుకోవడానికెవరూ ప్రయత్నించరు. సెర్వాంటెస్ కూతురు ఇసాబెల్ ఒక స్థానిక ప్రభుత్వోద్యోగికి ఉంపుడుకత్తెగా ఉన్నదని తేల్చాడు మేజిస్ట్రేట్.

పదిహేడవ శతాబ్ది ప్రారంభంలో ఒక వికలాంగుడు, జుత్తు నెరిసినవాడు, బోసినోటి మాజీ యుద్ధవీరుడు – ఓటోమాన్ సామ్రాజ్యంతో జరిగిన పోరులో ఇతనిది ప్రధాన పాత్ర ఒక బతికి చెడిన, వయసు మీదపడుతున్న వ్యక్తి గురించి ఒక నవల ప్రచురించాడు. సాహసగాథలు (షివల్రీ కథలు) చదవటంతో అతడి బుర్ర పాడైంది. తనూ పుస్తకాల్లోని సాహస వీరుడి (ఒక Knight errant) ననుకొన్నాడు. అలా ప్రారంభమవుతాయి కడుపుబ్బ నవ్వించే కథలు. ఈ పుస్తకం Don Quixote బైబిల్ కన్నా ఎక్కువ కాపీలమ్ముడుపోయింది. రచయిత మిగ్వెల్ డిసెర్వాంటెస్, ప్రపంచ చరిత్రలో పాఠకులు అత్యధికంగా చదివిన రచయిత ఇతడే. అయితే కేవలం ఒక బెస్ట్ సెల్లర్‌ను మాత్రమే ప్రచురించలేదు సెర్వాంటెస్. అతడొక కొత్త రచనా ప్రక్రియను ఆవిష్కరించాడు. 'ఫిక్షన్' అనబడే ఈ సరికొత్త ప్రక్రియను సెర్వాంటెస్ ఎలా కనుగొన్నాడో వివరిస్తుందీ పుస్తకం. ఈ నాలుగు వందల ఏళ్లలో ఫిక్షన్ ప్రపంచాన్నే మార్చివేసింది.

మి

ముక్తవరం పార్థసారథి - హైదరాబాద్. ఫోన్: 917 761 8708.

# అధివాస్తవికత
# (Surrealism)

**– టి.వి. ప్రసాద్**

ప్రపంచ యుద్ధాల ఫలితంగా చిత్ర, సాహిత్య రంగాల్లో పుట్టి ఒక వెలుగు వెలిగిన ఇరవైయవ శతాబ్దపు అగ్రగామి ఉద్యమం (Avant Garde) అధివాస్తవికత. ఆధునిక పెట్టుబడిదారీ విధానంలోని తర్కానికి, సౌందర్యానికి వ్యతిరేకి. అంతశ్చేతనలోని భావాలు, స్వాప్నిక జగత్తులోని ఊహలు, నిజజీవితంలోని వాస్తవానుభవాలు, సృజనాత్మకతల మిశ్రమ రూపఫలితం. 1924లో ఫ్రాన్స్ దేశంలో పురుడు పోసుకున్న సాంస్కృతిక విప్లవరూపం, డాడాయిజం నుండి అభివృద్ధి చెందింది.

నిద్రాణంగా ఉన్న కోరికలను బాహ్య ప్రపంచంలోని వాస్తవంతో జోడించగా ఏర్పడే అసంబద్ధ రూపాలు అధివాస్తవకతా ప్రతిబింబాలు. ఇందులోని ప్రతీకలు అసంగతాలు, పరస్పర విరుద్ధాంశాలు ఏకకాలంలో ప్రదర్శింపబడతాయి. ఇన్‌స్టిన్ సాపేక్ష సిద్ధాంతసారం, సిగ్మండ్ ఫ్రాయిడ్ అంతశ్చేతనలోని స్వైర కల్పనలు (Fantasies) కలగలిసిన కళాత్మక వ్యక్తీకరణ.

అంతవరకూ ప్రచలితంగా ఉన్న క్యూబా ఇజానికి కొనసాగింపు సర్రియలిజం, మూలాలు ముందుతరాల చిత్రకారులు బాస్క్ గోయాల చిత్రాల్లోనూ, పికాసో లే దేమ్జల్స్, గెర్నికా, విలపిస్తున్న వనిత మొదలైన చిత్రాల్లోనూ కన్పిస్తాయి.

1920లో మొదలైన సర్రియలిజానికి 30–40వ దశకం స్వర్ణయుగం. చిత్రకారులు, రచయితలు, ఫొటోగ్రాఫర్లు సినిమా నిర్మాతలు వందల సంఖ్యలో ఉద్యమాన్ని బలోపేతం చేశారు. 1936లో లండన్‌లో జరిగిన అంతర్జాతీయ సర్రియలిస్టు ప్రదర్శన, ఆ వెంటనే న్యూయార్క్, పారిస్ (1938)లలో జరిగిన ప్రదర్శనల్లో అరవైమంది ఆర్టిస్టుల మూడువందల చిత్రాలు ప్రదర్శించబడడంతో సర్రియలిజం ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడించింది కానీ ఆ తర్వాత దాదాపుగా ఏడు దశాబ్దాలపాటు మరుగున పడిపోయింది.



Relaxing

ఫ్రాంక్ ఫర్టులో 2020 ఫిబ్రవరి నుండి మే నెలవరకు జరిగిన సర్రియలిజ ప్రదర్శన చరిత్ర సృష్టించింది. 34మంది ప్రముఖ మహిళల 260 సర్రియలిజ చిత్రాలను ప్రదర్శించింది. వాటిలో పెయింటింగులు, స్కెచ్‌లు, చలనచిత్రాలు ప్రదర్శితమైనాయి. అంతకుముందే విట్నీ చాద్విక్ పుస్తకం, కేట్ బ్రౌన్ (Kate Brown) రచనలు సర్రియలిస్టులను గుర్తు చేస్తాయి. కేట్ బ్రౌన్ ఫిబ్రవరి 18, 2020 నాటి వ్యాసంలో సర్రియలిజం ముమ్మాటికీ మహిళా ఉద్యమం, అయినా ఎందరో మహిళా సర్రియలిస్టులు మరుగున పడిపోవడానికి కారణమేమిటి? అని ప్రశ్నిస్తూ జవాబులు కూడా తానే చెప్పింది. మహిళల సర్రియలిజం చిత్రాల్లో వైవిధ్యం కొరవడడం, పురుషులు తమ చిత్రాలలో స్త్రీని శృంగార వస్తువుగా భావించడం, స్త్రీ ఆర్టిస్టులు తమ స్వీయ చిత్రాలను విరివిగా చిత్రించడం కారణాలుగా పేర్కొనింది. ప్రదర్శనలో ప్రాతినిధ్యం వహించిన మహిళా చిత్రకారుల్లో చాలామంది 1900–1910 పుట్టినవారు కాగా కొద్దిమంది మాత్రం 1920 తర్వాత పుట్టినవారు. వారిలో అత్యంత ప్రభావం చూపిన పెయింటర్లు కనీసం ఇరవై మందైనా ఉంటారు. ఫ్రిదాకాలో, లియోనారా కారింగ్టన్, డోరోథియా టానింగ్, మెరెట్ ఓపెన్ హెయిమ్, రేమెడియోస్ వరో, హెలెన్ లూండ్, లుండెర్ బర్గ్ జూలియన్ లాండా మొదలైనవారు ప్రథమ శ్రేణి సర్రియలిస్టు ఆర్టిస్టుల్లో కొందరు.

**లియనారా కారింగ్టన్ (Leanara Carrington) (1917–2011):**

కారింగ్‌టన్ ఇంగ్లండులోని లాంకషైర్‌లో 1919లో జన్మించింది. తండ్రి సంపన్న వస్త్ర వ్యాపారి. తల్లి ఐర్లాండు మహిళ. కారింగ్‌టన్ బాల్యం ముగ్గురు సోదరులు మధ్య గడిచింది. బాగా అల్లరి పిల్ల అవడంవల్ల రెండుసార్లు స్కూల్ నుండి గెంటివేయబడి ఇంటివద్దనే విద్యనభ్యసించింది. కారింగ్‌టన్ అల్లరి భరించలేక తల్లిదండ్రులు ఆమెను ఫ్లోరెన్స్‌లోని పెన్‌రోజ్ అకాడెమీలో చేరుస్తారు. పదేండ్ల చిన్నవయసులోనే (1927లో) మొట్టమొదటిసారి పారిస్ ఆర్ట్ గాలరీలో సర్రియలిస్టు పెయింటింగును, తర్వాత పాల్ ఇలార్ట్‌లాంటి ప్రముఖ సర్రియలిస్టు పెయింటర్లను చూస్తుంది. కారింగ్‌టన్ ఆర్ట్ నేర్చుకోవడానికి తండ్రి వ్యతిరేకి అయినా తల్లి ప్రోత్సాహంతో ముందుకు సాగుతుంది. తర్వాత లండన్ చెల్సియా ఆర్టు స్కూలులో ఒక సంవత్సరం, ఫైనార్ట్స్ అకాడమీలో 1936–38 మధ్య చిత్రకళనభ్యసిస్తుంది. అదే సంవత్సరం సర్రియలిస్టు కవి, కళాభిమాని, ఎడ్వర్డ్ జేమ్స్ కారింగ్‌టన్‌కు అండగా ఉండి ఆ చిత్రాలను ఖరీదు చేసి న్యూయార్క్‌లో ప్రదర్శన ఏర్పాటు చేస్తాడు. లండన్‌లో నిర్వహించబడిన అంతర్జాతీయ సర్రియలిస్టు ప్రదర్శన

(1936)లో జర్మన్ కళాకారుడు మాక్స్ ఎర్నెస్ట్ చిత్రాలు ఆమెను ఆకర్షిస్తాయి. 1937లో మొదటిసారిగా అతణ్ణి ఒక పార్టీలో కలుసుకుంటుంది. అప్పటివరకూ వారి మధ్య పరిచయం లేదు. ఆ పరిచయంలో వారిరువురి మధ్య అనుబంధం పెరిగిపోయి అతనితో పారిస్ వెళ్ళిపోతుంది. పారిస్ వెళ్ళడానికి ముందే ఎర్నెస్ట్ భార్య నుండి విడిపోతాడు. 1938లో పారిస్ నుండి ఫ్రాన్స్ దక్షిణ ప్రాంతంలోని సెంట్ మార్టిన్‌కు మాకాం మారుస్తారు. ఇరువురు కలిసి జంతువుల, పక్షుల బొమ్మలు, శిల్పాలు చెక్కుతారు. కారింగ్‌టన్ చిత్రించిన ఎర్నెస్ట్ పోర్ట్రేట్ వారి మధ్యగల సంబంధంలోని సందిగ్ధతకు ప్రతిరూపంగా నిలుస్తుంది. అందులో సర్రియలజివు ఛాయలు కన్పిస్తాయి. అంతకుముందు చిత్రించిన స్వీయచిత్రంలో జోథ్‌పూర్ దుస్తుల్లో, బుట్టతలతో, కుర్చీ అంచున కూర్చొని ఉంటుంది. కలలాంటి దృశ్యంలో ఎదురుగా మీదికి వస్తున్న తోడేలువైపు చేయి జాపి ఉంటే వెనక గోడమీద పరుగెత్తుతున్న తోకలేని గుర్రం, తెరచిన వాకిట్లో ప్రకృతీ కనిపిస్తాయి.

రెండవ ప్రపంచ యుద్ధ కారణంగా ఫ్రెంచి అధికారులు జర్మనీ దేశీయుడైన ఎర్నెస్టును విదేశీ శత్రువుగా పరిగణించి అరెస్టు చేస్తారు. పాల్ ఇలార్డు (Paul Eluard) ఇతరమిత్రుల జోక్యంతో బయటపడుతాడు గానీ, ఫ్రాన్స్‌పైన దాడిచేసిన నాజీలు మళ్ళీ అతణ్ణి అరెస్టు చేస్తారు, వారి నుండి తప్పించుకుని కారింగ్‌టన్‌ను వదిలేసి అమెరికాకు పారిపోతాడు. దానితో హతాశురాలైన కారింగ్‌టన్ మాడ్రిడ్ చేరుకుంటుంది. మానసిక ఒత్తిడి, భయాందోళనలతో మానసిక రోగిగా మారిపోవడంతో ఆసుపత్రిలో చేర్చుతుంది. ఆ సమయంలో తల్లిదండ్రులు కల్పించుకుని కారింగ్‌టన్‌ను దక్షిణ ఆఫ్రికాలోని శానటోరియానికి పంపించే ఏర్పాటు చేస్తారు. ఆఫ్రికా వెళ్తూ మధ్యలో పోర్చుగల్‌లో ఆగినప్పుడు తప్పిచుకుంటుంది. మెక్సికో రాయబార కార్యాలయం చేరుకుని మెక్సికో కవి, రాయబారి లూడెన్ సాయం కోరుతుంది. అతడు పికాసోకు స్నేహితుడు. కారింగ్‌టన్ లూడెన్‌ను చేసుకుంటే రాయబారి భార్యగా ఆమెకు రక్షణ దొరుకుతుంది అన్న ఆలోచనను ఆచరణలో పెడ్తారు. ఇది కేవలం ఆమెను తప్పించడానికి చేసిన ప్రయత్నం. ఎర్నెస్ట్ అమెరికాలో వేరే స్త్రీని పెండి చేసుకోవడంతో కారింగ్‌టన్ ఎర్నెస్టుల బంధం శాశ్వతంగా తెగిపోతుంది.

**మెక్సికో జీవితం:**

ఒక ఏడాది న్యూయార్క్‌లో గడిపిన తర్వాత లూడెన్ కారింగ్‌టన్‌లు మెక్సికో వెళ్తారు. 1943లో లూడెన్‌తో విడిపోయి, తన ఎంతో ఇష్టపడిన జీవితం చివరివరకూ అక్కడే గడుపుతుంది. ఒక కుడ్యచిత్రాన్ని వేయడానికి పురమాయింపు దొరకగా మెక్సికో జానపదగాథల ఆధారంగా దాన్ని రూపొందిస్తుంది. అది ఇప్పుడు మెక్సికో సిటీ మ్యూజియంలో భద్రపరచబడి ఉంది. 1970లో మహిళలు చాలామంది స్త్రీవిమోచన ఉద్యమంలో పాల్గొనగా, కారింగ్టన్ ఒక పోస్టర్‌లో ఈవ్‌ను కొత్తగా చూపించి తనవంతు బాధ్యతను నిర్వహించింది. రాజకీయ స్వేచ్ఛకొరకు పోరాడే ముందు స్త్రీ తన ఆలోచనాపరిధి నుండి విముక్తి పొందాలి అని కారింగ్‌టన్ నమ్మింది. అందుకు మెక్సికో, ఉత్తర అమెరికాల్లోని రాజకీయ చైతన్యం కలిగిన స్త్రీల సహకారం అవసరం అని గుర్తిస్తుంది. ఆ దిశలో చిత్తశుద్ధితో చేసిన కృషి ఫలితంగా 1986లో న్యూయార్క్ 'మహిళా కళా సమ్మేళనం' నుండి జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకుంటుంది. తన వ్యక్తిత్వాన్ని, ఉనికిని కాపాడుకుంటూ ఆ దశాబ్దం అంతా చురుకుగా తీరిక లేకుండా గడుపుతుంది. ఆ సందర్భంగా కళను అభివృద్ధి చేసుకోవడానికేగాని, ఎవరికో ప్రేయసిగానో, భార్యగానో గడిపేంత తీరిక లేదు అంటుంది.

**రెండో పెళ్లి సంతానం:**

స్పెయిన్ అంతర్యుద్ధంలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేసిన ఎమెరికో వెయిజ్ అనే అతణ్ణి పెండ్లి చేసుకుంది. వారి సంతానం ఇరువురు కొడుకులు. వారిలో ఒకడు గాబ్రియేల్ కవి, రెండోవాడు పాబ్లో డాక్టరు, సర్రియలజ కళాకారుడు. భర్త వెయిజ్ 2007లో, 97వ ఏట మరణించాడు. ఆ తర్వాత నాలుగేండ్లకు కారింగ్‌టన్ 94 ఏండ్ల వయసులో న్యూమెనియాతో 2011లో మరణించింది.

**కారింగ్‌టన్ చిత్రాల ఇతివృత్తాలు:**

ఇతర సర్రియలిస్టు కళాకారుల్లాగా సిగ్మండ్ ఫ్రాయిడ్ రచనపై ఆసక్తి చూపలేదు. "నా బొమ్మల్ని ప్రదర్శించాలనిగానీ, ఎవరైనా కొంటారనిగానీ ఎన్నడూ ఆశించలేదు. నా కోసం నేను బొమ్మలు వేసుకున్నాను అంటుంది ఆమె మాంత్రిక వాస్తవికత (మాజిక్ రియలిజం) మీదా, రూపపరివర్తన మీదా దృష్టి పెట్టి, తన జీవితానుభావాలను, ప్రతీకలను ముడిసరుకులుగా చేసుకుని చిత్రాలు రూపొందించింది. జంతువులు, ప్రాచీన కథలు, గాథలు, జానపదకళ, సంకేతాలు కారంగ్‌టన్ చిత్రాలకు యితివృత్తాలు.

పురుష సర్రియలిస్టు కళాకారులు స్త్రీ కాముకత్వాన్ని వారి–వారి దృక్పథంతో చిత్రిస్తే, కారింగ్‌టన్ తన కాముకత్వాన్ని, తన శృంగార అనుభవాలను చూపించడంలో ఆసక్తి చూపించింది. 1940లో కారింగ్‌టన్ చిత్రాల్లోని సృజన చర్యలో స్త్రీ పాత్ర అంతర్లీనంగా కనిపిస్తుంది. 1938లో రూపొందించిన స్వీయచిత్రంలో స్త్రీ అనుభవాన్ని,

కాముకత్వాన్ని అనూచానంగా వస్తున్న పురుషుని పాత్రలో వచ్చిన మార్పును చూపాను అని వ్యాఖ్యానించింది. 'కోరిక, సృజనాత్మక ప్రేరణకు మూలం' అన్న సర్రియలిస్టు నమ్మకానికి ప్రతిస్పందన ఆమె స్వీయ చిత్రం.



Birds-in-flight- S.V. Rama Rao

అంతేకాకుండా స్త్రీ వ్యక్తిత్వంలోని రెండు కోణాలను – ఒకటి తన వ్యక్తిత్వం, రెండు తన వ్యక్తిత్వాన్ని ఇతరులు గమనిస్తున్నారన్న స్పృహను చూపాను అంటుంది. కారింగ్టన్ చిత్రాల్లో, కథల్లో హాయినా, గుర్రాల పాత్ర చాలాసార్లు కనిపిస్తుంది. అసైలం (Asylum) నుండి విడుదలైన మూడేళ్ళ తర్వాత తన జ్ఞాపకాలను 'డౌన్ బిలో' (Down Below) పేరుతో రాసిన పుస్తకంతో పొందుపరచింది. ఆసైలంలో గడిపిన తన అనుభవాలు, ఆకలి లేమి, స్వీయ నియంత్రణను కోల్పోవడం, నిర్దాక్షిణ్యంగా చేసిన వైద్యం, లైంగిక దాడి, డ్రగ్స్ అనుభవాలు, అపరిశుభ్ర పరిసరాలు అన్నింటినీ వివరించింది.

**కారింగ్టన్ ఇతర రచనలు:**

'ద హియరింగ్ ట్రంపెట్' పుస్తకంలో వయసు మళ్ళిన స్త్రీ రూపాన్ని వర్ణిస్తూ సాంప్రదాయక వ్యవస్థల్ని గేలి చేస్తుంది. స్త్రీ దేహాన్ని నగ్నంగా చిత్రించడాన్ని విమర్శిస్తుంది. దానికి 20 శతాబ్దపు లింగ వివక్షతను మొట్టమొదటిసారిగా ఎత్తిచూపిన పుస్తకంగా గుర్తింపు వచ్చింది. మాతృత్వం స్త్రీత్వానికి ముఖ్యాంశమని చెప్తుంది. మరో ప్రాణికి జన్మనివ్వడంలో మా శరీరాలు చీకటి గుహల్లోకి, మా ప్రేమ అగాధాల్లోకి నెట్టబడుతుంది అని రాసింది.

మెక్సికోలో గడుపుతున్న కాలంలోనే స్పెయిన్ ప్రవాసి, కళాకారుడు రెమెడియోస్ వెరోతో పరిచయం కలుగుతుంది. అతనితో కలిసి రసవాదాన్ని, కబలా ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తుంది. 1947లో ఆమె చిత్రాల మొట్టమొదటి ప్రదర్శన న్యూయార్క్‌లో అంతర్జాతీయ సర్రియలిస్టు ప్రదర్శనలో చోటు చేసుకుంది. అందులో పాల్గొన్న ఏకైక మహిళగా గుర్తింపు పొందింది. దానితో ఆమె ప్రతిభ ఒక్కసారిగా వెలుగులోకి వస్తుంది. తర్వాత (డబ్లిన్) ఐర్లాండ్, ఇంగ్లాండులోని వివిధ మ్యూజియాలలో కారింగ్టన్ చిత్రాలు వరసగా 20 సంవత్సరాలు ప్రదర్శించబడినాయి. కారింగ్టన్ చిత్రాల్లో ఆమె బాల్యం నుండే గుర్రాలు ప్రముఖ పాత్ర వహించాయి. ఆమె మొదటి కథ 'ద హౌస్ ఆఫ్ ఫియర్స్'లో గుర్రం కథానాయకునికి సైకిక్ మార్గదర్శిగా పని చేస్తుంది. ఆ తర్వాత ఆమె రచనల్లో గుర్రంపాత్ర అనివార్యంగా కన్పిస్తుంది. ఎడ్గార్ అలెన్‌పో కథను 1973లో మెక్సికన్ హారర్ ఫిల్మ్‌గా రూపొందించడంలో కారింగ్టన్ కాస్ట్యూమ్స్ సమకూర్చి దర్శకత్వం చేపట్టింది. ఇందులోనూ గుర్రం పాత్ర ఆమె 'ఆల్టర్ ఇగో'కు ప్రాతినిధ్యం వహిస్తుంది.

2015లో కారింగ్టన్ 98వ జన్మదినం సందర్భంగా గూగుల్ ఆమె సర్రియలిస్టు చిత్రాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి గౌరవించింది. కారింగ్టన్ పెయింటింగుల్లో ముఖ్యమైనవి ముప్పైదాకా ఉంటాయి. అవి వివిధ దేశాల మ్యూజియాల్లో ప్రదర్శించబడుతున్నాయి. వాటిలో కొన్ని – ఫిగర్స్ ఫెంటాస్టికోస్, ఆపరేషన్ వెన్స్‌డేస్, ఫేషియల్ మాస్క్, డౌన్ బిలో, గ్రీన్ గార్డెన్, పీకాక్స్ ఆఫ్ ఫెస్, ద లవర్స్.

కారింగ్టన్ పెయింటింగుల్లో మంత్రాలు, మాయలు, రూప పరివర్తన, రసవాదం, ప్రతీకలు కలగలిసి ఉంటాయి. సర్రియలిజం పెయింటింగుల్లో గాఢమైన స్త్రీవాదాన్ని శక్తివంతంగా ప్రవేశపెట్టిన పెయింటర్‌గా కారింగ్టన్ ఘనత సాటిలేనిది. ఆమె పెయింటింగుల మీద థెరిసా గ్రిఫిట్స్ దర్శకత్వంలో 'ద లాస్ట్ సర్రియలిస్టు' పేరిట గంట నిడివిగల డాక్యుమెంటరీ తీయబడింది.

**ఇంటర్వ్యూలలో కారింగ్టన్ వెలిబుచ్చిన అభిప్రాయాలు కొన్ని:**

● మగవారిని అర్థం చేసుకోవడం కష్టం వారంతా ఒక్కసారే చస్తే బాగుంటుంది. ● మనిషికీ తేడేలుకూ (హాయ్‌నా) తేడా ఏముంది. మనిషి ముసుగులో వున్న మృగం తోడేలు. మనిషిని స్త్రీగా ఊహించడం, స్త్రీ ముసుగు వేయడం, 'ఏది కళ? ఏది కృత్రిమం?' ● కొద్దిమంది రోగగ్రస్తులు, అసమర్థులు ప్రభుత్వం పేరుతో నడిపే యంత్రాంగాన్ని లక్షలాదిమంది అంగీకరించడం అర్థం కాని విషయం.

As They Rode Along the Edge అనే కథలో అటు స్త్రీ గానీ, ఇటు జంతువుగానీ కాని 'వర్జినియా ఫర్' అనే వింత ప్రాణిని సృష్టించింది. జంతువులు, పక్షులు సంగమించడం, ఏ రూపమో అంతుపట్టని వాటి సంతానం. వాటి ప్రవర్తన, మనిషి అంతశ్చేతనలో ఉండే అనేక భయానక, జుగుప్సాకర, వికారపు ఆలోచనకు అవి దర్పణాలు. కారింగ్టన్ చిత్రాల్లో చూపించిన అసంబద్ధత, ఆమె రచనల్లోనూ ప్రతిఫలిస్తుంది.

**టి.వి. ప్రసాద్ - హైదరాబాద్. ఫోన్: 798 139 8250.**




## చిత్రగీతాలు
# జావళీలు

**- ఎమ్. పురుషోత్తమాచార్య**

### 9. ఎవడే అతడెవ్వడే

**చిత్రం : విప్రనారాయణ (1954)**
**రచన : సముద్రాల**
**సంగీతం : ఎస్.రాజేశ్వరరావు**
**గానం, నృత్యం : పి.భానుమతి, రాగ, తాళమాలిక**

**1. భైరవి-ఆది**

*ఎవడే అతడెవడే ఓ భామ*
*కలలోన నను డాసినాడే ఓ భామ //ఎవ//*
*ఎన్నరాని బాసలాడి కౌగిట*
*నన్ను జేర్చినాడే భామ //ఎవ//*
చ// *మేను కుందనము జిగి మీరు*
*నా నెమ్మోము నెల గేరు*
*తేనెలూరు పల్కు తీరు కలువల*
*నేలజాలు కనుల సొరు //ఎవ//*

**2. మోహన-త్రిపుట**

*ఏమో రాడమ్మా ఇందుండిపోయె*
*జామాయెనమ్మ //ఏమో//*
*మా మేలు కనలేని ఏ మాయలాడి*
*సామిని నడుదారి ఇంతిరో*
*వలపునే మరచెనో*

**3. కాఫీ-ఆది**

*చాలుర మారాములు,సాములు*
*కేలును మోడుతు పోనీయరా ఇక //చాలు//*
*ఆడిన ఆట పాట చాలురా*
*గడుసరివయినా నీటుకాదవే*
*కూడెదరా నే రేపే వేళ*
*వేడుక చూడుమురా సామీ //చాలు//*

**4. వసంత-ఆది**

*తెలిసె నీ నెయ్యము తియ్యము నా సామి*
*అక్కర మాటలు నాకడగా నీ*
*మక్కువ,మన్నన దానివేలేరా //తెలి//*

చిత్రంలో దేవదాసిగా భగవంతుని సన్నిధిలో దేవదేవి నృత్యారాధనను సమర్పించింది. విచ్చేసిన పురజనులందరి మధ్యన దేవదేవి ఆనందంగా నృత్యం చేసిన సందర్భంలో నటి, గాయని భానుమతి మీద ఈ పాటను చిత్రించారు. ఆమె తల్లిగా మరో నటగాయని ఋష్యేంద్రమణి, అక్కగా నటి సంధ్య నటించారు. కలలో కనిపించిన స్వామివారి సౌందర్యాన్ని మొదటి భాగంలో వర్ణించారు. వచ్చి వెళ్ళిన ప్రియుని కోసం ఎదురుచూసే విరహోత్కంఠిత ధోరణిలో రెండవ భాగంలో ఆవేదన చిత్రించారు. రావడానికి మారాము చేస్తున్న ప్రియునిపై అలిగిన నాయిక మనఃస్థితిని మూడవ భాగం వర్ణిస్తున్నది. తన దగ్గర అవసరంకొద్దీ మాట్లాడి మక్కువ, మన్నన అంతా మరో ఇంతి కడ చూపుతున్నాడనే అసూయ నాల్గవభాగంలో వర్ణింపబడింది.

ఈ రచన సారంగపాణి పదానికి సంబంధించినట్లుగా కొందరు చెబుతున్నా సరియైన ఆధారాలు లేవు. ఆయనగారి సుమారు 200 పదాలలో ఎక్కడా ఈ పాట ప్రస్తావన కనిపించడంలేదు. కాని 'ఏమో రాడమ్మా....'తో మొదలైన పల్లవి మాత్రం క్షేత్రయ్య పదాలలో కనిపిస్తున్నది.

వయొలిన్స్, వేణువులతో ఒక ఆవర్తం బిట్టుతో పాట ప్రారంభమవుతుంది. బిట్టు కాగానే పల్లవిని అందుకున్నారు. ఆధారషడ్జమం నుంచి ప్రారంభించి పల్లవిని రెండుసార్లు పాడారు. దీనిలో 'డాసినాడే' పదం

దగ్గర భైరవి రాగముద్రను చాలా అందంగా పలికించారు. 'ఓ భామా' దగ్గర వదిలేశాక అర ఆవర్తంలో మృదంగం ముక్తాయినివ్వగా ఒక ఆవర్తంలో వాద్యాలు చక్కని బిట్టును అందించాయి. వెంటనే అనుపల్లవి 'ఎన్నగరాని' అనేది పంచమంలో సమంగా ప్రారంభమైంది. ఇక్కడి బిట్వర్కును విన్నప్పుడు మనకు, తరువాత వచ్చిన బొబ్బిలియుద్ధం సినిమాలోని 'నినుజేర మనసాయెరా' అనే జావళి స్ఫురిస్తుంది. అంటే దానికిది ప్రాథమికరూపం అన్నమాట!

అనుపల్లవిలోని మొదటి పాదాన్ని రెండు వైవిధ్య సంగతులలో పాడి రాగస్వరూపాన్ని చక్కగా చిత్రించారు. 'డాసినాడె'లాగానే 'నాడే భామ'ను సుందరంగా పాడారు. 'బాసలాడి' పదాన్ని రెండోసారి పాడుతున్నప్పుడు ఆరోహణ గమకాన్ని అందంగా పలికించారు. తరువాత అర ఆవర్తం ముక్తాయింపు, రెండు ఆవర్తాల బిట్వర్క్ అందించగా 'మేను కుందనము' చరణాన్ని సమంలో పంచమం నుంచి అందుకున్నారు. దీన్ని చౌకంగా పాడడం ఒక చిన్న విశేషం. రెండో భాగంలో 'పల్కు' పదాన్ని రెండవసారి 'బాసలాడి' గమకాన్నే అనుసరించారు. అలాగే 'కనుల సౌరు'ను రాగముద్ర అయిన ఆరోహణ గమకంతో పాడారు.

పల్లవిని అందుకుని పాడాక 4 ఆవర్తాలుగా మృదంగ విన్యాసాన్ని చూపారు. వెంటనే త్రిపుట తాళంలోకి మారుతూ వయొలిన్స్, వేణువులు 4 ఆవర్తాల బిట్టును మోహనరాగంలో ఇచ్చాక 'ఏమో'ను 'దరిస' బాణీలో అందుకున్నారు. 'జామాయెనమ్మ' తరువాత 3 ఆవర్తాల బిట్వర్క్ ఇచ్చారు. 'మా మేలు'ను పంచమం నుండి అందుకున్నారు. 'మా మేలు గనలేని' పాదాన్ని రెండుసార్లు పాడి, తరువాతి పాదాలను కూడా పాడి ముగించారు. తరువాత 'ఏమో రాడమ్మా' ఎత్తుకున్నారు. పిదప 7 ఆవర్తాలలో మృదంగవిన్యాసాన్ని వినిపించారు.

వెంటనే ఆదితాళంలోకి మారి కాఫీ రాగస్వరాలతో 2 ఆవర్తాల బిట్టును ద్రుతగతిలో అందించగా పైస్వరాలలో, అంటే, 'నిసనిప' బాణీలో 'చాలుర మారాములు'ను ఒక అక్షరం జాగా వదిలి ఎత్తుకున్నారు. దీన్ని రెండుసార్లు పాడాక 'మారాములు' దగ్గర వదిలేశారు. అక్కడి నుంచి ఒకటిన్నర ఆవర్తాలలో బిట్టునిచ్చాక 'ఆడిన ఆటను' దైవతం నుండి ప్రారంభించారు. ఈ పాదాన్ని రెండుసార్లు పాడారు. 'కూడెదరా నే'లోని 'నే' అక్షరం మీద చక్రభ్రమణపు గమకాన్ని రెండుసార్లు ఒకే తీరుగా చూపారు. చరణం అయ్యాక మళ్ళీ 'చాలుర' పాదాన్ని అందుకుని 'సాములు' దగ్గర ముగించారు. తరువాత వచ్చిన సాలూరివారి కాఫీరాగపు బాణీలకు మూలాలు ఈ చరణంలోనే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

దీని తరువాత ఒక ఆవర్తం మృదంగవిన్యాసం వినిపించి వసంతరాగాన్ని వాద్యాలు అందుకుని మూడు ఆవర్తాలలో వినిపించాయి. ఆధారషడ్జమం నుంచి సమంలోనే 'తెలిసె నీ' చరణాన్ని ఎత్తుకున్నారు. మొదటి పాదాన్ని మూడుసార్లు పాడారు. 'అక్కర మాటలు' పాదాన్ని, 'మక్కువ' పాదాన్ని రెండేసిమారులు పాడారు. చివరి పదం 'దానివేలేరా'ను 'దానీవేలేరా' అంటూ అసంగత దీర్ఘాలతో అయినా సంగీతపరంగా పాడుతూ రాగస్వరూప గమకాలను అందించడం సాధారణవిషయమే.

పాట ముగిశాక అర ఆవర్తంలో మృదంగం వినిపించాక రెండు ఆవర్తాలలో మృదంగపు ముక్తాయింపు వినిపించి పాట మొత్తాన్ని ముగింపజేశారు.

* * *

**14. బాలనురా మదనా**

**చిత్రం : మిస్సమ్మ (1955)**
**రచన : పింగళి**
**సంగీతం : ఎస్.రాజేశ్వరరావు**
**గానం : పి.సుశీల**
**నృత్యం : జమున**

**ఖరహరప్రియ–ఆది**

*బాలనురా మదనా విరి*
*తూపులు వేయకురా మదనా* //బాల//

1. *నిలచిన చోటనె నిలువగనీయక*
*వలపులు కురియునురా తీయని*
*తలపులు విరియునురా మదనా* //బాల//

2. *చిలుకలవలె గోర్వంకల వలెను*
*కులుకగ తోచునురా తనువున*
*పులకలు కలుగునురా మదనా* //బాల//

3. *చిలిపి కోయిలలు చిత్తములోనే*
*కలకల కూయునురా మనసును*
*కలవరపరచునురా మదనా* //బాల//

చిత్రంలో చిన్నప్పుడు తప్పిపోయిన అమ్మాయి పుట్టిన

రోజున ఆమెను తలుచుకుంటూ కన్నవారు జరిపే ఉత్సవంలో జమున సరదాగా అభినయిస్తున్న నృత్యగీతం ఇది. తెలిసీతెలియని ఊహ, వచ్చీరాని నాట్యం వీటికి తోడుగా అప్పుడే ఎదుగుతున్న సుశీల కమ్మని కంఠం–అన్నీ కలిసి ఈ పాటను ఉదాత్తగంభీరంగా వినిపించాయి. నాయికానాయకులు సావిత్రి, ఎన్టీఆర్; ఎస్వీ రంగారావు, ఋష్యేంద్రమణి ఆసీనులైన సన్నివేశంలో ఈ నృత్యప్రదర్శనను చిత్రించారు. యతిప్రాసల నియమం పల్లవిలో కనిపించదు. కాని మూడు చరణాలలోనూ 'ల'కారాన్ని ప్రాసగా అనుసరించడం ఎంతో చమత్కారంగానూ, విశేషంగానూ ఉంది. అంతేకాదు, ప్రతి చరణం సాధారణంగా పాటించే నాలుగు పాదాలుగాకాక మూడు పాదాలలో సాగడం మరొక విశేషం. ముగ్ధమనోహరమైన భావసంపదతో పాట సులలితంగా మనల్ని పలకరిస్తుంది.




ప్రారంభంలో 4 ఆవర్తాలలో వయొలిన్స్, వేణువు, క్లారియోనెట్ వాద్యాలతో బిట్ ఇచ్చారు. వీటిలో చివరి ఆవర్తంలో వీణ వినిపిస్తుంది. సాధారణంగా ఖరహరప్రియలో వినిపించే బాణీలోనే అంటే, 'దనిదప' నుంచే ఒక అక్షరం జాగా వదిలి 'బాలనురా' పల్లవిని ఎత్తుకున్నారు. పెదతిరుమలాచార్యుని 'ఒకపరికొకపరి' కీర్తన కూడా ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది. మొదటి పాదాన్ని పాడగానే క్లారియోనెట్‌తో 'సరిగమపద' అనే లింకుబిట్టును ఇవ్వడం అందంగా ఉంది. 'మదనా' కాగానే ఆరో అక్షరం వదిలి బిట్టును ప్రారంభించి పూర్తి ఆవర్తంలో ముగించగానే ఒక అక్షరం జాగా వదిలి దైవతం నుండి మొదటి చరణం 'నిలచిన'ను అందుకున్నారు. 'నీయక' దగ్గర అర ఆవర్తంలో ఆలాపన ఇచ్చారు.

పల్లవి తరువాత వాద్యాలతో బిట్టును ఆరో అక్షరం నుండి ప్రారంభించి మూడు ఆవర్తాలలో, మొదటి చరణానికి ముందు ఇచ్చిన స్వరసంపుటికంటె కొంచెం విభిన్నంగా బిట్టును ఇచ్చారు. దీనిలో అంతర్గతంగా కాఫీరాగచ్ఛాయలు తొంగిచూడడం ముఖ్యవిశేషం. రెండో చరణం ఎత్తుగడ కూడా దైవతం దగ్గరి నుంచే అక్షరం జాగా వదిలి ప్రారంభమైంది. 'గోర్వంకలవలెను' దగ్గరి ఆలాపన కూడా మొదటి చరణం మాదిరిగానే ఉంది. మూడవ చరణానికి ముందుగా ఇచ్చిన బిట్వర్క్ కూడా రెండవ చరణం మాదిరిగానే ఉంది. 'లోనే' దగ్గరి ఆలాపన కూడా మామూలుగానే ఉంది. పాట ముగింపులో అర ఆవర్తం మృదంగం ముక్తాయింపును వినిపించారు. సంగీత సంగతులకు ప్రాధాన్యమీయవలని రావడంవలన "విరీయును, కలూగును, కలవరపరాచునురా"వంటి అసాధు దీర్ఘాలు రాక తప్పలేదు. ఇదే సినిమాలో 'ఏమిటో నీ మాయ' పాటలో కూడా ఇలాంటివే కనిపిస్తాయి.

* * *

**11. ఎవరురా నీవెవరురా**

**చిత్రం : అగ్గిరాముడు (1954)**
**రచన : ఆత్రేయ**
**సంగీతం : ఎస్.ఎం. సుబ్బయ్యనాయుడు**
**గానం,నృత్యం : పి. భానుమతి**
**కాఫీ–ఆది**

*ఎవరురా నీ వెవరురా*
*ఎవరుగానీ ఎరుగరాని*
*దొరవీవని వింటిని* //ఎవ//

1. *ఎన్నో రూపములను కన్నాను*
*నిన్ను నేను ఏది నిజమని యెంచి*
*ఆరాధించేదిరా* //ఎవ//

2. *కలవని ఎందరో పలికిరి నీవే*
*కల్లని కొందరు వాదించిరి*
*కలవో లేవో తెలుపవేమి మా*
*కలతలు మాని కొలుతుము స్వామీ* //ఎవ//



చిత్రంలో కథానాయకుని పాత్ర విలక్షణంగా ఉంటుంది. ఆ పాత్ర యొక్క స్వభావాన్ని విని సందిగ్ధంలో పడ్డవారిలో కథానాయిక కూడా ఒకరై, స్వయంగా అగ్గిరాముని స్థావరంలో అతని ప్రవర్తనను మొదట శంకించి

తరువాత మెచ్చుకుంటుంది. అయినా ఆమెలోని సందేహం తీరక తనను తాను ప్రశ్నిస్తున్న ధోరణిలోనే అందరికి తన సందేహాన్ని ప్రకటిస్తున్న దృశ్యంలో ఈ పాటను చిత్రించారు. సన్నివేశంలో కథానాయిక భానుమతితో పాటు కథానాయకునిగా ఎన్టీఆర్ ఇంకా నటి సంధ్య తదితరులు కనిపిస్తారు.

నాయకుడు ఎన్నో వేషాలు వేస్తూ, ప్రజాహితాన్ని నెరవేరుస్తూ ఉండడం, దానిని పదిమంది పలురకాలుగా చెప్పుకోవడం అనేవి ఈ పాటలో ప్రస్తావనకు వచ్చాయి. యతిప్రాసలను చాలావరకు రచనలో పాటించారు. పల్లవిలో యతిని, మొదటి చరణంలో ప్రాసను, రెండవ చరణంలో యతిప్రాసలను చక్కగా పాటించారు.

ప్రారంభంలో వయొలిన్స్, వేణువు, క్లారియోనెట్ వాద్యాల కలయికతో 3 ఆవర్తాల బిట్‌వర్క్ వినిపించాక 'పగరిసా' అనే బాణీలో పల్లవిని ఎత్తుకుని రెండుసార్లు పాడారు. తరువాత అనుపల్లవిలో మూడో పాదాన్ని మాత్రమే గమ్మత్తుగా 'త్రిశ్రగతి'లో రూపొందించారు. ఇలాగ అనుపల్లవిని రెండుమార్లు పాడాక ఒక ఆవర్తంలో బిట్టును ఇచ్చారు. 'ఎన్నో మారులు' అనే మొదటి చరణాన్ని పై రిషభంలో ఎత్తుకున్నారు.

'ఎవరురా' అన్నప్పుడు ప్రశ్నిస్తున్న హస్తముద్రతో భానుమతి చాలా తేలికయైన అభినయాన్ని హుషారుగా ప్రదర్శించారు. పాటంతా ఆమె తన ధోరణిలోనే శరీరాన్ని ఎక్కువ అలయించకుండా అభినయం చేయడం పాట భావానికి ప్రాముఖ్యమివ్వడానికే అన్నట్లుగా కనిపిస్తున్నది.

మొదటి చరణాన్ని బాణీ చేయడంలో సుబ్బయ్యనాయుడుగారు ఒక ప్రత్యేకతను చూపారు. 'కన్నాను'దాకా ఒక పంక్తి చేసి 'కన్నాను' దగ్గర ఒక ఆవర్తం ఆలాపనను వినిపించారు. రెండోసారి 'ఎన్నో రూపములను' పాడేప్పుడు 'ఎన్నో' దగ్గర సంగతిని బాగా పొడిగించి, 'కన్నాను'లో 'క'ను పైకి లాక్కుని 'న్నాను' దగ్గరినుంచి 'నిన్ను నేను ఏది'వరకు ఒక పంక్తిగా ఆవర్తం చేశారు. 'నిజమని' దగ్గరి నుంచి సమంగా తీసుకుని 'చేదిరా' దగ్గర ఒక ఆవర్తం బిట్‌వర్క్‌ను పొందించి ఆరు అక్షరాలవరకే ఇవ్వగా 'ఏది'ని అతీతంగా అందుకుని చివరి పాదాన్ని సమతాళంతో ఆలపించారు. ఇది లయలో ఒక జిమ్మిక్కు. ఒక సర్దుబాటు. దీనికి లయజ్ఞానం అపారంగా కావాలి. అది నాయుడుగారి సొత్తు.

రెండో చరణానికి ముందు రెండు ఆవర్తాలతో బిట్టు ఇచ్చాక ఒక అక్షరం జాగా వదిలి దైవతం నుండి 'కలవని' అనే చరణాన్ని ప్రారంభించారు. 'దనిపదమరిమదా' బాణీ, కాఫీ రాగంలో అపురూపమైన ప్రయోగం. దీన్ని నాయుడుగారే చేశారు. 'కలవని ఎందరో' నుంచి రెండు పాదాలను రెండుమార్లు పాడారు. ఇలాంటి ప్రయోగాలు సాధారణ గానానికి భిన్నంగా సాగడం ఈ పాటలో ఎన్నోసార్లు కనిపిస్తుంది. 'కలవో' పదాన్ని మొదటిసారి ద్రుతగతి గమకంతో అందంగా పాడడం భానుమతిగారిలోని విశేషం.

అసలు పల్లవి బాణీలోనే భావప్రకటన అద్భుతంగా కనిపిస్తుంది. 'ఎవరురా?' అంటూ పైస్థాయి స్వరాలలో పాడుతూ ప్రశ్నించడం, వెంటనే 'నీవెవరురా' అని తగ్గు స్వరాలలో తనలో తాను వితర్కించుకుంటున్నట్లు, బ్రతిమాలుతున్నట్లుగా పాడడం ఎంతో సహజసుందరంగా ఉంది.

సుబ్బయ్యనాయుడుగారు, వారి పినతండ్రి వరుసైన దర్శకులు శ్రీరాములునాయుడుగారు తెలుగు వంశీయుల కుటుంబానికి చెందినవారని, చాలాకాలం క్రితం తమిళదేశానికి వెళ్ళిపోయారని కొందరి పరిశోధకుల అభిప్రాయం. ఇలాంటి చాలా తెలుగు సినిమా పాటల బాణీలు ఈ అంశాన్ని రుజువు చేస్తున్నాయని భావించవచ్చు.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
నల్లగొండ. ఫోన్: 939 661 1905.

# జాతీయ విద్యా విధానం (2020)

*– శ్రీరాములు గోసికొండ*

'మాయమైపోతున్నడమ్మా, మనిషన్నవాడు... ఓ..ఓ... మచ్చుకైనా లేడుచూడు, మానవత్వం ఉన్నవాడు' అని మహాకవి అందెశ్రీ పాడిన పాట నేటి సమాజంలో ప్రస్తుత విద్యావ్యవస్థ యొక్క డొల్లతనాన్ని వేలెత్తి చూపిస్తుంది. బ్రిటీష్‌వారు వారి అవసరాలకు అనుగుణంగా రూపకల్పన చేసిన బట్టీపట్టే ప్రశ్న–జవాబు చదువులవల్ల నేడు దేశంలో హృదయం లేని రోబోల్లాంటి మనుషులు తయారవుతున్నారు. విద్యవల్ల మనిషి వ్యక్తిగతంగానే కాకుండా సమాజానికి కూడా ఉపయోగపడాలి. ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను ఘనంగా జరుపుకుంటున్న మనం, ఇంకా మనకంటూ ఒక స్వంత విద్యావ్యవస్థను ఏర్పాటు చేసుకోలేకపోతున్నాం. అందుకే ఎంహెచ్‌ఆర్‌డి భారతదేశం యొక్క గొప్ప చరిత్ర, ప్రాచీన వైభవం, వారసత్వ సంపద, సాంస్కృతిక భిన్నత్వం, పూర్వ విద్యా ప్రాభవాన్ని – ఔన్నత్యాన్ని దృష్టిలో పెట్టుకొని, 2015 జనవరి నెలలోనే నూతన విద్యా విధానాన్ని తీసుకురావడానికి సంకల్పించింది.

'జాతీయ విద్యా విధానం ముసాయిదా (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్ట్) 2019'ను రూపొందించిన తీరు 2015 జనవరి నుండే పాఠశాల విద్యకు సంబంధించి 13 అంశాలు (థీమ్స్), ఉన్నత విద్యలో 20 అంశాలు గుర్తించి ప్రజాస్వామ్య దేశంలో పాలసీ రూపకల్పనలో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి MyGov పోర్టల్ ద్వారా ప్రజలు, విద్యా, పరిశోధన, ఇతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థల నుండి సలహాలు – సూచనలను ఆన్‌లైన్‌లో స్వీకరించడమే కాకుండా, ఎక్స్‌పర్ట్‌లతో మీటింగులు కూడా జరిపింది. అలాగే, 1,10,623 గ్రామ పంచాయతీలు, 3250 బ్లాకులు, 962 పట్టణ స్థానిక సంస్థలు, 406 జిల్లాలు, 21 రాష్ట్రాలు వారి–వారి అభిప్రాయాలను, నివేదికలను survey.mygov.in ద్వారా అప్‌లోడ్ చేశాయి. మొత్తమ్మీద 35,000 ఆన్‌లైన్ సలహాలు, 485 ఉత్తరాలు, 7613 ఈ–మెయిల్లు, రాష్ట్రపతి, ప్రధానమంత్రి కార్యాలయాల నుండి సూచనలతో పాటుగా, 31 కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, 76 పార్లమెంట్ సభ్యులు, 305 విఐపిలు, 324 సంస్థలు ఎంహెచ్‌ఆర్‌డికి అభిప్రాయాలను వెల్లడించాయి. తదుపరి, వీటినన్నింటిని క్రోడీకరించి, ఎంహెచ్‌ఆర్‌డికి ఒక నివేదిక రూపంలో అందించడానికి మాజీ క్యాబినెట్ సెక్రెటరీ కీ.శే. టిఎస్ఆర్ సుబ్రమణ్యన్‌గారి అధ్యక్షతన 2015 అక్టోబర్ నెలలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 2016 మే నెలలో తమ రిపోర్టును సమర్పించింది. ఆ తర్వాత, 2017 జూన్ నెలలో 'నూతన జాతీయ విద్యా విధానం డ్రాఫ్ట్'ను రూపొందించడానికి ఇస్రో శాస్త్రవేత్త పద్మవిభూషణ్ డా. కస్తూరి రంగన్ గారి అధ్యక్షతన మొత్తం తొమ్మిదిమందితో మరో కమిటీని నియమించింది. ఈ కమిటీ, ముసాయిదా (డ్రాఫ్ట్)ను రూపొందించే కార్యక్రమంలో భాగంగా సుమారు పన్నెండుసార్లు ఢిల్లీ, బెంగళూర్లలో సమావేశమైయింది. చివరగా, డా. కస్తూరి రంగన్ కమిటీ అందుబాటు/చేరువ (ఆక్సెస్), సమన్యాయము (ఈక్విటీ), నాణ్యత (క్వాలిటీ), ఆర్థిక స్థోమత (అఫర్డబిలిటీ), జవాబుదారీతనం (అకౌంటబిలిటీ) అనే ఐదు అంశాల ఆధారంగా 'జాతీయ విద్యా విధానం (జావివి/ఎన్ఇపి)–2019 డ్రాఫ్ట్' పూర్తి నివేదికను ఎంహెచ్‌ఆర్‌డికి 2018 డిసెంబర్ నెలలో సమర్పించింది. తదుపరి కేంద్ర క్యాబినెట్ జాతీయ విద్యా విధానం (జావివి)–2020ని జూలై 2020లో ఆమోదించింది.

**జాతీయ విద్యా విధానం–2020 చేసిన సిఫార్సులు:**

జావివి–2020 విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేయాలని సిఫార్సు చేసింది. పూర్వ ప్రాథమిక విద్య, పాఠశాల విద్య, ఉన్నత విద్య, పరిశోధన, ఉపాధ్యాయ విద్య, విద్యార్థుల్లో సామాజిక – నైతిక విలువలు పెంపొందించుట, లింగ సమానత్వం, సాంకేతిక (టెక్నికల్) విద్య, వృత్తి విద్య, అంతర/బహుళ విషయ (ఇంటర్/మల్టీ – డిసిప్లినరీ) విధానం, వివిధ స్థాయిల్లో విద్యా నిర్వహణ, ప్రభుత్వాల పాత్ర, ప్రైవేట్ సంస్థల పాత్ర, ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్), బోధనా మాధ్యమం, భారతీయ ప్రాచీన భాషల పరిరక్షణ మొదలగు విద్యా వ్యవస్థకు సంబంధించిన ఎన్నో అంశాలను స్పృశిస్తూ, క్లుప్తంగా వివరించింది. జావివి – 2020 పాఠశాల విద్యను 5౦3౦3౦4 విధానంలో నాలుగు దశలుగా రూపకల్పన చేయాలని సూచించింది. దీని ప్రకారం, ఐదు సంవత్సరాల వ్యవధి ఉండే పునాది దశలో 3 సం.ల ప్రీ–ప్రైమరీ, ఒకటి, రెండు

తరగతులు; 3 సం.ల కాల పరిమితి ఉండే సన్నాహక దశలో 3,4,5 తరగతులు; 3 సం.ల వ్యవధి ఉండే మధ్య దశలో 6,7,8 తరగతులు; చివరగా 4 సం.ల కాల పరిమితి ఉండే ఉన్నత దశలో 9,10,11,12 తరగతులు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో ఇప్పుడు అమల్లో ఉన్న ఇంటర్మీడియట్ విద్యను పూర్తిగా రద్దుచేసి, పాఠశాల విద్యలో కలపాలని సిఫార్సు చేసింది. 3 సం. వయస్సున్న పిల్లలను పాఠశాలలో చేర్చవచ్చని, వారికి 18 సం.లు వచ్చేనాటికి పాఠశాల విద్య పూర్తికావాలనీ పేర్కొంది.

స్కూళ్ళలో విలీనం కానున్న అంగన్వాడీలు చిన్న పిల్లల్లో భౌతిక – జ్ఞానాత్మక అభివృద్ధి, సామాజిక–భావోద్వేగ – నైతిక – సాంస్కృతిక అభివృద్ధితో పాటుగా కమ్యూనికేషన్ (భావ వ్యక్తీకరణ)కు అవసరమయ్యే భాషా, సంఖ్యా, అక్షరాస్యతా సామర్థ్యాలు పెంపొందించడం ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ యొక్క లక్ష్యం కావాలని జావివి –2020 అభిప్రాయపడింది. మూడు సంవత్సరాలలోపు పిల్లలకు, 3–8 సం. పిల్లలకు వేర్వేరుగా పాఠ్యాంశాలు రూపొందించి వాటిని బోధించే పద్ధతులు తల్లిదండ్రులకు, టీచర్లకు సులువుగా అర్థమయ్యేలా అభివృద్ధి చేయాలని ఎన్‌సిఈఆర్‌టికి సూచించింది. అలాగే ప్రస్తుతం పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లకు వారి విద్యార్హతలనుబట్టి బోధన పద్ధతులపై ప్రత్యేక శిక్షణనిచ్చేందుకు ఫ్రేమ్ వర్క్ రూపకల్పన చేసే బాధ్యతను కూడా ఎన్‌సిఈఆర్‌టికే అప్పగించింది. ఈ కొత్త పాలసీ ప్రకారం, 2020 సం.నాటికే దేశవ్యాప్తంగా ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్‌ను పాఠశాల విద్యలో విలీనం చేయాలనున్నా, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ఇంకా అడుగులు వేయడంలేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్‌ను పాఠశాల విద్యలో విలీనానికి విధివిధానాల రూపకల్పనకై ఆర్థికశాస్త్రవేత్త, సామాజిక శాస్త్రవేత్త, మనోవైజ్ఞానిక శాస్త్రవేత్త, మహిళా–శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్య శాఖల యొక్క కమీషనర్లు, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ నుండి డైటీషియన్ / న్యూట్రిషనిస్ట్, నీలోఫర్ హాస్పిటల్ నుండి డాక్టర్, బాలల హక్కుల కమీషన్ చైర్మన్, బాలల వికాసానికి కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలతో కూడిన ఒక కమిటీ వేసి సాధ్యమైనంత తొందరగా నివేదిక పొందేలా చొరవ తీసుకోవాలి.

**భవిష్యత్తులో ప్రపంచ గతిని మార్చే రంగాలు:**

రాబోయే కాలంలో బిగ్ డాటా, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్‌వంటి రంగాలు ప్రపంచాన్ని మార్చగలవని, అందుకనుగుణంగా ఆయా రంగాల్లో స్కిల్డ్ లేబర్‌ను తయారుచేసే ఉద్దేశ్యంతో ఉన్నత విద్యలో కూడా భారీ సంస్కరణలు చేయాలని జావివి – 2020 నివేదించింది. హౌస్ ఎఫెక్ట్ వల్ల వాతావరణం, ఫుడ్, ఎనర్జీ, వాటర్, సానిటేషన్‌వంటి రంగాల్లో కూడా నిపుణులకు మంచి డిమాండ్ రాబోతుందని అంచనా వేస్తూ, ఈ గొప్ప అవకాశాన్ని మన దేశం అందిపుచ్చుకోవాలని అభిప్రాయపడింది. దీనివల్ల మన దేశం ఆర్థిక వృద్ధిని సాధించడమే కాకుండా, నైపుణ్య భారత్‌గా అవతరించడానికి మార్గం సుగమం కానుందని నొక్కి వక్కాణించింది. దీనికి ఉన్నత విద్యలో చాలా మార్పులు చేయాలని సూచించింది. ఉన్నత విద్యను అభ్యసించిన వ్యక్తులు తమ కాళ్ళమీద తాము నిలబడేలా చేయడమే కాకుండా, దేశం, దేశంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనేందుకు కూడా ఉపయోగపడాలి. అందువల్ల ఉన్నత విద్య ఎంత సృజనాత్మకంగా ఉంటే, అంతగా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించబడి, దేశ ఆర్థికాభివృద్ధికి ప్రత్యక్షంగా దోహదపడుతుంది.

**ఉన్నత విద్యలో ఉన్న సమస్యలు–పరిష్కారాలు:**

ఎన్ఇపి–2020 ప్రస్తుతం అమల్లో ఉన్న ఉన్నత విద్యలో సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారాలను మార్గాలను కూడా సూచించింది. దేశంలో 50 వేలకు పైగా హైయర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్లు ఉండగా, చాలావాటిలో ఒకే ఒక కోర్సుతో ధనార్జనే ధ్యేయంగా నడవడం, నాణ్యమైన బోధన జరగకపోవడం, విద్యార్థులు జ్ఞానాన్ని సముపార్జించకపోవడం, కొన్నింట్లో 100 మంది కంటే తక్కువ విద్యార్థుల నమోదు ఉండటం, సైన్స్, సోషల్ సైన్స్ సబ్జెక్ట్స్ మధ్య ఎక్కువ అంతరం (గ్యాప్) / తక్కువ సమన్వయం ఉండటం, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల నమోదు తక్కువగా ఉండటం, ఆర్థిక వనరులలేమివల్ల చాలా కాలేజీల్లో పరిశోధన ప్రస్తావనే లేకపోవడం, క్వాలిఫైడ్ టీచింగ్ స్టాఫ్ లేకపోవడం, తగిన సదుపాయాలు లేకపోవడం, అనుబంధ యూనివర్సిటీకి సంబంధించిన సమస్యలు. నకిలీ (ఫేక్) కాలేజీ/ యూనివర్సిటీల బెడద ఉండటంవంటివాటిని ప్రధానమైన సమస్యలుగా పేర్కొంది. అందువల్ల ఉన్నత విద్యావ్యవస్థను మెరుగుపరిచేందుకు ఒక ముసాయిదాను ఎన్ఇపి–2020 రూపొందించింది. దానిలో భాగంగా అన్ని హైయర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్లు 2040 వరకు రకరకాల కోర్సులు స్టార్ట్ చేస్తూ, కనీసం 3 వేల విద్యార్థులను చేర్చుకొని అమెరికాలోని ఐవీలీగ్,

స్టాన్‌ఫర్డ్, ఎంఐటిటల్లాగా మల్టీ డిసిప్లినరి (బహుళ విషయ పరిజ్ఞానం) యూనివర్సిటీ/కాలేజీలుగా మార్చాలని సిఫార్సు చేసింది. ఈ విషయంలో ప్రాచీన భారతదేశంలో పేరొందిన నలందా, తక్షశిల యూనివర్సిటీలు వివిధ కోర్సులను అందిస్తూ ప్రపంచ నలుమూలల నుండి వేలాది విద్యార్థులను ఆకర్షించేవనే చారిత్రక వైభవాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పాలసీ పేర్కొంది.

**ఉన్నత విద్యకు సంబంధించి సిఫార్సులు:**

ప్రస్తుతమున్న ఉన్నత విద్యా సంస్థలను టీచింగ్ యూనివర్సిటీ (టియు), రీసర్చ్-ఇంటెన్సివ్ యూనివర్సిటీ (ఆర్ యు), అటానమస్ డిగ్రీ-గ్రాంటింగ్ కాలేజీ (ఏసి)లనే మూడు రకాలుగా మార్చాలని రికమెండ్ చేసింది, అయితే ఆయా యూనివర్సిటీలు వాటికి ఉన్న శక్తిసామర్థ్యాలు, అభిరుచి, వనరులనుబట్టి టియు, ఆర్‌యులల్లో ఏదైనా ఒకదాన్ని ఎంచుకోవచ్చని జావివి-2020 చెప్పింది. ఆర్‌యులు పరిశోధనపై మాత్రమే పూర్తిగా ఫోకస్ చేస్తే, టియులు బోధనపై ఎక్కువ ఫోకస్ చేస్తూ పరిమితంగా పరిశోధన కూడా చేస్తాయి. ఏసిలు మాత్రం డిగ్రీ స్థాయిలో బోధనపై ఫోకస్ చేస్తాయి. దేశంలో ఉన్న అన్ని కాలేజీలు క్రమక్రమంగా 2035 వరకు ఏసిలుగా మారాలని, ఆ తర్వాత అనుబంధ (అఫిలియేటెడ్) కాలేజీ విధానాన్ని ఎత్తివేయాలని దిశానిర్దేశం చేసింది. కాలక్రమేణా, ఒక ఏసి, టియుగా కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ మూడు రకాల విద్యాసంస్థలకు వేర్వేరుగా అక్రిడిటేషన్ రూల్స్ రూపొందుతాయి. పరిశోధనలకు ప్రత్యేకంగా నిధుల కోసం 'నేషనల్ రిసర్చ్ ఫౌండేషన్'ను ఏర్పాటు చేయాలని, ఉన్నత విద్య మొత్తానికి దేశవ్యాప్తంగా ఒకే ఒక నియంత్రిత విధానం (రెగ్యులేటరీ సిస్టమ్) ఉండాలని, ఆన్‌లైన్/డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అందించేందుకు అన్ని విద్యాసంస్థలకు అవకాశం కల్పించాలని సూచించింది, ఉన్నత విద్యలో సేవాదృక్పథం ఉండే ప్రైవేట్ సంస్థల యొక్క భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూనే, ప్రైవేట్ యూనివర్సిటీ/కాలేజీలు పారదర్శకంగా ఉండేలా, విద్యావ్యాపారీకరణను అడ్డుకునేందుకు 'లైట్ బట్ టైట్' విధానాలను అనుసరించాలని రికమెండ్ చేసింది. మన దేశంలోని ప్రఖ్యాత యూనివర్సిటీలు, విదేశాల్లో వారి క్యాంపస్‌లను నెలకొల్పడానికి, అలాగే టాప్ 100 ర్యాంకుల్లోనిలిచే ఫారిన్ యూనివర్సిటీలు, మన దేశంలో వారి క్యాంపస్‌లను స్థాపించి, విద్యా కార్యకలాపాలు నిర్వహించడానికి వీలుకల్పించేలా ప్రత్యేక చట్టం రూపొందించాల్సి ఉంటుందని జావివి - 2020 కూడా సిఫార్సు చేసింది.

**ఉన్నత విద్యలో మారనున్న కోర్సు వ్యవధులు:**

విద్యార్థిని దృష్టిలో పెట్టుకొని డిగ్రీ, పిజి కోర్సుల్లో చాలా మార్పులు సూచించింది. ఒక డిగ్రీ కోర్సును విద్యార్థి తనకు వీలైనప్పుడు చదువుకునేలా (మల్టిపుల్ ఎంట్రీ- మల్టిపుల్ ఎగ్జిట్) వాటిని రీడిజైన్ చేయాలని చెప్పడం ఎన్ఇపి-2020 చేసిన మరో ముఖ్యమైన సిఫార్సు. దీని ప్రకారం, ఎవరైనా విద్యార్థి అండర్ గ్రాడ్యుయేషన్‌లో ఒక సం. పూర్తిచేస్తే డిప్లొమా, 2 సం.లు చదివితే అడ్వాన్స్ డిప్లొమా, 3 సం.లు పూర్తిచేస్తే బ్యాచలర్ డిగ్రీ, 4 సం.లు చదివితే 'డిగ్రీ విత్ రిసెర్చ్'లాంటి సర్టిఫికేట్లు అందిస్తారు. అయితే పాలసీ మాత్రం 4 సం.ల డిగ్రీకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పింది. నిజానికి 4 సం.ల డిగ్రీ చేసినవారికి విదేశాల్లో మాస్టర్ డిగ్రీ చేయడానికి మార్గం సులుభమౌతుంది. అలాగే పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో కూడా మార్పులు చేసింది. 3 సం.ల డిగ్రీ చేసినవారు 2 సం.ల పిజి, 4 సం. డిగ్రీ చేసినవారు 1 సం. పిజి, 12వ తరగతి తర్వాత అయితే 5 సం.ల ఇంటిగ్రేటెడ్ పిజి చేయాలని నిర్దేశించింది. అంతేకాకుండా విద్యార్థి ఒక కాలేజీ/యూనివర్సిటీ నుండి మరో కాలేజీ/యూనివర్సిటీకి వెళ్ళేందుకు స్వేచ్ఛ కల్పించింది. దీనికోసం 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్' (ఏబిసి)ని ఏర్పాటు చేసి విద్యార్థులు సాధించిన క్రెడిట్లను డిజిటల్ రూపంలో భద్రపరచాలని సిఫార్సు చేసింది. దీని ద్వారా విద్యార్థులు ఎప్పుడైనా, ఎక్కడైనా, వారికి నచ్చిన ఇన్‌స్టిట్యూట్లలో సులువుగా జాయిన్ అయ్యే వీలుకలుగుతుంది. ఇక రిసెర్చ్ కోర్సుల విషయానికి వస్తే, ఎంఫిల్‌ను మొత్తానికే తొలగించాలని, పిజి పూర్తి చేసినవారు డైరెక్ట్‌గా పిహెచ్‌డి చేయవచ్చని రికమెండ్ చేసింది.

**మరికొన్ని ముఖ్యమైన సిఫార్సులు:**

మన దేశంలో ఉన్నత విద్యలో ఈ సంస్కరణలు చేయడం ద్వారా 2018 లో 26.3 శాతంగా ఉన్న గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియోను (నమోదు నిష్పత్తి) 2030వరకు 50 శాతానికి పెంచవచ్చు. దీంతోపాటుగా, పాఠ్యప్రణాళిక, బోధనావిధానం, మూల్యాంకనంలో మార్పులు చేర్పులు అవశ్యం అని కూడా పాలసీ నొక్కివక్కాణించింది. 'కాదంబరి'లో బాణభట్టుడు పేర్కొన్నట్టుగా 64 కళల్లో శిక్షణ ఇవ్వడమే నిజమైన విద్య అనీ, అలా నేటి విద్యార్థులకు సంపూర్ణమైన విద్యను అందించాలని పాలసీ అభిప్రాయపడింది. విద్యార్థులను ఒక్క

జ్ఞానవంతులుగా చేయడమే కాకుండా సామాజిక, భౌతిక, మానసిక, భావోద్వేగ (ఎమోషన్), సౌందర్యాత్మక, నైతిక తదితర అంశాల్లో కూడా శిక్షణనిస్తే వారు సంపూర్ణ మానవులుగా ఎదిగి, దేశోద్ధారకులౌతారు. అలాగే నిత్యసత్యాలైన సత్యం, శాంతి, అహింస, ధర్మం, ప్రేమ, మానవత్వం, కరుణ, త్యాగం, సౌభ్రాతృత్వం, సోదరభావం, లౌకికతత్వం, సేవ, భూతదయ, పర్యావరణ పరిరక్షణ మొదలైన విలువలను పాఠ్యప్రణాళికలో అంతర్భాగం చేయడం ద్వారా విద్యార్థుల మూర్తిమత్వం (పర్సనాలిటీ) అభివృద్ధి చెందుతుంది. క్రమక్రమేణా ఇలాంటి మహోన్నత విలువలు పాటించేవారే ప్రపంచానికి చోదకశక్తిగా మారి మొత్తం మానవాళినే సన్మార్గంవైపు నడిపించడమే కాకుండా ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు కొత్త ఆవిష్కరణలతో పరిష్కారం చూపుతారు. అందువల్ల సైన్స్ విద్యార్థులకు సామాజిక స్పృహ ఎంత ముఖ్యమో, ఆర్ట్స్ / సోషల్ సైన్స్ విద్యార్థులకు సైంటిఫిక్ టెంపర్ అంత ప్రధానమై ఉండాలి. ఈ కారణంచేతనే ఎన్ఇపి-2020 అన్నిరకాల ఉన్నత విద్యా సంస్థల్లో మల్టీ డిసిప్లినరి (బహుళ విషయ పరిజ్ఞానం) విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని సిఫార్సు చేసింది. దీనికోసం ఐఐటిడి, ఐఐఎం మాదిరిగా మల్టీ డిసిప్లినరి ఎడ్యుకేషన్ & రిసర్చ్ యూనివర్సిటీస్ (ఎంఈఆర్‌యూ) ఏర్పాటు చేయాలని కూడా సిఫార్సు చేసింది.

**జావివి -2020 అమలు చేయడంలో సవాళ్ళు:**

దేశంలోని మొత్తం విద్యా రంగాన్ని గాడినపెట్టేందుకు ఎన్ఇపి-2020 బృహత్తర ప్రణాళిక సిద్ధం చేసి, నివేదికలో పొందుపరిచింది. ఆ నివేదికను అమలు చేయడంలో ముందడుగుగా ప్రస్తుతం వాడుకలో ఉన్న కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖను (ఎంహెచ్ఆర్‌డి)ని 'మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్'గా మార్చారు. కానీ ఏ పాలసీ యొక్క విలువ అయినా దానిని అమలుచేసే విధానాన్నిబట్టి ఉంటుంది. కానీ, నిజానికి ఈ ఎన్ఇపి-2020ని అమలు చేయడానికంటే ముందే కొన్ని సమస్యలు - సందేహాలు ఉన్నాయి. ఇక పాలసీ అమలౌతున్నప్పుడు వచ్చే సమస్యలు మరికొన్ని ఉన్నాయి. విద్యారంగం ఉమ్మడి జాబితాలో ఉండటం, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రప్రభుత్వాలను ఒత్తిడి చేయలేకపోవడం, చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పాలసీని రాజకీయ కోణంలో చూడడం, కరోనా ప్రభావం తదితర కారణాలవల్ల జావివి-2020 అమలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. చాలా రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం దీనిని అమలు చేయడంలో ఎదురయ్యే సమస్యలు/లోతుపాతులు తెలుసుకోవడానికి అధ్యయన కమిటీలు కూడా వేయకుండా గుంభనంగా వ్యవహరిస్తున్నాయి. ఇక పాలసీ సిఫార్సులనుబట్టి కొన్ని సవాళ్ళు అంచనావేయవచ్చు. ఉన్నత విద్యలో సేవా దృక్పథం (ఫిలాంత్రపిక్) లేని ప్రైవేట్ సంస్థల యొక్క భాగస్వామ్యం పెంచడంవల్ల, విద్య వ్యాపారమయమై సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారికి అందని ద్రాక్షయే అవుతుంది. దీనిని ముందుగానే గ్రహించిన జావివి-2020 ప్రైవేట్ యూనివర్సిటీలు కనీసం సగంమంది విద్యార్థులకు, ట్యూషన్ ఫీజులో 50% నుండి 100% వరకు ఆర్థిక సహాయాన్ని ఉపకార వేతనాలుగా (స్కాలర్‌షిప్) అందించాలని సిఫార్సు చేసింది. అలాగే, ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో చదవడానికి ఏ వర్గానికి చెందిన విద్యార్థైనా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండడానికి 'జాతీయ స్కాలర్‌షిప్ ఫండ్'ను ఏర్పాటు చేయాలని ఈ కొత్త డ్రాఫ్ట్ సూచించింది. ఇంకా ఉపాధ్యాయ విద్యను ప్రోత్సహించడానికి ఉపకార వేతనాలు ఇవ్వాలని కూడా పేర్కొంది. ఇలా ఎన్నో సవాళ్లున్నప్పటికీ, ఎన్ఇపి-2020 అమలు చేయడం మాత్రం అనివార్యం. దేశమంతా విద్యారంగానికి సంబంధించి ఒకే పాలసీ ఉంటే రాబోయే తరానికి మంచిది. ఐఐటిడి, నీట్, సెంట్రల్ యూనివర్సిటీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్, నెట్‌వంటి పరీక్షలు దేశ వ్యాప్తంగా ఒకేసారి, ఒకే సిలబస్‌తో జరుగుతాయి. అందువల్ల దేశ వ్యాప్తంగా 'వన్ నేషన్-వన్ ఎడ్యుకేషన్' విధానాన్ని పాటిస్తే విద్యార్థులందరికీ ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఇలా చేయడంవల్ల విద్యార్థులకు సమయం కలిసిరావడమేకాకుండా, ఆర్థికంగా కూడా ఖర్చు తక్కువౌతుంది. అన్నింటికంటే ముఖ్యంగా విద్యార్థుల్లో మానసిక కుంగుబాటు చాలావరకు తగ్గుతుంది. అందుకే సెంట్రల్ యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలు, అటానమస్ కాలేజీలు జావివి-2020 అమలు చేయడంలో ముందు వరుసలో ఉన్నాయి. యూజిసి నుండి అధికారికంగా సర్క్యులర్ (ఉత్తర్వులు) వస్తేగానీ, అన్ని కాలేజీలు/యూనివర్సిటీలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ఇపి-2020ని అమలు చేయడానికి పూనుకుంటాయని చెప్పవచ్చు. ఒక్కో సమస్యను అధిగమిస్తూ ముందుకెళ్ళినప్పుడే మనం ఈ పాలసీ యొక్క ప్రతిఫలాలను పొందగలం. అప్పుడే భారతదేశాన్ని 'విశ్వ గురువు'గా చూడగలుగుతాము. మి

**డా. శ్రీరాములు గోసికొండ - హైదరాబాద్.**

# మాయమై పోతున్న భీమవరపు 'మా శర్మ' మాష్టారు!

– ఐ.వి. రామరాజు

ఏలూరు కట్టమంచి కళాశాల దాగిన సరస్వతీ చీరకొంగు కొల్లేరు, భీమవరపు దంతాలూరే పాకశాలగా ఉప్పొంగిన వయ్యేరు – మా శర్మ మాష్టారు!

మరో ఆరుమాసాలు మా 'అవంతి సిమ్మెంటు' కర్మాగారంలో పనిచేసే అవకాశం, కార్మికుల సంఘిటిత – శక్తి, అలాగే గుంటూరు – బ్రాహ్మణపల్లి – సైదా పైక్ (KHD-HWI) – ఓ యువ ఇంజినీరు సేవలషేక్ యుక్తి ఉటంకించక తప్పదు, సరదాగా సాధించాం మన్నికతో సామర్థ్యపు సిమ్మెంట్ ఉత్పత్తి, అలా ఆ 'సాగర్ సిమ్మెంట్' యాజమాన్యం సుస్థిరతాభివృద్ధి (Sustainability development) వైపు – ఆ సముద్ర తరంగాల దాగిన ఉత్సాహపు దాపు – ఆధునికత అన్వయతతో అన్నిదేశపు సిమ్మెంట్ కర్మాగారాల గుంపు, అంతులేని ఆకాశహర్మ్యాలు మొలకిత్తంచడం కొరకు – భూమికే వాపు! కాకూడదు ఆ వరాహపు దంతపు – వాపు?, సుస్థిరపు (sustainability) వాతావరణ భద్రతా భరోసా – కావాలి అన్ని తరాల రైతు తేలికగా మోసే పచ్చగడ్డి మోపు. అలా వృత్తి సంతృప్తితో ఇండియా – ఉద్యోగంలో ఉయ్యాల ఊగే సమయంలో, నాకిచ్చిన పెద్ద ఇంటిలో – పనిమనిషి ముట్టని నా మంచం క్రింద ఓ మచ్చ! – అది నాకు తెలిసినవారి రూపమా?

మొన్న వర్షాకాలం తీసుకొచ్చే వాసనతో అనేక వందల గాజు పురుగులు ప్రతి నిముషం – ఎంత తుడిచినా మా జన్మ హక్కులా – ఓ రావణ/జరాసంధుని బొందులులా ప్రతీక్షణం – ప్రత్యక్షం – ఈ రామ నామధేయునిగా ప్రతీకారమేమోగా! అన్న తరుణంలో మూడు కప్పలు జాడ – దాడి, రాతిరి ఎంత నెట్టినా – ఉదయాన అవేకళ్ళు! ఈ 'కప్పల తిప్పలు' అనుకొనే సమయంలో – గాజుపురుగుల దాడి – తెలియకుండానే పగిలిపోవడం ఆలస్యంగా గుర్తించి, ఏదో తెలియని సంకేతపు సిగ్గుతో – ఉన్న మూడు కప్పలను బయటకు నెట్టకుండా కలసి దీపావళి మందులు కాల్చాము, ముగ్గురక్కల తమ్మునిగా 50 సంలు పైన ఇన్నాళ్ళు దూరంగా భ్రమపు ప్రేమగా జీవించి – ఇప్పుడు ముసలి చాధస్తంలో జీవనపు రుచిని రచించలేక ఓడిపోతున్న తరుణంలో ఈ మూడు మూగ కప్పల కనులు – నా బాల్యపు ముగ్గురక్కల గారాబపు పిలుపు ప్రతి ధ్వనులుగా పరవశించే తీర్చని రుణంలో!, కార్తీకమాసపు దీపాల కాంతులు కొండెక్కడంలో, ఆ కారుచీకటిలో ఒక్కసారే వచ్చిన ఆఖరి వర్షపు – కంగారు భద్రతా బూటుల బురదతో నా రూమ్‌లో ప్రవేశం, సూర్యోదయపు కాంతి కిరణాలలో అక్కడక్కడ చిరు రక్తపు మరకలు, బాత్‌రూమ్‌లో ఓ మూల ప్రతిరోజూ చూసే కప్ప పెద్దదవడం – ఆకారంలో నిండు గర్భిణిగా ఓసారి ఊహించాను: వాటి మేటింగ్ (సంభోగం) బావలను ఆఫ్రికాలో చూసినట్లుగా చూడలేదు కదా! – బహుశా 'మోడీ' భరత భూమిలో 'యోగీ' కాపలా కాయడం మూలానా – జంతు పుట్టుకలూ భారతంలోలా వరప్రసాదాలేనా? కానీ నాలో బలిచక్రవర్తి శిరస్సును త్రొక్కిన వామనుడు పాదపు – ప్రతీకార శాపంలా కనిపించినది – అదే 'మాయని మచ్చ' – నేనుగాంచిన నా మంచం క్రిందనే చూసిన మండూకపు – నా తలవాపు – 'అయ్యో! సోదరి మండోదరి! – ఇన్నాళ్ళు నా దరి – ఓం – నా హరి! బావ రావణునిగా తలంప వధించి – అక్క మండోదరిని గర్భిణిగా ఎందుకు వదిలినావయ్యా – నా రామయ్యా! ఇక ఏ యుద్ధమూ వలదయ్యా' – తలచి; రెండు లక్షల ఉద్యోగాన్ని వదిలి తెలంగాణా ఎక్స్‌ప్రెస్‌లో 'నిండుభారతం' మధ్యలో భోపాల్‌లో అర్ధరాత్రి ఎక్కేసా–ఓ స్వేచ్ఛా నిద్ర; ఓగంట భోగంలో – ఓ కల కలతగా లేపినది, 34 సంవత్సరాలుగా నా బుర్రలో ప్రాకే కానరాని ఓ విధ్యుల్లతది, అవును గత నెలలో సినీ నట శేఖరులు 'కృష్ణ అస్తమయం', మరో నటులు మురళీమోహనులు – తమ సి.ఆర్. రెడ్డి కళాశాల బి.యస్సీ 1958–60 అనే తమ క్లాస్‌మేట్స్ బ్యాచ్ పోటో – గూగోలగా – జయభేరిగావించడం, నాలో దాగిన విధ్యుల్లత ఓసారి మెరిసినది – అదే బి.యస్సీ. 1960 అనే తమ క్లాస్‌మేట్స్ పోటోలో – సూపర్‌స్టార్ కృష్ణ – బిగబిట్టే మురళీ మోహన్ రవంతో నా కలలో వచ్చే మా భీమవరం ఆల్ – ఇన్ – ఆల్ ఓ తరం ట్యూషన్ను మా ష్టారు – శ్రీ జె.వి.కె. యస్. శర్మగారు, ఆయన కూడా వారి బ్యాచ్‌మేటుగా, మేము చదివేటప్పుడు ఆయన తలుచుకోవడం – స్పురణతో ఇప్పుడు సినీ కృష్ణ

మాయంతో, మా మాయపోతున్న మహా మేధావి శర్మ మాష్టారి కొన్ని మేధా మహత్యాలు పంచుకొని ఓ అజ్ఞాత శిష్యపరమాణువుగా గురుదక్షిణగా బరువు దించుకొనే ప్రయత్నమే – ***మినిమ*** వ్యాసంగా దాగిన మా మాష్టారి విశ్వ రూపం.

భీమవరం – సుబ్బారాయుడి వీధి, బొంబాయి లాండ్రి ఎదురు సందు చివర – ఓ పెద్ద డాభాలో 1975 (బహుశా) నుండి 1990 ప్రాంతంలో – మా D.N.R. కళాశాల, బి.యస్సీ 1984 –1987 కాలంలో మా పిప్పర ఓ సీనియర్ స్టూడెంట్ (ఇప్పుడు కెనడా పౌరుడిగా ఫిజిక్స్ ప్రొఫెసర్) "రాజు – నీవు శర్మగారి దగ్గర లెక్కలు & ఫిజిక్స్ ట్యూషన్ జేరు – తక్కువ ఫీజు, నీవు చేసే 20 కి.మీ. – బస్ పాస్ షటిల్ సర్వీస్‌కు అనుకూలంగా అర్థమయ్యేలా చెబుతారు, పదివేలు విద్యార్థినీ – విద్యార్థుల కో ఎడ్యుకేషన్ D.N.R. collegeలో కంగారుపడకు, కవర్ చేసుకోమని – చక్కగా ఎంకరేజ్ చేసి – శర్మగారి దగ్గర ట్యూషన్ చేరే అవకాశం కలిగించడం, ఆ పిదప ఇలా – ఇంకా ఆ మేధావి శర్మ మాష్టారి చతురతకు నా ఆశ్చర్యపు మెదడు ఉబ్బిని ఎవరితోనూ పంచుకోలేక తెలియని భారంతో ఇబ్బంది పడుతున్నాను.

మాష్టారు – శ్రీ జె.వి.కె.యస్. శర్మగారికి – బేసిక్‌గా గణితశాస్త్రం ఆయన అసలు సబ్జక్ట్ – కానీ 1975–88 భీమవరపు ప్రాంతంలో – ఇంటర్, డిగ్రీ – సైన్స్ – ఇంజినీరింగ్ (డి.యన్.ఆర్., కె.జి.ఆర్. సైన్స్ & ఆర్ట్స్ & ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజినీరింగ్ మొ''గు) కాలేజి విద్యార్థినీ – విద్యార్థులకు: మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మెకానికల్, సివిల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ సబ్జక్ట్స్, సి.ఏ. నుండి క్రొత్తగా వచ్చిన కంప్యూటర్ సైన్స్ – కంపార్ట్‌మెంటల్ – షోలాపూర్ ఇంజినీరింగ్ డొనేషను బ్యాచ్ విద్యార్థులతో సహా భోదన చేసేవారు. ఒకానొక కాలంలో 800 స్టూడెంట్స్ – తెల్లారుజాము 4 గం.ల నుండి అర్ధరాత్రి 0.30 గం.ల వరకు వారానికి నాలుగు సెషన్స్‌లో విభిన్న సబ్జక్ట్స్ వివిధ తరగతులవారికి అనర్గళంగా చెబుతూనే ఉండేవారు.

ప్రపంచంలో ఓ క్రొత్త సబ్జక్ట్ రిఫరెన్స్ బుక్‌గా ఇస్తే – ఆ సబ్జక్ట్‌లో ఓ 30 సం అనుభవమున్న ప్రొఫెసర్‌లా వివరించి – అది ఓ సింగిల్ పేద విద్యార్థియైన సరే విశిదీకరించి భోదించగలరు – కాదు భోదించడం చూశాము.

**ఓ పరీక్ష:** 1984లో, మా 1st ఇయర్ బి.యస్సీ – కామన్ మ్యాథ్స్ క్లాస్‌లో ఇంజినీరింగ్ ఎంట్రన్స్ లాంగ్ టర్మ్ కొంటె స్టూడెంట్స్ సీనియర్ ఇంటరు కలన గణితపు ఆఖరి ప్రాబ్లమ్స్ "సాల్వ్ చేసి పెట్టగలరా సార్" అని ఓ లీజర్ డౌట్స్ తరగతిలో మ్యాథ్స్‌లో ఓ గోల్డ్‌మెడల్ సీనియర్ లెక్చరరుగారిని ఆయన ప్రోత్సాహంతోనే అభ్యర్ధనగా అడిగారు. అది కాలిక్యులస్ పాఠంలో ఓ జటిలమైన సమస్య – పరీక్షలలో రాదని సాధారణంగా అందరు లెక్చరర్సు వదిలేసే విధానం.

సీనియర్ లెక్చరరు శ్రీ రాజు గారు – కలన గణితపు కవ్వించే సమస్యను సాల్వ్ చేయడంలో బ్లాక్ బోర్డ్ మీద బోర్డర్లు అన్నీ ఆక్రమించారు, నెక్స్ట్ పీరియడ్ కూడా పాపం ఖాళీయని కంగుతినక మరల ఖడ్గతిక్కనలా విజృభించారు, చివరకు 'ప్రశ్నకు – జవాబు ప్రశ్నే రావడం', ఆయన నల్లని ముఖం చాక్‌పీస్‌ల పౌడర్‌తో తెల్లగా పాలిపోవడం – మేమంతా ఏమీ ఎరుగని విధంగా మరుసటి లాంగ్వేజ్ పీరియడ్ శ్రీ ఆలీమ్ మాస్టార్ ఆంగ్లపుక్లాస్ – As you like it – షేక్‌స్పియర్ స్పిన్నింగ్ రొమాన్స్‌లో మునిగిపోవడం జరిగిపోయినది.

మరుసటిరోజు పట్టువదలిన – ఓ విద్యార్థి మా శర్మగారి ట్యూషన్ క్లాస్‌లో – ఆ కాలేజీలో సాల్వ్ చేయలేని కలన గణితపు ప్రశ్న ఇచ్చి – చెయ్యండయ్యా అన్నాడు, అంతేనా! అన్నట్లుగా ఆ శర్మ మాస్టార్ – మూడు స్టెప్‌లలో – పార్షియల్ ఇంటిగ్రేషన్ అంటూ విడమర్చి సమస్యా లెక్కను మామూలు ఎక్కంగా చూపించారు, అలాగే వేరే అప్లికేషన్స్ అంటూ రెండు పద్ధతులుగా క్రియేటివిటి అంటే గావించారు. కట్ చేస్తే ఆ లెక్క సాల్వ్ చేయలేని కాలేజీ సీనియర్ లెక్చరరు – ఆ పిదప ప్రముఖ అమెరికన్ యూనివర్శిటీలో ప్రొఫెసర్ ఓ రాజుగా పచ్చగార్డుతో వెచ్చగా స్థిరపడినట్లుగా దినపత్రికలో – ఏకంగా ఇంటర్వ్యూలో చదవడం – మా పాత రోజులు విక్కరించడంలా – ఏదో సాల్వ్ చేయని ప్రపంచపు లెక్క సహజమేమోయని బుర్రలు మూసుకొన్నాము.

ఓ శని–ఆది వారాలు "సింహాసనం" సినిమా రిలీజ్ అయ్యిందని – అన్ని బ్యాచ్‌లకు శెలవిచ్చేశారు. అంత డబ్బు ఖర్చుచేసి కృష్ణగారు సినిమా తీస్తే ఎలా ఉన్నా చూడగలరని ప్రోత్సాహించారు – 'తన డిగ్రీ బ్యాచ్‌మేటుగా 1961లో సినిమా అవకాశం వస్తే పార్టీ ఇస్తానని కనపడకుండా వెండితెరపై వెలుగుతున్నాడయ్యా' – ఏ

వెటకారం లేకుండా అనడం మాకు గుర్తు. మాకు తెలిసి మాస్టారు ఎంతో ఉన్నతంగా జీవించేవారు, బహుశా పెద్ద కలర్ టి.వీ., ఫ్రిజ్ & ఇతరత్రా ఇంటి అవసరాల కుటుంబ ఖర్చులు ఉన్నతంగా భీమవరపు రాజులకు తగ్గకుండా వాడేవారు, అప్పటికి కార్ల గోల ఇంకా రాలేదు, ఓ రిక్షావాడు ఆయన ఆస్థానంలో పర్మెనెంటు అన్నట్లుగా కూరగాయలు/కిరాణా సరుకులు తేవడానికి, మాస్టారు – మేడమ్‌తో సెకెండ్ షోకి తీసుకొని వెళ్ళడానికి ఉండేవాడు.

ఆఖరిసారిగా డిగ్రీ తర్వాత సొంత పాడి పాలకోవతో గులాం జామ్ అంటూ మా అక్కయ్య ప్రథమ ప్రయోగంగా ఓ క్యానుడుతో 20 కిమీ సైకిల్ తొక్కి – కేవలం ఆయన దర్శనపు భాగ్యంగా ఇవ్వడం – "రామరాజు గారు! (ఆయన ఏ విద్యార్థినీ – విద్యార్థినైనా మన్నించడం అలవాటు) రెండేళ్ళు ఉండండి మిమ్ములను – ఏ.యం.ఈ. లేక ఎమ్.సి.ఏ. చేయిస్తాను", అని శర్మ మాస్టారు చెప్పడం, మేము విడిపోవడం–

ఆ పై నేను సిమ్మెంటు తయారీ మంటలు కాల్చే కాపరిగా – సత్యానికే 'హరీ' అంటూ అందరి ఊపిరికి కొంచెం కర్బనపు వాయువు – అభివృద్ధి అంటూ అధికారకంగా వారి చేతులతోనే అందింస్తూ వారినే హిట్లర్లు – స్వయం తయారీగా, తెలియని మీటర్లు దాచుకొంటూ – హద్దులు లేని అన్ని హైటెక్ సిటీల ఆకాశ హర్మ్యాలత్యాశల మర్మపు కర్మపు సాఫ్ట్‌వేరులశోక ధర్మపు చక్రాలలో – ఓ శిలనై తిరుగుతున్నాను.

2014లో నా భీమవరపు ప్రాణమిత్రునికి – ఈ భళే భీమవరపు శర్మ మాస్టారు వివరాలు సంపాదించ మనవి చేయడం, అదే సుబ్బారాయుడి వీధి రోడ్ – బొంబాయి లాండ్రి ఎదురు సందు చివరకంటూ ఆనమాల అనుమానాలతో – శర్మ మాస్టారు అన్నగారి స్వంత ఇల్లుగా తలచుకొని – "ఓనరు అమ్మగారున్నారని" – వీధిలో బహుశా ఓ ట్రైలరు సంకేతం ఇవ్వడం – ఆ బ్రహ్మానందంలో – నా బుర్ర జాగ్రత్త పడినట్లున్నదేమో! ముందరగా శర్మగారి అన్నగారి శిష్యుడనని (ఆయన కూడా పేరున్న రసాయనిక శాస్త్రపు పండితులే – 1987లోనే పరమదించారు), వాళ్ళబ్బాయి క్లాస్‌మేటని – మెల్లగా దాగిన ఆశతో అడిగా – ఆమె మరిదిగారైన శర్మమాస్టారు వివరాల – ఆరాల ఆరంభంలోనే – నన్ను ప్రపంచంలో ఒకే ఒక్కదౌర్భాగ్యునిగా చూసినారు – ఆ కోపపు శబరి, "మీరెవరో? ఉన్నతులుగా ఉన్నారని" – నా స్నేహితుని ఇంటి వివరాలతో వదిలి "వచ్చిన దారిన వెళ్ళండి – అతని (శర్మ మాష్టారు) గురించి ఏమీ తెలియవు, ఎక్కడో కోచింగ్ కాలేజిలో ఉండవచ్చు – ఉనికి తెలియదు – మొబైల్ నెంబరూ లేదు – దయతో వెళ్ళగలరు, ఎందుకు ఇంకా స్థిరపడనివారిని'' వెతుక్కుంటారన్న భావంలో – గౌరవంగా శెలవు తీసుకొనేలా సాగనంపారు. నా స్నేహితుని (1989 నుండి) దగ్గర శర్మ మాష్టారు అన్ని లెక్కలకు రెక్కలొచ్చి – విశ్వంలో అన్ని సబ్జక్‌లకు పక్షవాతమొచ్చి మూగతో చివరి పరీక్షలు తప్పిపోయినట్లుగా తల తిరిగి – ఆర్.టి.సి. బస్‌లో గరగపర్రు గతుకుల రోడ్‌పై – కొరడా కొట్టుకుంటూ మా పిప్పర వెళ్ళిపోయాను.

2015లో అడిస్ అబాబా – ఇథియోపియా ఆఫ్రికా కొమ్ము – అందాల రాజధాని మధ్యలో అమెరికా నుండి వచ్చే ఓ అనుకోని అతిథికి – మా రాజుల (క్షత్రియ) కులపు లంకెగా – నేను ఓ రోజు మర్యాద చేయవలసి వచ్చినది, ఆయన హోదాకు సరితూగని ఈగనని – సున్నండ్లు – పూత రేకులు – పకోడీల ఫలహారం పంచుకోనప్పుడే అర్ధమైనది. ఆయన రాడిసన్ బ్లూలో – – బిజెనెస్ ట్రిప్‌పై దిగినారు.

మితభాషి, మెల్లగా 'వీకెండ్ రాత్రికి H2O పబ్‌కి తోడు వస్తారా? సరదాగా!' అంటీ అంటనట్లుగా అడిగారు, ఆయనకు 55 అటు ఉంటాయి – నాకు ఓ యాభైకి ఇటుగా, బావనుకొని మర్యాదగా H2O క్లబ్‌లో ఫ్రెంచ్ వైన్ మబ్బులలో ఇథియోపియా కన్నెల – మల్లెల – అల్లికలతో అమెరికాంధ్రున్ని ఆఫ్రికా – అల్లుడిగా ఆనంద భాష్పాలు కార్పించాను – 'సారా' అనే అనుష్క చెల్లిని చూపిస్తే 'తిజిస్ట్' అనే కత్రినా నైఫ్ – తినేసేటట్లు – సేఫ్ అన్నారు. "ఏమండి ముప్పై ఏళ్ళుగా అమెరికా అంతా తిరిగాను ఇంత స్వేచ్ఛా – మల్లెల అల్లరి స్వచ్ఛత అక్కడ లేదు", కొంచెం – నా బావమరిది హోదా పెరిగిపోయింది – అర్ధరాత్రి అరిగినాక ఆంధ్రా అరెసన్నాడు. ఆయనకు వేలమంది పని చేసే సాఫ్ట్‌వేర్ కంపెనీలుండడం మూలానా – భీమవరం దగ్గర గ్రామానికి రావడం – చాలా ఇబ్బందట – చుట్టాలందరూ అమెరికాలో ఎక్కడెక్కడివారికో కుదరని ఉద్యోగాలిప్పించమంటారట! కేవలం కాలీఫోర్నీయా ఆఫీస్ నుండే తనుకున్న అనేక దేశాల ఐ.టి. సంస్థలను నడుపుతున్నట్లుగా తెలిసినది, కేవలం అడిస్ అబాబా – ఇథియోపియాలో ఆహ్లాదమైన గులాబీ తోటల

ఫార్మ్‌హౌస్‌లు – వినోదాల విడిదికోసమేమో? ఆయన సంస్థల వ్యవహారం సంగతులు అడిగే మర్యాద కాదు కనుక, తను చదివిన స్కూల్, కాలేజీ జీవితం – విద్యాగందం గురించి – ఓ భీమవరపు పూర్వపు విద్యార్థిగా ఆరా తీశాను, స్కూల్, ఇంటరువరకు అక్కడే అట, కానీ 'ఇంజినీరింగ్ మహారాష్ట్రలో' అనేలోపు – "భీమవరపు ట్యూషన్స్ చెప్పే శర్మ మాష్టారు! విన్నారా"యనేలోపు – తనును కంప్యూటర్ ఇంజినీరుగా – ఆ ఆల్ – ఇన్ – ఆల్ శర్మ మాష్టారే కన్నారని – ఆ కాలే – ఫోర్న్ కనులు దాయలేకపోయినాయి, "నా– లా– చాలా– మొదటితరం మహారాష్ట్ర కంప్యూటర్ ఇంజినీరింగ్ బ్యాచ్ విద్యార్థులు భీమవరం వచ్చి మిగిలిన సబ్జక్ట్స్ శర్మ మాష్టారుతో పాఠాలు చెప్పించుకొని అన్ని బ్యాక్‌లాగ్స్ పూర్తి చేసుకొనేవారని" పలకడంలో – నా బ్రయిన్‌లో బ్లాక్ హోల్స్ కనబడ్డాయి, శర్మ మాష్టారు ఉనికి వివరాలు పై – ఆరా – ఆయనకు ఆసక్తి లేనట్లుగా గ్రహించి అంతటితో – 'ఉంటానండి'యనే సింపిల్ శెలవు తీసేసికొన్నాము, తెలుగునాట గోదావరి వడి పాయలుగా వీడినా – 'గోదారి నీరని' ఇంకా కొంచెం ప్రేమగా గురువు గౌతుముడు తెచ్చిన దీక్షా భిక్షగా తరాలుగా తలచుకొనే తెనుగువారిక్కడ! శాక్రమేంటో నది (Sacramento river -California) – దాని శాకలేంటో (శాఖ లేమిటో) – ఆ సోక్రటీస్ సిలికాన్ శిష్య పరమాణువుల మది ఎక్కడ/అక్కడ?, అలాయని అపహాస్యమేమి కాదు, గూగుల్ సుందర పిచ్చయ్య తన చిన్నప్పటి గురుతుల్యులను ప్రేమపిచ్చితో గౌరవ గోల చేస్తూనే ఉన్నాడు, అది – ఐ.ఐ.టి లేక ఐ.టి. లేక – లేని ఐ.టి.ఐ. కాదు "It may be a spirit or a spit, Everything will certainly be in one's own six feet pit!"

ఆ పై విధంగా భవిష్యత్ బాగుంటుందని – భీమవరపు ప్రాంతపు ప్రథమ సాఫ్ట్‌వేర్ జీవుల మొదట వర్షపు మేఘము – మా శర్మ మాష్టారు, కొంచెం కురిసి అక్కడ నుండి మాయమైపోనారు – జ్ఞానానికి రూపం ఆ కృష్ణభగవానుడు, ఆ మాధవునికీ ఎన్నో మాయలు – నీలాపనిందలు. సహజంగానే ఈ గాయత్రీ పుత్రునికి అందని అభివృద్ధి అందెలు, సామాన్యులుకే అవసరమేమో లాటరీ – దోపిడీ – బిజెనెస్ లంకెబిందెలు.

మాష్టారు వ్యక్తిగత వివరాలు 1988 పిదప తెలియవు, బహుశా జనకోటిగా – మనకు అనవసరం, ఆయన నుండి నేను పెద్ద చదువులు చదవకపోయినా – ఆ చదువల సబ్జక్ట్‌ల సవ్యసాచి శాస్త్రపు – అస్త్రపు మెరుపు చూసిన ఈ రాజసపు సంబరంగా ఓ అనామక శిష్యుని గురుదక్షిణ – ఈ ***మిసిమి*** వీణా వ్యాసపాంజలి.

"ఓ భీమవరపు భళా – భేతాళ – పాఠాల –పాతాళ – శర్మ మాస్టారు (1975–1988)!

ఏలూరు కట్టమంచి తెల్లపంచ (C.R. Reddy College) దాచుకొని వదిలిన ఓ సరస్వతి ఏరు,

మ్యాథ్స్, ఆర్ట్స్, సైన్స్ – ఇంజినీరింగ్ అన్ని సబ్జక్ట్‌లను కదిపే బేరింగ్ – నీ పండితబావి – నోరు!

నీకు నేడు నీడలేదని తెలుసు – తగదు తవ్వేసిన మా భీమవరం – లేదు – ఏ రాజసపు అగ్రహారం!

"శ్రీశ్రీ"కి – విశాక ఎండాడ కొండ? – అప్పుడూ – మరెప్పుడూ ఓ ఎండిపోయిన మండే మొండిహారం!

''చలం'' స్వతంత్ర భారతిలో నిశ్చలశవం, ఆ మహామైదానం ఆఖరికి అరవపు అరుణాచల శివం!

"అంబేద్కరుడే" అంతగా అరచినా "బౌద్ధం, నిబద్ధం, నీ అద్దం" అర్థంగాని అలగా మనవనం!

తనను కనిబెట్టిన ''కొలంబస్‌నే'' సమాధిగా కలుపుకోలేదు – ఆ – మెరికా! (USA), తన నామాన్నే నెత్తిన ఒత్తుకొన్నా – 'అమెరిగో' నీడజాడ లేదిక! నల్లవారిక – ఎన్నడు తెల్లవారిక! మేమందరం – అదోరకం – అంధులం, మీ శాస్త్రాలు – నేర్పిన రంధ్రాలం – రాజధానిగా – ఇక మన అమెరికా – ఓ పొలికేక!

మాష్టారూ ఇంటి పేరు బహుశా – "జోస్యల" ముందే తెలుసు సకల శాస్త్రాలు – ఆయనే – కడలి కడదాకా!

మీరు త్రివేణి సంగంలో గంగా – జమునా నడుమ కొంగుల దాగిన సరస్వతీ వీణ పాల పొంగు, ప్రతితరపు గురువుల నోట – నాటు – నాటాలి – తన నెమలి నాట్యమాడాలి – జగమందరికీ అదే నీలి రంగు.

(ఈ వ్యాసం – నే చూసిన ఓ మేధావి మాష్టారుగారి కేవలం అబ్బురపడే మేధావితనం గురించే, ఆయనే – ఒక్కడిగా ఓ విశ్వవిద్యాలయంగా వెలగడం గురించే, ఆయన వ్యక్తగత జీవితం, ఆయన సొంతం, ప్రతి తరపు అలాంటి గురువులకు అన్వయిస్తూ – పాదాభి వందనాలతో – శిష్య పరమాణువుల తరపున!)

ఐ.వి. రామ రాజు
పిప్పర / హైదరబాద్. ఫోన్: 991 264 4386.

*ఇటీవల తెరమరుగైన సూపర్‌స్టార్ కృష్ణ మాస్టారి సహవిద్యార్థి*



# ఇరానీ ఛాయ్

*- వలేటి గోపీచంద్*

హైదరాబాదీ జీవితం ఇరానీ ఛాయ్‌తో ముడిపడి ఉంది. దాని పుట్టుపూర్వోత్తరాలు, తయారీ విధానం గురించి ఈ కబుర్లలో అప్రస్తుతం - 1984లో పిజి కోసం రాజేంద్రనగర్‌లో అడుగుపెట్టిన కొద్ది కాలానికే ఇరానీ ఛాయ్ నన్ను తనలో కలుపుకుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఇరానీ ఛాయ్ ఎన్ని గాలన్స్ సేవించానో చెప్పటం కష్టం. నా పరిధిలో నేను గంటలకొద్ది సమయం ఇరానీ కేఫ్‌లలోనే గడిపా - లేదా కాలక్షేపం చేశా. మిత్రులతో కలసి కబుర్లు చెప్పుకున్నా. బాధ ఉంటే ఒక్కడినే ఇరానీ ఛాయ్ ఆస్వాదిస్తూ... కాలం గడిపిన సందర్భాలు కోకొల్లలు. అప్పట్లో నలుగురం కలిసి బాతాఖాని కోసం అయినా... చాలా సీరియస్ అంశమైనా, సినిమా సంగతులకైనా.. రాజకీయ విశ్లేషణలకైనా అడ్డా మాత్రం ఇరానీ కేఫ్ మాత్రమే.

విశాలంగా ఉండి, ఎవరి మూలాన వారు కూర్చొని గంటల తరపడి మాట్లాడుకున్నా.. కేఫ్ ఓనర్ పంఖా ఆపడు. సర్వర్ ఏమి కావాలని అడగడు. ఒక ఉర్దూ దినపత్రిక, *డెక్కన్ క్రానికల్, ఆంధ్రభూమి* దినపత్రికలు దాదాపు ప్రతి ఇరానీ కేఫ్‌లో దర్శనమిచ్చేవి. వాటిని ముక్కలు ముక్కలుగా ఎవరికి కావలిసిన అంశం వారు సినిమాలు, లాటరీలు, గుర్రపు పందాలు వివరాలు చూసుకుంటూ ఉన్నా కేఫ్ ఓనర్ కళ్ళలో మాత్రం కోపం, విసుగు, అసహనంకు బదులు ఆనందం కనిపించేది. పెదాల మీద నిత్యం చిరునవ్వు చెక్కు చెదరకుండా ఉండేది.

బన్, బన్ మస్కా, దిల్ పసంద్, దిల్ ఖుష్, కజోర, లుక్మి , ఫైన్ బిస్కట్, ఒస్మానియా బిస్కట్, రస్క్ , టై బిస్కట్ మరెన్నో రకాల బిస్కట్లు రాశులు పోసినట్లు ఓనర్ కం క్యాషియర్ ఎదురుగా కనిపిస్తుంటాయి. చిన్న సమోసా, పూరీలు సమయం బట్టి వేడివేడిగా దొరుకుతుండేవి. దాల్ రైస్ సరేసరి. బన్, చాయి తాగి కడుపు నింపుకునేవాళ్ళు ఒకవైపు, దాల్ రైస్‌తో మరికొంతమంది, కజోర తిని మంచినీళ్ళు తాగి పొట్ట నింపుకునేవారు ఇంకొందరు కనిపించేవారు. బిచ్చగాళ్లకు సైతం బన్, చాయి ఓనర్ ఉచితంగా ఇవ్వటం కూడా పరిపాటిగానే ఉండేది.

ఇప్పటిలా ఫోన్స్, ఇతర సాధనాలు అందుబాటులో లేవు కదా. అందుకని ఏ సమయానికి ఎక్కడ కలుసుకోవాలి అనే విషయం ముందే నిర్ణయించుకుని, ఆ సమయానికి ఆ దగ్గర్లో ఉన్న ఇరానీ కేఫ్ అడ్డా అయ్యేది. రన్నింగ్ బస్ ఎక్కి, రన్నింగ్ బస్ దిగటం నగరం నేర్పుతుంది కాబట్టి, ఆ అలవాటును నేర్పుగా వాడుకుంటూ బస్ డ్రైవర్, కండక్టర్ తిడుతున్నారు అని తెలిసినా, తెలియనట్లు ముఖం గంభీరంగా పెట్టుకుని సమయానికి గమ్యం చేరటం జరిగేది. ఎన్ని ఇరానీ కేఫెలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఎన్నో దర్శిని టిఫిన్ కేంద్రాలుగా మారాయి. మరెన్నో ఇరానీ కేఫ్‌లు కొత్త రంగులు పులుముకున్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఇరానీ కేఫ్ ఒక్కో చారిత్రక సంఘటనలకు చరిత్రలో సాక్షులుగా ఉన్నాయి. బషీర్‌బాగ్ చౌరస్తాలోని ఎంబసీ కేఫ్ ఎంతమంది బిడ్డలకు ఇరానీ ఛాయ్ ఇచ్చిందో. నిజాం కళాశాల మైదానంలో జరిగిన ప్రతి చారిత్రాత్మక బహిరంగ సభకు నిలువెత్తు సాక్ష్యంగా అవసాన దశలో ఉంది. ఇలాగే ఉస్మానియా యూనివర్సిటీ నలువైపులా ఉన్నవాటి చరిత అనతం. ఒక్కో కేఫ్‌కి చరితలో ఒక్కో పేజీ. ఇప్పటికీ నెబ్రాస్కా అడిక్‌మెట్‌లో గత వైభవానికి గురుతుగా వెలుగుతూ ఉంటుంది. అప్పుడు ఇరానీ కేఫ్‌లలో ఉండే కుర్చీలు, బల్లలు నిజాం సంస్కృతికి ప్రతీకగా ఉండేవి. పౌనా ప్రత్యేకమైన గుర్తింపు పొందింది. బాగా మరిగిన పాలమీద మీగడ వేసి ఇచ్చేవారు. శివంరోడ్ మీదుగా చే నంబర్ చౌరస్తా, గోల్‌నాక చౌరస్తా, అటునుండి మూసారంబాగ్

మీదుగా మలక్‌పేట, దిల్సుఖ్‌నగర్ వెళ్ళే దారిలో కూడా అటూ-ఇటూ పలు ఇరానీ కేఫ్‌లు పిలుస్తూ ఉండేవి. అంబర్‌పేట నుంచి రామాంతపూర్ మీదుగా ఉప్పల్ వైపు, ఉప్పల్ చౌరస్తా నుంచి నాగోల్, మరో దిశగా హబ్సిగూడ చౌరస్తా మీదుగా తార్నాక చౌరస్తాదాకా ఒకప్పుడు ఆప్యాయంగా అభిమానంగా ఇరానీ ఛాయ్ వాసనలు పరిఢవిల్లిన చరిత్ర అభివృద్ధిలో భాగంగా అనాథ అయింది.

సెక్రటేరియట్ ముందు గేట్‌కు ఎదురుగా టెహ్రాన్ కేఫ్‌ను మరచిపోగలమా.. అది సాదరంగా ఆహ్వానించి అందించిన తాజాతాజా వేడివేడి ఉస్మానియా బిస్కట్లు, బాగా సాంద్రతగల ఇరానీ ఛాయ్‌తో జనం ఒక మత్తులోకి వెళ్ళేవారు. సమయం, వచ్చిన పని మర్చిపోయిన సందర్భాలు కోకొల్లలు. లకడికాపూల్ సెంటర్‌లో లక్కీ కేఫ్, కామత్ ఎదురుగా ఆస్టోరియా, BSNL ఆఫీస్ ఎదురుగా మరొకటి, మీరా థియేటర్‌కు వెళ్ళే మార్గంలో.

పోస్ట్ ఆఫీస్ ఎదురుగా, ఖైరతబాద్ రైల్వేగేట్ దగ్గర.. ఆకాశవాణి కేంద్రంవద్ద జమ్‌జమ్, తరువాత లైన్‌లో పైకి వెళ్తుంటే హిల్ టాప్, ముందుకు వెళ్తే ఆదర్శ్‌లు ఇప్పటికీ అలా-అలా నడుస్తూ ఉన్నాయి. లికోటిలోని కిషోర్ కేఫ్, చాథర్ఘట్‌లోని నయాగరా, రెడ్‌హిల్స్‌లోని నీలోఫర్, దాని చుట్టూ ఉన్న కొన్నిటితో పాటు ఇప్పటికీ గంగా జమున కేఫ్ నన్ను గుర్తు పడతారా అని అప్పుడప్పుడు మెల్లమెల్లగా తన దగ్గరకు రమ్మని పిలుస్తూ ఉండటం ఒక అనుభూతి.

ఇక ఖైరతబాద్ ప్రాంతంకు వస్తే చౌరస్తాలో ఒకప్పుడు హిల్‌టాప్, దాని వెనుక సర్వి, షాదన్ ఎదురుగా చింతల బస్తీకి వెళ్ళే దారిలో బిగ్‌బాస్, వీరనగర్ దారిలో సఫా, *ఈనాడు* దినపత్రిక ప్రక్క సందులో కారొనేషన్, కేసిపి ఎదురుగా బెస్ట్ కేఫ్, ఆ తరువాత సెల్లార్‌కు వెళ్లి ఇప్పుడు దర్శిని అయింది కూడా. ఇంకొచెం ముందుకు వెళ్తే సివిల్ సప్లైస్ భవనం వెనుక చౌరస్తాలో రెడ్ రోజ్ తన ఉనికిని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తూనే ఉంది. శ్రీనగర్ కాలనీలో చౌరస్తాలో కేఫ్‌లో మాయమయ్యాయి. RBI Quartersకు వెళ్ళే దారిలోని లైట్ ఆఫ్ ఆంధ్ర అదృశ్యమైంది. శ్రీనివాస్‌నగర్ తూర్పు, పడమరలలో ఉన్న అన్ని కూడా మారిన పరిస్థితిలో మూలనబడ్డాయి. ఇంకా అల్పాబా ఒకటి, అల్మాస్ ఒకటి కొద్దిపాటి మెరుపులు అప్పుడప్పుడు మెరిపిస్తున్నయి. ESI చౌరస్తాలో 24 గంటలు చాయి ఇచ్చిన ఝున్‌ఝున్ ఇప్పుడు లేదుకదా. ఎర్రగడ్డ కూడలిలో మెల్లి కేఫ్, మరో ప్రక్కన JK పాయింట్ ఇంకా సాగుతూ ఉండటం సంతోషం. Y జంక్షన్‌లో అల్పాబా, ఆ తరువాత కొంచెం దూరంలో సర్విలు ఉన్నాయి. అయితే అక్కడ నుండి BHEL దాకా రోడ్‌కిరువైపులా గతంలో ఉన్న ఇరానీ కేఫ్‌లలో 97 శాతం మాయమయ్యాయి. Y జంక్షన్ నుంచి బాలానగర్ అదే నర్సాపూర్ చౌరస్తా మీదుగా బోయిన పల్లిని పలకరిస్తూ సికిందరాబాద్‌వరకూ కూడా దాదాపు ఇదే స్థితి. అక్కడక్కడా గత వైభవపు గుర్తులు ఉన్నా మనం గుర్తించ లేని స్థితి. ఆల్ఫా, ప్యారడైజ్, అబిడ్స్‌లోని గ్రాండ్ హోటల్, గాంధీభవన్ ప్రాంతంలో అదాబ్, అజీజియాలుకు ఆదరణ బాగానే ఉంది. వీటితో పాటు అత్తాపూర్, బహదూర్‌పుర, ఛార్మినార్, చాంద్రాయణ గుట్ట, సైదాబాద్, సంతోష్‌నగర్, షాలిబండ, గుడిమల్లాపూర్‌లతోపాటు మరొకొన్ని - పాత బస్తీ ప్రాంతాలలో కొంచెం మెరుగ్గా ఉంది ఉండవచ్చు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ప్రెసిడెంట్, సన్షేమ్, ఆస్టోరియాలు కూడా అంతంత మాత్రంగానే. శాంతి నారాయణగూడ, విఠల్‌వాడి, హిమాయత్‌నగర్, అశోక్, గాంధీనగర్, ముషీరాబాద్‌లలో సైతం ఇదే పరిస్థితి. సిటీ కేఫ్ ఇంకా హిమాయత్‌నగర్‌లో ఆకట్టుకుంటూనే ఉంది. ఇక నా ఇరానీ కేఫ్‌ల ముచ్చట్లు ముగిస్తున్నాను. ఇంకా చాలా ప్రాంతాలు, అక్కడి కేఫ్‌లు ప్రస్తావన తీసుకురాలేదు. ఇరానీ కేఫ్‌లు అందించిన కేర్ & షేర్ భావన పూర్తిగా పోయింది. వాటి స్థానంలో వచ్చిన దర్శినిలకు, ఇతర సెంటర్లకు లాక్కోవటం మాత్రమే తెలుసు. కూర్చోకముందే వస్తారు. తినక ముందే ఫ్యాన్ ఆపుతారు. వచ్చినవారిని మరోసారి రాకుండా బిల్లుతో పాటు ప్రవర్తనతో చిరాకు పెడతారు. ఇరానీ ఛాయ్ ఇరానీ కేఫ్‌లు అందించిన భిన్నమయిన రుచులు, సంస్కృతి స్థానంలో ఇడ్లీ, వడ, దోశ, సాంబారు, చట్నీలు వచ్చాయి. జీవితాలలో వెలుగు పోయింది. మకరందం ఆవిరయింది. మానవ సంబంధాలు పూర్తిగా మృగ్యమయ్యాయి. అలాయి బలాయి లేదు. ఒకటే మార్కెట్.. మార్కెట్.. ఏదైనా మార్కెట్‌కి అంతా రడి రడి.. బహు పరాక్.

అయిపోయింది.

ఓపికగా చదివినందుకు మీకు నా కృతజ్ఞతలు.

---

వలేటి గోపీచంద్ - హైదరాబాద్. ఫోన్: 944 127 6770.

విలక్షణ ఆర్థిక శాస్త్రవేత్త వినూత్న సంస్థల సృష్టి కర్త

# ఆచార్య వి.కె.ఆర్.వి. రావు

*– అలజంగి మురళీధరరావు*



విజయేంద్ర కస్తూరి రంగా వరదరాజ రావు

మన దేశంలో పేరెన్నికగల ఆర్థిక శాస్త్రవేత్తలు గురించి మనం మాట్లాడుకోవలసి వచ్చినపుడు పి.సి. మహల్నోబిస్, వి.ఎన్. గాడ్గిల్, లక్డావాలా, పి.ఎన్. ధర్, దండేకర్, రథ్, అమర్త్యసేన్‌లాంటి ఎందరివో పేర్లు స్ఫురణకు వస్తాయి. అయితే ఏ కోణంలో చూసినా విస్మరించలేని, శిఖరాయమానమైన ఆర్థికవేత్త ఎవరూ అంటే మనకు గుర్తుకు వచ్చే పేరు ఆచార్య వి.కె.ఆర్.వి. రావుగారిదే. బలీయమైన మానవ సంకల్పం, దార్శనికత, పరిశోధన మౌలికత, సంస్థల నిర్మాణ దక్షత, మొత్తంగా చూస్తే, ఒక సమగ్రమైన సంపూర్ణ మానవేచ్ఛ, వ్యక్తిత్వాలకు ప్రతీకగా నిలిచేవారు ఒక్క ఆచార్య వి.కె.ఆర్.వి. రావుగారేననిపిస్తుంది. వారు పాదుకొలిపిన విద్యావిషయిక విలువలు, సమ్మిళిత దృష్టి, నెలకొల్పిన సంస్థలు అందుకు నిదర్శనాలు. భావ వ్యక్తీకరణ, విద్యా సంబంధ విషయాలలో ప్రమాణాలు, సామాజిక నిబద్ధత, బహుళ విషయ పరిశోధన అన్నవి అతను నమ్ముకున్న ఆదర్శాలు. ఈ ఆదర్శాల పునాదుల మీదనే వారు ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (1948), ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ (1957), ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ & ఎకనామిక్ చేంజ్, బెంగుళూరు (1972)ను నిర్మించారు. అర్థశాస్త్రానికి సంబంధించిన అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయతలలోని బహుళ పార్శ్వాల సమతౌల్యానికి సంబంధించిన రావుగారి దృక్పథాన్ని చాటిచెప్పే సంస్థలు ఈ మూడు.

ఇతర సామాజిక శాస్త్రాలతో సంబంధం లేకుండా అర్థశాస్త్రాన్ని విడిగా అధ్యయనం చేయలేమని, సామాజిక శాస్త్రాల పరస్పర పూరకత్వం, ఉమ్మడి అధ్యయనాలతోనే విధాన నిర్ణయాలకు ఒక సమగ్రమైన రూపం వస్తుందని అతను గాఢంగా నమ్మేవాడు. ఈ అవగాహనతోనే అతను ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో సమాజశాస్త్రంలాంటి ఉత్తమ శ్రేణి విభాగాన్ని ప్రారంభించాడు. బెంగళూర్‌లో అతను స్థాపించిన ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్ చేంజ్ సామాజిక శాస్త్రాలన్నింటికి ఇస్తున్న సమానమైన ప్రాధాన్యత వెనుకగల ప్రేరణ కూడా ఇదే. తాను యువజన సర్వీసుల విభాగంలో కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఢిల్లీలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ICSSR) స్థాపనకు చొరవ చూపించింది కూడా ఈ దృక్పథంతోనే. సామాజిక దృగ్విషయాల అధ్యయనాల ద్వారా తేల్చిన సత్యాలను అర్థశాస్త్ర నిర్మితికి, విస్తృతికి ఉపయోగించుకోవాలే తప్ప ఆర్థిక దృగ్విషయాల అధ్యయనాలను అనువర్తించి సమాజ గమనాన్ని అంచనావేయుట ఆర్థికవేత్తల పని కాదని అతని నిశ్చితాభిప్రాయంగా ఉండేది. అంతేగాక ఆధునిక అర్థశాస్త్రంలో పెరిగిపోతున్న గణిత శాస్త్ర దురాక్రమణను కూడా వారు గర్హించేవారు. 1990ల కాలం నాటికి వచ్చిన నూతన ఆర్థిక సంస్కరణల పెనుతాకిడితో నెహ్రూ సామ్యవాదం కుప్పకూలిపోతున్నప్పుడు అది తమ తరంనాటి ఆర్థికవేత్తల వైఫల్యంగా భావించాడు. కానీ ఒక దేశ భక్తునిగా, దేశ సమగ్రతను కోరుకునే పౌరునిగా తనది 'వివేకానంద సామ్యవాదమని' చెబుతూ సంఘ నిర్లక్ష్యానికి గురవుతున్న వ్యక్తులు, జాతులపట్ల దయ ఉండాలని, అభివృద్ధి ఫలాల నుండి వారిని వేరు చెయ్యరాదని స్పష్టం చేశారు. నిత్య చలనత్వ స్వభావం కలిగిన ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకునే క్రమంలో నిశ్చల ఆర్థిక విశ్లేషణా పద్ధతులు ఎక్కడ వైఫల్యం చెందుతున్నాయో చూపుతూ తనదైన చలన విశ్లేషణ ద్వారా ఆర్థిక వ్యవస్థలోని అనేక అంశాలను, నూతన దృక్కోణాలను జోడించారు ఆచార్య వి.కె.ఆర్.వి. రావు. ఆర్థిక కార్యకలాపాల నిర్వహణ, మానవ వికాసం మధ్యగల సంబంధాన్ని పరీక్షిస్తూ అంతిమంగా ఇది వ్యక్తుల గుణాత్మక ఎదుగుదలకు తోడ్పడుతున్నదా లేదా అన్నది చూడాలంటాడు. ఈ దృక్పథం ఆచార్య రావును మహాదేవ గోవింద రనడే, బాలగంగాధర తిలక్, మహాత్మ గాంధీల సరసన కూర్చోబెడుతుంది. వెనుకబడిన ఆర్థిక వ్యవస్థల లక్షణాలైన ప్రచ్ఛన్న నిరుద్యోగం, వ్యవసాయ రంగ ఆధిక్యత, ఉత్పత్తుల హెచ్చు స్వీయ వినియోగం, పెరుగుతున్న ఆదాయ అనుపాతంలో ఆహార వస్తువుల డిమాండ్ పెరుగుదల మొదలైనవాటిని రావు తన పరిశోధనల ద్వారా గుర్తించి తెలియజేసినవే. పారిశ్రామికీకరణ ద్వారా వ్యవసాయ రంగంపైగల జనాభా ఒత్తిడిని తగ్గించగలమన్నది వీరి మరో పరిశీలన. పేదరికాన్ని నిర్వచిస్తూ రావు "పేదరికమంటే అన్ని జీవన స్థాయిలలోను లోటు,

ఈ జీవన స్థాయిల్లో వ్యక్తులకు శక్తినిచ్చే కారకాలు మాత్రమేగాక ఆరోగ్యానికి ఆవశ్యకమైన సమతౌల్య ఆహారం, మానవ మనుగడకు అవసరమయ్యే ఇతర మౌలిక అవసరాలు కూడా ఉంటాయి" అని అభిప్రాయ పడ్డారు. వ్యవసాయ ఆదాయాన్ని కూడా ఆదాయపన్ను పరిధిలోకి తీసుకురావాలన్నది వీరు ప్రభుత్వాలకు చేసిన ఒక మౌలిక సూచన. జే.ఎం. కీన్స్ ఆర్థిక సూత్రాలను పరిశీలిస్తూ అనిచ్ఛా పూర్వక నిరుద్యోగ నిర్మూలనకు ఒక పరిష్కారంగా కీన్స్ ప్రతిపాదించిన "సంపూర్ణ ఉద్యోగిత" అన్న భావన అసంతృపమైనదేగాక ఉద్యోగ (సంఘటిత) శ్రామికుల ఉత్పాదకతను పెంచుటలో కూడా ఈ భావన యోగ్యమైనదిగా లేదని తన మౌలిక పరిశోధనల ద్వారా ఖండిస్తారు రావుగారు. ఇంతేగాక లోటు ద్రవ్య విధానం, కోశ విధానం, ధరల విధానం, ఆర్థిక వృద్ధిలో మానవ వనరుల పాత్ర మొదలైన అంశాలలో కూడా వీరి సూచనలు, చేసిన ప్రతిపాదనలు నేటికీ మౌలికంగానే కొనసాగుతున్నాయి. ఒక దేశ ఆర్థికాభివృద్ధిని తెలియజేసే సూచికలలో ప్రధానమైనదైన 'జాతీయాదాయం' గురించిన లెక్కింపు, గణనను మొట్టమొదట మనదేశంలో ప్రారంభించి శాస్త్రీయమైన మదింపు పద్ధతులను అందించినవారు ప్రొఫెసర్ వి.కె.అర్.వి. రావుగారే. ఈ విధంగా వారు ''భారతదేశ జాతీయాదాయ గణన పిత''గా వినుతికెక్కారు. జాతీయాదాయ గణింపు, విశ్లేషణలో వారి సైద్ధాంతిక, అనువర్తిత కృషి అంతర్జాతీయ ప్రమాణాలను, ప్రాముఖ్యతను సంతరించుకుని ఆనాటికి చెలామణిలో ఉన్న జాతీయాదాయ లెక్కింపు విధానాలకు పునర్మూల్యాంకనం చెయ్యవలసిన అనివార్యతను కలిగించింది. "భారత ఆర్థిక శాస్త్ర అగ్రగామిగానూ, సంస్థల నిర్మాతగానూ వి.కె.అర్.వి. రావు సేవలు బాగా గుర్తించబడినాయి. నమోదు అయ్యాయి, కానీ ఒక మేధావిగా ఆయన వ్యక్తిత్వం గురించి, ఆయన ఆసక్తులు, ఆయన గాఢావేశాలు, ఆయన ఉద్దేశాలు, ప్రేరణలు, దృక్పథాల గురించి అతి తక్కువగా రాయబడింది. ఆయన గాఢమైన దేశభక్తుడు. స్వతంత్ర భారతదేశ నిర్మాణం అనే గొప్ప లక్ష్యం కోసం ఆర్థికవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలకు ఒక పాత్ర ఏర్పరచాలనే ఆకాంక్షతో రగిలినవాడు" అంటూ ఆచార్య వి.కె.అర్.వి. రావు గురించి అభిప్రాయపడ్డారు ఆర్థికవేత్త, మాజీ ప్రణాళిక సంఘ సభ్యుడైన శ్రీ చెన్నమనేని హనుమతరావు తన ఆత్మకథ "నా ప్రయాణం"లో.

ప్రాచీన విలువల పట్ల విధేయతతోబాటు, ఆలోచనల్లోనూ, లక్ష్య సాధనలోనూ ఆధునికతను అలవరుచుకుంటూ విశ్వాసం నిండిన చూపుతో భావికాలంలోకి దూసుకుపోగలిగే ఒక బలమైన సమైక్య దేశంగా భారతదేశం ఎదగాలని ఆచార్య రావు కోరుకున్నారు. అందుకు వారు సూచించిన "పేదరిక నిర్మూలన, అసమానతల తొలగింపు, సామాజిక న్యాయం" అనే ఆదర్శాలను ప్రభుత్వాలు అనుసరించగలిగినప్పుడు ఇది కార్య రూపం దాలుస్తుంది. వారి ఆర్థిక తత్త్వం, రాజకీయ దృక్పథంలోని ఈ 'సామాజిక నిబద్ధత'నే నేటికీ తన ప్రాసంగితను కలిగి ఉన్నదని చెప్పాలి. అట్టడుగు వర్గాల సంక్షేమం, సాధికారత ప్రశ్నార్థకమౌతున్న నేటి ప్రపంచీకరణ సందర్భంలో ఆచార్య వి.కె.అర్.వి. రావు సూచించిన "సామాజిక నిబద్ధతతో కూడుకున్న ఆర్థికవృద్ధి" అనే భావన అతనిని ఒక దార్శనికుడైన ఆర్థికవేత్త, మానవవాదిగా నిలబెడుతున్నది.

**జీవిత విశేషాలు:** జననం– జూలై 8, 1908, మరణం– జూలై 25, 1991. పూర్తి పేరు – విజయేంద్ర కస్తూరి రంగ వరద రాజారావు. తల్లిదండ్రులు – భారతీ అమ్మ, కస్తూరి రంగారావు (కన్నడిగులు) – సీనియర్ లెక్చరర్ in ఎకనామిక్స్, ఆంధ్రా యూనివర్సిటీ వాల్తేరు (1936–37) – ప్రిన్సిపాల్ అండ్ ప్రొఫెసర్ అఫ్ ఎకనామిక్స్ LD ఆర్ట్స్ కాలేజీ అహమ్మదాబాద్ (1937–42) – యూనివర్సిటీ ప్రొఫెసర్ అఫ్ ఎకనామిక్స్ ఢిల్లీ యూనివర్సిటి (1942–61) – డైరెక్టర్ ఢిల్లీ స్కూల్ అఫ్ ఎకనామిక్స్, ఢిల్లీ (1948–57) – వైస్ ఛాన్సలర్, ఢిల్లీ యూనివర్సిటి – డైరెక్టర్,ఇనిస్టిట్యూట్అఫ్ ఎకనామిక్ గ్రోత్ – మెంబెర్, ప్లానింగ్ కమీషన్ – యూనియన్ కాబినెట్ మినిస్టర్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్ & షిప్పింగ్ – యూనియన్ కాబినెట్ మినిస్టర్ ఫర్ ఎడ్యుకేషన్ & యూత్ అఫైర్స్ – డైరెక్టర్, ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ & ఎకనామిక్ చేంజ్, బెంగళూరు – నేషనల్ ప్రొఫెసర్, GOVT. OF INDIA – పద్మవిభూషణ్ అవార్డు.

**రచనలు:** 1. ఇండియాన్నేషనల్ ఇన్కమ్, 2. ఇండియా అండ్ ఇంటర్నేషనల్ కరెన్సీ ప్లాన్స్, 3. టాక్సేషన్ అఫ్ ఇన్కమ్ in ఇండియా, 4. బంగ్లాదేశ్ ఇన్కమ్ – ప్రాబ్లెమ్స్ అండ్ ప్రాస్పెక్ట్స్, 5. స్వామి వివేకానంద, 6. ఫుడ్, న్యూట్రిషన్ అండ్ పావర్టీ in ఇండియా.

**సంప్రదించిన గ్రంథాలు:** 1. ఇండియన్ ఎకానమీ – ఆర్ దత్ అండ్ kvs సుందరం. 2. సమ్ మెమోయర్స్ అఫ్ VKRV రావు–విజయేంద్ర రావు. 3. ది పార్షియల్ మెమోయర్స్ అఫ్ VKRV రావు. 4. నా ప్రయాణం – చెన్నమనేని హనుమంతరావు, గూగుల్ సమాచారం.


అలజంగి మురళీధరరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్, పాడేరు. ఫోన్: 944 033 5461.

# వెయ్యేళ్ళ మంతిన

– గార రంగనాథం

విజయనగరం జిల్లా సంతకవిటి మండలంలోగల మంతిన గ్రామానికి వెయ్యేళ్ళకుపైగా చరిత్ర ఉందని తెలుస్తోంది. అలాంటి గ్రామ చారిత్రక ప్రాధాన్యతను తెలియజెప్పడమే ఈ వ్యాసపు ఉద్దేశం. సంతకవిటి పొందూరు రోడ్డులో అప్పలగ్రహారం ఉంటుంది. ఆ గ్రామానికి ఉత్తర అంచునుండి తూర్పునకుగల ఒక రోడ్డుగుండా ప్రయాణించాలి. అలా సుమారు మూడు కిలోమీటర్లు ప్రయాణిస్తే మంతిన వస్తుంది. అన్నివైపులా పొలాలు ఉన్న ఆ గ్రామానికి ఇదొక్కటే మార్గం. రాజాం చరిత్ర రాయడానికి ఉపకరిస్తుందనే ఉద్దేశంతో నేను ఇటీవల వర్షాలు పడక ముందర సమతం మహేశ్వరరావును, మజ్జి హరనాథరావును తోడు తీసుకొని వెళ్ళాను. ఈ గ్రామంలో ఒకప్పుడు ఉరిటి ఇంటిపేరుగల పట్నాయకులకు నాలుగు వందల ఎకరాల భూమి ఉండేదని, ప్రస్తుతం వారంతా పట్టణాలకు వలసపోగా 40 ఎకరాలు మాత్రమే మిగిలిందని, అందులో 18 ఎకరాలు తమ సొంతమని ఆ ఊరిలో నాయుడుగా పిలువబడే విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి ఉరిటి అప్పారావు పట్నాయక్ తెలిపారు. ఆ ఊరిలోని విశేషాలను చూపించారు.

ఊరి మధ్యలోనే సిమెంటు రోడ్డు దాటడానికి మెట్టుగా ఒక రాయిని వినియోగిస్తున్నారు. దానిపై తెలుగన్నడ శాసనం చెక్కి ఉంది. అందులో ఏముందో శాసన పరిశోధకులు మాత్రమే చదవగలరు. గ్రామానికి ఈశాన్య మూల మూడడుగుల ఎత్తు, దానికి తగ్గ లావుగల ద్విభుజ వినాయకుని విగ్రహం రావి చెట్టును అనుసరించి ఉన్నది. వినాయకుని పొట్టను మూడు చుట్లు చుట్టి, బొడ్డువద్ద సర్పం కలిగిన నాగుపాము చెక్కి ఉంది. రెండు భుజాలకూ నాగుల చుట్లు ఉన్నాయి. విగ్రహానికి ముందర సన్నని ప్రాచీనమైన శివలింగం, నంది విగ్రహం ఉన్నాయి. ఇటీవల వాటికి ఓ చిన్న మంటపం కట్టారు. తూర్పున పాఠశాల దాటిన వెంటనే ఒక రాతిమీద కొన్ని విగ్రహాలు ఉన్నాయి. పార్వతి, విష్ణువు, జైన విగ్రహం, అస్పష్టమైన నంది, వినాయకుడు, మహిషాసుర మర్దని, భైరవ విగ్రహాలున్నాయి. ఆ రాతి సమీపం నుండే నారాయణపురం కాలువ ప్రవహిస్తుంటుంది. 1956–60 మధ్య ఈ కాలువ తవ్విన సందర్భంగా బయల్పడిన విగ్రహాలను తన తండ్రి ఆ రాతిమీద భద్రపరిచారని, అడుగు వెడల్పు, అడుగు పొడవైన బౌద్ధానికి చెందిన కాల్చిన ఇటుక అక్కడ ఉండేదని అప్పారావు పట్నాయక్ చెప్పారు. అలాగే 56 రాగి రేకులతో శాసనాలు దొరికితే తన తండ్రి ప్రభుత్వానికి అప్పగించినట్టు తెలిపారు. దక్షిణ దిక్కునగల శివాలయం వద్ద పానవట్టం, రాతిపాదాలు, శివదీక్షాపరుడు విగ్రహాలున్నాయి. నాగబంధం కూడా ఉండేదని అక్కడివారన్నారు.

ఊరికి పడమర, వాయవ్య, ఉత్తర దిక్కుల్లో గుండ్రని మూడు మట్టిదిబ్బలు ఒకే వైశాల్యంలో ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం. ఈ దిబ్బలు ఎత్తైన చెట్లతో, ముళ్ళదొంకలతో కూడి రెండడుగుల ఎత్తున ఉంటాయి. ఆ దిబ్బల మీద విగ్రహాలుంటాయి. ఈ ప్రాంతంలో అసిరమ్మ అనే దేవతను చాలా గ్రామాల్లో కొలుస్తారు. ఆ దేవతకు 50, 60 ఏళ్ళకు ఒకసారి పండుగ చేస్తారు. అలాంటి గ్రామదేవత పండుగనాడు ప్రతి ఇంటికి కనీసం ఒక గొర్రెపోతును బలిస్తారు. అవకాశం ఉన్నవారు రెండు మూడింటిని బలిస్తారు. మంతెనలోని గ్రామదేవత పేరు కూడా అసిరమ్మే. ఈ ఊరిలో ఆమెకు 75 ఏళ్ళ క్రితం పండగ చేశారు. ఆ పండగ సందర్భంగా ఇక్కడి దిబ్బల మీద అమ్మవారికి జంతువుల్ని బలిస్తారు కాని ఆ జంతువులు భిన్నమైనవి.

ఈ దిబ్బలలో మొదటిది గ్రామానికి పడమరనగల పిల్లల దిబ్బ. ఇక్కడ పెద్ద అక్షరాలతో ఓ శాసనం ఉంది. భూమిలోకి కొంత దిగబడి ఉంది. దాని భాష అర్థం కాలేదు. సాధారణంగా రాతిపై లోతుగా అక్షరాలు చెక్కడం ద్వారానే శిలాశాసనాలను తయారు చేస్తారు. కానీ ఈ శాసనపు అక్షరాలు రాతిపై ఉబ్బెత్తుగా చెక్కబడ్డాయి. ఇది ఓ ప్రత్యేకత. దాని ప్రక్కనే వీరుణ్ణి చెక్కిన శిల్పం ఉంది. ఒక వీరుడు తన ఎడమ చేత్తో తన ప్రియురాలిని నడుం వెనక నుండి పట్టుకొని ఉంటాడు. మరో చేత్తో వంపు తిరిగిన కత్తివంటి ఆయుధం పట్టుకుంటాడు. కుడిప్రక్కన మూడు నాలుగు అడవిపందులు. ఒక పంది మోరఎత్తి మీదపడబోతే దానిని బల్లెంతో వేటాడుతున్న వీరుడు ఉంటాడు. ఎడమ ప్రక్క మరో ఇద్దరు స్త్రీలు. వారు కూడా వేటకు సహకరించే విధంగా ఉంటారు. కత్తిపైన అడ్డంగా ధనుస్సు చెక్కి ఉంది. అది వీరశిల. ఓ పెద్దఏకశిల మీద చెక్కబడిన శిల్పం. భూమిలోకి కొంత దిగబది ఉన్న ఆ శిల్పాన్ని పూర్తిగా బైటపెడితే మరిన్ని వివరాలు తెలుస్తాయి.

ఇక్కడ ఓ విశేషం ఉంది. ఎప్పుడైనా గ్రామస్తులు పండగ చేస్తే ఈ పిల్లల దిబ్బ మీద గ్రామదేవతకు పందిని బలి ఇస్తారు.

వెయ్యేళ్ళ క్రిందట ఇక్కడ అడవి పందులు అధికంగా ఉండి ఉండవచ్చు. ఒక వీరుడు తన స్త్రీ జనంతో వచ్చి ఆ పందుల్ని వేటాడి చంపి ఉండవచ్చు. పందిని కొట్టిన వీరుడు గనుక అతడి విగ్రహాన్ని ఇక్కడ చెక్కించారని చెప్పవచ్చు. అప్పటి నుండి గ్రామదేవత పండుగవేళ పందిని బలి ఇవ్వడం ఆనవాయితీగా వచ్చి ఉండవచ్చు. మరి పిల్లల దిబ్బ అని ఎందుకన్నారు? పిల్లల్ని రక్షించే గ్రామదేవత అయి ఉంటుందేమో! లేదా పిల్లలపంది ఉన్న దిబ్బ కనుక తొలుత పిల్లలపంది దిబ్బ. రానురాను పిల్లల దిబ్బగా స్థిరపడి ఉంటుందని చెప్పవచ్చు. గ్రామదేవతలు అంటే వనదేవతలు. వనాలలో ఉండే దేవతలు. గతంలో ఆ గ్రామం బైట మూడుచోట్లగల వనాలలో గ్రామదేవతను పూజించేవారు. మరికొన్నాళ్ళకు ఈ అమ్మవార్లు ఉండే మరకలను (స్థలాలను) విడిచిపెట్టి, వ్యవసాయానికి అనువుగా భూముల్ని మార్చుకొన్నారు. పొలంగా మార్చడానికి తవ్విన మట్టిని ఈ వనంలోకి విసరడం ద్వారా ఇవి దిబ్బలయ్యాయి. ఇప్పటికీ ఈ ప్రాంతపు పల్లెలలో వనం ఉన్న పొలాన్ని వనం పొలమని, వనుంమడి అని పిలుస్తారు. విజయనగరం అమ్మవారి ప్రధానమైన కోవెల పట్టణం నడిబొడ్డున మూడులాంతర్ల వద్ద ఉండగా, రైల్వేస్టేషన్‌కి ఎదురుగా వనంగుడి ఉంది.

రెండవ దిబ్బ గజాలదిబ్బ. అది ఎక్కడానికి కష్టమని భావించి స్థానికుల్ని ఎక్కించాం. దానిపైన పూర్వం ఉన్న విగ్రహాలు మట్టిలో కూరుకుపోయి, కనిపించకున్నాయని చెప్పారు. అయితే ఇక్కడ అమ్మవారి పండగనాడు దున్నపోతును బలిస్తారని వారు చెప్పారు. ఒక మగ దూడను ఎంపికచేసి పండగకు ఆరునెలల ముందుగా పొలాలలో వదిలేస్తారని, దానిని పండగనాడు ఈ దిబ్బ మీద బలి ఇస్తారని చెప్పారు. దానిని బలి ఇచ్చే కత్తి ఇప్పటికీ దళితుల ఇళ్ళలో ఉంటుందని ఆ ఊరివారన్నారు. ఇక మూడది బాపనమ్మ దిబ్బ. ఈ దిబ్బమీద బ్రాహ్మణ స్త్రీ బలవన్మరణమో మరేదైనా కారణంవలన దీనికి ఈ పేరు వచ్చి ఉంటుంది. బాపనమ్మ అంటే బ్రాహ్మణ మహిళ అని కదా అర్థం. మహిళా సంబంధి అనేమో ఇక్కడ గ్రామదేవత పండగనాడు ఆడ గొఱ్ఱెను బలిస్తారు. దీనిమీదికి ఎక్కి విగ్రహాలతో పాటు ఫోటోలు తీసుకున్నాం. నల్లరాతిపై చెక్కిన మహిషాసురమర్దని, పానవట్టం, ఇద్దరు పిల్లలతల్లి శిల్పం ఉన్నాయి. ఇసుక రాతిపై చెక్కి, కొంత చెదిరిన కార్తికేయుడు, భక్తుడు, దేవి విగ్రహాలున్నాయి. మహిషాసుర మర్దనికి పసుపు పెయింట్ పూయబడి ఉంది. ఈ విగ్రహాల, శాసనాల కాలం 10-12 శతాబ్దాల మధ్య అంటూ వివరాలను ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఈమని శివనాగిరెడ్డి స్పష్టపరిచారు. శివాలయం వద్ద లభించిన పాదశిల గోధుమ వర్ణంతో ప్రత్యేకంగా కనిపిస్తోంది. కొన్ని నల్లరాతి శిల్పాలు కాగా కొన్ని ఇసుకరాతి విగ్రహాలు ఉన్నాయి. పిల్లలదిబ్బ మీద ఉన్న పెద్ద వీరశిల, పెద్ద అక్షరాలతోడి శాసనం సిమెంట్‌విలా అనుపిస్తుంది. ఆ రాతి వాటాం అలాంటిది.

ఈ గ్రామం చుట్టూ కనిపించిన విగ్రహాలతో పాటు గతంలో బయల్పడి కనుమరుగైన శిల్పాలు మరో పది ఉంటాయి. ఇటీవలే ఒక విగ్రహం దొరొకిందని అది పంచలోహ విగ్రహం కావచ్చని పలువురు చెప్పుకుంటున్నారు. అది ఎక్కడుందో మాత్రం చెప్పలేక పోతున్నారు. అన్ని దిశల్లోను, మూలల్లోను విగ్రహాలు లభించినందువల్ల, నాగావళీ పరీవాహక ప్రాంతం కనుక ఈ ఊరిలోని వందలి నేలల్లో ఇంకా కప్పబడి ఉన్న ప్రాచీన సంపద చాలా ఉంటుందని నిపుణుల అభిప్రాయం. బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ మతాలకు చెందిన విగ్రహాలు ఉండడంవలన ఆయా కాలాలలో ఆయా మతాలు ఈ ఊరిలో పరిఢవిల్లాయని చెప్పవచ్చు. ఆయా మతోద్యమాల వేళ తొలి మతాలు నాశనమై కాలక్రమంగా అక్కడి చరిత్ర భూగర్భంలోకి చేరిపోయి ఉండవచ్చు.

అయితే కళింగాన్ని దాదాపు వెయ్యేళ్ళ పాటు గాంగులు పాలించారు. వారు మహేంద్రగిరుల్లోని గోకర్ణేశ్వరస్వామి భక్తులమని చెప్పుకున్నారు. శివభక్తులన్నమాట. అందుచేత వారి ఏలుబడిలోని మా రాజాం ప్రాంతంలో ఏ వైపున ఏ పురాతన దిబ్బను తవ్వినా శివునికి చెందిన లింగాలు, పానవట్టాలు, నందులు బయల్పడతాయి. అంతకు ముందరి బౌద్ధ, జైనమతాల ఆనవాళ్ళు కూడా అరుదుగా కనిపిస్తాయి. రామానుజుడి తరువాతే మా ప్రాంతంలో వైష్ణవం వ్యాపించిందని చెప్పవచ్చు. అతనికంటే ప్రాచీనమైన విష్ణువిగ్రహాలు ఒకటీ, అరా దర్శనమిస్తాయి. మధ్వాచార్యుని ప్రభావం నేటికీ ఈ ప్రాంతంలో అక్కడక్కడా కనిపిస్తుంది.

పూర్తిగాను, సగం సగంగాను కప్పబడిన విగ్రహాలను బయటకు తెస్తామని, మూడు దిబ్బల్నీ శుభ్రం చేయిస్తామని గ్రామస్తులు మాతో చెప్పారు. శాసనాలను పాఠశాల వద్దకు తరలిస్తామని అన్నారు. ఆ పనులు జరిగిన తరువాత శాసనాలను ప్రింట్ తీయడానికి, అన్ని విగ్రహాలను ఇంకోసారి పరిశీలించడానికి మరోసారి వద్దామని నిర్ణయించాం. అట్టి ప్రయత్నం చేస్తే తప్ప మంతిన గ్రామ చరిత్ర పూర్తిగా బయట పెట్టలేం అనుకుంటూ అక్కడివారికి వీడ్కోలు చెప్పి వెనుదిరిగాం. ౝ

గార రంగనాథం - రాజాం. ఫోన్: 988 575 8123.

# నూరేళ్ల సుగాలీ కుటుంబం

*- ఎస్. హనుమంతరావు*

తెలుగులో వచ్చిన ఉత్తమోత్తమమైన కథల్లో ఒకటిగా కథాప్రియుల, విమర్శకుల మన్నన పొందినది చింతా దీక్షితు గారి కథ "సుగాలీ కుటుంబం". ఇది తొలిసారిగా ప్రచురితమై ఈ సెప్టెంబర్‌నాటికి నూరేళ్లు.

తెలుగులో తొలి తరం కథకుల్లో ఒకరైన దీక్షితులగారి గురించి ఇప్పటి తరంవారికి పెద్దగా తెలిసి ఉండకపోవచ్చు. బహుశా చలం సాహిత్యం చదివే సందర్భంలో వారికి దీక్షితులగారి పేరు తగులుతూ ఉండొచ్చు. కాని దీక్షితులు గారు చలం మెచ్చిన రచయిత. ఏ కథ రాసినా వెంటనే, అది రాత్రి అయినా సరే దీక్షితులుగారికి వినిపించనదే చలంగారికి తృప్తి ఉండేది కాదు. చలంగారు తన మ్యూజింగ్స్‌లోను, లేఖల్లోను దీక్షితులుగారిపై తనకున్న ప్రేమను, గౌరవాన్ని ఎన్నోసార్లు వ్యక్తం చేశారు. 1955వ సం॥లో విశాలాంధ్ర ప్రచురణాలయం దీక్షితుల వ్యాసాల్ని 'ప్రజా వాఙ్మయం' పేర అచ్చు వేసింది. దానికి చలం ముందు మాట రాస్తూ "దీక్షితుల గారి పుస్తకానికి చలం ఉపోద్ఘాతమా?... ఇప్పటి తెలుగు సారస్వత శాఖలెన్నింటికో ఆయనే ఉపోద్ఘాతం" అంటారు. మరోచోట "నేను ముల్లు. దీక్షితులుగారు గులాబీ పువ్వు" అని చెబుతారు.

1891 సం॥లో తూర్పుగోదావరి జిల్లా దంగేరు గ్రామంలో జన్మించిన దీక్షితులు విద్యాశాఖలో స్కూళ్ల ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం చేశారు. ఉద్యోగరీత్యా తెలుగు దేశపు అనేక ప్రాంతాల్లో పనిచేసి, ఆయా ప్రాంతాల ప్రత్యేకతలను, అక్కడి ప్రజల సాధక బాధకాలను పరిశీలించి తమ రచనల్లో కళాత్మకంగా చిత్రించారు. తన తరం రచయితలకు భిన్నంగా, దీక్షితులు గారు సమాజంలో క్రింది వర్గాల బతుకుల్ని తన కథావస్తువులుగా స్వీకరించడం గొప్ప విశేషం. ప్రఖ్యాత నవలా రచయిత నోరి నరసింహ శాస్త్రి ఒకచోట వీరి కథల్ని సమీక్షిస్తూ "గ్రామీణుల నిరాడంబర జీవితమంటేను, పేదల కష్టాలంటేనూ శ్రీ దీక్షితులకు పక్షపాతము" అని అన్నారు.

ఈ కథ మొదటిసారిగా 'సాహితి' పత్రిక 1921 ఆగష్టు, సెప్టెంబరు సంచికలో అచ్చయ్యింది. తెలుగు నాట ఒక అటవీ ప్రాంతానికి అటవీ అధికారిగా బదిలీ మీద మునిస్వామి వస్తాడు. అది ఏ ప్రాంతమో రచయిత వేరుగా చెప్పకపోయినా, అధికారి పేరును బట్టి అది రాయలసీమ ప్రాంతమని అర్థం చేసుకోవచ్చు. మునిస్వామి తను నిజాయితీపరుడైన అధికారినని రూల్సు విషయంలో ఖచ్చితంగా ఉంటాననే భావనని పై అధికారులలోను, ప్రజలలోను కలిగించే విధంగా ప్రవర్తిస్తుంటాడు. కాని అది నిజం కాదని, అతను అవినీతిపరుడని కథ ప్రారంభంలోనే రచయిత అధికారి భార్య కంఠె ఉదంతాన్ని చెప్పటం ద్వారా పరోక్షంగా ఎరుకపరుస్తాడు. అతను బదిలీపై వచ్చీ రాగానే అడవిపై ఆధారపడ్డ పేద ప్రజల్ని రకరకాల కేసులు పెట్టి ఇబ్బంది పెడతాడు. ఇలా ప్రవర్తించడానికి కారణం విధి నిర్వహణలో తను కఠినంగా ఉంటాననే భ్రమని పై అధికారుల్లో కలిగించడం. తద్వారా భవిష్యత్తులో తాను పాల్పడబోయే అవినీతి పనులకుపై అధికారులలో తనపై ఉన్న మంచి అభిప్రాయం ఒక రక్షణ కవచంగా ఉంటుందని మునిస్వామి భావన. అతని కుటిలనీతికి బలియైనవారిలో రూపల్ నాయక్ కుటుంబం ఒకటి. అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న ఒక కుగ్రామంలో ఒక సుగాలీ కుటుంబం నివసిస్తూ ఉంటుంది. రూపల్ నాయక్, అని భార్య చంద్రి, వారి ఏడుగురి సంతానం ఆ కుటుంబ సభ్యులు. కూలిపని చేసుకుని ఆ కుటుంబం పొట్ట పోసుకుంటుంది. అది రాక్షస నామ సంవత్సరం. పేరుకు తగ్గట్టే వర్షాలు కురవక కరువు తాండవిస్తూ ఉంటుంది. 'ఈ యేడు వర్షములు లేక పంటలు లేవు. తినడానికి తాటిపళ్లేనా పడటం లే' అని జనం వాపోయే కరవు. కూలి పనులు లేనప్పుడు ఆ కుటుంబం అడవిలో, కొండల్లో దొరికే దేవదారు కూర, పింకి కాయలు, పాల పళ్లు, వెలగపళ్లు తెచ్చి ఊళ్లో జనానికి జొన్నలకో, కొర్రలకో అమ్మి, అవి తెచ్చుకుని ఇంత ఉడకేసుకుని ఆకలి తీర్చుకుంటుంది. కాని క్షామం వల్ల ఆకుకూరలు, పళ్లూ దొరకని పరిస్థితి. ఒకవేళ అంతో ఇంతో దొరికినా ఊరి జనం కొనలేని దుస్థితి. పొట్ట గడవటానికి ఆ కుటుంబం నానా పాట్లు పడుతుంది. మొగుడూ పెళ్లాలు ఈత పండ్లని

పోగుచేసి, వాటిని ఎండబెట్టి, గింజల్ని పారవేసి పొట్టుతో రొట్టెలు చేసి తమ ఆకల్ని తీర్చుకుంటారు. కానీ ఆ ఈతపళ్లూ కొన్నాళ్లకి కరువైనాయి. తర్వాత చింత గింజల్ని రోటిలో దంచి, తిరగలితో విసిరి, నల్లటి పిండితో రొట్టెలు చేసుకుని అరకొరగానైనా కడుపులు నింపుకుంటుంది ఆ కుటుంబం.

కొంత కాలం తర్వాత చింత గింజలూ దొరక్కపోతే, చింత చిగురూ, చింతపండూ, బూడిదలో కలుపుకుని అంబలిగా ఉడికించుకుని తాగుతారు. అడవిలో దొరికే దేవదారు కూర మంచి సువాసన కలిగి, పప్పుతో కలిపి వండుకుంటుంటే పప్పు మెంతికూరలా ఉంటుంది. దీన్ని రహస్యంగా అడవి నుండి తెచ్చి, బయట అమ్ముకుని, ఇంట్లో వండుకుని కొంత కాలం జీవనం సాగిస్తారు. అడవిలో దేవదారు ఆకుని కోయడం చట్టరీత్యా నేరం కాకపోయినప్పటికి కొమ్మల్ని విరవడం నేరం. ఓరోజు దేవదారు ఆకును కోయడానికి అడవికి వెళ్లిన రూపల్ నాయక్ అడవి కాపలాదారుల కంట పడతాడు. వారు దేవదారు కొమ్మల్ని కొట్టి అతను అమ్మబోయినట్టు ఆరోపించి అధికారి మునుస్వామి దగ్గర హాజరుపరుస్తారు. అతను నాయక్‌పై కేసు పెట్టి, న్యాయాధికారి ముందు ప్రవేశపెడతాడు. తాను ఆకు కోయడం తప్ప, కొమ్మల జోలికి పోలేదని ఎంత మొత్తుకున్నా ప్రయోజనం ఉండదు. అతనికి నాలుగు సంవత్సరాలు శిక్ష ఖరారవుతుంది. చంద్రి తను ఒక్కర్తీ పిల్లల్ని పోషించలేక, చంటిబిడ్డని తీసుకుని ఎటో వెళ్లిపోతుంది. మిగిలిన పిల్లలూ చెల్లాచెదురవుతారు. శిక్ష పూర్తి చేసుకున్న అనంతరం ఊరికి వచ్చిన నాయక్‌కి కుటుంబం కనిపించక హతాసుడవుతాడు. ఆ కుటుంబ విషాదాంతాన్ని 'భూదేవి వారిని కన్నది. భూదేవి వారిని మరల స్వీకరించినది' అని రచయిత సూచిస్తారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1982 సం॥లో 'తెలుగు కథా రచయితలు' అన్న పుస్తకాన్ని ప్రచురించింది. ఇందులో వివిధ కథకుల సాహిత్య కృషిని వ్యాస రూపంలో వేరు-వేరు రచయితలు అంచనా కట్టారు. ఈ పుస్తకంలో చింతా దీక్షితులు గారి గురించి ప్రఖ్యాత రచయిత, వీరేశలింగం గారిపై విశిష్ట పరిశోధన చేసిన శ్రీ అక్కిరాజు రమాపతిరావు రాశారు. ఇందులో 'సుగాలీ కుటుంబం' గురించి వివరిస్తూ "ఇది చిన్న కథ. ఏడు పేజీల కథ. శిల్పంలో, వస్తువులో, భావనవ్యతలో, సాఫీతనంలో, సాంఘిక ప్రయోజనంలో, పరమార్థంలో, అన్నిటా విన్నాణాలు, సొగసులూ చిమ్ముతున్న కథ. ఆయన (దీక్షితులు) కథలు రాయడం మొదలుపెట్టిన ఇంత స్వల్ప కాలంలో ఇంతటి పరిణామమా? అని విస్తుపోవాల్సిన కథ" అని ప్రశంసలు కురిపించారు. రమాపతిరావుగారే తను సంపాదక బాధ్యత వహించిన 'తొలి మలి తరం తెలుగు కథలు' (బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ వారి ప్రచురణ) పుస్తకంలో ఈ 'సుగాలీ కుటుంబం'ని చేర్చడమే కాకుండా కథపై మంచి పరిచయం రాశారు. 1915 రాక్షస నామ సంవత్సరం నాటి కరువు పరిస్థితిపై ప్రతీకాత్మకంగా రాసిన కథ కావొచ్చని కూడా రమాపతి రావుగారు అభిప్రాయపడ్డారు.

ఒక రచన జీవితకాలాన్ని నిర్ణయించేది ప్రధానంగా దానిలోని వస్తువు. అలాగే ఆ వస్తువు సాహిత్య రూపంలోకి మారే క్రమంలో వినియోగపడే శైలీ శిల్పాలు కూడా ముఖ్యమైనవే. వస్తువు యొక్క సార్వకాలీనతా లక్ష్యం కూడా పరిగణనలోనికి తీసుకోవాలి. సుగాలీ కుటుంబం కథలోని గుండెల్ని పిండే విషాదవే ఏ తరం పాఠకుడి హృదయాన్నైనా కదిలిస్తుంది. ఈ కారణంగానే దీనికి కథా చరిత్రలో సుస్థిర స్థానం కలిగింది. ఈ కథలో అనవసర వర్ణనలుగాని, ఉపోద్ఘాతాలు గాని, ఉపన్యాసాలుగాని, కథకుని సూత్రధారి పాత్రగాని లేవు. ఈ కథ రాసేనాటికి రచయితకి అనుభవం తక్కువైనా ఆయన చూపిన పరిణితి, శిల్ప చాతుర్యం మనల్ని అబ్బురపరుస్తుంది.

కరువు కరాళనృత్య వేదిక ఈ కథ. ఇటీవలి కాలంలో డా. హరికిషన్ సంపాదకత్వంలో 'రాయలసీమ కరువు కథలు' పుస్తకం వచ్చింది. ఈ సంపుటిలో అన్నీ సీమ రచయితలు కరువుపై రాసిన కథలే ఉన్నాయి. ఆ ప్రాంత కథకుడు కాకపోయినప్పటికీ దీక్షితులగారి ఈ కథని కూడా అనుబంధంలో చేర్చారు. రాయలసీమ కరువుపై వచ్చిన కథల్లో 'సుగాలీ కుటుంబం' తొలి కథ. ఈ చారిత్రక ప్రాధాన్యం రీత్యా ఈ కథకి సంకలనంలో చోటు కల్పించామని పుస్తక సంపాదకులు అన్నారు.

కథ, 'గాథ' (epic)గా రూపాంతరం చెందడం ఇలాంటి కథల విషయంలోనే జరుగుతుంది.

ఎస్. హనుమంతరావు
హైదరాబాద్. ఫోన్: 889 781 5656.

# షేక్స్‌పియర్ సాహిత్యంలో భారతదేశం ప్రస్తావన

*– గుజ్జు చెన్నారెడ్డి*

మానవ చరిత్ర లోతులు వెలికితే ఆనవాలు కనిపించే ప్రదేశాలలో భారతదేశం ఒకటి. క్రీస్తు పుట్టకమునుపే నలందా, తక్షశిలలతో విద్యారంగాన ప్రకాశించి సిరిసంపదలతో తులతూగిన ఈ గడ్డను వశం చేసుకోవాలని ప్రపంచ విజేత అలెగ్జాండర్ కోరుకోవడంలో అతిశయోక్తి లేదు. చరిత్రను తెలయజేస్తూ తరతరాలుగా ప్రజలకు అందిస్తున్న సాహిత్యరంగంలో నాటకానిది ఓ ప్రత్యేకత. చారిత్రాత్మక నాటకాలు గతాన్ని కల్లముందుంచుతూ ఆయా పాత్రలు, సంఘటనలు ప్రేక్షకుల హృదయాలలో చెరగని ముద్రవేస్తాయి. నాటకాలకు నాటి ప్రపంచానికే కేంద్రబింధువైన ఇంగ్లాండ్‌ను 1558–1603 మధ్య పరిపాలించిన ఎలిజబెత్ మహారాణి స్వయంగా తిలకించిన సందర్భాలు ఉన్నాయి. సాహిత్య రంగంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఎలిజబెత్ కాలంనాటి నాటకాలు ప్రపంచ సాహిత్యానికి పునరుజ్జీవం (రెనైజాన్స్)గా గుర్తింపు తెచ్చాయి. ఆ నాటక రచయితల్లో అగ్రగణ్యుడు విలియం షేక్స్‌ఫియర్. నాడు అఖండ ఖ్యాతి పొందిన భారతదేశం గురించి సమయస్ఫూర్తిగా తన నాటకాలలో ప్రస్తావించాడు.

షేక్స్‌పియర్ తన జీవిత కాలంలో ఇంగ్లాండ్ దాటి పయనించిన దాఖలాలులేవు. కాని అతని నాటకాల్లో ఐరోపా, ఆఫ్రికా, ఆసియా, అమెరికా ఖండాలను సృజించి ఆయా దేశాలలోని అద్భుతాలతో ఆంగ్లేయ ప్రేక్షకుల మనసులు దోచుకున్నాడు. ఆంగ్లేయ నావికులు, వర్తకులు పరాయి గడ్డలు తొక్కి తమ అనుభవాలతో మోసుకొచ్చిన గాథలు వినడానికి ఆంగ్లేయులు మక్కువ చూపించే సమయమది. నాటి భారత్‌ను పరిపాలించిన మొగల్ చక్రవర్తి అక్బర్ ఐరోపా వర్తకులకు భారతదేశాన వ్యాపారానికి తివాచి పరిచాడు. అరబ్బు దేశాలతో పోలిస్తే సుసంపన్నమై అపార వ్యాపార సౌకర్యం కలిగి ఎంతో మర్యాదస్తులు నివసించే భారతదేశంలో వర్తకం చేయడానికి ఐరోపా వర్తకులు, ముఖ్యంగా ఆంగ్లేయ వర్తకులు మక్కువ చూపించే రోజులవి. పోర్చుగీస్ నావికుడు డామింగోపేజ్ దక్షిణ భారతదేశాన శ్రీకృష్ణదేవరాయుల ఆస్థానంలో వజ్రవైఢూర్యాలు రాశులుగా పోసి అమ్ముతున్నారన్న వార్త ఐరోపాకి చేరిన సమయమది. సాంఘిక శాస్త్రాలను సృజించి, ప్రేమకావ్యాలు, విషాధగాధలు, హాస్యకథలతో 37 నాటకాలు, 154 సానెట్లనే ప్రేమ కావ్యాలు ఈ కవిరాజు వ్రాసి నాలుగు శతాబ్దాలు దాటినా నేటికి సాహిత్యాభిమానులకు ఉగ్రూతలూగిస్తున్నాయనడానికి సందేహం లేదు. ప్రపంచంలోని అన్ని ముఖ్యభాషల్లోకి తర్జుమా చేయబడిన ఈ నాటకాలు పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలై చరిత్ర, సంస్కృతి, కళలతోపాటు అన్ని సాంఘిక శాస్త్రాలను భోదిస్తున్నాయి. బ్రిటిష్ వారు 1600 సంవత్సరంలో భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రారంభించక మునుపే ఆంగ్లేయ వర్తకులు తమ వ్యాపారానికి భారతదేశం అనువైన దేశంగా గుర్తించారు. ఎలిజబెత్ మహారాణి కాలానికి భారతదేశం వజ్రవైఢూర్యాలు, చీనాంబరాలు, సుగంధ ద్రవ్యాలు, ఔషద మొక్కలు, శిల్పసౌందర్య నిర్మాణాలకు ప్రసిద్ధి. షేక్స్‌పియర్ తన నాటకాలలో 'ఇండియా' అనే పదం బంగారం, సంపద, విలువలకు పర్యాయ పదంగా ఉపయోగించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇండియాను 'ఇండ్', 'ఇండి' 'ఇండియ ఇండిన్ 'ఇండియన్' అను పదాలతో ఉపయోగించాడు.

'ఇండియా' అనే పదం మొదట ఉపయోగించింది "కింగ్ హెన్రీ ద ఫోర్త్" నాటకంలో. ఈ నాటకంలోని మూడవ అంకం మొదటి సన్నివేశంలో హెన్రీ మహారాజు "నా రాజ్యపాలన నా హృదయంలో ఉంది. అది నా తలపైనున్న కిరీటంలో లేదు. అది భారతదేశపు వజ్ర వైఢూర్యాలతో పొదిగి ఉన్నా సరే" అని ప్రకటించాడు. ఆంగ్లేయ మహాసామ్రాజ్యాన్ని ఏలిన హెన్రీతో పాటు ఐరోపాను ఏలిన చక్రవర్తులు తమ కిరీటంలో భారతదేశ వజ్ర వైఢూర్యాలు పొదిగి ఉండడాన్ని ఎంత ప్రతిష్టగా భావించేవారో ఈ నాటకం ద్వారా తెలియవస్తుంది. "ఏ మిడ్ సమ్మర్ నైట్ డ్రీమ్స్" అనే హాస్య నాటకంలో రచయిత భారతదేశాన్ని నాలుగుసార్లు ప్రస్తావిస్తూ భారత భూభాగం సూర్యరశ్మికి, సంపదకు, బంగారానికి ప్రతీకని ప్రస్తుతించాడు. భూమద్యరేఖకు దగ్గరగా ఉన్న భారతదేశానికి అపారమైన సూర్యకాంతి సోకుతుందని షేక్స్‌పియర్ గ్రహించి ఉండాలి. ప్రఖ్యాత నాటకం "మర్చంటాఫ్ వెనిస్"లో బెసానియో తన స్నేహితుడు ఏంటోనియోతో మాట్లాడుతూ నీ వ్యాపారం ఇండియాతో ఎలా ఉందని ప్రశ్నిస్తాడు. నిజానికి అది సముద్ర మార్గాన చేసే వ్యాపారం. అప్పటికి ఇంగ్లాండ్‌కు ఇండియాకు

మధ్య అటు సముద్ర మార్గం ఇటు భూమార్గం ద్వారా వ్యాపారం జోరుగా సాగుతుండేది. అలాగే పోర్షియాతో మాట్లాడుతూ భారతీయ మహిళలు తమ నలుపు ముఖాన్ని కనిపించకుండా ఉండేందుకు ఆకర్షిణీయమైన దుస్తులు ధరిస్తారన్నాడు. ఈ వాఖ్య భారతీయ మహిళలు సంప్రదాయంగా చీరకొంగులో తమ ముఖాన్ని దాచుకోవడాన్ని సూచిస్తుంది. రచయిత భారతదేశ రంగురాళ్ళను, ఆభరణాలను కీర్తిస్తూ తమ సృష్టించిన నటులతో పోల్చాడు.

తన నాటకాలలోనే గొప్ప హాస్య శృంగార నాటకం ''ట్వల్త్ నైట్''లో అందాల రాశి ఒలీవియ పరిచర్య, సమయస్ఫూర్తిని మెచ్చుకుని ఆమెను భారతీయరత్నంగా అభివర్ణించాడు. ఆ నాటకలోనే, తన అద్భుత సమయస్ఫూర్తితో తింగరి మల్వాలియో ఆటకట్టిస్తుంది. "ట్రెయిలస్ అండ్ క్రిసెడా" నాటకంలో కథానాయికి హెర్బటోను భారతీయ ఆణిముత్యంతో పోల్చాడు. పాండరస్ తన ప్రేమికురాలు ట్రియలస్ మనసులో తిరిగి స్థానం సంపాదించడానికి చెప్పులు లేకుండా ఇండియాకు పయనిస్తానంటాడు. అప్పటికే వాస్కోడిగామా భారత్‌కు సముద్రమార్గం కనిపెట్టినప్పటికి ఐరోపా నుండి ఇండియాకు భూమార్గంలో వ్యాపారం జోరుగా జరుగుతున్న రోజులవి. మరో హాస్య నాటకం "ఆల్స్ వెల్ దట్ ఎండ్స్ వెల్"లో హెలెనా తనకంటే ఎంతో ఉన్నతుడైన బెర్ట్రాంతో ప్రేమలో పడినపుడు ఆమె తన విధిని భారతీయులు సూర్యభగవానుని మీద పెట్టుకున్న నమ్మకంతో సరిపోల్చుతాడు కవి. పంచభూతాలలో ఒకటైన సూర్యుని పూజిస్తే తమ కోరికలు నెరవేరుతాయన్న భారతీయుల నమ్మకాన్ని షేక్స్‌పియర్ ఇక్కడ ఉదహరించాడు. ప్రఖ్యాత విషాదనాటకం ''ఒథెల్లో''లో కథానాయకుడు ఒథెల్లో తన చావుకు ముందు తన డెస్టిమోనా ఆణిముత్యంలాంటిదని, తను ఓ అమాయుక భారతీయునిలాంటివాడినని వాపోతాడు. సిరిసంపదలు, రాజభోగాలతో పాటు సామాన్య భారతీయుల నిరాడంబర జీవితం ఈ నాటక రచయిత ఆంగ్లేయ నావిక, వర్తకుల ద్వారా షేక్స్‌పియర్ విని ఉండాలి.

షేక్స్‌పియర్ చివరి మరియు 37 నాటకం "ద టెంపెస్ట్" మరియు కింగ్ హెన్రీ–8 (Henry VIII) నాటకంలో కూడా భారతీయత కోసం చర్చించాడు. కింగ్ హెన్రీ–8లో అందాలరాణిని భారతదేశ సంపదతో పోల్చుతాడు. అలాగే రాజు ఆమెకోసం అంతగా శ్రమించడానికి కారణం అతని చేతిలో ధనవంతురాలైన 'భారతి' ఉంది కనుక అని చమత్కరిస్తాడు. ఇక్కడ 'ఇండిస్' (భారతి) అంటే అప్పటి ఐరోపా వాసులకు వర్తకవ్యాపారంలో కాసులు కురిపించిన భారతదేశం. షేక్స్‌పియర్ తన నాటకాలలో భారతీయ సంపద, చాతుర్యం, నమ్మకాలు, కట్టుబాట్లు, అమాయకత్వం మీద చమత్కరించాడే తప్ప భారత రాజరిక వ్యవస్త, మత వ్యవస్థ మీద ఎక్కడా ప్రస్తావించకపోవడం గమనర్హం. షేక్స్‌పియర్ సాహిత్యంపై అపర పరిశోధన చేసిన ప్రఖ్యాత విమర్శకుడు జాన్సన్ "ఈ కవి ఒక యుగానికి, ఒక ప్రాంతానికి పరిమితంకాదు అన్ని కాలాలలో వర్ధిల్లుతాడు" అన్నాడు. ఈ నాటక సూత్రధారి చదువుకున్నది కేవలం పాఠశాల విద్య మాత్రమే. అప్పటికే పేరెన్నికగన్న ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ ప్రక్కనే ఉన్నా షేక్స్‌పియర్ వాటిని అతను సందర్శించిన ధాఖలాలు లేవు. నాటక రంగంలో మొదట నటుడుగా అడుగిడక ముందు నాటకశాల బయట గుర్రాల కాపలాదారునిగా వచ్చిపోయే ప్రేక్షకులను పరిశీలించి సమాజాన్ని, మానవ సంబంధాలను సృజనాత్మకంగా అభ్యసన చేశాడు. నాటకశాలలకు వచ్చే నావికులు, వర్తకులతో ముచ్చటించేవాడు.

అనేక సాంఘికశాస్త్రాల మిళితమైన షేక్స్‌పియర్ నాటకాలలో అపారమైన జ్ఞానం ఉంది. అప్పటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్‌లలో గ్రీకు తత్త్వవేత్తలు ముఖ్యంగా అరిస్టాటిల్‌ను పండితులు ఔపోసన పట్టేవారు. నాటకాలు రాయడానికి అతని అడుగుజాడలు పాటించేవారు. ఆ పండితుల జ్ఞానమంతా చాలావరకు సిద్ధాంతపరమైనదే (Theoretical Knowledge). కాని షేక్స్‌పియర్ జ్ఞానం ఆచరణాత్మకమైనది (Practical Knowledge). అతని అభ్యాసన తరగతి గది బయటే జరిగిందని నేటి సమాజం గ్రహించాల్సిన అవసరం ఉంది. గత 400 ఏళ్ళుగా ప్రపంచం అతని 37 నాటకాలను మాత్రమే చదువుతుంది కాని, అతని జీవితం చదవడం ప్రారంభించలేదు.

సినిమా రంగం ప్రాచుర్యం పొందిన తరువాత నాటకరంగం కనుమరుగైపోయింది. నాటకాలలోనే కాకుండా ఆంగ్ల కథలు, కవితలు, నవలా సాహిత్యంలోను భారతదేశ ప్రస్తావన కనిపిస్తుంది. గ్రీకు తత్వశాస్త్రం (Philosophy) ఆంగ్ల సాహిత్యంలో ప్రముఖ స్థానం ఆక్రమించినా విక్టోరియన్ నవలా సాహిత్యంలో భారతీయ ప్రస్తావన ఉంది. అటువంటి అంశాల మీద లోతైన పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది.

డా. గుజ్జు చెన్నారెడ్డి - ప్రొఫెసర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం. ఫోన్: 984 925 4826.

# ఆంగ్ల సాహిత్యంలో భావ కవితా విన్యాసం

*– కస్మూరి అలెగ్జాండర్*

ఇంగ్లాండులో 18వ శతాబ్దం మేధాశక్తికి పట్టం కట్టింది. కవి శేఖరులైన విలియం బ్లేక్, షెల్లి, విలియం వడ్స్ వర్త్, కోల్ రిజ్ రచనలు ప్రపంచ కవులకు మార్గదర్శకాలయ్యాయి. అందరూ వాడుకునే మాటల్లో పాడుకునే వరుసల్లో మానవుల సుఖదుఃఖాలను ప్రకటించాలనే ఆశయం ప్రధానంగా ఈ కాలపు కవులలో కనిపిస్తుంది. అతి సామాన్య అంశాలను వస్తువుగా తీసుకొని తమ భావన శక్తితో సాధారణంగా కనిపించే అతి సాధారణ వస్తువులకు వింత వింత రంగులు దిద్ది మేలి ముసుగులు సవరించి ఎంతో ఆకర్షణీయంగా రచనలు వెలయించారు ఈ కవులు. నాగరిక జీవితపు సంఘర్షణల నుంచి కవిత్వాన్ని దూరంగా తీసుకువెళ్లారు. గ్రామసీమలలో విలసిల్లె ప్రకృతి రామణీయకతను, సంతృప్తితో జీవించే జానపదుల జీవితంలో కనిపించే అమాయకత్వమును, సరళ నిరాడంబర విధానమును సామాన్యుల సుఖదుఃఖాలను ఆశానిరాశలను తమ కవితావస్తువుగా స్వీకరించారు. సంప్రదాయపు కళ్ళజోడు తీసేసి తమ సొంత కళ్ళతో ప్రకృతి సౌందర్యాలను చూసి నిలువెల్లా పులకించి సొంత బాణీలలో పరికించారు, పలికించారు. నిర్మలమైన అమాయకమైన ప్రవృత్తితో నవ్వుతూ జీవన సాగర తీరంలో ఇసుకతో పిచ్చుకగుళ్ళు కట్టుకునే శిశువులలో పావనత్వం దివ్యత్వం వారు దర్శించారు.



షెల్లి

శైశవంలో స్వర్గం మన చుట్టూ పరుచుకొని ఉంటుంది, పెరుగుతున్నకొద్దీ మనలో దివ్యాంశ తరిగిపోతుంది, జీవన మందిర తలుపులు మూసుకుపోతాయి. శైశవంలో విరిసిన అమూల్య దివ్యత్వం క్రమక్రమంగా అంతర్ధానమైపోతుంది. "ఎవరనుకున్నారో ఎరుగరా మీరు శిశువు సాక్షాత్తు పరమాత్ముడండి," అంటాడు వడ్స్ వర్త్.

ప్రాచీన కవిత్వం ఆశయ సాధనవల్ల కలిగిన సంతృప్తిని వెల్లడిస్తుంది. భావ కవిత్వం అందని ఆదర్శాల కోసం, అందాల కోసం, మానవ హృదయాన్ని కలవరపెట్టే అన్వేషణను ప్రకటిస్తుంది. అప్రాప్తమైన ఆశయాల కోసం మానవుని నిరంతరాన్వేషణకు అక్షర రూపం ప్రాశ్చత్య భావ కవిత్వం. భావకవులకు స్వేచ్ఛ ప్రాణవాయువు. సంకెళ్లతో సంగీతం ఎలా సాధ్యం! "హాయిగా పాడే కోయిలను పంజరంలో బంధిస్తే ప్రకృతి అగ్రహంతో ఉడికిపోతుంది సుమా," అంటాడు కోల్ రిజ్. అందుకేనేమో ప్రపంచమంతటా భావకవులు బానిసత్వానికి కృత్రిమమైన నిబంధనలకు అర్థంలేని కట్టుబాట్లకు బద్ధ శత్రువులు. గ్రీసు స్వతంత్ర సమరంలో బైరన్ ప్రాణాలర్పించాడు. విలియం బ్లేక్, విలియం వడ్స్ వర్త్ ఫ్రెంచ్ విప్లవంలో ప్రజాపక్షం వహించారు.

భావ కవుల దృష్టిలో బుద్ధి వైభవంకంటే మానవ హృదయ వైశాల్యమే విలువైనదీ. బుద్ధికి పదునుపెట్టడంకంటే హృదయాలను కదిలించి, కరిగించి మెత్తపడేయటమే కవితకు లక్ష్యంగా భావిస్తారు. ఒక హృదయంలోంచి ఎగిసి వచ్చి ఇంకో హృదయంలోకి సూటిగా దూసుకుపోగల రచనా విన్యాసం వారికి ఆదరపాత్రం. అందుకే గానాన్ని ప్రాణంగా భావించి పాటలతో పూలబాటలు వేసి పరమ సత్యాలను ఆవేశ బంధురంగా సుకుమార సుందరంగా పలికిస్తారు భావకవులు. పండితులు చేసిన ఈసడింపులకు గురైన జానపద గేయ పణితులను కళ్ళకు అద్దుకుంటారు, పనికట్టుకొని ధర్మోపదేశాలు చేయకుండా ఆకులందు దాగి తీయగా పాడుతూ సమాజాన్ని ప్రభావితం చేస్తారు,

ప్రోత్సహిస్తారు, భావ కవి కోకిలలు. పాండిత్య ప్రధానమైన మేధాశక్తికంటే భావన శక్తియే కవితకు ప్రాణమని భావ కవుల విశ్వాసం, పరమాణువులో బ్రహ్మాండం, గడ్డి పువ్వులో సౌందర్య స్వర్గము, క్షణకాలంలో అనంతమును గుర్తించగల భావన శక్తి విభవాన్ని తన గేయాలలో వ్యక్తం చేసిన కవి విలియం బ్లేక్. ఈ భావన శక్తివల్లనే విభిన్నంగా కనబడే విశ్వంలో ఏకతా సూత్రం మనకు కనిపిస్తుంది అంటాడు బ్లేక్ కవి. ఈ భావన శక్తి ప్రసరించే కాంతి మూలంగా దివికి భువికి వినూత్న శోభలు సమకూరగలవని ఆయన భావన. భావ కవిత్వం ఒక విధంగా ప్రణయ కవిత్వమే. సృష్టి అంతటికి మూలాధారం ప్రణయం. విశ్వంలో ఉన్న జీవకోటిని ఆప్యాయంగా లాలించి పాలించే శక్తి ప్రణయమే. విభిన్నంగా తోచే విశాల విశ్వాన్ని అనుసంధించే అదృశ్య సూత్రమే ఈ ప్రణయం. విచిత్ర ప్రపంచ మణిహారంలో కనబడని దారం. ఈ విశ్వాసపు పునాదిగా విలియం బ్లేక్‌లాంటి భావకవులు ఎన్నో రమ్య హర్మ్యాలు నిర్మించారు. శరీరాల స్పర్శకూ, కామవికారాలకు అతీతమైన ఉత్తమమైన ఉదాత్తమైన పవిత్ర శక్తిగా ప్రణయాన్ని ఉపాసించారు. విలియం బ్లేక్ షెల్లి వడ్స్‌వర్త్‌ల కవిత్వమంతా ఈ ప్రణయ శక్తికి ఆవాహనగా, ఆరాధనగా, నివేదనగా అక్షర రమ్యతతో అలరిస్తుంది.

**అరుదైన భావ కవి విలియం బ్లేక్ (1757-1827):**

బ్రిటన్ ఇప్పటివరకు నిర్మించిన గొప్ప కళాకారుడు విలియం బ్లేక్. అతని సమకాలీన కవులు బ్లేక్ విలక్షణమైన దృక్కోణాల ధోరణిని అపార్థం చేసుకున్నప్పటికీని అతని భావవ్యక్తీకరణ సౌందర్యం సృజనాత్మకత అతనిలోని తాత్త్విక ఆధ్యాత్మిక అంతర్ ప్రవాహాలకు ముగ్ధులై జోహార్లు అర్పించడం ఆశ్చర్యకరం అతని కవిత్వం, చిత్రాలు, రొమాంటిక్ ఉద్యమంలో భాగంగా ప్రీ రొమాంటిక్, రొమాంటిక్ భాగాలుగా వర్గీకరించబడ్డాయి. వాస్తవంగా బ్లేక్ రొమాంటిసిజం, జాతీయ వాదం రెండింటికి కీలకమైన ప్రారంభ ప్రతిపాదకుడు అని చెప్పవచ్చు. వ్యవస్థీకృత మతాలను తీవ్రంగా నిరసించి మత నాయకులు ఆగ్రహానికి గురయ్యాడు, నిబద్ధత కలిగిన మనిషిగా మానవుని స్వేచ్ఛ స్వాతంత్రాల పరిరక్షణ కోసం ఉన్నత ఆశయాల కోసం జీవించిన కవి అతడు. అనేక ప్రభావాలు తనపై ఉన్నప్పటికీని తనదంటూ ఒక విలక్షణమైన శైలిని ఎన్నుకున్న కవిధీరుడు. అతనిని వర్గీకరించడం చాలా కష్టతరమే, అందుకే మైఖేల్ రోసెట్టి అతనిని "అద్భుతమైన ప్రకాశవంతుడు" అని ప్రశంసించాడు. అతనిపై బైబిల్ గాథలు ప్రగాఢమైన లోతైన ప్రభావాన్ని చూపాయి. అతని జీవితాన్ని స్ఫూర్తిదాయకంగా నిలిపింది బైబిల్. విలియం బ్లేక్ 16సంవత్సరాల ప్రాయంలో ఉన్నప్పుడు అతని స్వభావాన్ని గుర్తించి తల్లిదండ్రులు పాఠశాలకు బదులు హెన్రీ పార్స్ డ్రాయింగ్ స్కూల్లో చేర్పించారు. తనకు నచ్చిన విషయాలను బ్లేక్ ఆసక్తిగా చదివాడు. ఈ కాలంలోనే బ్లేక్ కవిత్వంలో పరిశోధనలు చేశాడు. జేమ్స్ బస్టర్ దగ్గర ఏడు సంవత్సరాల శిక్షణలో రాతి పలకాలను చెక్కడంలో నైపుణ్యాన్ని సంపాదించాడు. కొన్నేళ్ల తర్వాత వెస్ట్ మినిస్టర్ అబ్బేలో ప్రవేశం కలగడం, అక్కడ గోతిక్ శైలులను సునిశితంగా గమనించడంవల్ల ఆ అనుభవాలు అతనిలోని కళాత్మక శైలిని అతనిలోని సృజనాత్మక ఆలోచనలను రుపొందటానికి దోహదపడ్డాయని చెప్పవచ్చు. ఈ సమయంలోనే తాను దివ్యదర్శనాలను అనుభవించినట్లు బ్లేక్ చెప్పుకోవడంవల్ల తండ్రితో సహా సమకాలీన కవులు బ్లేక్‌ను అపహాస్యం చేయడం, నిర్దాక్షిణ్యంగా మత నాయకులు వెలివేయడం చూస్తాం. మానవుల స్వేచ్ఛ మనిషి మనుగడను మహోన్నతం చేస్తుందని విశ్వసించాడు. అందుకే ఫ్రెంచ్, అమెరికన్ స్వేచ్ఛ ఉద్యమాలను అభిమానించి అనుగుణంగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, అని ముద్రించిన దుస్తులు ధరించి బహిరంగంగా తిరిగేవాడు. అతని పుస్తకాలన్నీ అద్భుతమైన చిత్తరువులతో నిండి ఉంటాయి. స్టడీ మాన్ కవితో పరిచయం అతనని బానిసల విముక్తి కోసం పరితపించేటట్లు చేసింది. మతం యొక్క సంకుచిత దృక్పథాలను, మానవ నైతిక విలువలను ప్రశ్నించి తన అనుభవాలను సాంగ్స్ అఫ్ ఎక్స్‌పీరియన్స్‌లో వెల్లడించాడు.

క్రీస్తు శకం 1800లో పెల్ ఫామ్‌లో సైనికులతో గొడవ పడినప్పుడు రాజద్రోహం నేరం ఆరోపించబడి నిర్బంధించబడ్డాడు. నేరం రుజువైతే మరణశిక్ష తప్పదు అనుకున్న సమయంలో హేలి అనే సహచర కవి సాయంతో బయటపడ్డాడు. జైలులో గడిపిన ఈ కాలంలో రాసిన "మిల్టన్" కావ్యం అద్భుతమైన రచనగా ప్రసిద్ధి చెందింది.

నవీన శాస్త్రాన్ని మానవుని వెన్నెముకగా, హేతుబద్ధమైన ఆలోచనలను దృఢమైన కండరాలుగా, ఊహాశక్తి, భావనశక్తి మానవాకృతిగా, అంతర్ వివేచనను సుందర రూపంగా భావించిన విలియం బ్లేక్ ఆగస్టులో 12, 1827న, తుదిశ్వాస వదిలాడు. అతను చనిపోయే ముందు అతని ముఖం స్వర్గ కళతో అందంగా మారిందని, అతని కళ్ళు ప్రకాశవంతమై జ్వలించాయని, వివశుడై పరవశగానం చేస్తూ పరమాత్మలో లీనమయ్యాడని దగ్గరే ఉన్న శిష్యుడు రిచ్ మోండు తన వాంగ్మూలల్లో పేర్కొన్నాడు. పేదరికం అతనిలో పెల్లుబికిన ఉద్వేగాలను ఆపలేకపోయింది, చీకటి కర్మాగారాలగుండా మురికి వీధుల్లో నడుస్తూ పేద బాలబాలికల ఆకలి కేకలను గమనించి కన్నీరుమున్నీరయ్యేవాడు. వాళ్లను తన కవిత్వంలో బంగారు మూర్తులుగా చిత్రించాడు. విలియం బ్లేక్ వార్త హరుడు, గ్రాహకుడు, నిర్మల జలధార. భావ కవిత్వ ప్రయోక్త, ప్రవక్త. విలియం బ్లేక్ దృష్టిలో ప్రతి మనిషి ద్రష్టే. అందుకే అంటాడు దేవుని సంతానమైన మానవులంతా ప్రవక్తలే అని. తన దర్శనాలను కవిత్వ రూపంలో మన ముందు ఉంచాడు. ప్రకృతిని శాస్త్ర విజ్ఞానం నిలిపి ఉంచలేదు, అలాగే మతం దేవుణ్ణి బంధించలేదు అని నిర్ద్వందంగా ప్రకటించాడు. బ్లేక్ కవిత్వం మర్మ గర్భితం. అతి గంభీరం. అన్ని తరాల కవులను రసవాద పరిశోధకులను జ్ఞాన తృష్ణ ఉన్న ప్రతి తరాన్ని ప్రభావితం చేసింది. అతని కవిత్వం ముందు మనమందరం పసిపిల్లలమే. విలియం బ్లేక్ చూపిన క్రాంతి పథాన ఆనంద గానం చేస్తూ ఆయనతో కలసి నడుద్దాం.

కన్నూరి అలెగ్జాండర్ - నల్లగొండ. ఫోన్: 984 888 3244.

## అర్ధనారి

పురుష శరీరంలో స్త్రీత్వాన్ని భరించలేనిస్థితి చంద్రన్నది. అతనికి చీర కట్టుకోవాలని, ఆడదానిలా అలంకరించుకుని మగవాళ్ల మధ్య తిరగాలని విపరీతం ఆరాటం. ఇంట్లో తండ్రి ఛండశాసనుడు. చంద్రన్న ఈ ఆడంగి వేషాలంటే ఆయనకి తీవ్ర వ్యతిరేకత. ఆఖరికి ఆ ఇంట్లో ఉండలేక చంద్రన్న ఇల్లొదిలి పారిపోయాడు. కల్యాణ దుర్గం ఊరు చేరాడు. అక్కడ అతనికి అతని జాతి హిజ్రాలతో పరిచయం అయింది. వాళ్ల సమూహంలో చేరిపోయాడు. కళ్యాణదుర్గం హిజ్రాలలో రెండు గ్రూపులు. ముందు ఓ గ్రూపులో చేరిన చంద్రన్న వాళ్ల దోపిడి నచ్చక మరో గ్రూపుకి మారాడు. వాళ్లకి ఓ గట్టి వ్యవస్థ ఉంది. భర్త చేతిలో మోసపోయి, వదిలేయబడిన భార్య రామలక్ష్మి. ముగ్గురు పిల్లల తల్లి. పిల్లల కోసం, రోజు గడవక వ్యభిచారిగా మారింది. రకరకాల అవస్థలు పడింది. శారీరక, మానసిక దాడులకి, దోపిడీకి గురైంది. వీళ్లిద్దరి కథ ఇలా సాగిసాగి, రకరకాల అనుభవాల తర్వాత కిన్నెర అన్న స్వచ్ఛంద సంస్థలో చేరి, హిజ్రాల, సెక్స్ వర్కర్ల బతుకులు బాగుపడాలని, వారికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని జరుగుతున్న ఆందోళనకి మద్దతుదార్లు అవుతారు. అదీ ఈ నవల ముగింపు. హిజ్రాల వ్యవస్థ గురించి, వారి శారీరక, మానసిక ఆవేదనల గురించి, సమాజంలో వారి న్యూనత గురించి, వారి యాచకవృత్తి, వ్యభిచార జీవితం గురించి చాలా విపులమైన వివరాలు, పలు సంఘటనలు ఈ నవలలో ఉన్నాయి. అలాగే వ్యభిచారం చేస్తూ బ్రతికే స్త్రీ బాధలు, పోలీసుల రౌడీల జులుం, వ్యభిచార కంపెనీలు, గృహాల నిర్వహణ ఈ వివరాలూ ఉన్నాయి. పోతే, ఇంత సమాచారం ఉన్నా, అది పాఠకులకి అంత సులువుగా చేరదు. బండి నారాయణస్వామిగారి రచనా తీరులోనే క్లిష్టత ఉంది. దానికి తోడు కొత్త రకం శిల్పం, తీరు కోసం ప్రయత్నం చేశారు. కథనంలో కథకుడి విశ్లేషణతో పాటు పాత్రల ఆలోచనల కలగలపు ఉందని ఆయనే చెప్పుకున్నారు. చాలాచోట్ల రచయిత వ్యాఖ్యానాలు, తాత్విక చర్చలు, సామాజిక విశ్లేషణలు కథకి అడ్డుపడతాయి. చివరికి ఇందులో విశేషాలన్నీ పాఠకులు మెదడుకు చేరినట్టు మనసుకు అంతగా చేరవు. కొత్త విషయమే. కానీ ఓ ఉపాధ్యాయుడు చెప్పిన కొత్త పాఠంలాంటి నవల. మాండలికం, తదితర కారణాలవల్ల చురుగ్గా చదివించటం తక్కువే. ఏమైనా తెలిగ్గా పదిమంది దృష్టికి వచ్చే నవల.




**అర్ధనారి** – *బండి నారాయణస్వామి – వెల: ₹ 320/- ప్రతులకు: విశాలాంధ్ర, నవచేతన, నవోదయ, అనల్ప పుస్తక షాపులు.*

రా.రా.రా. - హైదరాబాద్. ఫోన్: 939 473 8805.

# మధుమతి

## (జి.ఎన్. సూరి)

*– వి. రాజారామమోహనరావు*

మధుమతి నవలా రచయిత శ్రీ జి.ఎన్. సూరి స్వగ్రామం అమలాపురం. పుట్టింది, పెరిగింది కూచిమంచివారి అగ్రహారం. ఆ అగ్రహారం ఆచార కట్టుబాట్లలో నియమనిష్టల మధ్య రూపుదిద్దుకుంది తన జీవితం. కానీ జీవిత వైచిత్రి, దానికి పూర్తిగా భిన్నమైన వాతావరణంలోకి తను విసిరివెయ్యబడ్డాడు.

***

జి.ఎన్. సూరి వాళ్లది పెద్ద కుటుంబం. ఆర్థిక ఇబ్బందులు. ఎనిమిదో తరగతివరకూ చదవగానే చదువుకు ఆటంకం ఏర్పడి స్కూలు వదిలేయటం జరిగింది. ఆంధ్ర మెట్రిక్ పరీక్షలకి కట్టి పాస్ అయ్యాడు. పి.యు.సి. కూడా చదివాడు. ఆ తర్వాత మళ్లీ ఆటంకం. చదువుకునే రోజుల్లోనే రచనలు చేయటం, బొమ్మలు వేయటంలో నేర్పు అలవడింది. తెరచాటు కట్నాలు, తేనెటీగలు అన్న నాటికలు రాశాడు. ప్రగతి భావాలున్న నాటికలవి. ఒకటి వరకట్నాలకి రెండోది ధనికుల పేదవాళ్ల దోపిడీకి వ్యతిరేకంగా రాసినది. కథలూ పత్రికల్లో వచ్చాయి. 'సిస్టర్ సుజాత' అన్న కరుణ ప్రధాన నవలని ప్రముఖ వారపత్రిక ఆంధ్రప్రభ సీరియల్‌గా ప్రచురించింది. దాని సినిమాగా కూడా తీస్తామన్న చర్చలూ సాగాయి. కానీ అది ఫలించలేదు. అదే సమయంలో సూరి కొన్ని రచనలకి బహుమతులూ వచ్చాయి. ఆ తర్వాత చిత్రకళని అభ్యసించడానికి హైదరాబాద్ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో చేరాడు. రెండేళ్లు చదివాక ఆర్థిక ఇబ్బందివల్ల మానేశాడు. మద్రాసు సినీరంగంలో, అసిస్టెంట్ డైరెక్టర్ శంభూప్రసాద్, సూరి అన్నగారు. జీవిక కోసం ఆయన నీడన చేరాడు సూరి. అక్కడ నుంచీ, ఆ వాతావరణంలో జి.ఎన్. సూరి రచనా విధానం మారుతూ వచ్చింది. జీవన విధానమూ మారింది. సృజనకన్నా, అవసరానికి ప్రాధాన్యం ఇవ్వటం సూరిలో పెరిగింది. పలు నవలలు రాశాడు. 'ఈ ఉత్తరానికి జవాబు రాదు', నవల 'జరుగుతున్న కథ' అన్న సినిమాగా వచ్చింది. వైదేహి, డ్రీమ్‌గర్ల్ ఇతర నవలలు. ఆ వరసలోదే 'మధుమతి' నవల. ఇదంతా ఎందుకంటే ఓ ప్రగతిశీల రచయితగా పేరు పొందాల్సిన జి.ఎన్. సూరి ఓ సెంటిమెంటల్, మెలో డ్రామా రచయిత అయ్యాడు. జీవితపు ఆర్థిక ప్రభావమే దీనికి కారణం.

జనరంజిక మాధ్యమాలకి ప్రేక్షకుల్ని, పాఠకుల్ని కండిషన్ చేసే అమోఘశక్తి ఉంటుంది. ఆ ప్రభావంతో జరగటానికి పెద్దగా అవకాశం లేని సన్నివేశాల్ని, నాటకీయతని నిజమే, జరుగుతున్నట్టే నమ్మేస్తాం. దానివల్ల నష్టం లేకపోవచ్చు. కానీ ఉపయోగమూ ఉండదు. అదొక గమ్మత్తైన మాయాచక్రం. ఉదాహరణకి సినిమాల్లో ఇంచుమించు అన్ని పాత్రలకి పాటలు పాడటం, నృత్యం చేయటం వచ్చేసినట్టు 'మధుమతి' ఆ కోవకు చెందిన నవలే. పుష్కలంగా నాటకీయత, ముందేం జరుగుతుందో అన్న కౌతూహలం, కొంత క్రైమ్ ఉన్న నవల.

నవలా నాయకి పేరే నవలకీ పేరుగా పెట్టటం జరిగింది. మధుమతి ప్రధాన పాత్ర. మధుమతి సెంట్రల్ జైల్ నుంచి విడుదలై, బయటకు రావటం నవలారంభం. ఆమెకి ఎక్కడికి వెళ్లాలో తెలియని స్థితి. వెళితే తను ఎక్కడి నుంచి జైలుకు వచ్చిందో ఆ ఇంటికి వెళ్లాలి. అది శ్రీపతిగారిల్లు.

శ్రీపతిగారు బాగా స్థితిమంతుడు, ధనవంతుడు. ఆయనకి ఒక కొడుకు, ఒక కూతురు. భార్య గతించింది. శ్రీపతిగారు మంచి మనిషి. ఆయనది మంచి దయగల మనసు. శ్రీపతిగారి అబ్బాయి ఆనంద్‌మోహన్. మనసున్నవాడు. అంతులేని ఆస్తికి ఏకైక వారసుడు. అహంభావం, అతిశయం లేవు. ఎంతో అదృష్టవంతురాలు కాబట్టి అతని ప్రేమను పొందగలిగింది మధుమతి. శ్రీపతిగారి కూతురు అరుణ. ఆ పిల్లకి మధుమతంటే అమిత ప్రేమ. ఇంక శ్రీపతిగారి సంగతి చెప్పనే అక్కర్లేదు. మధుమతి ఆ ఇంటి కోడలు కాబోతున్న శుభతరుణం. ముహూర్తం కూడా పెట్టారు. అటువంటి సమయంలో మధుమతిని దురదృష్టం కాటువేసింది. జైలుపాలైంది.

ఇప్పుడు తిరిగి శ్రీపతిగారింటికి వెళ్లటానికి మనసు సమ్మతించటంలేదు. అలా అని జీవితాన్ని ఏం చేయాలో అర్థం కావటం లేదు మధుమతికి. రైలుస్టేషన్‌కి వెళ్లి, ఏ రైలు కిందో పడి ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. అలాగా చేయలేకపోయింది. హైదరాబాద్‌కి రైలు రెడీగా ఉంటే టికెట్ కొని ఎక్కేసింది. విశాఖపట్నంతో రుణం తీరిపోయింది అనుకుంది. ఎటువంటి విచిత్ర పరిస్థితుల్లో విశాఖకి వచ్చింది,

అతకు ముందు జీవితం, ఆ తర్వాత జీవితం వరసగా జ్ఞాపకాల్లో కదిలాయి. గతంలో మద్రాసులో మధుమతి గడిపిన జీవితం వేరు. చిన్నతనంలో ఎవరు పెంచారో వయస్సు వచ్చేనాటికి హోటల్ కిన్నెరాలో స్థిరపడింది. అదీ కేబరే డ్యాన్సర్‌గా. తినటం, తాగటం, తిరగటం, ప్రేక్షకులకి కిక్ ఎక్కేలా అర్థనగ్న నృత్యాలు చేయటం. అదీ ఆమె వృత్తి. జార్జీ ఆ హోటల్ యజమాని. ఆ హోటల్ బార్‌కి డిమాండ్ మూడొంతులు మధుమతి అందం, డాన్స్‌వల్లే. ఆ విషయం మధుమతికీ తెలుసు. అందుకే ఆమెకి స్వేచ్ఛాప్రవర్తన అలవాటైంది. ఉన్నట్టుండి ఆమెకు మద్రాసు, ఆ హోటల్ బోర్ అనిపించాయి. అందుకే కలకత్తా మరో హోటల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. వెళ్లిపోతానంటున్న మధుమతిని ఉండమని జార్జి రకరకాలుగా బతిమాలాడు. మధుమతి వినలేదు. వ్యాపారం దెబ్బతింటుందనే కాదు, మధుమతంటే జార్జికి పిచ్చి. ఎక్కువ డబ్బిస్తానని మధుమతి ఏం కావాలంటే అది చేస్తాననీ అన్నాడు. మధుమతి మనసు మారలేదు. మద్రాసు – హౌరా మెయిల్ ఎక్కేసింది. రైల్లో ఆమె ఉన్న కూపేలోనే శ్రీపతిగారూ ఉన్నారు. ముందు వేరేరకంగా గడిచినా, శ్రీపతిగారికి గుండెలో నొప్పి రావటం, మధుమతి ఎటెండర్‌ని, ఎటెండ్ రైల్వే డాక్టర్నీ పిలవటం ఆయన కోలుకోవటం జరిగాయి. ఆయన మధుమతిని తనతో విశాఖ వచ్చేయమన్నాడు. డాన్స్ జీవితంతో విసిగిపోయిన మధుమతి అలాగే చేసింది.

డబ్బున్న ముసలాయన తను వలలోకి లాగితే జీవితం సుఖంగా గడిచిపోతుందనుకుంది. కానీ శ్రీపతిగారు అలాంటివాడు కాదు. సన్మార్గుడు. తన కూతురు అరుణతో సమానంగా ఆదరించాడు. ఆయన మారలేదు సరికదా, ఆ ఇంటి వాతావరణం, ఆ వ్యక్తుల వల్ల మధుమతే పూర్తిగా మారిపోయింది. వేషం, నైజం మాత్రమే కాదు, మధుమతి జీవన ధ్యేయమే మారిపోయింది. దేవాలయంలాంటి ఆ ఇంట్లో ప్రశాంతతలో ఎంతకాలం గడిస్తే అదే మహాభాగ్యం అనుకుంది. ఆ తర్వాత ఆ ఇంట్లో స్థిరనివాసం కలిగే అవకాశం వచ్చింది. శ్రీపతిగారి అబ్బాయి ఆనందమోహన్, మధుమతులు పరస్పరం ప్రేమించుకోవటం, అది అందరి సంతోషామోదాలు పొంది పెళ్లి స్థిరపడింది. ఆ పెళ్లికి ముందుగానే జార్జి వచ్చి శ్రీపతిగారింట్లోనే దిగటం మధుమతి దురదృష్టం. మధుమతి గతం రహసంగా ఉండాలంటే తనతో ఒక రాత్రి గడపాలన్నాడు జార్జి. మధుమతి ఒప్పుకోలేదు.




జార్జ్ మధుమతిని బలవంతం చేశాడు. మధుమతి ఎదురు తిరిగింది. ఆ ఘర్షణలో గాజు బొమ్మతో జార్జి తలమీద మధుమతి కొట్టిన దెబ్బకి అతను చచ్చిపోయాడు. పోలీసులకి లొంగిపోయింది. ఆమె గత జీవితం అంతా బైటపడి అందరికీ తెలిసింది. కోర్టుకేసు నడచింది. శ్రీపతిగారు వాళ్లు ఆమెని తప్పించాలని ఎంతగానో ప్రయత్నించారు. తప్పక జైలుపాలైంది. రైల్లో హైదరాబాద్ చేరిన మధుమతి రకరకాల అధ్యాయాల తర్వాత చిల్డ్రన్ హోంలో ఆయా అయింది. విషజ్వరం సోకిన పిల్లలకి అపూర్వ మానవత్వంతో సేవచేసి వారందరి ప్రాణాలు కాపాడింది. దురదృష్టం – ఆ విషజ్వరం మధుమతిని చావుబతుకుల్లో స్థితిలో హాస్పిటల్‌లో చేరేలా చేసింది. ఈ వార్త పేపర్‌లో వచ్చింది. అది శ్రీపతిగారువాళు చూశారు. అంతవరకూ మధుమతి ఏమైందో తెలియక అలమటిస్తున్నవాళ్లందరూ హుటాహుటిన మధుమతి దగ్గరకు చేరారు. ఆమె ప్రాణ్నాలతో ఉండాలని దేవుళ్లందరికో మొక్కారు. ఆనందమోహన్ అయితే పిచ్చివాడిలా అయిపోయాడు. ఏమైతేనేం చివరికి మధుమతి దక్కలేదు. చనిపోయింది. నవల విషాదాంతం. ఒక్కసారి సంస్కరించబడిన వ్యక్తి నీతిని, నిజాయితీని వదులుకోలేదు అన్నది సందేశం.

కథ ఇదే అయినా రకరకాల మలుపులతో, మంచి ఉత్సుకతతో నడుస్తుంది. పుస్తకంగా మంచి పాఠకాదరణ పొందింది. కానీ పాపులర్ నవలగా తప్ప, మంచి నవలగా పేరు సంపాదించలేకపోయింది.

నీతి తప్పిన మనిషి ప్రధాన పాత్ర అయిన ఏ రచననీ అప్పటికీ ఇప్పటికీ పాఠకులు ఆదరించలేకపోతున్నారు.

మంచి రచయితగా, అభ్యుదయ సృజనాపరుడిగా పేరు పొందడానికి అన్ని అర్హతలు, తెలివితేటలు ఉన్న శ్రీ జి.ఎన్. సూరి ఆ స్థితి చేరలేకపోవటానికి కారణం, జీవితం చిన్న చూపు చూడటమే. అతనే కాదు, అలాంటి రచయితలు ఇంకెందరో ఉన్నారు. మధుమతి నవల రచయిత కోరుకున్నట్లు సినిమాగానూ రూపొందలేదు. ఈ పైవాటన్నింటికీ గొప్ప ఉదాహరణ మధుమతి నవల.

వి. రాజారామమోహనరావు
హైదరాబాద్. ఫోన్: 939 473 8805.

# చదవండి...

**- ఝాన్సీ**

**వాణిజ్య 'ఫన్ను'లు:** సాధారణంగా రిటైరైన తరవాత ఉద్యోగానుభవాలను అక్షరాల్లోకి మార్చేటప్పుడు కాస్త హాస్యాన్ని, కూసింత వ్యంగ్యాన్ని అద్ది వాటిని హ్యూమరసంతో నింపడం అంత 'ఈజీ' కాదు. వాణిజ్య పన్నుల విభాగంలో ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వహించిన హర్షవర్ధన్‌గారు వాణిజ్య "ఫన్ను"లు అన్న శీర్షిక పుస్తకానికి పెట్టడంతోనే తన స్టైల్ ఎలా ఉండబోతుందో చెప్పేశారు. వాస్తవానికి ఉద్యోగ జీవితం యాంత్రికంగానో, తాత్వికంగానో ఉన్నా నవ్వుల పువ్వులు పూచిన సందర్భాలుంటాయి. కొందరే వాటిని గమనించి వాటి సంఖ్య పెంచుతూ ఆ పరిమళాన్ని పంచుతుంటారు. వాణిజ్య పన్నుల శాఖలోని అనేక అంశాలను హర్షవర్ధన్ వివరించిన తీరు ముచ్చటేస్తుంది. ఇరకాటంలో పడ్డ సందర్భాల్లోను వారి హాస్యప్రియత్వంతో నెగ్గుకొచ్చేస్తారు. ఎన్నో కబుర్లు మరిన్ని ఛలోక్తుల బూరెల బుట్ట ఈ పుస్తకం. 'పన్ను'లో ఉండే 'ఫన్'ని ఆస్వాదించొచ్చు. హర్షవర్ధన్‌గారిప్పటికే నానీల హర్షవర్ధన్‌గా పరిచయం. ఇప్పుడు ఫన్ గన్ హర్షవర్ధన్ అయ్యారు ఈ పుస్తకంతో. పన్ను వసూలు చేసినంత సులభంగా నవ్వును వసూలు చేసి పఠిత ఎదదకు సమర్పిస్తారు. రాజీపడని అధికారిలా పుస్తకాన్ని రాజీపడకుండా తీసుకొచ్చారు.




*పేజీలు: 125, వెల: ₹ 150/-*
*ప్రతులకు: రితిక పబ్లికేషన్స్ ప్రచురణ,*
*ఫోన్: 994 999 2880.*

**పురాణ పాత్రలపై కొత్త వెలుగు:** అనాదిగా మన దేశంలో పురాణేతిహాసాలు జనజీవనంతో పెనవేసుకుపోయాయి. అవి ఎప్పటికప్పుడు నూతనత్వాన్ని సంతరించుకుని సజీవంగా ఉంటున్నాయి. పురాణ పాత్రలను పండిత దృష్టితో కాకుండా పామర దృష్టి కోణంతో భారతదేశపు తాత్విక చింతనలోను, రాజకీయాలలో భిన్నమైన వ్యక్తిగా పేరుగాంచిన డా. రామమనోహర్ లోహియా విశ్లేషిస్తారు అనేక పాయలుగా సాగిన తన సాహిత్యంలో. పౌరాణిక పాత్రలను ఆయన విగ్రహాలుగా మార్చి పూజించదు. వారు ప్రాతినిధ్యం వహించే విలువలను, భారతీయాత్మను గుర్తు చేస్తాడు. అలాగే పురాణ పాత్రలను సాంప్రదాయిక చూపుతో కాకుండా సమకాలీన, సమన్వయం ఉట్టిపడే తన చూపుతో చూసిన వ్యాసాల అనువాదాన్ని నవ్యతను ప్రేమించే తెలుగు పాఠకలోకానికి కానుకగా తెచ్చారు రామమనోహర్ లోహియా సమతా ట్రస్ట్‌వారు. నేటి కాలానికి అవసరమైన అన్వయాన్ని పొందుపరుస్తూ "పురాణ పాత్రలపై కొత్త వెలుగు" ప్రసరిస్తాయి ఈ పుస్తకంలోని వ్యాసాలు. రామమనోహర్ లోహియా దృక్పథాన్ని పరిచయం చేసే కల్లూరు భాస్కరం ముందుమాటతో పాటు వోల్గా, రాణీ శివశంకర్, అవధానం రఘుకుమార్, డా. నాగసూరివంటి ప్రముఖుల వ్యాసాలు పాఠకుడి దృష్టిని విశాలపరచి లోహియా చూపును అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. పురాణ పాత్రలపై కొత్త వెలుగు రామమనోహర్ లోహియా సమతా ట్రస్ట్ ప్రచురణ సంకలనం : రావెల సాంబశివరావు.




*పేజీలు: 253, వెల: ₹ 250/-*
*ప్రతులకు: ఫోన్: 910 094 2260/74/75.*

**తేనెతెరలు:** కమ్మదనం, ఘాటు కలిసిన కథలు రచయితలకు కథారచన అయస్కాంతంలాంటిది. వచనమయినా, నాటకమయినా, కవిత్వమయినా ఏ ప్రక్రియలో తన అనుభవాన్నో, ఉద్వేగాన్నో వ్యక్తపరచినా ఏదో సందర్భంలో కథ రాయకుండా ఉండలేడు రచయిత. సంగీతంలో నిష్ణాతులు, పెక్కు నాటకాలు, పద్యకావ్యాల రూపకర్త నల్గొండవాసి ఎమ్. పురుషోత్తమాచార్యగారు కూడా కథను స్వంతం చేసుకోకుండా ఉండలేకపోయారు. యాభైమూడేళ్ళ సాహిత్య జీవితంలో అరవైకి పైగా కథలు రాశారు. తన చుట్టూ ఉన్న ప్రపంచంలో అలజడులు, సంఘర్షణలు వడగాడ్పులై వీచిన ప్రతిసారీ ఆయన కథకుడయ్యాడు. ముఖ్యంగా స్త్రీల జీవితాల్లోని అనేక పొరలను తన కథల ద్వారా ఆయన అర్థం చేసుకునే



ప్రయత్నం చేశారు. వారి నాటకానుభవం కథా రచనలోని నాటకీయతను, సంభాషణా చాతుర్యాన్ని తీర్చిదిద్దింది. "తేనెతెరలు" శీర్షికన పదిహేను కథల పారిజాత పరిమళాన్ని చదువరి ఆస్వాదిస్తాడు. ఇంతకీ *తేనెతెరలు* అంటే ఏమిటి.. తేనెపట్టులా ఉండే కారప్పూస చుట్టు. తెలంగాణాలో వాడుకలో ఉన్న అచ్చ తెనుగు మాట. అసలు పదం "తేనెతేరలు"ట. కాలక్రమేణా తేనెతెరలుగా మారిందని రచయిత అంటారు. ఈ కథలన్నీ జీవితంలోని కమ్మదనాన్ని, ఘాటును సందర్భోచితంగా మనకు పరిచయం చేస్తాయి. *పేజీలు: 156, వెల: ₹ 150/- ప్రతులకు: ఫోన్: 939 661 1905.*

**మట్టికథలు:** మేరెడ్డి యాదగిరిరెడ్డి. రచయితకు గ్రామీణ జీవితం పట్ల చక్కని అవగాహన ఉంది. లోతుల్లోకి వెళ్లి చూడగలిగే నేర్పు, ఓర్పు రెండూ ఉన్నాయి. విడమరిచి విశ్లేషించే భాషా ఉంది. ఆయన గ్రామీణ ప్రాంతం నుంచి రావటమే కారణం. మట్టి కథలు, తొలకరి చినుకులకు




తడిసిన మట్టివాసన వస్తున్నాయి! 'నిర్మలమైన ఆకాశం, మైదానంలాంటి భూమి – ఎక్కడా గడ్డిపరక లేదు. మనుషుల అస్థిపంజరాలు, తోళ్లు కప్పుకున్న పశువులు – వాన కోసం వెతుకుతున్న కళ్లు – మబ్బులను చూసి చప్పరించే నాటికలు" ఇదీ కరువు – కథనం. మట్టి కథలు – చదవండి. మీరు మర్చిపోయిన విషయాలు ఎన్నో గుర్తుకొస్తాయి.

*పేజీలు: 115, వెల: ₹ 40/-*
*ప్రతులకు: ఫోన్: 040-233741.*

**మట్టివాసన:** (కవితా సంపుటి) మేరెడ్డి యాదగిరిరెడ్డి. మల్లెల వాసనకన్నా – గులాబీల పరిమళాలకన్నా – మట్టి వాసనలు మిన్న – అంటూ మట్టి కవితలు –



వాసనలు వెదజల్లుతాయి. రైతులను కూలీలుగా మార్చిన అనర్థ పరిణామాలు కవితలుగా వినిపిస్తాడు – మేరెడ్డి యాదగిరి! 'పువ్వులు పూసిన అప్పులు – కాయలు కాసిన వడ్డీలు' ఇలా ఉంటాయి ఈ కవితా పరిమళాలు.

*పేజీలు: 81, వెల: ₹ 80/-*
*ప్రతులకు: మేరెడ్డి యాదగిరిరెడ్డి, నల్లగొండ. ఫోన్: 994 941 5796.*

**రైతు నానీలు:** ఇది కూడా మేరెడ్డి యాదగిరి రెడ్డి కథలు – కవితలు రాసిన (అవీ రైతు – మట్టి వస్తువుగా)




నానీలు కూడా రాశారు. సహకార వ్యవసాయం అంటే – రైతును కూలీగా మార్చటం. ఎక్కడా కోడి కూయటం లేదేమి? సెల్‌ఫోన్లు కూస్తున్నాయి కదా? ఇలా ఉంటాయి. అయినా నానీల పరిధి చిన్నదే కదా! ఇవి కూడా చిన్నచిన్నగా అతను మహా మాంత్రికుడు – మట్టిని – మెతుకులుగా మార్చాడు. బాగానే ఉంటాయి. చదవండి. *పేజీలు: 46, వెల: ₹ 40/- ప్రతులకు: మేరెడ్డి యాదగిరిరెడ్డి, నల్లగొండ. ఫోన్: 994 941 5796.*

**మనసా శతకం:** డా. చింతోజు మల్లికార్జున్ – ఉత్తమ ఉపాధ్యాయునిగా, ఉత్తమ కవిగా, రచయితగా, పరిశోధకునిగా, వ్యాఖ్యాతగా, గాయకునిగా మంచి




పేరున్న వ్యక్తి. వీరు ఏ పద్యమైనా సరళంగా, సహజంగా వ్రాయడంలో అందెవేసిన చేయి. వీరి పద్యాలు స్వభాషితాలే కావచ్చు. కానీ అన్నీ సుభాషితాలే. 'మనసా శతకం'లోని ప్రతి పద్యమూ హృద్యమే! *పేజీలు: 30, వెల: ₹ 100/- ప్రతులకు: డా. చింతోజు మల్లికార్జునాచారి, 307, లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్స్, బృందావన్ హోమ్స్, మిర్యాలగూడ రోడ్, నల్లగొండ – 508 001. ఫోన్: 99499 27142.*

**నా సీమ యాసే నా శ్వాస:** సీమ యాసకు ఆద్యుడు పులికంటి కృష్ణారెడ్డి. ఆయన రాసిన *సీమ భారతం* – సీమ గ్రామసీమలలో సామాన్యులు మాట్లాడుకునే యాస నుంచి పుట్టినది. ఆ తరువాత వచ్చినవారు నామిని ప్రభృతులు. ఇప్పుడు *నా సీమ యాసే నా శ్వాస* అన్న




యెలిచెర్ల గజేంద్రనాథ్‌రెడ్డి "అది నీ ఇట్టం మా" అని మాల్లాడ్డి అంటా, "నడిపోడా, సినమ్మీ! మనమేదో బాగాలు పంచుకున్నెమనీ ఒకరికొకరు దూరంగా ఉండాల్సిన అవుసరం లేదు.." ఇలా ఉంటుంది ఈయన యాస. అర్థం అవటం కాకపోవటం మన గోస!

*పేజీలు: 222, వెల: ₹ 150/- ప్రతులకు: ఎలిచెర్ల చంద్ర ఓబుల్ రెడ్డి, కడప. ఫోన్: 944 111 2404.*

# మిసిమి
మాసపత్రిక

## మీరు చందాదారులుగా చేరండి    బహుమతిగా పంపండి

*మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు* ***మిసిమి*** *ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా* ***మిసిమి*** *పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా* ***మిసిమి*** *పత్రికను పంపిస్తాం.*

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

**Scan QR to Pay**
Misimi Publication

## మిసిమి ప్రచురణలు


**నోబెల్ వ్యాసాలు**


**మిసిమి** పార్థసారథి వ్యాసాలు


**చిత్రకళా నీరాజనం**


**నరిసెట్టి ఇన్నయ్య మిసిమి వ్యాసాలు**


**పురస్కార సాహిత్యం**


**వ్యాస మంజూష**


**సారస్వత వ్యాసాలు**


చార్లీ చాప్లిన్


**రజ్జు సర్పభ్రాంతి**


**బైరన్**


సిద్ధార్థ


సప్తపర్ణి


**షెల్లీ జీవిత కథ**


దోసిట చినుకులు


**నృత్యభారతి**


పారిజాతం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

**మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.**